వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 9 సంచిక : 11 హైదరాబాద్ 124 నవంబర్ 2011 పేజీలు : 68 రు. 15

* ఫోకస్ : సకల జనుల సమ్మె
* తెలంగాణ - సంఘ్ పరివార్ ఎజెండా
* 'పెట్టుబడిని ముట్టడిద్దాం'
* బిల్లు మతోన్మాద హింసను ఆపగలదా?
* కొత్త భూసేకరణ చట్టం చేసేదేమిటి?
* మరో జాదూగూడ కానున్న కడప
* బీళ్లుగా మారనున్న పంట భూములు

124

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

నవంబర్ 2011
సంపుటి : 9
సంచిక : 11

లోపలి పేజీల్లో...

ఫోకస్ : సకల జనుల సమ్మె

ప్రింటర్స్
డక్కన్ ప్రెస్ /
చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్
హైదరాబాద్
ఫోన్ : 98484 28516
92468 26191

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
మైత్రీ రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు	విద్యార్థులకు
విడి ప్రతి	రు. 15	రు. 15	రు. 15
సంవత్సరం	రు. 180	రు. 150	రు. 120
మూడు సంవత్సరాలు	రు. 500	రు. 400	రు. 350
ఐదు సంవత్సరాలు	రు. 800	రు. 650	–
పది సంవత్సరాలు	రు. 1500	రు. 1300	–

వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175**
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్
ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

'వీక్షణంకు చేయూతనివ్వండి' విజ్ఞప్తికి స్పందించి పత్రిక శ్రేయోభిలాషులు ఎస్. కిశోర్ కుమార్ రాష్ట్రంలోని 23 జిల్లా గ్రంథాలయ సంస్థలకు తన కానుకగా చందాలు కట్టారు. మిత్రులు ఎస్. మల్లారెడ్డి, జి.కె.ఎస్. రాజా ఆర్థిక సాయం అందించారు. వారికి కృతజ్ఞతలు. – సం.

వీక్షణం పత్రిక నిబద్ధతకు, నిర్మొహమాట విధానానికి నా నమస్సులు. మంచి విషయాలను ఎంచుకొని, వాటికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అంకెలతో, నిరూపణలతో ఇవ్వడం, కొన్నింటి విషయంలో పరిష్కార మార్గం చూపడం లేదా మేల్కొలిపే ప్రయత్నం చెయ్యడం చాలా మెచ్చుకోదగ్గవి. ఆయా వ్యాసకర్తల కృషిని అభినందించి తీరవలసిందే. అటువంటి రచనలను, అంశాలను మాత్రమే ఎంచుకొని ప్రచురించడంలో వీక్షణం ప్రధానోద్దేశ్యం తేటతెల్లమవుతోంది. ఇంతవరకూ బాగానేఉంది. కాని ఇంతటి బృహత్తర కృషి ఎంత మందికి అందుతోంది? అందినవారికి కూడా ఎంతమందికి అవగాహనలోకి వస్తోంది? మన పత్రికకు సేవలందిస్తున్న వ్యాసకర్తలు, సంపాదకులు, ఇతర మద్దతుదార్ల వరకే ఇది పరిమితమవుతోందనే అనుమానం కలుగుతోంది. కారణం – విషయంలోను, విపులీకరణలోను ఉన్న క్లిష్టత అని నా అనుమానం. సర్క్యులేషన్ గురించి కాదు నా చింత. ఇంతటి మంచి విషయాలు, నడుస్తున్న చరిత్రల్ని, వ్యవస్థలోని డొల్లతనాన్ని చాటి చెబుతున్నవి జనబాహుళ్యానికి అందడం లేదేమో అన్నదే నా అనుమానం. భావజాలానికి దూరం కాకుండానే, పదజాలాన్ని సరళీకరించడం, సోదాహరణంగా వివరించడం, అవసరమయిన చోట ఇలస్ట్రేషన్స్ ఇవ్వడం వగైరాలతో మరింతమంది పాఠకులను చేరుకోవచ్చేమోనన్నది నా ఆశ. అంతేకాని మీరు చేస్తున్న ఈ బృహత్కర కార్యాన్ని విమర్శించడమో, నిరుత్సాహపరచడమో నా ఉద్దేశ్యం ఎంత మాత్రం కాదు. అలాగే పాత రచనలను (ఉదాహరణకు, గురజాడ, చలం, శ్రీశ్రీ, రావిశాస్త్రి వంటి వారి ప్రసిద్ధ రచనలు) హక్కుదార్ల అనుమతితో సీరియల్‌గా ప్రచురించడం ద్వారా కూడా మన పత్రిక మరింత మందిని ఆకట్టుకోగలదేమో. దానితోబాటు, ఈ తరానికి వారి రచనలను అందించినట్టు కూడా ఉంటుంది. మరోసారి వీక్షణాన్ని మనసారా అభినందిస్తూ నావంతుగా చిన్న విరాళాన్ని మీ బాంకు అక్కౌంటుకు జమ చేస్తున్నాను. పత్రికను ఎక్కువమంది చదివేలా, ఉత్తేజపరిచేలా చెయ్యడంలో భాగంగా ఈ విరాళంతో కొన్ని గ్రంథాలయాలు, యువజన సంఘాలు వంటివాటికి పంపగలరని నా మనవి. ఇప్పుడు నేను మన భారతదేశానికి ఆవలివైపున ఉన్నందుకు, పత్రికను అంతర్జాలంలోనే చదువుతున్నాను. వెల చెల్లించకుండా ఇంతటి అమూల్య విషయాలను పొందగలుగుతున్నానన్న భావన కూడా నన్ను ఈ చిన్న విరాళానికి పురిగొల్పింది.

– జి.కె.ఎస్.రాజా
gksraja@gmail.com
gksraja.blogspot.com
(ఈమెయిల్ ద్వారా వచ్చినది)

వీక్షణం అక్టోబర్ 2011 సంచిక విషయ పరిపుష్టితో నిండుగా ఉంది. ప్రధానంగా 'ఆలోచనల గూటికి పుల్లా పుడకా' శీర్షిక అదనపు శోభ. అయితే వ్యాసాలను ఎడిట్ చేసేటప్పుడు ప్రారంభం – ముగింపుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటించడం అవసరం. ఆహార భద్రతపై వచ్చిన వ్యాసం అర్థాంతరంగా ముగించేసి నట్టనిపిస్తుంది. ముక్తాయింపును జోడిస్తే బాగుండేది. అక్షర దోషాలు దొర్లుతూనే ఉన్నాయి. గమనించగలరు. అభినందనలతో.

– ఆజాద్, స్పందన
హైదరాబాద్

వీక్షణం అక్టోబర్ 2011లో 'మారుతి సుజుకి కార్మికుల పోరాటం' వ్యాసం బాగుంది. అందంగా కనబడే కార్ల ఉత్పత్తిలో ఇంకుతున్న కార్మికుల రక్తం, చెమటల గురించి, అక్కడ జరుగుతున్న పోరాటం గురించి పి.వి. రమణ లోతుగా పరిశీలించి, విషయాలను అందించారు. కార్మిక హక్కులను కాలరాస్తూ మారుతి కార్ల యాజమాన్యం సాగిస్తున్న దోపిడీని వివరించారు. 1885లోనే చికాగో కార్మికులు ఎనిమిది గంటల పనిదినాల కోసం పోరాడి ప్రాణాలు పణం పెట్టి సాధించుకున్న ఆ హక్కు ఈరోజు ఏ రంగంలోనూ కానరాకుండా పోయింది. సేవారంగమైనా, కార్మిక రంగమైనా ఎనిమిది గంటల పనిదినాల అంటే ఏమిటి? అని అడిగే పరిస్థితి వచ్చేసింది. ఐచ్ఛికంగా(?) పన్నెండు నుంచి పద్దెనిమిది గంటలు పనిచేస్తున్న పరిస్థితులు వచ్చేసాయి. విజ్ఞానం లేదు, వినోదం లేదు, విరామం లేదు.. పొట్టకూటికి, అవసరాలకు గానుగెద్దుల్లా పనిచేయడమే నేడు ఉంది. మనుషుల మధ్య సంబంధాలు కూడా సమయాభావంతో హింసాపూరితంగా మారుతున్నాయి. పెరిగిన సాంకేతికతతో సదుపాటాలతో పని గంటలు వాస్తవానికి ఎనిమిది గంటలు కాదు, బహుశా ఆరు గంటలకు రావాలేమో. నిజంగానే ఈ వ్యవస్థలు మనుషులను సృజనాత్మకంగా ఎదగడానికి అవకాశమిస్తాయా? మన దేశంలో ట్రేడ్ యూనియన్‌లు, కార్మిక ఉద్యమాలు ఎందుకు విఫలమయ్యాయో, విఫలమవుతున్నాయో లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. మన దేశంలో కార్మికవర్గ పుట్టుక, పెరుగుదల, పరిణామం ఎలా ఉందో లోతైన అవగాహన ఇచ్చే విధంగా మరిన్ని రచనలు వీక్షణం అందిస్తుందని ఆశిస్తున్నాం.

– పి. సుబ్బారావు
విజయనగరం

వీక్షణంలో వ్యాసాలు చాలా ఆలోచనాత్మకంగా విశ్లేషణలతో వస్తున్నాయి. ఇంకా వివరణాత్మకంగా వస్తే బాగుంటుంది. సెప్టెంబర్ 2011లో ప్రపంచ పరిణామాలపై వ్యాసాలు బాగున్నాయి. ముఖ్యంగా ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు కార్పొరేట్ వ్యవస్థలపై ప్రజలలో ఉన్న అసంతృప్తికి అద్దం పడుతున్నాయి.

– టి. యశోద
మిర్యాలగూడ

వీక్షణంలో అక్టోబర్ 2011 వరకు సీరియల్‌గా వచ్చిన 'వ్యవసాయ సంబంధాల సిద్ధాంతం దిశగా..' శీర్షికతో వచ్చిన ఆర్.ఎస్. రావు వ్యాసం చాలా విశ్లేషణాత్మకంగా ఉంది. మన దేశంలో వ్యవసాయ సంబంధాలను అర్థం చేసుకోవడానికి చాలా ఉపయోగపడుతుంది. దున్నే వారికే భూమి నినాదానికి కాలం చెల్లిందనే వాదనలు నడుస్తున్న సందర్భంలో ఈ వ్యాసం రావడం ముదావహం. మన దేశంలోని ఉత్పత్తి సంబంధాలను లోతుగా అర్థం చేసుకోవడానికి ఇటువంటి చర్చను వీక్షణం కొనసాగిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

– బి. సిద్ధార్థ
ఆదిలాబాద్

ఆ మధ్య చూస్తే వీక్షణం బాగానే వస్తున్నట్టు అనిపించింది. ఈ మధ్య చూస్తే ఎంత మార్పు! ఇంతకీ మీరు ఏ రాజకీయ పార్టీకి సపోర్టు ఇస్తారు? ఇస్తున్నారు? పత్రికల వాళ్లు వాళ్లకి వారు మహనీయులమనుకుంటారు? హిందూ ఇంగ్లిష్ దినపత్రిక తాను భారత్ జాతీయ దినపత్రిక అంటుంది. నిజానికి హిందూ తమిళనాడు తమిళుల సాంబారు ఇంగ్లిష్ స్టైల్.

– ఎన్. వెంకటరావు
విశాఖపట్నం

వీక్షణం అక్టోబర్ 2011 సంచికలో హరగోపాల్ వ్యాసం 'ఆంధ్రప్రదేశ్ – ప్రపంచబ్యాంక్ అప్పు' బాగుంది. రాష్ట్ర ప్రజలపై ఇంత అప్పు భారం పెడుతున్న ప్రభుత్వాలు ఆ ప్రజలకు ఏ ప్రయోజనాలు చేకూర్చిందో ప్రశ్నించుకోవాలి. అలాగే మారుతి సుజుకి కార్మికుల పోరాటం వ్యాసం చాలా విశ్లేషణాత్మకంగా ఉంది. కార్మికుల పోరాటం, వారి స్థితిగతులను పి.వి. రమణ వివరణాత్మకంగా చెప్పారు.

– ఆర్. సుజాత
వరంగల్

మేధావులకు సకల జనుల సమ్మె పాఠాలు

సెప్టెంబర్ రెండో వారంలో మొదలై అక్టోబర్ చివరి వారం దాకా తెలంగాణలో సాగిన సకల జనుల సమ్మె ఏమి సాధించిందో, ఏమి సాధించలేకపోయిందో ఇతరంగా చర్చించవచ్చుగాని తెలుగు సమాజంలో కొందరు మేధావుల సంకుచితత్వాన్ని మాత్రం బయటపెట్టింది. దాదాపు నూట అరవై సంవత్సరాలుగా తెలుగు సమాజ ఆలోచనాధార ప్రగతిశీల, ప్రజానుకూల సంప్రదాయానికి నెలవుగా ఉండింది. మేధావులు తాము పుట్టిన వర్గాన్నీ, కులాన్నీ, ప్రాంతాన్నీ, మతాన్నీ అధిగమించి న్యాయాన్యాయ విచక్షణ చూపుతారనీ, ఎక్కువగా న్యాయం పక్షమే తీసుకుంటారనీ ఇంతకాలమూ నమ్మకం ఉండేది. కాని ఇటీవల తెలంగాణ ప్రజా ఆకాంక్షల విషయానికి వచ్చేసరికి కోస్తాంధ్ర, రాయలసీమ ఆలోచనాపరులలో కొందరు న్యాయాన్యాయాలు, చరిత్ర పక్కనపెట్టి తాము పుట్టిన ప్రాంతానికి అనుకూల వైఖరి మాత్రమే తీసుకుంటున్నారు. కొందరు బహిరంగంగా అన్యాయాన్ని, వివక్షను సమర్థించడానికి సిద్ధపడుతుండగా, ఎక్కువమంది మౌనంగా, తటస్థంగా ఉన్నట్టు కనబడుతూ అన్యాయమే చెల్లిపోవడానికి వీలు కల్పిస్తున్నారు. సకల జనుల సమ్మె వంటి అతి పెద్ద, ప్రభావశీల పరిణామంలో కూడ మేధావులు ఇలా ప్రవర్తించడం ఆశ్చర్యకరం. ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా ఖండించే మేధావులు, తమ పక్కనే, తాము నివసిస్తున్న నగరాలలోనే, అన్ని ప్రజావర్గాలూ ఎలుగెత్తి చాటుతున్న అన్యాయం పట్ల మౌనం వహిస్తున్నారు. జరిగిన పరిణామాలు మౌనంగా ఉండదగినవైతే కాదు. రాజధానితో సహా రాష్ట్రంలో దాదాపు సగ భాగం, తెలంగాణ మొత్తం నలభై రోజులకు పైగా స్తంభించిపోయింది. ప్రభుత్వ కార్యకలాపాలు ఆగిపోయాయి. సింగరేణి గనులలో ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. ప్రభుత్వ రవాణా ఆగిపోయింది. విద్యాలయాలు మూతపడ్డాయి. నిజానికి ఈ నలభై రోజులు మాత్రమే కాక దాదాపు రెండు సంవత్సరాలుగా తెలంగాణలోనూ, మొత్తంగా ఆంధ్ర ప్రదేశ్ లోనూ పౌరజీవనం, ప్రభుత్వపాలన కుంటుతున్నాయి. దానికి కొనసాగింపుగా సకల జనుల సమ్మె జరిగింది. తెలంగాణ సమాజమంతా ఒక్క తాటి మీద పాల్గొన్న ఈ సకల జనుల సమ్మెను చూసి ఐనా తెలంగాణ ప్రజల ఆకాంక్షకు ఉన్న విస్తృతినీ, సంపూర్ణ భాగస్వామ్యాన్నీ గుర్తించవలసిన ఇతర ప్రాంతాల బుద్ధిజీవులు కొందరు ఇప్పటికీ ఆ ఆకాంక్షను గుర్తించడానికి నిరాకరిస్తున్నారు. ఒక ప్రాంతపు ప్రజానీకం ఇంతకాలం పాటు ముక్తకంఠంతో నినదిస్తున్న ఆకాంక్షను పట్టించుకోకుండా ఉండడం ప్రభుత్వాలకు, పాలకవర్గాలకు సహజమేనేమో గాని బుద్ధిజీవులకు ఉచితం కాదు. తమను తాము ఆలోచనాపరులుగా, విశ్లేషకులుగా, మేధావులుగా చెప్పుకుంటున్నవారు, ఇంతకాలంగా, ఇంత పెద్ద ఎత్తున ప్రకటితమవుతున్న ఆకాంక్ష గురించీ, దాని పూర్వాపరాల గురించీ, చరిత్ర గురించీ ఇప్పటికైనా గొంతు విప్పవలసి ఉన్నది. పరిష్కారం విషయంలో భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. కాని సమస్య గురించి ఏమనుకుంటున్నారు, ఆ సమస్యమీద ఉద్యమంలో పాల్గొంటున్న కోట్లాది ప్రజల భాగస్వామ్యం గురించి ఏమనుకుంటున్నారు, ఆ ఉద్యమం మీద ప్రభుత్వం అమలుచేస్తున్న అణచివేత గురించి ఏమనుకుంటున్నారు, ప్రభుత్వ సాచివేత ధోరణి మీద ఏమనుకుంటున్నారు స్పష్టం చేయవలసిన అవసరం ఉంది. అసలు సమస్యే లేదని, తెలంగాణకు అన్యాయమే జరగలేదని ఇప్పటికీ పత్రికల్లో రాస్తున్నవారు, టెలివిజన్ తెరలమీద మాట్లాడుతున్నవారు ఉన్నారు. అన్యాయమే జరగకపోతే ఈ యాభై ఐదు సంవత్సరాలలో డజను సార్లయినా అన్యాయాలను సరిదిద్దుతామనే వాగ్దానాలు ప్రభుత్వం నోటనే ఎందుకు వచ్చాయో ఈ మేధావులు చెప్పాలి. తెలంగాణ సమస్యే లేదని, అదంతా రాజకీయ నిరుద్యోగుల సృష్టేనని ఇప్పటికీ తమను తాము వంచించుకుంటూ ఇతరులకు నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తున్నవారు మరి సకల జనుల సమ్మెలో తెలంగాణలోని ప్రతి ఒక్కరూ అంత పెద్ద ఎత్తున ఎందుకు పాల్గొన్నారో చెప్పాలి. సమస్య లేదని, అది కల్పితమని, అందులో ప్రజల పాత్ర లేదని నమ్ముతున్న వాళ్లు కూడ ప్రభుత్వం అమలు చేసిన అణచివేత చర్యలను ఖండించాలి. ఎక్కడైనా అధికారిక, రాజ్య హింస తప్పనీ, ఎటువంటి ఉద్యమం మీదనైనా దమననీతి తప్పనీ వాదించే, ప్రపంచంలో ఎక్కడ అటువంటి రాజ్యహింస జరిగినా ఖండించే మేధావులు తమ పక్కనే తెలంగాణ ప్రజల మీద లాఠీఛార్జీలూ, అక్రమ అరెస్టులూ, తప్పుడు కేసులూ, అక్రమ నిర్బంధాలూ జరిగిపోతుంటే, వందలాది మంది యువకులు ఆత్మహత్యలు చేసుకుని రాలిపోతుంటే మౌనం వహించడం ఆశ్చర్యకరం మాత్రమే కాదు, క్రూరం. “ఇవన్నీ తెలంగాణ ప్రజల కల్పిత సమస్యలు, వారి తప్పులకు వారు చెల్లించుకుంటున్న పరిహారాలు, వాటితో మాకేం సంబంధం” అనుకున్నా సరే, మరి ఈ దేశంలో నాగరికమైన ప్రజాస్వామిక పాలన సాగాలనే కోరిక అయినా ఈ మేధావులకు ఉన్నదా లేదా? మహా ఘనత వహించిన భారత ప్రభుత్వం ఒక ప్రాంతపు సమస్యను పరిష్కరించడానికి చేస్తున్న ప్రయత్నాలు సవ్యంగా ఉన్నాయో లేవో, అసలు ఏ ప్రయత్నమైనా సాగుతున్నదో లేదో వ్యాఖ్యానించ వలసిన బాధ్యత ఈ మేధావులకు లేదా? రాష్ట్రం ఏర్పడడానికి కారణభూతమైన ఒప్పందంలో ప్రతి ఒక్క అంశాన్నీ ఉల్లంఘిస్తే మౌనమే. ఆ ఒప్పందాన్ని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వమే చట్టం తెచ్చి, అన్యాయానికి గురికాగల ప్రాంతానికి రక్షణలు కల్పించి ఆ రక్షణలను అమలు చేయకపోతే మౌనమే. ఆ రక్షణల అమలు కోసం ప్రారంభమైన ప్రజాందోళన మీద దారుణ దమననీతిని ప్రయోగించి 370 మందిని బలిగొని, నాయకత్వాన్ని కొనివేసి ఆందోళనను చల్లారిస్తే మౌనమే. అంత జరిగిన తర్వాత మళ్లీ కేంద్రప్రభుత్వమే వాగ్దానాలు చేసి, స్వయంగా రాష్ట్రపతి పేరు మీద ఉత్తర్వులు ఇచ్చి, రాజ్యాంగ సవరణ చేసి వాటిని అమలు చేయకపోతే మౌనమే. మూడు నెలల్లో అమలు జరుపుతామని మరొకసారి వాగ్దానం చేసి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వు తెచ్చి దాన్ని ఇరవై ఐదు సంవత్సరాలైనా అమలు చేయకపోతే మౌనమే. ఆ చరిత్రంతా పక్కనపెట్టినా స్వయంగా కేంద్ర ప్రభుత్వం తరఫున హోంమంత్రి ఒక ప్రకటన చేసి దాన్ని వెనక్కి తీసుకున్నా, అమలు చేస్తామని చెపుతూనే తాత్సారం చేస్తున్నా మౌనమే. పాలకులు అంత అబద్ధాలకోరులుగా, మోసకారులుగా, వంచకులుగా, దుర్మార్గులుగా ఉన్నప్పుడు మేధావులు మౌనంగా ఉండదగునా? అన్యాయాన్ని సమర్థించదగునా? ఇది ప్రజల మధ్య వైరుధ్యం కాదు. ప్రజలకూ పాలకులకూ మధ్య వైరుధ్యం. ఇది ప్రజల మధ్య వైరుధ్యమని అనుమానపడి ఒక ప్రాంత ప్రజలకు వ్యతిరేక వైఖరి తీసుకునే బదులు, పాలకుల దుర్మార్గాన్ని ఖండించడం ఆలోచనాపరుల బాధ్యత. సకల జనుల సమ్మె ఆ బాధ్యతను మరొకసారి గుర్తుచేస్తున్నది.

వీ


నెత్తుటి చాలు పోసే అద్వానీ రథయాత్ర

రాజుల రథాలు సాగినంతమేరా సామాన్యుల నెత్తుటి కాలువలు పారడం భారత చరిత్రలో కొత్త కాదు. భగవంతుని రథమే చక్రాల నిండా అంటిన బహుజన రక్తచిహ్నాలతో సాగుతున్నదని, అందులో ఒక భక్తుడి నెత్తురు ఎక్కడ కనబడుతుందని పరమ ఆస్తికుడు విశ్వనాథ సత్యనారాయణే ప్రశ్నించారు. అంటే అటు రాజ్యాధికారమైనా, ఇటు మతభావజాలమైనా రథాలనూ వాడుకుంటాయి, రక్తప్రవాహాలనూ సృష్టిస్తాయి. ఆ రాజ్యాధికారాన్నీ మతోన్మాద భావజాలాన్నీ కలగలపడమే సంఘ్ పరివార్ లక్ష్యం. రాజ్యాధికారం కోసం మతవిద్వేషాలు రెచ్చగొట్టి రక్తాలు పారించే రథాలు నడపడం సంఘ్ పరివార్ రాజకీయ ప్రతినిధి లాల్ కృష్ణ అద్వానీకి ఇష్టమైన క్రీడ. గత ఇరవై సంవత్సరాలలో ఐదు సార్లు రథయాత్రలు జరిపి, రథం వెళ్లినచోటల్లా విషబీజాలు నాటుతూ అధికార పీఠం ఎక్కి హోంమంత్రిగానూ ఉపప్రధానిగానూ పనిచేసిన అద్వానీ ఇప్పుడు అవినీతి వ్యతిరేకత ముసుగు కప్పుకుని మరొక రథయాత్ర ప్రారంభించారు. రానున్న ఎన్నికలలో ఢిల్లీ గద్దెను ఆక్రమించడం, అప్పటికి ఆరోగ్యం సహకరిస్తే ప్రధానమంత్రి కావడం లక్ష్యాలుగా ఈ యాత్ర సాగుతున్నది. వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు కల్పించే మండల్ కమిషన్ నివేదికను అమలు చేయాలని వి పి సింగ్ ప్రభుత్వం నిర్ణయించగానే 1990 సెప్టెంబర్ 23న అద్వానీ రామ జన్మభూమి కోసం మొదటి రథ యాత్ర ప్రారంభించారు. అప్పటి బీహార్ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ ఆ యాత్రను అడ్డుకోగా అక్టోబర్ 23న అది ఆగిపోయింది. కాని ఆ నెలరోజుల యాత్ర సందర్భంలోనే రథం ఎక్కడికి వెళితే అక్కడ మతఘర్షణలు చెలరేగి 275 మంది మరణించారు. ఆ తర్వాత రెండు సంవత్సరాలలో మతకల్లోలాలలో వేలాది మందిని బలిగొని, చివరికి బాబ్రీ మసీదును కూల్చిన పరిణామాలకు ఈ రామ రథ యాత్రే మూలం. ఆ తర్వాత నాలుగు జనాదేశ్ యాత్రలు, ఒక సురక్షా యాత్ర ప్రతి ఒక్కటీ అధికారాన్ని చేపట్టే, మతవిద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నంలో జరిగినవే. ఇప్పుడు సాగుతున్న జన చేతనా యాత్ర, అవినీతికి వ్యతిరేకంగా జన చైతన్యాన్ని రేకెత్తించడానికనే పేరుతో 2014 ఎన్నికలకు ముందస్తు ప్రచార యాత్రగా సాగుతున్నది. తమ పార్టీలోనూ, తమ పార్టీ పాలనలలోనూ జరిగిన భారీ కుంభకోణాలన్నిటినీ విస్మరిస్తూ అవినీతి వ్యతిరేక యాత్ర చేయడం భాజపా వంటి ద్వంద్వ ప్రమాణాల పార్టీకే చెల్లింది. యుపిఎ ప్రభుత్వం అవినీతి కుంభకోణాలలో కూరుకుని పోయినందువల్ల, ప్రజలలో ఆ ప్రభుత్వాన్ని తొలగించాలనే కోరిక ఉన్నందువల్ల, తామే ప్రత్యామ్నాయమని ప్రకటించడానికి, ఇతర మతస్తులను బెదరగొట్టడానికి ఇదే అనువైన సమయమని అద్వానీ భావిస్తున్నారు. బహుళజాతి సంస్థలు, స్వయంగా అమెరికా ప్రభుత్వం కూడ 2014లో యుపిఎ ప్రభుత్వం కూలిపోతుందని, భాజపా నాయకత్వంలోని ఎన్ డి ఎ అధికారంలోకి వస్తుందని అంచనా వేస్తున్నారు గనుక అంతటా అనుకూల స్థితి ఉందని సంఘ్ పరివార్ అనుకుంటున్నది. ఈలోగా ప్రధాని పదవికి తనను మించిన అర్హత గలవాళ్లు లేరని గుజరాత్ ముఖ్యమంత్రి, 2002 మారణకాండలో మూడు వేల మంది ముస్లింల ఊచకోత కోయించిన రక్తపిపాసి మోడీ కూడ పోటీ పడుతున్నారు. అలా రెండు అవినీతి కూటములలో, రెండు సామ్రాజ్యవాద దళారీ, ప్రజావ్యతిరేక పాలకవర్గ ముఠాలలో ఏదో ఒక ముఠాను ఎన్నుకోవడానికి, ఒకే పార్టీకి చెందిన ఇద్దరు నరహంతకులలో ఎవరో ఒకరిని ఎన్నుకోవడానికీ మాత్రమే ప్రజలకు అవకాశం మిగులుస్తున్నారు. ఈ నెత్తుటి పంటల రథాలనూ, ప్రజావ్యతిరేక రాజకీయాలనూ ఓడించి, నిజమైన ప్రజారాజకీయాల ప్రత్యామ్నాయాన్ని సాధించేదాకా భారత సమాజం ముందు ఈ రథాల హంతక సంరంభం సాగుతూనే ఉంటుంది. వీ

వాల్‌స్ట్రీట్ ముట్టడి, గడ్డాఫీ హత్య


తాను పుట్టి పెరిగిన పట్టణం సర్త్ నేల మీదనే తనను వెంటాడి పట్టుకుని తన మీదికి తుపాకి గురిపెట్టిన సామ్రాజ్యవాద కీలుబొమ్మ సైనికుడితో "బిడ్డా, నువు చేస్తున్నది తప్పు" అన్నాడు లిబియా అధ్యక్షుడు ముఅమ్మర్ గడ్డాఫీ. "నీకు తప్పేదో ఒప్పేదో తెలుస్తున్నదా" అని కూడ ఆ చివరి క్షణాలలో అవసరమైన ప్రశ్న వేశాడు. ఇవాళ మూడో ప్రపంచ దేశాల ప్రజలందరూ తమకు తాము వేసుకోవలసిన ప్రశ్న ఇది. తెలిసో తెలియకో సామ్రాజ్యవాదాన్ని సమర్థిస్తున్న "తమ"వారిని అడగవలసిన ప్రశ్న ఇది. తమ దేశానికి, తమ ప్రజలకు చెందిన సహజ వనరులను, తమ మార్కెట్లను సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల బకాసుర దాహానికి అప్పగించడం తప్పు. తమ ప్రజల సార్వభౌమాధికారాన్ని పరాయి పాలకుల పాదాల చెంత సమర్పించడం తప్పు. ఇవాళ చుట్టూ ఉన్న మూడువందలమంది మీద నాటో బాంబు దాడులు జరిపి చంపితే, నేల మీద గడ్డాఫీని వెంటాడి, పట్టుకుని కాల్చిచంపిన లిబియన్ యువకులు తమను తాము తిరుగుబాటుదారులమనీ, గడ్డాఫీ నిరంకుశపాలనను ఎదిరిస్తున్న స్వాతంత్ర్య యోధులమనీ అనుకోవచ్చు, వారికి ఆయుధాలు సమకూరుస్తున్న సామ్రాజ్యవాద నాటో సైన్యాలు ఆ ప్రచారమే చేయవచ్చు. సామ్రాజ్యవాద ప్రచారసాధనాలన్నీ గడ్డాఫీ నిరంకుశత్వం గురించీ, తిరుగుబాటుదార్ల వీరత్వం గురించీ వీరగాథలు పాడవచ్చు. కాని వారి తప్పు ఒప్పుగా మారదు. సహజ వనరుల కోసం, మార్కెట్ల కోసం ఇతర దేశాలలో ప్రవేశించి, అక్కడి వనరులను యథేచ్ఛగా దోపిడీ చేస్తూ, అక్కడి ప్రజల సార్వభౌమత్వాన్ని కాలరాస్తూ, అక్కడి పాలకులను తన దళారీలుగా మార్చుకోవడమో, మారనివాళ్లను నిందల పాలు చేసి మట్టుపెట్టడమో విదేశాంగనీతిగా వ్యవహరిస్తున్న సామ్రాజ్యవాద దేశాలదీ, బహుళజాతి సంస్థలదీ క్షమించరాని తప్పు. గడ్డాఫీ చరిత్ర ఇక్కడ మళ్లీ చెప్పుకోనక్కరలేదు గాని ఆయన చేశాడని చెపుతున్న, చేసిన తప్పులేవైనా ఈ సామ్రాజ్యవాద తప్పులకు సరిపోయేవి కావు. మూర్ఖుడో, నిరంకుశుడో, భిన్నాభిప్రాయాన్ని సహించనివాడో, అధికార పిపాసో, ఏమైనా సరే సామ్రాజ్యవాదాన్ని ఎదిరించాడు. గడ్డాఫీ చేసిన తప్పులకు శిక్ష విధించే అధికారం అమెరికాకూ, నాటో సైన్యాలకూ, అమెరికా ప్రభావిత లిబియన్లకూ లేదు. తన దేశపు వనరులు తన ప్రజలకే చెందాలని స్వేచ్ఛ, ఐక్యత, సోషలిజం నినాదాలతో ప్రారంభమైనవాడే, మూడో ఇంటర్నేషనల్ సిద్ధాంతంగా గ్రీన్ బుక్ ప్రచారం చేసినవాడే పీడకుడిగా మారి ఉండవచ్చు. ఇంటా బయటా వ్యతిరేకతలతో, సామ్రాజ్యవాదులమీద కసితో, అధికారం తలకెక్కడంతో నియంతగా మారి ఉండవచ్చు. ఇప్పుడిక మనిషే మరణించాక, పాలన అంతమయ్యాక చరిత్రలో మిగిలేదేమిటి? తప్పేమిటి? ఒప్పేమిటి? చాల తప్పులు ఉన్న మాట నిజమే. కాని ఇవాళ ప్రపంచం మొత్తం మీద అత్యంత దుర్మార్గమైన సామ్రాజ్యవాదానికి ఎదురునిలబడడం అనే ఒప్పు చేశాడు. ప్రపంచంలో ఎవరూ ఆ ఒప్పు చేయకుండా బెదిరించడానికే సామ్రాజ్యవాదం గడ్డాఫీ మీద మూడు దశాబ్దాలకు పైగా కత్తిగట్టి చివరికివాళ హత్య చేసింది. ఈ హత్య వెనుక చమురు యుద్ధపు రాజకీయార్థిక కారణాలు మాత్రమే కాక, ఇవ్వాళ్టికివాళ అమెరికన్ పాలకులు, నాటో దేశాల పాలకులు ఎదుర్కొంటున్న %%పెట్టుబడిని ముట్టడిద్దాం%% ఉద్యమం పైనుంచి దృష్టి మళ్లించే ఆలోచన కూడ ఉన్నది. గడ్డాఫీ తప్పులను క్షమించకుండానే, గడ్డాఫీ ఒప్పులను గుర్తించవలసి ఉన్నది. అంతకన్న ముఖ్యంగా సామ్రాజ్యవాదపు దుర్మార్గాన్ని గుర్తించవలసి ఉన్నది. వీ











- **కష్టజీవికి ఇరువైపుగా నిల్చిన మహాకవి శ్రీశ్రీ** – సింగమనేని నారాయణ – శ్రీశ్రీ సాహిత్య నిధి ప్రచురణ – 31 పేజీలు, 1/8 డెమీ, రు : 20, ప్రతులకు : శ్రీశ్రీ సాహిత్య నిధి, 305, ప్రగతి టవర్స్, వీరయ్య వీధి, మారుతినగర్, విజయవాడ – 520 004, ఫోన్ : 0866–6617375, ఫాక్స్ : 0866 – 6697375 సెల్ : 9246277375, ఇమెయిల్ : srisri_sahityanidhi@yahoo.com
- **తెలుగులో మారు పేరు రచయితలు** – కె.పి. అశోక్ కుమార్, ప్రొ. ఎ.ఎ.ఎన్. రాజు – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 150 పేజీలు, 1/8 డెమీ, రు : 70
- **హంసగీతి** – కాలుష్యంపై వచన కవితలు – ఎస్.ఎం. ప్రాణ్‌రావ్ –పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 49 పేజీలు, 1/8 డెమీ, రు : 20

పై రెండు ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16–11–20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500 036. ఫోన్ : 9848787284, palapittabooks@gmail.com

- **మట్టి పలకలు** – నానీలు – మంత్రి కృష్ణమోహన్ – 127 పేజీలు, 1/8 డెమీ, రు : 75, ప్రతులకు : మంత్రి రవికుమార్, 7–662 (కె.43), శ్రీనివాస థియేటర్ ఎదురుగా, మార్కాపురం, ప్రకాశం – 523 316, ఫోన్ : 94410 28186; అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలలో
- **విజయనగరం కథకుల కథల జాడ** – సంపాదకుడు : మోదు రాజేశ్వరరావు – సత్యమూర్తి చారిటబుల్ ట్రస్ట్, – 136 పేజీలు, 1/8 డెమీ, రు : 50, ప్రతులకు : మోదు రాజేశ్వరరావు, ఎడిటర్ కావ్య సమీక్ష తెలుగు మాసపత్రిక, సప్తగిరినగర్, చినముషిడివాడ, విశాఖపట్నం – 530 051, ఫోన్ : 9391811226; మోదు రాజేశ్వరరావు, ప్లాట్ నెం. 138, సింహాద్రినగర్, జుట్టాడా (పో), పెందుర్తి, ఆనందపురం రోడ్, విశాఖపట్నం – 531173
- **కుల వ్యతిరేక పోరాట యోధులు సాహు మహరాజ్** – రమణమూర్తి – విజయవిహారం సమర్పణ, జనహర్ష ప్రచురణ – 22 పేజీలు, 1/10 డెమీ, రు : 10
- **కుల వ్యతిరేక పోరాట యోధులు గాంధీజీ** – రమణమూర్తి – విజయవిహారం సమర్పణ, జనహర్ష ప్రచురణ – 38 పేజీలు, 1/10 డెమీ, రు : 10


పై రెండు ప్రతులకు : జనహర్ష పబ్లిషర్స్ ప్రై. లి., 3–8–347, మన్సూరాబాద్, చంద్రపురికాలనీ, ఎల్.బి.నగర్, హైదరాబాద్ – 500 074, ఫోన్ : 24026053, సెల్ : 9848019076


- **'తత్వవేత్త' మార్క్స్** – ఇస్త్వాన్ మెజారోస్, అనువాదం : ఆర్వియార్ – లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణ – 32 పేజీలు, 1/8 డెమీ, రు : 15
- **బాలన్యాయ దర్శనం** – వాఙ్మయ మహాధ్యక్ష వడ్లమూడి గోపాలకృష్ణయ్య – లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణ – 20 పేజీలు, 1/8 డెమీ, రు : 10

పై రెండు ప్రతులకు : లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్, డి. రాధాకృష్ణమూర్తి, ఇ.నెం. 5–85–4/బి, పండరీపురం, 1వ లైను, గుంటూరు – 522 002, సెల్ : 9848877596


- **ఓ యుద్ధకాండ (డివిడి)** – ఉస్మానియా విద్యార్థి ఉద్యమంపై డాక్యుమెంటరీ – సి. వనజ, విపుల్ కుర్‌కర్ణి – మహువా మీడియా – రు : 100, ప్రతులకు : జి1, మైత్రీ రెసిడెన్సీ, 3–6–394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్ హైదరాబాద్ – 500 029, ఫోన్ : 27623261











మావోయిస్టుల వేటకు 'బర్డ్'

మావోయిస్టుల వేటకు 'బర్డ్' (మానవ రహిత విమానం) వినియోగించనున్నట్లు డిజిపి దినేశ్‌రెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 25న విలేకరులతో మట్లాడుతూ దండకారణ్యంలో మావోయిస్టుల కదలికలను పసిగట్టడంతో పాటు, వారి ఛాయా చిత్రాలను, సంభాషణలను కూడా రికార్డు చేసి ఉపగ్రహం ద్వారా పంపుతుందన్నారు. వీటి ఆధారంగా తమ సిబ్బంది హెలికాప్టర్‌లో వెళ్లి మావోయిస్టులను ఏరివేస్తారని వివరించారు. అక్టోబర్ నుంచి రాజమండ్రి విమానాశ్రయం (మధురపూడి) కేంద్రంగా రోజుకు 8 గంటల పాటు బర్డ్‌తో రాష్ట్ర సరిహద్దుల్లోని 8 జిల్లాలతో పాటు, చత్తీస్‌గడ్, ఒడిశా రాష్ట్రాల్లో గాలింపు చేపట్టనున్నట్లు చెప్పారు.

గూడూరి సీతారాం ఇక లేరు!

ప్రఖ్యాత తెలంగాణ తొలి తరం కథకుడు గూడూరు సీతారాం (75) సెప్టెంబర్ 25 తెల్లవారుజామున అనారోగ్యంతో చనిపోయారు. చాలా కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. కరీంనగర్ జిల్లా వేములవాడ మండలం హన్మాజిపేటలో 1936లో సీతారాం పుట్టారు. ఆ గ్రామానికే చెందిన ప్రముఖ కవి, జ్ఞానపిఠ అవార్డు గ్రహిత సి. నారాయణ రెడ్డి శిష్యరికంలో రచయితగా ఎదిగారు. 1961లో నిజాం కాలేజిలో బి.ఎ చేస్తున్న కాలంలో అక్కడ లెక్చరర్‌గా ఉన్న సి.నారాయణ రెడ్డితో సాహిత్య బంధం పెనవేసుకుంది. ఆయన తరంగిణి అనే పత్రికను నిర్వహించారు. ఆయన నాలుగు నవలలు, ఎనబైకి పైగా కథలు రాసారు. సిరిసిల్ల పట్టణంలో జరిగిన సీతారాం అంత్యక్రియలకు రాష్ట్రం నలుమూలల నుంచి రచయితలు, కళాకారులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు.

కోటికి పైగా ఆధార్ కార్డుల జారీ

ఆధార్ విశిష్ట సంఖ్య కార్డుల జారీలో మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉంది. హైదరాబాద్‌లోని కేంద్ర ఆధార్ సంస్థ (యు.ఐ.డి.ఎ.ఐ.) కార్యాలయం ద్వారా రాష్ట్రంలో ఆధార్ ప్రక్రియ నడుస్తోంది. 6200 కేంద్రాల ద్వారా సెప్టెంబర్ 27 నాటికి 3.24 కోట్ల మంది ఆధార్ సంఖ్య నమోదు చేయించుకున్నారు. వీరిలో 1.2 కోట్ల మందికి ఆధార్ సంఖ్య జారీచేశారు.

కుల గణన తరువాతే...

కులాల వారిగా జనాభా లెక్కలు పూర్తి అయిన తరువాతే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థలకు సెప్టెంబర్ 29తో ముగియనున్న ప్రత్యేక అధికారుల పాలనను మరికొంత కాలం పొడిగిస్తూ సెప్టెంబర్ 28న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. డిసెంబర్ మొదటి వారంలోపు నాలుగు దశల్లో కుల గణనను పూర్తి చేస్తారని అంచనా.

తెలంగాణ ప్రజాఫ్రంట్ వార్షికోత్సవం

కేంద్ర హోంమంత్రి చిదంబరం 2009 డిసెంబర్ 9న చేసిన ప్రకటన ఆధారంగా తక్షణమే తెలంగాణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టి.పి.ఎఫ్) అధ్యక్షుడు గద్దర్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. టి.పి.ఎఫ్ తొలి వార్షికోత్సవం సందర్భంగా 9 అక్టోబర్ 2011న హైదరాబాద్‌లోని కార్యాలయంలో ఆయన జెండా ఎగురవేశారు. 1956లో విలీనం చేసిన తెలంగాణ కావాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

బిసిలకు 130 సీట్లు ఇవ్వాల్సిందే!

రాబోయే ఎన్నికలలో బిసిలకు 130 సీట్లు ఇవ్వకుంటే రాష్ట్రంలో కొత్త రాజకీయ వేదిక అనివార్యమని బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. బిసిలకు ప్రత్యేక వేదిక కావాలన్న డిమాండ్ ప్రజల నుంచే వస్తోందన్నారు. చట్ట సభల్లో కోటాకోసం కాకుండా వాటా కోసం పోరాడుతామని అన్నారు. త్వరలోనే జాతీయ స్థాయిలో బిసి ఉద్యమం చేయనున్నట్లు తెలిపారు. విజయవాడలోని సిద్దార్థ అకాడమి ఆడిటోరియంలో బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బిసిల రణభేరి అక్టోబర్ 9న జరిగింది. అన్ని జిల్లాల్లో సభలు పెట్టి బిసిల ఐకమత్యానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

మానవ హక్కుల వేదిక రాష్ట్ర మహాసభలు

మానవ హక్కుల వేదిక నాలుగవ రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 8, 9 తేదీల్లో జరిగాయి. ముగింపు రోజున మహాసభ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకుంది. అధ్యక్షుడిగా ఎస్. జీవన్‌కుమార్ తిరిగి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎ. సుబ్రహ్మణ్యం (నెల్లూరు), సి. సుబ్బారావు (మిర్యాలగూడ), ఎ. చంద్రశేఖర్ (అనంతపురం), జి. మాధవరావు (నిజామాబాద్), ప్రధాన కార్యదర్శిగా వి.ఎస్. కృష్ణ (విశాఖపట్నం), రాష్ట్ర కార్యదర్శులుగా జి.మోహన్ (నల్లగొండ), ఎ.మురళి (హైదరాబాద్), ఎం.డి.అన్వర్ (గోదావరి ఖని), యు.జి. శ్రీనివాసులు (ఆదోని), కె.వి. జగన్నాథరావు (శ్రీకాకుళం), ప్రచురణల సంపాదకురాలిగా వి. వసంతలక్ష్మి ఎన్నికయ్యారు. రెండు రోజుల పాటు జరిగిన మహాసభలకు 19 జిల్లాలనుంచి 170 మంది వేదిక సభ్యులు హాజరయ్యారు. తెలంగాణతో పాటు 20 అంశాలపై తీర్మానాలు చేశారు.

కరువు మండలాలుగా ప్రకటించండి

విద్యుత్ కోత కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అఖిలపక్ష నేతలు పేర్కొన్నారు. 13 జిల్లాల్లో 400 వందల మండలాల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని వెల్లడించారు. సంఘనాయకులు ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతి పత్రం అందించారు. క్రాప్ హాలిడే ప్రకటించిన ప్రాంతాలతో పాటు విద్యుత్ కోత ఎదుర్కొంటున్న మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని, ఎకరాకు రు. 10 వేల చొప్పున నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సకల జనుల సమ్మె

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలంటూ 42 రోజుల పాటు ఉధృతంగా సకల జనుల సమ్మె కొనసాగింది. ఈ సమ్మెలో సింగరేణి, ఆర్.టి.సి. కార్మికులతో సహా టీచర్లు, ఉద్యోగులు, లాయర్లు, వివిధ రంగాల్లో పనిచేస్తున్నవారు పాల్గొన్నారు. నిరసన ప్రదర్శనలు, ధర్నాలు, బహిరంగసభలు, మానవ హారాలు, నిరహార దీక్షలు, ఆటో బంద్‌లు, రైలురోకోలు, లాఠీ చార్జీలు, అరెస్టులు, జైళ్లకు తరలింపులతో తెలంగాణ ప్రాంతం అట్టుడికిపోయింది.

డాన్స్ మాస్టర్ సలీం మృతి

డాన్స్ మాస్టర్ సలీం (75) అక్టోబర్ 14 రాత్రి చెన్నైలో గుండెపోటుతో మరణించారు. ఆయన సుమారు మూడు వేల సినిమాలలో 5,500 పాటలకు నృత్య దర్శకత్వం వహించారు. ఆయన కేరళకు చెందిన ఒక మధ్యతరగతి కుటుంబంలో పుట్టారు. చిత్ర సినిమాకు దుస్తులు కుట్టడంతో ఆయన సినీ జీవితం ప్రారంభమైంది. చివరి దశలో తీవ్రమైన పేదరికంలో చనిపోయారు.

జాలాది కన్నుమూత

ప్రముఖ సినీ గేయ రచయిత జాలాది (79) అక్టోబర్ 14న విశాఖపట్నంలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. తాత్వికత నిండిన లోతైన భావాలతో ఆయన గేయాలు రాశారు. ఆయన పూర్తిపేరు జాలాది రాజారావు. ఆయన 265 సినిమాలకు గాను, 1500 వందలకు పైగా పాటలు అందించారు. నంది అవార్డ్‌తో సహా పలు అవార్డ్‌లు అందుకున్నారు. వీ

సకల జనుల సమ్మె ఇటీవల తెలంగాణ ఉద్యమంలోనే ఒక మైలురాయి వంటిదనీ, ప్రత్యక్షంగా, పరోక్షంగా అది వేసిన గుణాత్మక ప్రభావం అంచనా వేయాల్సి ఉందనీ అంటున్నారు **శ్రీధర్ దేశపాండే**

సకల జనుల సమ్మె : విజయాలు - వైఫల్యాలు

సెప్టెంబర్ 13న ప్రారంభమైన సకల జనుల సమ్మె 40 రోజులుగా సాగుతూనే ఉంది. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి పాలక వర్గాలు త్రిముఖ వ్యూహం రచించాయి.

1. నాయకత్వాన్ని లొంగదీసుకొని ప్రలోభపెట్టి సమ్మెను విరమింపజేయడం. 2. సమ్మె చేస్తున్న ఉద్యోగులు, ప్రజాశ్రేణులపై నిర్బంధాన్ని, అణచివేత చర్యలను అమలుచేసి ఉద్యమ నాయకత్వాన్ని ఉద్యమం నుండి దూరం చేయడం. 3. ఉద్యమంలో లేని బయటి వ్యక్తులచే ఉద్యమ నాయకత్వంపై దాడి చేయించడం.

ఈ త్రిముఖ వ్యూహం పాక్షింగానే ఫలించింది. కొన్ని శ్రేణులు సమ్మెను విరమించుకున్నవి. ద్రోహానికి గురి అయికొన్ని, అనివార్యతకు లోనయి కొన్ని వాటిని చూసి నిరాశా నిస్పృహలకు లోనయి మరికొన్ని.. ఉద్యమం నుండి వైదొలగకపోయినా సమ్మె విరమించుకోవాల్సి వచ్చింది. అయితే 40 రోజులుగా ఉద్యోగవర్గాలు మాత్రం సమ్మెలో ఇంకా కొనసాగుతుండడం విశేషం. వారికి తోడుగా విశాల ప్రజానీకం రోడ్ల మీద రోజూ కవాతు చేస్తూనే ఉన్నారు. ఇది ఇవాల్టి పరిస్థితి. ఉద్యోగుల సమ్మె కూడా అంతిమంగా విరమణ కావచ్చు. సమ్మెకు ముందు నినాదం 'తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు స్పష్టమైన కాలపరిమితితో కూడిన రోడ్ మ్యాప్' ప్రకటించే వరకు సమ్మె కొనసాగిద్దాం. ఇంకా ప్రజల నోటిలో నినాదం ఏమిటంటే 'తెలంగాణ వచ్చేదాకా తెగించి కొట్లాడుదే'. మరి సమ్మె తన లక్ష్యాలను సాధించకుండానే విరమణ దిశగా పయనిస్తున్నదా? సమ్మె సాధించిన విజయాలు, అది వేసిన ప్రభావాలే లేవా? ఇవి ఇవాళ తెలంగాణ వాదులందరినీ కలిచివేస్తున్న ప్రశ్నలు. సమ్మె ప్రభావాలను, పర్యవసానాలను నిష్పక్షపాతంగా సమీక్షించుకోవాల్సి ఉన్నది. తెలంగాణ ఉద్యమ శ్రేణుల ఆత్మస్థైర్యాన్ని కాపాడుకోవాల్సి ఉంది.

మొదట సమ్మె ప్రభావాలను విశ్లేషించుకుందాం. సమ్మె ప్రారంభమైన మొదటిరోజు నుండే అంటే సెప్టెంబర్ 13 నుంచే గ్రామ పంచాయతీ ఆఫీసులు, మండలాఫీసులు, కలెక్టర్ కార్యాలయాలకు తాళాలు పడినాయి. సింగరేణి బొగ్గు గనుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. బొగ్గు రవాణా ఆగిపోయింది. సెప్టెంబర్ 16న ఉపాధ్యాయులు సమ్మెలోకి వచ్చినందున తెలంగాణ వ్యాప్తంగా స్కూళ్ళు, కాలేజీలు బందయినవి. పిల్లలు, ఉపాధ్యాయులు రోడ్లమీదికి వచ్చి కవాతు చేసినారు. ఈ సమ్మెలోకి మొదటిసారి ప్రైవేట్ స్కూళ్ళు, కాలేజీలు కూడా పాల్గొనడంతో విద్యారంగంలో సమ్మె సంపూర్ణంగా జరిగింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల కదలికలు బందయినాయి. పన్నుల వసూళ్ళు, బిల్లుల చెల్లింపులు ఆగిపోయాయి. సచివాలయానికి రోజుకు సగటున 75 వేల అర్జీలు వస్తాయి. సమ్మె కారణంగా అది పదివేలకు పడిపోయిందని సమాచారం. ఇక ప్రత్యేకించి ప్రస్తావించుకోవాల్సింది దేశంపై సింగరేణి సమ్మె వేసిన ప్రభావాలు. సింగరేణి బొగ్గుపై ఆధారపడిన రామగుండం ఎన్.టి.పి.సి. సూపర్ థర్మల్ పవర్ స్టేషన్‌లో 1400 మెగావాట్ల ఉత్పత్తి నిలిచిపోయింది. ఫలితంగా ఎన్.టి.పి.సి. నుండి సరఫరా అయ్యే కరెంట్ నిలిచిపోవడంతో తమిళనాడు, కర్ణాటక, కేరళ, గోవా రాష్ట్రాలలో విద్యుత్ సంక్షోభం ఏర్పడింది. అన్ని రాష్ట్రాల కంటే తీవ్రమైన కొరత ఎదుర్కొన్నది కర్ణాటక రాష్ట్రం. బీదర్, గుల్బర్గాలలో ఉన్న థర్మల విద్యుత్ కేంద్రాలకు సింగరేణి బొగ్గే ఆధారం. అక్కడ విద్యుత్ ఉత్పత్తులు పూర్తిగా నిలిచిపోవడంతో కర్ణాటక రాష్ట్రం సుమారు 500 మెగావాట్ల కొరతను ఎదుర్కొన్నది. వరంగల్ జిల్లా భూపాలపల్లి విద్యుత్ కేంద్రంలో 500 మెగావాట్ల ఉత్పత్తి నిలిచిపోయింది. ఇవే కాక బొగ్గు ఆధారిత అనేక పరిశ్రమలు సంక్షోభంలోకి నెట్టివేయబడినాయి. లాకవుట్లు ప్రకటించాయి. విద్యుత్ సంక్షోభం ఢిల్లీని కూడా తాకింది. ఢిల్లీకి కరెంటు సరఫరా చేసే థర్మల్ కేంద్రాలకు బీహార్, ఒడిశా ఓపెన్ కాస్ట్ గనుల నుండి బొగ్గు సరఫరా అవుతుంది. వర్షాల కారణంగా ఆ గనుల్లో బొగ్గు తడిసిపోయి విద్యుత్ ఉత్పత్తికి పనికి రాకుండా పోవడంతో సింగరేణిపై ఆధారపడినాయి. సింగరేణి సమ్మెతో ఢిల్లీ నగరం వేడెక్కింది. ఇంకా కొన్ని రోజులు సింగరేణి సమ్మె కొనసాగి ఉంటే దేశం మొత్తం ఈ దీపావళిని అమావాస్య చీకట్లలోనే జరుపుకోవాల్సి వచ్చేదని విద్యుత్ రంగ నిపుణులు వ్యాఖ్యానించారు. ఈ విద్యుత్ సంక్షోభాన్ని ఎట్లా ఎదుర్కోవాలో తెలియక అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు దిక్కుతోచని పరిస్థితిలో కూరుకుపోయాయి. సింగరేణి బొగ్గు దేశ ఆర్థిక, పారిశ్రామిక ప్రగతికి ఎంత కీలకమైందో సమ్మె సందర్భంగా తెలంగాణ ప్రజలకు, దేశ ప్రజలకు తెలిసింది.

ఆర్.టి.సి. కార్మికులు సెప్టెంబర్ 19న సమ్మెలోకి వచ్చినారు. ఆర్.టి.సి. కార్మికుల సమ్మె వల్ల తెలంగాణలో పూర్తిగా, మిగతా ప్రాంతాల్లో పాక్షికంగా పబ్లిక్ రవాణా రంగం స్తంభించిపోయింది. సెప్టెంబర్ 19 నుండి హైదరాబాద్ సహా తెలంగాణ వ్యాప్తంగా బస్సు పయ్యలు తిరగడం బందయింది.

సమ్మె చేస్తున్న ఉద్యోగ, కార్మిక వర్గాలకు తోడుగా తెలంగాణలో అపూర్వమైన రీతిలో ఒక ప్రజా వెల్లువ కనబడుతున్నది. ప్రజలు అలలు అలలుగా సమ్మెలోకి వచ్చి చేరుతున్నారు. గ్రామాలు, మండల కేంద్రానికి తరలివెళ్లాయి. మండలాలు జిల్లా కేంద్రానికి తరలివెళ్లాయి. రోజూ

లక్షలాది మంది రోడ్లమీదికి వచ్చి నినదిస్తున్నారు. గ్రామీణ రైతాంగం, కూలీలు, కుల సంఘాలు, వృత్తి సంఘాలు, వ్యాపారవర్గం, ఆటోవాలాలు, తోపుడు బండ్ల వ్యాపారులు, హమాలీలు, బీడీ కార్మీకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇందిరా క్రాంతి పథం ఉద్యోగులు, అర్చకులు, లాయర్లు, ముస్లింలు, క్రిస్టియన్లు సబ్బండ వర్గాల ప్రజలు ర్యాలీలు తీసి సమ్మెలో భాగస్వాములవుతున్నారు. సమ్మెకు సంఘీభావంగా రైల్వే కార్మికులు, ఉద్యోగులు, బి.ఎస్.ఎన్.ఎల్. ఉద్యోగులు, ఎల్.ఐ.సి. ఉద్యోగులు, బ్యాంకు ఉద్యోగులు రక్షణ శాఖ ఉద్యోగులు కూడా ర్యాలీలు తీసి నిరసన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 19న రహదారుల దిగ్బంధనం కార్యక్రమంలో ప్రజలు వేలాదిగా ఎడ్లబండ్లతో వచ్చి ఎంపిక చేసిన జాగాల్లో బైఠాయించారు. ఆదిలాబాద్ బోరజ్ చెక్‌పోస్ట్, సిర్పూర్ కాగజ్ నగర్, మెదక్ జిల్లా జహీరాబాద్, నిజామాబాద్ జిల్లా సాలూర్ చెక్‌పోస్ట్, నల్లగొండ జిల్లా కోదాడ, మహబూబ్‌నగర్ జిల్లా ఆలంపూర్ వద్ద జాతీయ రహదారులపై వేలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా 12 గంటలపాటు బైఠాయించి దేశానికి, తెలంగాణకు లింకు తెంపేసారు. సెప్టెంబర్ 24, 25 తేదీలలో తిరిగి అక్టోబర్ 15, 16 లో జరిగిన 48 గంటల రైల్‌రోకో కార్యక్రమంలో వేలాది మంది పాల్గొని విజయవంతం చేశారు. నిజానికి రైల్‌రోకోని 200 రైళ్లని రద్దు చేసుకొని రైల్వేశాఖ తనకు తాను అమలు చేసుకున్నది. దక్షిణ భారతానికి, ఉత్తర భారతానికి రైళ్ల రాకపోకలు పూర్తిగా బందయినాయి. రెండోసారి జరిగిన రైల్‌రోకోలో వేలాది మంది అరెస్టయి జైలు పాలయినారు. దక్షిణ భారతానికి, ఉత్తర భారతానికి రైళ్ల రాకపోకలు పూర్తిగా బందయినాయి. స్వంత పార్టీ ఎం.పి.లనే అరెస్టు చేసి జైలుకు రిమాండ్ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. సెప్టెంబర్ 24, 25 తేదీలలో ఆటోబంద్, పెట్రోల్ పంపుల బంద్ కూడా పాటించ డంతో రైళ్లు లేక, బస్సులు లేక, ఇంధనం లేక రవాణా రంగం పూర్తిగా స్తంభించిపోయింది. హైదరాబాద్‌లో అప్రకటిత బంద్ జరిగినట్లయింది.

సమ్మె ప్రభావం ఆఖరికి దేవుళ్లకి కూడా తగిలింది. తెలంగాణ అర్చకులు అర్చక సేవలను బందు పెట్టి దేవాలయాలకు తాళాలు వేసి తమ నిరసనని తెలియజేశారు. ఉద్యమస్ఫూర్తిని చాటుకున్నారు.

సమ్మె ప్రభావం వలన తెలంగాణ వ్యాప్తంగా ముఖ్యంగా హైదరాబాద్‌లో కొనుగోళ్లు పడిపోయి వ్యాపారం కుంటు పడినట్లుగా సమాచారం. సంవత్సరం మొత్తంలో జరిగే వ్యాపారంలో 40 శాతం వ్యాపారం దసరా – దీపావళి పండుగల సందర్భంగానే జరుగుతాయి. దసరా, దీపావళి కొనుగోళ్లు లేక కొత్త స్టాకులు 10 శాతం కూడా అమ్ముడుపోలేదని వ్యాపారులు చెబుతున్నారు. ఇది స్థూలమైన అంచనా మాత్రమే. సమ్మె ప్రభావాలు మరింత సూక్ష్మ స్థాయిలో విశ్లేషణ జరగాల్సి ఉన్నది. ఈ ప్రభావాల పర్యావసనాలు ఇంతవరకు మనం చూడనివే.

35 రోజుల సమ్మె అనంతరం కొన్ని శ్రేణులు సమ్మెలోంచి జారిపోయినప్పటికీ సమ్మె దేశం మీద ముఖ్యంగా కేంద్రపాలక వర్గాల మీద ప్రభావాలు, అనంతర పర్యావసనాలు సమ్మె సాధించిన విజయాలు గానే మనం అంచనా వెయ్యాల్సి ఉంటుంది. సమ్మె పర్యావసనాలుగా చెప్పుకునే వాటిలో తెలంగాణ ఉద్యమ శ్రేణుల్లో, ప్రజల్లో వెల్లివిరిసిన ఐక్యత ప్రముఖంగా చెప్పుకోదగ్గది. తెలంగాణ ఏర్పాటు అన్న రాజకీయ డిమాండ్‌తో సంఘటితరంగంలో ఉన్న ఉద్యోగులు, కార్మికులు ఏకోన్ముఖంగా, ఐక్యంగా సాగడం మనం గతంలో ఎన్నడూ చూడనిది. ఆర్.టి.సి.లో, సింగరేణిలో, ఉద్యోగుల్లో అనేక యూనియన్లు, సంఘాలు పనిచేస్తున్నాయి. గతంలో వారు వారి ఆర్థిక డిమాండ్లపై సమ్మెలు చేసిన చరిత్ర ఉన్నది. అయితే ఒకరు సమ్మెకు పిలుపిస్తే మరొకరు విభేదించడం జరిగింది. సమ్మెలు సంపూర్ణంగా జరిగిన దాఖలాలు లెవ్వు. ఇవాళ ఒక రాజకీయ డిమాండ్‌పై అన్ని పార్టీల అనుబంధ యూనియన్లు, స్వతంత్ర యూనియన్లు కూడా ఒకటై తమ మధ్య ఉన్న రాజకీయ, సైద్ధాంతిక, వ్యక్తిగత వైరుధ్యాలను, విభేదాలను పక్కనబెట్టి సమ్మె చెయ్యడం అపూర్వం. ప్రజలు మతాలకు, కులాలకు అతీతంగా కదిలి రావడం ఉద్యమం సాధించిన అద్భుతమైన విజయం. ఈ వెల్లువెత్తిన ఐక్య ఉద్యమాలు, తెలంగాణ ఉద్యమంలో ప్రజలు లేరని, ఇది రాజకీయ నిరుద్యోగులు రెచ్చగొట్టి లేపిన ఉద్యమమని చేస్తున్న దుష్ప్రచారం ఒక కుట్ర అని, అబద్ధమని సమ్మె దేశానికి నిర్ద్వంద్వంగా తెలియజెప్పింది. దేశం దృష్టిని తనవైపుకు మల్లించుకున్నది.

సమ్మె ప్రభావాలు ఢిల్లీని అతలాకుతలం చేసినాయి. కేంద్ర పాలక వర్గాలు ఇన్నాళ్లూ కండ్లు మూసుకొని నిద్ర నటిస్తున్నాయి. వారి మీద కొరడా ఝుళిపించి వారిని దొంగ నిద్ర నుండి లేపింది సమ్మె. సీమాంధ్రుల డబ్బు సంచుల ప్రలోభాల నుండి ఇవతలకి గుంజి పడేసింది. ఢిల్లీలో పదిరోజుల పాటు కోర్‌కమిటీలని, మినీ కోర్ కమిటీలని, సంప్రదింపులని చర్చోపచర్చలకు లోను చేసింది. కేంద్ర పాలకవర్గాలు సత్వరమే పరిష్కరించవలసిన సమస్యగా ముందుకు తెచ్చింది. ఇట్లా జరగడం ఇది రెండోసారి. మొదటిసారి నవంబర్ 29 నుండి డిసెంబర్ 9 2009లో పది రోజుల పాటు తెలంగాణలో ఎగిసిన ప్రజావెల్లువ సందర్భంగా ఇటువంటి కదలికలు ఢిల్లీలో చూశాం. ఆ ఉద్యమ ప్రభావ ఫలితమే డిసెంబర్ 9 ప్రకటన. ఇవాళ అటువంటి ప్రకటన ఇంతవరకు రాకపోయినా, ఆ ప్రకంపనకు కావలసిన పూర్వ రంగాన్ని సిద్ధం చేసింది సకల జనుల సమ్మె. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించకపోతే తెలంగాణలో కాంగ్రెస్ ఖేల్ ఖతం అయినట్లే అన్న స్పృహను, అభద్రతను కేంద్ర పాలకవర్గాల మెదళ్లలోకి దించ గలిగింది సమ్మె. సమస్యలను నాన్చి నాన్చి, సాగదీసి సాగదీసి సమస్యను దానికదే సమసిపొయ్యేటట్లు చెయ్యగల నిష్ణాతులుగా పేరుగాంచిన కాంగ్రెస్ వృద్ధ జంబుకాల బూజు దులిపి తన వైపు దృష్టి మరల్చే విధంగా చేయగలిగింది సమ్మె.

భారతదేశానికి ఇంతకాలం తెలంగాణ అర్థం కాలేదు. అదొక మావోయిస్టు తీవ్రవాద ప్రభావిత ప్రాంతంగానే వారికి తెలుసు. ఇవాళ సకల జనుల సమ్మె ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఒక న్యాయమైన, ప్రజాస్వామ్యయుతమైన, రాజ్యాంగబద్ధ డిమాండ్‌గా దేశం గుర్తించేలాగా చెయ్యగలిగింది. దేశంలోని పౌరసమాజం, మేధావి వర్గం, జాతీయ పత్రికలు, మీడియా తెలంగాణను పట్టించుకోకుండా ఉండలేని పరిస్థితి. నిర్లిప్తంగానో, వ్యతిరేకంగానో ఉన్న దేశ పౌరసమాజం ఇవాళ తెలంగాణ డిమాండ్‌ను సమర్థిస్తూ మాట్లాడుతున్నది. జాతీయ పత్రికలు తెలంగాణ ఆకాంక్షను విశ్లేషిస్తూ వ్యాసాలు ప్రచురిస్తున్నవి. జాతీయ మీడియా ఉద్యమ కథనాలను, విశ్లేషణలను ప్రసారం చేస్తున్నవి. అంతర్జాతీయ పత్రికల్లో, వెబ్ మాగజైన్లలో కూడా తెలంగాణపై విస్తృత చర్చ జరుగుతన్నది. ఇవి సకల జనుల సమ్మె సాధించిన అద్భుతమైన, గుణాత్మకమైన విజయాలు.

ఇదే సమయంలో ఉద్యమ వైఫల్యాలు కూడా ఉన్నాయి. ఉద్యమానికి ఎదురైన విద్రోహాలను ముందుగా అంచనా వేసే నాయకత్వం ప్రలోభాలకి లోను కాకుండా నివారించలేకపోయింది. ఐక్యంగా నిలబడిన కార్మిక శ్రేణులు మరింత జాగరూకతతో తమ నాయకత్వాన్ని దృఢంగా వ్యవహరించి సమ్మెను కొనసాగించేలాగా చెయ్యడంలో వైఫల్యం

అవకాశవాద రాజకీయ నాయకత్వంతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యం కావడం లేదనీ, ప్రజలే తెగించి కొట్లాడి సాధించుకోవాలనీ అంటున్నారు **డా. ప్రభంజన్ యాదవ్**

చిత్తశుద్ధిలేని పోరాటం

తెలంగాణ పోరాటం 'చిత్తశుద్ధి లేని శివ పూజ' లెక్క ఉంది. తెలంగాణల అన్ని రాజకీయ పార్టీలూ ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకుంటున్నై. ఒక్క సిపిఎం మాత్రం విశాలాంధ్రనే సమర్థిస్తాంది. కానీ కేంద్రం తెలంగాణ రాష్ట్రాం ఇస్తానంటే తమకు అభ్యంతరం లేదనీ స్పష్టం చేసింది. రాజకీయ లబ్ధే లక్ష్యంగా కాంగ్రెస్, తెలుగు దేశం, భారతీయ జనతా, కమ్యునిస్టు పార్టీలు తెలంగాణకు జై అన్నయి. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర సమితి, తెలంగాణ సాధన సమితి, తెలంగాణ విమోచన సమితి, తెలంగాణ సంఘర్షణ సమితి, తెలంగాణ కమ్యూనిస్టు తదితర పార్టీలూ సంస్థలు పుట్టినై. కొన్ని మన లేక పోయినై. మరి కొన్ని విలీనమైనై. ఉద్యమాన్ని బలోపేతం చేసినై.

పార్టీలు రాజకీయ ఉద్యమం చేస్తున్నై. సమాంతరంగా ప్రజా సంఘాలు, సంస్థలు, వ్యక్తులు, విద్యార్థి, యువజన, మహిళా, దళిత సంఘాలు, జర్నలిస్టుల, న్యాయవాదుల, కవుల, కళాకారుల, రచయితల వేదికలూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకోసం రాజీలేని పోరు చేస్తున్నై. శక్తి వంచన, ఆత్మ వంచన లేకుండా ఉద్యమాన్ని మరింత పదునెక్కిస్తున్నై. ప్రజాస్వామ్య పద్ధతిల శాంతియుతంగా సమరం సాగిస్తున్నై. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల ఉద్యమానికి మద్దతు కూడ గట్టినై. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్ష అని చాటినై.

తెలంగాణ ఉద్యమంల మజిలీలెన్నో... మలుపులు మరెన్నో... సీమాంధ్రుల దోపిడి వలస వాదానికి, భాషాదురంహాంకారానికి, ద్వంద్వనీతికి, దాష్టికానికి వ్యతిరేకంగా 1969 ల్నే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వెల్లువెత్తింది. 369 మంది విద్యార్థులు సీమాంధ్రుల రక్తదాహానికి బలైపోయిండ్లు. అరెస్టులు, అరాచకాలకు గురైనవాళ్లు అనేకులు. మధ్యల్నే ఉద్యమ నాయకత్వాన్ని కబ్జా చేసిన దగాకోరులు, దగుల్బాజీలు, స్వార్థపరులు తెలంగాణకు ద్రోహం చేసిండ్లు. చరిత్రల దోషులుగా మిగిలిపోయిండ్లు. గప్పటి సంది తెలంగాణ ఉద్యమం పదుతూ లేస్తూ బలం పుంజుకున్నది. ఆ నిరసన జ్వాల నింగికెగిసింది. తొలి, మలి దశలు దాటింది. దావానలమై నేడు తెలంగాణమంతటా ఇసురుకుంది. ఆఖరుకొచ్చింది.

రాష్ట్ర సాధన కోసం నింగికెగిసిన నిరసన జ్వాలలు, ఆశల ఎరతో నీళ్లు చల్లే ఏలికల కుటిల నీతులు, వ్యూహ ప్రతివ్యూహాలు, అణచివేతలూ ప్రతిఘటనలూ, తిరగబడ్డ తెలంగాణం కదను తొక్కిన కడపటి

చెందాయి. ద్రోహులపట్ల, ఇంటి దొంగలపట్ల అప్రమత్తంగా వ్యవహరించ లేకపోయాయి. తెలంగాణ రాజకీయ నాయకత్వాన్ని ముఖ్యంగా మంత్రులు, ఎం.ఎల్.ఎ.లను ఉద్యమంలోకి దించలేకపోయింది. వాళ్లమీద పెట్టవలసినంత తీవ్రమైన ఒత్తిడిని పెంచలేకపోయింది. ఉద్యమాన్ని నిరసనస్థాయి నుండి ప్రతిఘటనస్థాయికి పెంచలేకపోయింది. ఈ నలభై రోజులు ఉద్యమంలో ప్రతిఘటన స్థాయిలో ఉన్న సంఘటన ఒక్కటే కనబడుతుంది. రెండు రోజుల పాటు జాతీయ రహదారి నెం. 9పై రాస్తారోకో సందర్భంలో ప్రజలు ప్రతిఘటనను ప్రదర్శించారు. తెలంగాణను అడ్డుకుంటున్న సీమాంధ్ర పెట్టుబడిదారులపై సమ్మె అస్త్రాలని ఎక్కుపెట్టనేలేదు. వారి వ్యాపార, ఆర్థిక కార్యకలాపాలపై ఎటువంటి ఆటంకాలని కలిగించలేకపోయింది. సీమాంధ్ర వస్తు, వ్యాపార బహిష్కరణ పిలుపును జె.ఎ.సి. ఇవ్వలేకపోయింది. సీమాంధ్ర సాంస్కృతిక ఆధిపత్యానికి ప్రతీకలుగా ఉన్న సీమాంధ్ర తెలుగు సినిమాలని బహిష్కరించమని జె.ఎ.సి. పిలుపు ఇవ్వలేకపోయింది. సినిమా వ్యాపారంలోంచి వచ్చిన వందల కోట్ల సొమ్ము తెలంగాణను అడ్డుకోవడానికి పెట్టుబడిగా ఉపయోగపడుతుందన్న స్పృహ జె.ఎ.సి.కి ఉండి కూడా సీమాంధ్ర సినిమాల బహిష్కరణకు పిలుపు ఇవ్వలేక పోయింది. ఉద్యమం రెండోదశలో అత్యవసర సర్వీసులను కూడా సమ్మెలోకి దించుతామని ప్రకటించామే తప్ప ఏ దశలోనూ అత్యవసర సర్వీసులను సమ్మెలోకి దించలేకపోయారు. తెలంగాణలోనే ఉన్న అంతర్గత శత్రువుల దాడిని సమర్థవంతంగా ఎదుర్కోలేకపోయాం. కొత్తగూడెంలో జె.ఎ.సి. కో ఆర్డినేటర్ పిట్టల రవీందర్‌పై దాడి, జె.ఎ.సి. చైర్మన్ కోదండరాం ఇంటి ముట్టడి అందుకు ఉదాహరణలు. ఈ ఇద్దరు రాష్ట్ర నాయకులపై జరిగిన దాడులని ఖండించే సౌజన్యం కూడా ఉద్యమ సంఘాలు ప్రదర్శించకపోవడం విచారకరం.

వైఫల్యాలు, ద్రోహాలు ఎన్ని ఉన్నప్పటికీ సకల జనుల సమ్మె ఆశించిన ఫలితాలను, విజయాలను సాధించిందనే చెప్పాలి. విజయాలు మరింత ఉధృతమైన ఉద్యమ నిర్మాణానికి సోపానాలవుతాయి. వైఫల్యాలని విశ్లేషించుకొని గుణపాఠాలు నేర్చుకోవాలి. ప్రొ. హరగోపాల్ ఒక వ్యాసంలో పేర్కొన్నట్లు 'సకల జనుల సమ్మె ఏం సాధించినా సాధించక పోయినా దేశ ప్రజాస్వామిక ఉద్యమాల చరిత్రలో ఒక చిరస్మరణీయ సంఘటనగా మిగిలిపోతుంది'. 'ఇంఖిలాబ్‌కా పైగంబర్ తెలంగాణ' అన్న మగ్దూం మాటని సగర్వంగా ప్రపంచానికి మరొక్కసారి చాటి చెప్పింది సకల జనుల సమ్మె.

(సకల జనుల సమ్మె విరమణకు ముందు రాసిన వ్యాసం)

(రచయిత తెలంగాణ విద్యావంతుల వేదిక ఉపాధ్యక్షులు) వీ

రణరంగం, త్యాగాల తోరణాలు, బద్మాషుల బదనాంలు, అమరుల ఆత్మ బలిదానాలు వెరసి తెలంగాణ తనువెల్లా సలుపుతున్న గాయలు. అయినా సడలని ఆత్మవిశ్వాసం, దిన దినం అంతకు పదింతలవుతున్న పోరాటం. ప్రాంతీయేతరులను తరిమికొట్టాలని, ఇంటి దొంగల భరతం పట్టాలని పగలు రేయి రగులుతున్న పగలు. గిదీ నేటి ఉద్యమ స్వరూపం. ఉద్యమం పల్లే పల్లెకు పాకింది. గుడిసె గుడిసెకు చేరింది. గుండె గుండెను తట్టింది. లోలోపల మసిలి మసిలి బుసలు కొడుతాంది. చావో రేవో తేల్చుకునే తందుకు తొడగొట్టి బరిగీసి నిలిసింది. జై తెలంగాణ... జై జై తెలంగాణ అని నినదిస్తున్నది. సకల జనుల సమ్మె సైరను మోగింది. సమర సంగీతం ఆలపిస్తున్నది.

గిట్లాంటప్పుడు రాజకీయ రాబందుల వాలకం పీనుగల మీద పేలాలు ఏరుక తిన్నట్టు ఉంది. రాష్ట్ర సాధన కోసం మనసు పెట్టి కొట్లాడుతలేరు. తెలంగాణ వస్తే గద్దెనెక్కుడెట్లాని ఆలోచిస్తున్నరు. ఒకరికి మించి మరొకరు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నరు. ఓట్ల రాజకీయాల బురద గుంటల్నే దొర్లాడుతున్నరు. ఆంధ్ర నేతల ఆధిపత్య పార్టీల చట్రంల చిక్కుకొన్నరు. బయటకు వొచ్చేతందుకు ధైర్యం చేస్తలేరు. రాజకీయ సిద్ధాంతాలను పక్కన పెట్టి రోశయ్య చంద్రబాబు చెట్టాపట్టాలేసుకున్నరు. రాత్రికి రాత్రే కుట్ర చేసిండ్లు. వచ్చిన తెలంగాణను తెల్లారె సరికల్లా అడ్డుకున్నరు.

ఇంకా గట్లాంటి ఆంధ్ర నాయకుల కనుసన్నలల్లనే తెలంగాణ సాధించాలని మన నేతలు తెగ పోటి పడుతున్నరు. 'తెచ్చేదీ మేమే, ఇచ్చేదీ మేమే' అన్నవాళ్లు తెస్తలేరు, ఇస్తలేరు. ఈ పెగ్గెల సోగ్గాలు కోతలల్ల ఉత్తర కుమారుణ్ణీ మించి పోయిండ్లు. మీడియా ముందు ఊగిపోతూ ఊదరగొడుతరు. గల్లీలల్ల గంభీరంగా మాట్లాడుతరు. బీరాలు పోతరు. ఢిల్లీ అధిష్ఠానం అంటేనే అదిరి పోతరు. అమ్మ కాడ గొంతు పెగలదు. ప్రణబ్ కాడ పప్పులుడకవు. మొయిలి మొసలి కన్నీళ్లకు నీరు కారి పోతరు. ప్రజాఉద్యమ తీవ్రతకు తట్టుకోలేక పోయిండ్లు. అయిష్టంగానే పదవులకు రాజీనామాలు చేసిండ్లు. మొత్తం మీద బలాన్ని కూడగట్టు కున్నరు. ఆజాదు ముందు జబర్దస్తిగనే మాట్లాడిండ్లు. ప్రత్యేక తెలంగాణ తప్ప, ప్రత్యామ్నాయానికి ఒప్పుకునేదిలేదని తెగేసి చెప్పిండ్లు. పార్లమెంటు సమావేశాలకు హాజరు కాకుండా పంతమీదనే ఉన్నరు.

సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ అధిష్ఠానం పిసరంతైనా కృషి చేస్త లేదు. ఎన్నికలల్ల గెలిచి తెలంగాణకు తెడ్డు చూపెడుతాంది. 'గడ్డి గాలికి పోయినా, వడ్లు వరదల పోయినా పర్వా లేదు' అనుకుంటాంది. ఆంధ్రోళ్ల కాసులకు తప్ప, మన తెలంగాణ నేతల ఊసులకు విలువ ఇస్తలేదు. తెలుగోళ్లే తేల్చుకోవాలని చేతులెత్తేసింది. 'మరి ఎద్దు పుండు కాకికి ముద్దా'. కాలం గడుపుతాంది. రాజకీయ లబ్ధి కోసం 2014 ఎన్నికల దాక సమస్యను సాగతీయాలనే చూస్తాంది. గిది పసిగట్టే కాంగ్రెస్ ఎం.పి.లు, ఒకరిద్దరు ఎం.ఎల్.ఎ. లు, మాజీ మంత్రులు ప్రత్యక్ష్య పోరాటానికి దిగిండ్లు. రైల్ రోకో చేసి అరెస్టులైండ్లు. జైలుకు పోయిండ్లు. హోం మంత్రి సహ తెలంగాణ మంత్రులు సీమాంధ్ర ముఖ్యమంత్రి మూతి నాకిండ్లు. పోలీసులు రెచ్చిపోయి ఉద్యమకారులను హింసల పాలు చేస్తుంటే, అక్రమ కేసులు బనాయించి జైళ్లల్ల పెడితే చూసుకుంట కూసున్నరు. పైగా సమ్మె విరమించాలని కోరుతరు. వచ్చే ఎన్నికలల్ల తెలంగాణ ప్రజలు వాళ్లకు తగిన బుద్ధే చెప్తరు. కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోక తప్పదు.

ఇగ గా తెలంగాణ తెలుగుదేశం నేతల తిప్పలు చెప్పనలవి కాదు. వాళ్ల పరిస్థితి కుడితిల పడ్డ ఎలుక తీరు ఐంది. సీమాంధ్ర బాబుల ఉచ్చుల పడి పీనుగల తీర్రెండ్లు. గా పార్టీని వదిలేస్తే రాజకీయ మనుగడ ఎట్లాని నెత్తి పీక్కుంటున్నరు. కక్క లేక మింగ లేక దిక్కు తోయని స్థితిల కొట్టుమిట్లాడుతున్నరు. బయటికి వచ్చి సొంత పార్టీ పెడదామంటే పైసల్లేవట. దీనంగా మీడియా ముందే చెప్పిండ్లు. తెలంగాణ రాష్ట్ర సమితి, భారతీయ జనత, కాంగ్రెస్ పార్టీలల్ల ఏ పార్టీల చేరాలన్నది ప్రస్తుతానికి వాళ్లకాడ జవాబు లేని ప్రశ్న.

'గాడిదలకు గడ్డి పెట్టి, బర్లను పాలు పిండితే ఇస్తాయా' అంటూ కెసిఆర్ విమర్శలు చేస్తున్నడు. తెలంగాణ కోసం వెయ్యిమంది పిల్లగాండ్లు ప్రాణాలు తీసుకున్నరు. వాళ్ల త్యాగాల మీద భోగాలు అనుభవిస్తున్నడు. ప్రజాశ్రేయస్సును పక్కన పెట్టిండు. రాజకీయ లబ్ధి కోసం పదేండ్ల సందీ ఉద్యమాన్ని ఎన్నికల చుట్టే తిప్పుతున్నడు. ఇగ గిప్పుడేమో 2014 ఎన్నికలపైనే కన్నేసిండు. కాలయాపన చేస్తున్నడు. కాకమ్మ కథలు చెప్తున్నడు. తెలంగాణ రాజకీయ ఐకాస అధ్యక్షుడు కోదండరాం కోతలకు అద్దు పద్దు లేదు. ఉద్యమంల ఆయన ఆడిందే ఆట పాడిందే పాట. పిల్లగాండ్లు దాగుడు మూతలు ఆడినట్లు ఉద్యమం చేయమంటడు. మూణ్నెళ్లకోసారి ఆర్నెళ్లకోసారి, అమాసకు పున్నానికి ప్రజలను పురి కోల్పుతడు. సకల జనుల సమ్మె మంచిదే. కానీ సమయం సరైంది కాదు. నెలరోజుల సందీ జనం విసిగిపోయిండ్లు. రవాణా, విద్యా సంస్థలను సమ్మె నుంచి మినహాయించాలని డిమాండ్ చేసిండ్లు.

రాజస్థాన్ల గుజ్జర్లు పద్దెనిమిది రోజులు ఏకధాటిగా రైలు పట్టాల మీద సమ్మె చేసి లక్ష్యం సాధించుకున్న సంగతి రాజనీతిశాస్త్ర బోధకుడికి తెలియదా? పరాషకాలు ఆడినట్లు ఉద్యమం చేస్తే ప్రత్యేక రాష్ట్రం వస్తదా? 'ప్రాణం ఇడిసినా పర్వలేదు కానీ పట్టి ఇడువొద్దు' అన్న సామెత ఈ ప్రొఫెసర్ ఇనలేదా? గీ పట్టు విడుపుల్ల శత్రువు బలపడుతున్న తీరు గుర్తెగాలె. గుణపాఠం నేర్చు కోవాలె.

ప్రజలను ప్రభావితం చేయగల తెలంగాణ దళిత–బహుజన నాయకులు కొందరు ఏమీ పట్టనట్టు ఉన్నరు. మరికొందరు తమ వాటా తేలిస్తేనే ఉద్యమంల భాగస్వాములం అవుతామంటున్నరు. బేరాలు ఆడుతున్నరు. రెండు దశాబ్దాల ఆత్మగౌరవ, అస్తిత్వ పోరాటాల అనుభవం నేర్పింది ఇదేనా!? ఇంకా అడుక్కునే దుస్థితిలనే దళిత బహుజన నాయకులు ఉన్నరు. మరి గిట్లైతే రాజ్యాధికారం సాధించేదెట్లా? సకల జనులు తెలంగాణ సాధన కోసం తెగించి కొట్లాడుతున్నరు. అలుపెరగకుండా, అవిశ్రామంగా పోరాడుతున్నరు. ఈ నేతలేమో మీనమేషాలు లెక్కపెడుతున్నరు. తమ ప్రజలు ఉద్యమాలు చేస్తుంటే నాయకులు ఒడ్డున కూచున్నరు. చోద్యం చూస్తున్నరు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పోరాడుతలేరు. రవాణా విద్యా సంస్థలను సమ్మె నుంచి మినహాయించాలని కొందరు ధర్న చేసిండ్లు. 'దొరల తెలంగాణ కాదు, సామాజిక తెలంగాణ కావాలి' అని నినదిస్తున్నరు. నినాదాలతో లక్ష్యం సాధించిన సంఘటనలు చరిత్రల ఉన్నయా? నేల విడిచి సాము చేసినట్లు గాలిల విమర్శల కత్తులు మాత్రం దూస్తే వీరులైతరా?

ఉద్యమాలు చేస్తున్న ప్రజలు ఇక అవకాశవాద నేతల కుయుక్తులను పసిగట్టాలె. అమర వీరుల ఆత్మ సాక్షిగా జుట్టు పట్టికొట్టాలె. కదను తొక్కిన తెలంగాణకు ఈ సకల జనుల సమ్మెనే కడపటి రణరంగం కావాలె. నాలుగున్నర కోట్ల ప్రజల ప్రత్యేక రాష్ట్ర కల ఫలించాలె. తెలంగాణ వచ్చేదాక తెగించి కొట్లాడుదే. జై తెలంగాణ. జై జై తెలంగాణ.

(రచయిత పాత్రికేయులు) వీ

తెలంగాణ ఉద్యమం ప్రజలలో ఉన్న అపోహలను ముందు తొలగించాలనీ, వెనకబడిన ఇతర ప్రాంత ప్రజల ఆకాంక్షలనూ పరిగణనలోకి తీసుకోవాలనీ అంటున్నారు **చలసాని శ్రీనివాస్**

సకల జనుల సమ్మె - సామాన్యుల ఇబ్బందులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనపై కొంత మంది నాయకుల విద్వేష వ్యాఖ్యానాలు, ఛలోక్తులు, ప్రజల ఆవేదనలు అలాగే పత్రికలలో నిరంతర వ్యాసావళి, ప్రసార మాధ్యమాలలో 24 గంటల బ్రేకింగ్ హెచ్చరికల 'న్యూస్‌లు, వ్యూస్‌లు' ప్రజలను అసహనానికి గురిచేస్తున్నాయి. అతి కొద్ది మంది మినహా అనేక మంది నాయకులు ప్రాప్తకాల విజ్ఞతను, దూరదృష్టిని ప్రదర్శించకుండా ఎప్పటికప్పుడు భావోద్వేగాలకి అనుగుణంగా స్పందించడం వల్ల పరిస్థితి దిగాజారుతున్న విషయం కనపడుతోంది. అందువల్ల మేధావులు, పాత్రికేయులు విషయాలపై స్పందించేటప్పుడు జాగరూకతతో ఉండి వాస్తవాలను ప్రజలలోకి ఉధృతంగా తీసుకు వెళ్లాల్సిన సమయం ఆసన్నమయినదనిపిస్తోంది.

మొన్న బాన్స్‌వాడ ఎన్నికలలో అనామకుడిగా కాంగ్రెస్ పెద్దలే ముద్రవేసిన శ్రీనివాసగౌడ్ పోచారానికి గట్టిపోటీ ఇవ్వలేకపోయినా మేటి ప్రదర్శన చేసారని చెప్పవచ్చు. కానీ పోచారానికి తెలుగుదేశం పార్టీలో ఉండగా ఒకసారి వచ్చిన మెజార్టీ కంటే ఇప్పుడు మెజార్టీ తగ్గడం, అదే సమయంలో వై.ఎస్.ఆర్ కాంగ్రెస్, భాజపాతో సహా వామపక్ష వర్గాలు ప్రస్తుతం పోచారానికి మద్దతు ఇవ్వడం గమనించాలి. విజయం తరువాత అక్కడ స్థిరపడ్డ తీర-సీమాంధ్రులపై పోచారం చేసిన వ్యాఖ్యాలు మానవీయ కోణంలో ఆక్షేపణీయం. అయితే తెలంగాణ జిల్లాలలో ఇంతకు ముందు జరిగిన ఎన్నికలలో లేదా మొన్న మొదలు పెట్టిన సమ్మె ద్వారా ప్రజలలో అత్యధికులు తమకి ప్రత్యేక రాష్ట్రం కావాలనే ఆకాంక్షను వ్యక్తపరిచారు. అదే విధంగా డిసెంబర్ 9 తరువాత తీర సీమాంధ్ర ప్రజలలో అత్యధికులు సమైక్యాంధ్రకి అనుకూలమని స్పష్టం చేసిన విషయం కూడా విదితమే. ఇక ప్రత్యేక రాష్ట్రాన్ని కోరే నాయకులు చేయవలసింది కోస్తా, రాయలసీమ వాసుల అభ్యంతరాలు తెలుసుకుని ఒక పరిష్కారమార్గాన్ని అన్వేషించి సమస్యను పరిష్కరించాలి. అంతే తప్ప సమ్మె మాత్రమే అంతిమ పరిష్కారంగా భావించి 'నిరవధికంగా' చేయడం వల్ల సామాన్యులు ఇబ్బందిపడుతున్న విషయం పరిగణనలోకి తీసుకోవాలి. ప్రస్తుతం నడిచేది సకల జనుల సమ్మెగా కాక సకల జనులపై ఉద్యోగులు చేసే సమ్మెగా మారడం సరైనది కాదు.

తెలంగాణ సంస్కృతి పునరుజ్జీవనానికి పాటుపడుతున్నవారి కృషికి అభినందించాలి. అదే సమయంలో సమ్మెవల్ల నిత్యావసరాల ధరల పెరుగుదలేకాక దసరా పండుగకి రాష్ట్రమంతటా విద్యుత్ ఇతర కొరతలతో, బాగా జరుపుకోలేకుండా ఉంటే అనేక జిల్లాలలో భారీగా ధూం..ధాంగా బతుకమ్మ సంబర మహోత్సవాలు కె.సి.ఆర్‌గారి కుటుంబ సభ్యులు జరుపుకోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? సమ్మెవల్ల వేలాది కోట్ల రూపాయల కాంట్రాక్టులు చేసే పార్లమెంట్ సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి, మేకపాటి రాజమోహన రెడ్డి లాంటి పెట్టుబడిదారులకి గాని అలాగే కృష్ణా జిల్లాలో, విశాఖపట్నంలలో పెద్ద పరిశ్రమలు నడుపుకుంటున్న పార్లమెంట్ సభ్యులు వివేక్ లేదా లగడపాటిలకుగాని ఇబ్బందులేముంటాయి? బస్సులు, సామాన్య రవాణ వ్యవస్థ లేకపోవడం, రోజుల తరబడి రైలుబళ్లని ఆపివేయడం వల్ల సామాన్యులకి ఇబ్బందులు తలెత్తవా? తీరాంధ్ర నుంచి వచ్చే బస్సులలో ప్రయాణికులపై రాళ్ల దాడులు, పూటల కొద్దీ ఆపివేస్తే వారికి పోయే మానవ హక్కుల గురించి ఎవరూ మాట్లాడలేదే? దురదృష్టవశాత్తు గత 54 సంవత్సరాలలో తీరాంధ్రలో మంచి ఆసుపత్రులని పాలకవర్గాలు ఏర్పరచకపోవడం వల్ల హైదరాబాద్‌లో ఆపరేషన్లు ముందే నిర్ణయమైనవారు, ప్రమాదాలకు, తీవ్ర రుగ్మతలకు లోనైనవారి బాధలు పట్టవా? అదే విధంగా తెలంగాణ జిల్లాలలో సామాన్యులు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారు?

ఆదివాసీలకు భారత రాజ్యాంగం ఆర్టికల్స్‌లో ఇచ్చిన రక్షణలు ఉల్లంఘించి అత్యవసర సర్వీసులు కూడా వెళ్లని పరిస్థితులలో, వర్షాలలో విష జ్వరాలకులోనై వందలాది మంది మరణిస్తుంటే అవి ఈ నాగరిక సమాజం చేసే హత్యలు గావా? అలాగే ఉద్వేగాలను తారాస్థాయిలోకి తీసుకువెళ్లి తెలంగాణ రాకపోతే మరణమే అని నాయకులు ప్రకటిస్తే లేదా ఒకనాడు తెలంగాణకు అనుకూలంగా మాట్లాడి నేడు ఎట్టిపరిస్థితులలోనూ రాదు అనిచెప్పే నాయకుల వల్ల ఆవేదనతో ఆత్మహత్యలు చేసుకుంటున్న యువతవి ఒక విధంగా హత్యలు కావా? ఈ రోజు బ్రాందీ షాపులు, డిస్కోతెక్‌లు ఒక పక్క అలాగే పరిశ్రమలు, వ్యాపారాలు నడుస్తూ ఉంటే, విద్యా సముపార్జనమీదే తదుపరి జీవనం ఆధారపడి ఉండే మధ్య, దిగువ తరగతి వర్గాల పిల్లలు విద్యకు దూరం అవ్వాలా? రాజకీయ నాయకులు, పెద్ద కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తల సంతానానికి వారి వారసత్వం రెడీగా పెడతారు. మరి సామాన్యుల విషయం ఏమిటి?

సమ్మెకాలంలో సింగరేణి గనులలో ఒక జిల్లాలో 90 శాతం ఉత్పత్తి అయితే మరొక జిల్లాలో ఒక్క టన్నూ ఉత్పత్తి కాలేదు. విద్యుత్ కొరత దారుణంగా ఉంటే శ్రీశైలం, నాగార్జునసాగర్ ఖాళీచేసి సముద్రంలోకి నీరు పంపించి అయినా విద్యుత్ ఉత్పత్తి చేయాలంటూ లేదా హర్యానా నుంచైనా విద్యుత్ ఏ రేటుకైనా వేలాది కోట్లతో కొనైనా కరెంటు ఇచ్చి రైతులను కాపాడాలనే వాదన చేసేవారు రైతుల ప్రాణాల

రక్షణకోసం సింగరేణిలో సమ్మె ఆపితే మాత్రం వారి మనసులలో ఉన్న ప్రత్యేక తెలంగాణ వాదం ఎందుకు పలుచనౌతుందనుకుంటున్నారు? తెలంగాణలో అనేక మంది సామాన్యుల దైనందిన జీవితం ఇబ్బందులకు గురవుతోంది. అయినా అనేక మంది పంటి బిగువున తెలంగాణ వస్తే స్వర్గం దిగివస్తుందని, అన్ని సమస్యలకి జిందా తిలస్మాత్‌లాంటి నివారిణి ప్రత్యేక రాష్ట్రమని కొందరు రాజకీయ నాయకులు చెపుతున్న విషయాలను నమ్ముతున్నారు. బూజుపట్టిన వ్యవస్థని మార్చకపోతే రేపు మరల ఇదే మీసాల దామోదరరెడ్డి, కె.టి. రామారావు లాంటి నాయకులే సారథ్యం వహిస్తే పాలనా వ్యవస్థలో మౌలికమైన మార్పు ఎలా వస్తుంది?

ప్రత్యేక తెలంగాణ వస్తే సీమాంధ్రులు దోచిన లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు తెలంగాణ బిడ్డలకి వస్తాయనే అభూత కల్పనలతో లేదా కిందున్నవారే నీరు దోస్తున్నారని తెలంగాణ వస్తే జర కాలడ్డంబెడితే తెలంగాణ అంతా సస్యశ్యామలం అవుతుందని భ్రమలు కల్పిస్తూ వస్తున్న కొందరు ఇకనైనా వాస్తవాలను ఉద్వేగంలో ఉన్న ప్రజలకు తెలిపి, వాస్తవాల ఆధారంగా విభజనకు సుముఖం చేయాలి. లేకపోతే ప్రత్యేక రాష్ట్రాలు ఏర్పడిన తరువాత పెద్ద నాయకుల స్వంత ఆత్మగౌరవం కోసం ఇంత జరిగిందా అనుకుంటారు. తెలుగు తల్లి బిడ్డలందరూ సోదరులేనని, రాజకీయ దోపిడికి అన్ని ప్రాంతాల బలహీనులు బలైపోయారని తెలపాలి. అదే విధంగా హక్కులకి, ఆత్మగౌరవానికి ఇబ్బందులు లేనప్పుడు రాష్ట్రం విభజించినా ఇబ్బందులు లేవని కోస్తా, రాయలసీమ వాసులని చైతన్యవంతం చేసి సత్వర విభజనకు సుముఖం చేయాలి. దానికి విజ్ఞులు, అలాగే వామపక్ష భావజాలీకులు మార్గదర్శకత్వం వహించడానికి ముందుకు రావాలి. ఇంతకు ముందు ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిధిలో పనిచేసే లెక్చరర్లపై దాడులు, అలాగే బస్సులపై జరిగిన దాడుల వల్ల ప్రత్యేక తెలంగాణ యోజనాల దూరం వెళుతుందని నిబద్ధతతో తెలంగాణ కోరేవారికి తెలుసు. ఇరువైపులా రెచ్చగొట్టే ప్రకటనలు, విద్వేషాలకు గురిచేసే ప్రకటనలు వెంటనే ఆపాలి. విధ్వంసాలు, హింసావాదాన్ని నేటి ప్రపంచ సమాజం హర్షించదు. అంతిమంగా హింసావాదం పెచ్చరిల్లితే అది రాజ్యహింసకి దారితీస్తుంది తప్పితే పరిష్కారం లభించదు. అందువల్ల సమస్యలపై, పరిష్కారంపై దృష్టిపెట్టాలి. మేం గత నెలరోజులుగా తీరసీమాంధ్రలో అనేక ప్రదేశాలలో పర్యటించినపుడు తీరాంధ్రలో అనేకమందిలో హైదరాబాద్‌లో తీరాంధ్రులకు రక్షణలేదనే విషయంలో, అలాగే విడిపోతే నీరురాదనే విషయంలో తీవ్ర అభ్యంతరాలే సమైక్యాంధ్రకు ఎక్కువగా పురిగొల్పుతుండగా, సీమలో దానికితోడు భవిష్యత్తుపై ఒకరకమైన ఉద్వేగం కూడా కనపడింది. పోలవరం లాంటి ప్రాజెక్టులని అడ్డుకోవడానికి మన్యసీమ గిరిజనులను అడ్డుపెట్టుకునే కొందరు రాజకీయ నాయకులు, మేధావులు అన్ని విధాలుగా అన్యాయమైపోయిన ఆదివాసుల న్యాయమైన మన్యసీమ రాష్ట్ర ఏర్పాటుకు ఎందుకు మద్దతు ఇవ్వరో అర్థంకాదు. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ముందు తెలంగాణ ప్రాంతం ఒక రాష్ట్రంగా లేదని షిర్డి నుంచి రాయచూర్ - కొప్పల్ వరకూ కలిసిన హైదరాబాద్ రాష్ట్రం ఉండేదని తెలిసినా 1956కి ముందు నాటి తెలంగాణ కావాలంటూనే, పైగా ఆనాటి వేలాది చ.కి.మీల కోస్తా భూభాగాన్ని తమ జెండాలలోనూ, కండువాలలోనూ వేసుకున్న రాజకీయ నాయకులకి సరిహద్దులు ఎలా చెప్పగలం?

ఖచ్చితంగా తెలుగుజాతి ఐక్యతకోసమే ఉద్యమించే మండలి బుద్ధప్రసాద్‌లాంటి నిస్వార్థ రాజకీయ నాయకులు, అనేక మంది చిరు ఉద్యోగులు సమైక్యాంధ్ర కోరుతుంటే అసలు రాష్ట్రం విభజిస్తే లగడపాటి రాజగోపాల్ లాంటి పెద్ద పారిశ్రామిక వేత్తలకు తీర సీమాంధ్రలో ఉన్న ఆస్తుల విలువలు లక్షకోట్లకు పైగా పెరిగే అవకాశం ఉందని, అదే విధంగా అనేక రాష్ట్రాలలో, దేశాలలో వ్యాపారాలు నిర్వహించే పెట్టుబడిదారులకు ప్రత్యేక తెలంగాణ వస్తే వచ్చే పెద్దనష్టం ఉండదనే వాదనకు సమాధానం ఎలాచెపుతారు? పైగా బహుళజాతి కంపెనీలు తమ అమ్మకాలకన్నా తక్కువ జి.డి.పి ఉండే దేశాలపై తెలిగ్గా అదుపుకు యత్నిస్తాయి. అలాగే చిన్న రాష్ట్రాలనే కోరుకునే అవకాశాలు ఉన్నాయి. అందువల్ల అందరివీ కుట్రలంటే న్యాయమా? అందుకనే కొంత విశాల ప్రాతిపదికన ఆలోచించి నిబద్ధతతో ప్రత్యేక తెలంగాణ కోరేవారు ఈనాడు కొందరి రాజకీయ కుట్రలకు బలవ్వకుండా ఒక మెట్టు దిగి, కేవలం కొందరు పెట్టుబడి దారుల ఉద్యమంగా సమైక్య ఉద్యమాన్ని విమర్శించడానికి పరిమిత మయ్యే బదులు తీర సీమాంధ్రుల అభ్యంతరాలపై చర్చించి నీటిపారుదల, హైదరాబాద్ అక్కడి యువత ఉపాధి సమస్యలను ఏవిధంగా పరిష్కరిస్తారో ప్రతిపాదనలు ఇవ్వాలి. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తరువాత అభివృద్ధికి ఆమడ దూరంలో పయనిస్తున్న తీర-సీమాంధ్ర ప్రాంతాలు తమ సమస్యలు పరిష్కరించుకొన్న తరువాతే (పరిష్కరించ కుండా విభజిస్తే పెనంలో నుండి పొయ్యిలో పడ్డ చందంగా తయార వుతాయి) విడిపోతే అభివృద్ధి పథంలో, ఆత్మగౌరవంతో పయనించే అవకాశం ఉంది.

(రచయిత ఆంధ్ర మేధావుల వేదిక అధ్యక్షులు) వీ

రాబోయే సంచికలలో...

- **'ఆక్యుపై వాల్‌స్ట్రీట్' నిరసనలు చెబుతున్నదేమిటి?**
- **భారతీయుల స్వదేశీయత, విదేశీయతలోని మూలాలు - డా. జి. సాంబశివా రెడ్డి**
- **తిలా పాపం - తలా పిడికెడు - విద్యాభూషణ్**
- **తెలుగు నాట బౌద్ధ క్షేత్రాలు - ఎన్. లక్ష్మీదేవి**
- **సత్యమంగళం నుండి వాకపల్లి వరకు - తుంపాల శ్రీరామమూర్తి**

తెలంగాణ ప్రజలంతా సకల జనుల సమ్మెలో పాల్గొని తమ ఆకాంక్షను బలంగా ప్రపంచానికి చాటితే, రాజకీయ నాయకత్వం మాత్రం దిశానిర్దేశం చేయడంలో విఫలమైందని అంటున్నారు **ఎన్. వేణుగోపాల్**

సకల జనుల సమ్మెను ఎలా చూడాలి?

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఒక కీలకమైన ఘట్టంగా సకల జనుల సమ్మె 2011 సెప్టెంబర్ 13న మొదలయి నలభై రెండు రోజులపాటు కొనసాగి అక్టోబర్ 24న ప్రభుత్వానికీ ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నేతలకూ మధ్య కుదిరిన ఒప్పందంతో ఆగిపోయింది. మొత్తం నలభై రెండు రోజుల సమ్మెలో రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు చివరిదాకా ఉండగా, సింగరేణి కార్మికులు, ఆర్ టి సి సిబ్బంది, ఉపాధ్యాయులు వివిధ కారణాలవల్ల మధ్యలోనే సమ్మె నుంచి వైదొలిగారు. సకల జనుల సమ్మె ఆగిపోయినా ఉద్యమం కొనసాగుతుందనీ, ఇది తాత్కాలిక విరామమే తప్ప విరమణ కాదనీ అక్టోబర్ 24న ఐకాస నేతలు ప్రకటించారు.

జీతభత్యాలు, పని పరిస్థితులు వంటి తమ వృత్తి, ఉద్యోగ పరమైన కోర్కెలపై కాక ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనే రాజకీయ ఆకాంక్ష సాధించడం కొరకు ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ వర్గాలు సమ్మె సాగించడం దానికదే అసాధారణమైన విషయం. సకల జనుల సమ్మె దాని పేరుకు తగినట్టుగా సకల జనుల ఆకాంక్షలను, ఐక్యతను, నిరసనను ప్రదర్శించింది. అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో సాగింది. కాని ప్రధానంగా పాల్గొనవలసిన, నాయకత్వం వహించవలసిన రాజకీయవర్గాల అలసత్వం వల్ల, దివాళాకోరుతనంవల్ల, ద్వంద్వవైఖరి వల్ల సకల జనుల సమ్మెకు తొలినుంచీ లోలోపలనే చీడ పాకింది. తెలంగాణ ఆకాంక్ష అన్ని వర్గాలనూ ఎంతగా ఏకం చేసినప్పటికీ, సమాజంలోని అంతర్వైరుధ్యాలు, విభజనలు, అంతరాలు వాటికవిగాగాని, స్వార్థపరశక్తుల ప్రోత్సాహం వల్లగాని సకల జనుల సమ్మెకు లోపలి నుంచి తూట్లు పొడవడానికి ప్రయత్నించాయి. సకల జనుల సమ్మెలో పాల్గొంటున్న వర్గాలలో కొన్ని సంఘటిత బృందాలకు మినహా, మిగిలిన అసంఖ్యాక ప్రజానీకానికి అర్థవంతమైన పోరాట, ప్రతిఘటనా రూపాలను అందించడంలో నాయకత్వం అవసరమైన కృషి చేయలేదు. ఇటువంటి లోపలి లోపాలతో పాటు, బైటినుంచి తెలంగాణ ప్రత్యర్థివర్గాలు, పాలకవర్గాలు, ప్రచార సాధనాలు సకల జనుల సమ్మె మీద పెద్ద ఎత్తున దాడి చేశాయి. సమ్మెకు వ్యతిరేకంగా మధ్యతరగతికి సబబుగా తోచే కొన్ని వాదనలను ముందుకు తెచ్చాయి. సమ్మెకు వ్యతిరేకంగా విద్యార్థులను, ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులను రెచ్చగొట్టడానికి ప్రయత్నించాయి. సమ్మె నాయకత్వాలను, శ్రేణులను కొనివేయడానికి, బెదిరించడానికి ప్రయత్నించాయి. ఆ ప్రయత్నాలు కుదరనప్పుడు దమననీతికి పాల్పడ్డాయి. ఇంటా బయటా సాగిన ఈ దాడులతో సర్వ జనుల సమ్మె పెట్టుకున్న లక్ష్యాలను సాధించకుండానే విరమించవలసిన స్థితి ఏర్పడింది.

మొత్తంగా మదింపు వేస్తే, సకల జనుల సమ్మె తెలంగాణ ప్రజల ఐక్యతను, ఆకాంక్షను, నిరసనను ప్రదర్శించడంలో అసాధారణమైన విజయం సాధించింది. అపూర్వమైన సంప్రదాయాల్ని నెలకొల్పింది. అదే సమయంలో తప్పనిసరిగా నేర్చుకోవలసిన పాఠాలనూ అందించింది. ఒక ప్రజాఉద్యమంలో నాయకత్వమూ, భాగస్వాములూ ప్రతి చిన్న విషయంలోనూ ఎంత జాగరూకత వహించవలసి ఉంటుందో సకల జనుల సమ్మె నుంచి నేర్చుకోవలసినది ఎంతో ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే సకల జనుల సమ్మె అనుభవంలో అనుకూల అంశాలూ ఉన్నాయి, ప్రతికూల అంశాలూ ఉన్నాయి. అందువల్ల ఈ ప్రయోగపు మంచి చెడులను, సాఫల్య వైఫల్యాలను నిష్పక్షపాతంగా, వస్తుగతంగా అంచనా వేసుకోవలసి ఉంది. అటువంటి సమీక్ష మాత్రమే తెలంగాణ ఉద్యమానికీ, మొత్తంగా ప్రజా ఉద్యమాలకూ అవసరమైన అవగాహనలను అందించగలుగుతుంది.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమవుతున్నదని కేంద్ర ప్రభుత్వం 2009 డిసెంబర్ 9న చేసిన ప్రకటన తర్వాత, ఆ ప్రకటనను తిరగదోడుతూ విస్తృత సంప్రదింపులు జరగాలని డిసెంబర్ 23న మరొక ప్రకటన చేసిన తర్వాత జరిగిన ఇరవై రెండు నెలల కాలంలో తెలంగాణ ప్రజా జీవితం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ఒకవైపు ప్రజల ఆకాంక్ష మరింత బలోపేతమవుతూ పదునుదేరుతూ ఉండడం, మరొకవైపు పాలకవర్గ రాజకీయ పక్షాల కుట్రలూ కుహకాలూ బహిరంగంగా, నిర్లజ్జగా సాగడం ఈ ఇరవై రెండు నెలల చరిత్ర. ఈ కాలంలో తెలంగాణ సమాజం డిసెంబర్ 9 ప్రకటనకు ఆచరణ రూపం ఇచ్చేలా ప్రభుత్వాల మీద ఒత్తిడి తేవడానికి అనేక ప్రయత్నాలు చేసింది. రకరకాల నిరసన రూపాలు వెలికివచ్చాయి. ప్రజల సృజనాత్మక చొరవ అద్భుతంగా ప్రకటితమయింది. పాలకవర్గాలు మాత్రం చర్చల పేరుతో, కమిటీల పేరుతో సాచివేత ప్రయత్నాలు చేసింది. ఉద్యమకారుల మధ్య చీలికలు సృష్టించడానికి ప్రయత్నించింది. పెద్దఎత్తున నిర్బంధ కాండను అమలు చేసింది. ఉద్యమాన్ని నీరుగార్చడానికి, అణచడానికి పాలకవర్గాలు ప్రయత్నిస్తుంటే, తమ ఆకాంక్ష చల్లారేది కాదని, రాష్ట్ర ఏర్పాటు అనే ఏకైక పరిష్కారం తప్ప

మరేదీ తమకు ఆమోదయోగ్యం కాదని ప్రజలు చూపారు. అయినా ఆ ప్రజా ప్రయత్నాలేవీ విజయం సాధించలేకపోయిన తరుణంలో మరింత ఉన్నత రూపంగా సకల జనుల సమ్మె ఆలోచన రంగం మీదికి వచ్చింది.

ఐతే అంతకు ముందరి రకరకాల నిరసన, పోరాట రూపాలు, సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన, తెలంగాణ వ్యతిరేక వస్తు బహిష్కరణ లాంటి నినాదాలు ఎందువల్ల ఫలితం సాధించలేక పోయాయో, ఆ అనుభవాల నుంచి ఏ పాఠాలు తీసుకోవలసి ఉన్నదో, సకల జనుల సమ్మెను పటిష్టంగా, అర్థవంతంగా ఎలా రూపొందించ వలసి ఉన్నదో నాయకత్వం తగినంత ఆలోచన, చర్చ సాగించినట్టు కనబడదు. సకల జనుల సమ్మె నినాదం ఎంత విస్తృతమైనదో, దాని ఆచరణ రూపాలేమిటో, విడివిడిగా వ్యక్తుల, వివిధ ప్రజా సమూహాల బాధ్యత ఏమిటో నాయకత్వం స్పష్టంగా చెప్పలేకపోయింది. ఉద్యమ నాయకత్వంలో విభిన్న రాజకీయార్థిక ప్రయోజనాల బృందాలు ఉండడం వల్ల ఈ అస్పష్టత నెలకొందని సంజాయిషీ చెప్పుకోవచ్చు. కాని, ఆ భిన్న బృందాలకు తెలంగాణ సాధన అనే లక్ష్యం మీద ఉండవలసినంత చిత్తశుద్ధి ఉంటే కనీసం ఆమోదించే ఉమ్మడి పోరాట రూపాలను అన్వేషించడం అసాధ్యం కాదు. కాని నాయకత్వం ఆ కనీస ఐక్యతను, చిత్తశుద్ధిని ప్రదర్శించలేకపోయింది. ఒకవైపు ప్రజలలో అద్భుతమైన ఐక్యత, చిత్తశుద్ధి, ఆశయ స్పష్టత ఉండగా, నాయకత్వంలో మాత్రం అవి కొరవడ్డాయి.

ఐనా నాయకత్వపు చొరవవల్ల కాక, ప్రజల ఒత్తిడితో మాత్రమే ఒక క్రియాశీల ఆచరణ రూపంగా సకల జనుల సమ్మె ముందుకు వచ్చింది. ఏమి జరగాలో, ఎట్లా జరగాలో, ఎవరి బాధ్యత ఏమిటో స్పష్టంగా నిర్దేశించని నాయకత్వం "ఎవరు ఏమి అర్థం చెప్పుకుంటే అదే జరగనీ" అనే ప్రాప్తకాలజ్ఞతతో, అలసత్వంతో వ్యవహరించింది. అంతవరకూ అనుసరించిన, ఫలితం ఇవ్వని ఆచరణరూపాలు చేపట్టినా ఫరవాలేదనే ఆలోచనతో, తమ చేతులు దాటిపోయే సమరశీల పోరాట రూపాలు మాత్రం చేపట్టవద్దనే అతి జాగ్రత్తతో నాయకత్వం సకల జనుల సమ్మెకు పిలుపు ఇచ్చింది.

ఆ పిలుపు ఇవ్వడంలో కూడ నాయకత్వం ప్రదర్శించిన సందిగ్ధతను ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. సకల జనుల సమ్మెను ఆగస్ట్ మొదటి వారంలో ప్రారంభించడానికే మొదట సన్నాహాలు జరిగాయి. అది మొదట ఆగస్ట్ 17కు వాయిదా పడింది. మళ్లీ ఎన్నో ముందువెనుక గుంజాటనలు సాగి, చివరికి కింది నుంచి వేడి పెరిగిన తర్వాత సెప్టెంబర్ 13న సమ్మె మొదలయింది. ఈ సమ్మెలో సింగరేణి కార్మికులు, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, ఆర్ టి సి సిబ్బంది, ఉపాధ్యాయులు ఒకరొకరుగా పాల్గొనడంతో బలం చేకూరింది. కాని సకల జనులంటే ఈ పది, పదిహేను లక్షల మంది మాత్రమే కాదు. తెలంగాణలోని నాలుగున్నర కోట్ల ప్రజలూ సకల జనులే. వారందరూ సమ్మెలో పాల్గొనడమంటే ఏమిటో నాయకత్వం సూచించలేకపోయింది, నిర్దేశించలేకపోయింది, కనీసం వచ్చిన సూచనలను స్వీకరించలేకపోయింది. కేవలం సంఘటిత, క్రమబద్ధ ఉద్యోగాలలో ఉన్నవారికి మాత్రమే ఆ ఉద్యోగవిధులను ఆపివేయమనే పిలుపు ఇవ్వడం జరిగింది గాని, ఇతర ఉపాధి, ఉద్యోగాలలో, సాధారణ జీవితంలో ఉన్న కోట్లాది మంది సమ్మెలో పాల్గొనడం ఎలానో నాయకత్వం మార్గనిర్దేశనం చేయలేకపోయింది. వారికి ఎక్కువలో ఎక్కువ నిరాహారదీక్ష, ప్రదర్శన, ఊరేగింపు, సభ, సమావేశం, ధూంధాం, వంటా వార్పు, ఆటపాటలు, దిష్టిబొమ్మల దహనం, శవదహనం, పిండప్రదానం, యాగాలు వంటి పెద్దగా ఉపయోగం లేని, ప్రత్యర్థులమీద ఎటువంటి ప్రభావమూ చూపలేని రూపాలు మాత్రమే మిగిలాయి. గ్రామాలకు తరలండి అనే పిలుపు వినవచ్చింది గాని అది పెద్దగా అమలయినట్టు లేదు.

ఈ రూపాలలో కొన్ని ప్రజల ఐక్యతను, ఆకాంక్షను, నిరసనను ప్రకటించడంలో బలమైనవే. కాని అవేవీ ప్రత్యర్థుల మీద ప్రభావం వేయగల శక్తిమంతమైన ప్రతిఘటనా రూపాలు కావు. సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ప్రదర్శనలు, కార్యాలయం ముందర శిబిరం వేసి పాటలు, మాటలు సాగించడం వంటి రూపాలు తెలంగాణ ఆకాంక్షల గురించి, పరిష్కారం గురించి తెలంగాణ ప్రజలకు తెలిసిన విషయాలనే మరొకసారి తెలియజేసేవే. కనీస నైతికత లేని ప్రత్యర్థుల మీద నిరాహారదీక్ష వంటి నైతిక ఒత్తిడి రూపాలు ఎటువంటి ప్రభావమూ వేయవు. దిష్టిబొమ్మల దహనం, శవదహనం, పిండప్రదానం, యాగాలు వంటి రూపాలైతే ప్రధానంగా బ్రాహ్మణీయ, హిందూ మతభావజాలాన్ని, మూఢనమ్మకాలను పెంచిపోషించేవే గాని ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షతో ఎటువంటి సంబంధమూ ఉన్నవి కావు. ఈ ఆచరణ రూపాలు అర్థవంత మైన పోరాట రూపాలవునో కాదో, వాటి పరిమితులూ అవకాశాలూ ఏమిటో, వాటి ద్వారా సాధించగలిగిందేమిటో నాయకత్వం ఎన్నడూ లోతుగా ఆలోచించినట్టు కనబడదు. ప్రత్యర్థి మీద ప్రభావం వేసే ఆచరణ రూపాలు లేక, ఉన్నవి నిరుపయోగమని రుజువు అవుతుండడంతో, సుదీర్ఘకాలం అవే రూపాలతో ఉన్నచోటనే కదం తొక్కుతుండడంతో నిరాశా నిస్పృహలకు లోనైన, సున్నిత మనస్కులైన అనేక మంది యువకులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మొత్తంగా ఉద్యమంలోనే ఒకరకమైన నిర్లిప్తత, క్రియాశీల రూపాలు చేపట్టాలనే కోరికకూ, అవి వద్దనే నాయకత్వానికీ మధ్యన డోలాయమాన స్థితి నెలకొన్నాయి.

ఈ స్థితిలో ప్రారంభమైన సకల జనుల సమ్మె పాత ఆచరణ రూపాలను సరిగా సమీక్షించి, కొత్త ఆచరణ రూపాలను అన్వేషించి వాటిని ఈ సకల జనుల సమ్మెలో ప్రధాన నినాదాలుగా చేయవలసి ఉండింది. కాని అలా జరగక పోగా, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలకు సమ్మెను సూచిస్తూ, ఇతర వర్గాలకు ఏ ప్రత్యేకమైన సూచనా లేకుండా సకల జనుల సమ్మె మొదలయింది. అప్పటికే ఉద్యమం చీలికలకు గురై ఉండడంతో ఈ సకల జనుల సమ్మె ప్రారంభమైనపుడు అన్ని వర్గాలూ సహకరిస్తాయా లేదా అనే అనుమానమూ ఉండింది. సహాయ నిరాకరణ ఉద్యమ విరమణ సందర్భంగా ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి మీద వచ్చిన విమర్శలూ, అపోహల వల్ల ఈ సారి పిలుపు ప్రారంభంలో సందేహాస్పదంగానే ఉండింది.

అలా ఎన్ని బాలారిష్టాలతో, నాయకత్వపు సందిగ్ధాలతో మొదలైనా సకల జనుల సమ్మె క్రమక్రమంగా అద్భుతంగా పరిణమించింది, వేడెక్కింది, బలోపేతమయింది. సింగరేణి కార్మికుల సమ్మె వల్ల ప్రభుత్వ, ప్రైవేటు విద్యుదుత్పత్తి కర్మాగారాలకు దెబ్బతగిలింది. ఆ విద్యుత్తు మీద ఆధారపడిన ఇతర పరిశ్రమలకూ దెబ్బతగిలింది. ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ రాష్ట్ర ప్రభుత్వానికి అందే ఆదాయానికి గండి పడింది.

రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, ఆర్.టి.సి. సిబ్బంది సమ్మెకు దిగడం వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు పన్నుల ఆదాయం, ఇతర ఆదాయం గండి పడే స్థితి వచ్చింది. మిగిలిన వర్గాల సమ్మె రాష్ట్ర పాలకుల మీద నైతిక ప్రభావం వేసేది మాత్రమే గనుక ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు గాని సింగరేణి, ఆర్ టి సి, ప్రభుత్వోద్యోగుల సమ్మె వల్ల ఆర్థిక సంక్షోభం తలెత్తి ప్రభుత్వం ఇబ్బందిలో పడింది. ఏదో ఒకటి చేసి ఈ సమ్మెను ముగింప జేయాలని రాష్ట్ర ప్రభుత్వం పడిన తాపత్రయానికి మౌలిక కారణం అదే. అట్లని ఇతర వర్గాల ప్రజల భాగస్వామ్యాన్ని తక్కువ చేసి చూడనక్కరలేదు. వారి ఆందోళనా రూపాలు తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమస్ఫూర్తిని సజీవంగా నిలిపి ఉంచడానికి తోడ్పడ్డాయి.

కలిసివచ్చేవారెవరో, వ్యతిరేకించేవారెవరో స్పష్టంగా అంచనా వేసుకుని కలిసివచ్చేవారిని కలుపుకోవడానికీ, వారి శక్తిసామర్థ్యాలకు తగిన ఆచరణ రూపాలు ఇవ్వడానికీ, వారి మధ్య అభిప్రాయ భేదాలను సున్నితంగా పరిష్కరించడానికీ తగిన వ్యూహాలూ, వ్యతిరేకించేవారిని ఒంటరులను చేసి, చికాకుపరచి, వారి ప్రయోజనాలను దెబ్బతీసే వ్యూహాలూ రూపొందించుకుని అమలు చేసినప్పుడే ఏ ప్రజా ఉద్యమమైనా తాను అనుకున్న లక్ష్యాలు సాధించగలుగుతుంది. సకల జనుల సమ్మెకు నాయకత్వం వహించిన తెలంగాణ ఐక్య కార్యాచరణ సమితికి గాని, భాగస్వామ్య రాజకీయ పక్షాలకు గాని, విభిన్న ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ సంఘాలకు గాని ఈ స్పష్టత ఉన్నదా అనుమానమే. సమ్మె జరిగిన తీరును చూస్తే ఈ స్పష్టత లేదని, ఉండవలసినంతగా లేదని అనిపిస్తుంది. అట్లాగే, ప్రజల చేతికి చొరవ పోగూడదని, ఉద్యమమంతా తాము గీసిన పరిమితులలోపలే జరగాలని ఈ దేశంలో రాజకీయ నాయకత్వాలన్నిటి ఉమ్మడి ఆకాంక్ష. చౌరీచౌరా తర్వాత ఆందోళనను విరమించిన గాంధీ నాటినుంచీ ఇవాళ్టిదాకా ప్రతి నాయకత్వమూ ఇటువంటి పనే చేస్తూ వచ్చాయి.

నిజానికి తెలంగాణ ఆకాంక్ష విషయంలో కలిసి వచ్చే శక్తులు తెలంగాణ ప్రజానీకంలో 99 శాతం, కనీసం 95 శాతం. వ్యతిరేకించే శక్తులు తెలంగాణలో ఉన్న దళారులూ, వారి ఆశ్రితులూ ఒక్క శాతమో, ఐదు శాతమో. కాక, తెలంగాణ వ్యతిరేక శక్తులు కోస్తాంధ్ర, రాయలసీమ పాలకవర్గాలలో, సంపన్న వర్గాలలో, రాష్ట్ర ప్రభుత్వంలో, కేంద్ర ప్రభుత్వంలో ఉన్నాయి. సకల జనుల సమ్మె ఇటు మిత్రులు కాదగిన 95 శాతాన్ని ఏకం చేయలేకపోయింది. వారంతట వారే ఏకమైనప్పుడు తగిన పోరాట రూపాలు ఇవ్వలేకపోయింది. ఆ ఐక్యతను దెబ్బతీయడానికి ప్రత్యర్థి వర్గాలు చేస్తున్నప్రయత్నాలను అడ్డుకోలేకపోయింది.

ఇక అటు ప్రత్యర్థి శక్తుల మీద ప్రత్యక్ష పరోక్ష ప్రభావం వేయగల శక్తిమంతమైన పోరాట రూపాలను అన్వేషించి, సృష్టించి, అమలు చేయడంలో కూడ నాయకత్వం తగినంత కృషి చేయలేకపోయింది. తెలంగాణ ప్రత్యర్థి శక్తులు ప్రధానంగా నాలుగు – రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, కోస్తాంధ్ర, రాయలసీమ సంపన్నులు, తెలంగాణ దళారీలు. ఈ నాలుగు శక్తులను లొంగదీస్తే తప్ప, తటస్థంచేస్తే తప్ప, దెబ్బతీస్తే తప్ప, బలహీనంచేస్తే తప్ప, తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యం కాదు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం గత యాభై ఐదు సంవత్సరాలుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేసున్న పాలక విధానాలకు, వివక్షా విధానాలకు, వాగ్దాన భంగాలకు వ్యతిరేకంగా సాగుతున్నది గనుక ఉద్యమంలోని ప్రతి అడుగూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను అడ్డుకునే దిశగా సాగవలసి ఉంది. ఎక్కడ వీలయితే అక్కడ రాష్ట్ర, కేంద్ర పభుత్వాలను స్తంభింపజేయడానికి, చికాకు పరచడానికి, ఆర్థికంగా, రాజకీయంగా బలహీన పరచడానికి, ఆర్థిక రాజకీయ ప్రయోజనాలను దెబ్బతీయడానికి ప్రయత్నించవలసి ఉంది. అంటే ఉద్యమం ప్రధానంగా ప్రభుత్వ వ్యతిరేకంగా సాగాలి. కాని మొదటి నుంచీ కూడ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు మూసివేయడం, రవాణా ఆపివేయడం మినహా మరొక రూపం ముందుకు రాలేదు. ప్రభుత్వ స్తంభన అన్నప్పుడు అర్థం ప్రభుత్వ కార్యాలయాల, విద్యాలయాల, రవాణా సౌకర్యాల మూసివేత మాత్రమే కాదు. ప్రధానంగా ప్రభుత్వ రాజకీయార్థిక మూలాలు దెబ్బతినడమే స్తంభన అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ సాధికారతను ప్రశ్నించాలి, సవాలు చేయాలి. దాని ఆర్థిక ఆదాయ మూలాలకు గండి కొట్టాలి. అప్పుడు అది రాజకీయంగానూ ఆర్థికంగానూ బలహీనమై ఉద్యమకారుల ఆకాంక్షల సామంజస్యాన్ని చర్చించడానికీ, అర్థం చేసుకోవడానికీ, అంగీకరించడానికీ సిద్ధపడుతుంది. ఈ ఇరవై రెండు నెలల ఉద్యమంలో సకల జనుల సమ్మె మాత్రమే రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక మూలాల మీద కొంత ప్రభావం వేసింది. అంతకు ముందరి సహాయ నిరాకరణ, శాసనోల్లంఘనల సమయంలో దాని రాజకీయ సాధికారతను సవాలు చేసే పని జరిగింది గాని ముందుకు సాగలేదు. నలభై రెండు రోజుల పాటు సాగిన సకల జనుల సమ్మె ప్రభుత్వ సాధికారత లోని బోలుతనాన్ని బట్టబయలు చేసింది. అయితే ఇవి రెండూ కూడ ఇంకా విస్తృతంగా సాగగల అవకాశాన్ని సకల జనుల సమ్మె కూడ వాడుకోలేదు.

రాష్ట్ర ప్రభుత్వానికైనా ఏదో ఒక మేరకు ఈ వేడి తగిలింది గాని కేంద్ర ప్రభుత్వం మీదనైతే నాలుగు రోజుల పాటు రైల్ రోకో ప్రత్యక్షంగానూ, సింగరేణి సమ్మె పరోక్షంగానూ వేసిన ప్రభావం మినహా ఇతరంగా పడిన ప్రభావం తక్కువ. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం మీద ప్రభావం చూపడానికి అవసరమైన బ్యాంకింగ్, బీమా, కమ్యూనికేషన్స్, కేంద్ర పన్నుల వ్యవస్థలు, తెలంగాణలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సకల జనుల సమ్మె ప్రభావంలోకి రాలేదు. వాటిని కూడ స్తంభింపజేయ గలిగితే కేంద్ర ప్రభుత్వ సాధికారతకు, ఆర్థిక మూలాలకు ప్రమాదం ఏర్పడి ఉండేది. అప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికంటె ఎక్కువ స్పందన చూపక తప్పేది కాదు.

తెలంగాణ విషయంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఖరి వ్యతిరేకంగా ఉండడానికి, వివక్షతో, వాగ్దాన భంగాలతో, అన్యాయాలతో కూడిన పాలక విధానాలు అమలు కావడానికి మూల కారణం కోస్తాంధ్ర, రాయలసీమలలోని సంపన్న పాలకవర్గాలు. ఆ పాలకవర్గాలు నేరుగా అధికారంలో ఉండిగాని, పరోక్షంగా ప్రభావం వేసి గాని తెలంగాణ వ్యతిరేక విధానాలకు కారణమయ్యాయి. కనుక తెలంగాణ అనుకూల ఉద్యమమేదైనా ప్రధానంగా ఈ కోస్తాంధ్ర, రాయలసీమ పాలక, సంపన్న వర్గాలను బలహీనం చేసే, వారి రాజకీయార్థిక ప్రయోజనాలను దెబ్బతీసే పోరాట రూపాలు చేపట్టాలి. తెలంగాణ వనరుల మీద ఆధిపత్యం చలాయిస్తున్న ఆ కోస్తాంధ్ర, రాయలసీమ పాలకుల దోపిడీ పీడనలను అడ్డుకోవాలి. దురదృష్టవశాత్తూ తెలంగాణ ఉద్యమం ఇటువంటి పనికి

ఇంతవరకూ పెద్దఎత్తున పూనుకోనేలేదు. ప్రజలలో ఉన్న న్యాయమైన ఆగ్రహం అటువంటి ప్రతిఘటన రూపాలను చేపట్టడానికి సిద్ధ పడినప్పుడు కూడ నాయకత్వం వారిని వెనక్కి లాగింది. లేదా పాలకవర్గ నిర్బంధకాండ అనే బూచిని చూపింది. తెలంగాణలో భూములు ఆక్రమించినవారు, ఖనిజనిలువలు దోచుకుంటున్నవారు, పరిశ్రమల పేరుతో జల, విద్యుత్, అటవీ సంపద దోచుకుంటున్నవారు, టోల్ గేట్లు, రహదారులు, అనేక రకాల ప్రాజెక్టులు నిర్మించి తాము చేసిన వ్యయానికి వందల రెట్లు ఎక్కువ ఆదాయం పొందుతూ తెలంగాణ మూలుగులను పీలుస్తున్నవారు కోస్తాంధ్ర, రాయలసీమ కాంట్రాక్టర్లు, సంపన్నులు గాని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు గాని వేలాది మంది ఉన్నారు. అలాగే రవాణా, బ్యాంకింగ్, చిట్ ఫండ్, కాంట్రాక్టులు, విద్యా, వైద్య, ఆరోగ్య వ్యాపారాలు, సినిమా, మీడియా రంగాల ద్వారా తెలంగాణను దోపిడీ చేస్తున్న తెలంగాణేతర, ప్రత్యేకంగా కోస్తాంధ్ర, రాయలసీమ సంపన్నులు ఉన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు పట్ల వారు వ్యతిరేకులా, అనుకూలురా అనే గీటురాయి మీద వారి పట్ల వైఖరిని ప్రకటించుకుని, వ్యతిరేకులమీద ప్రతిఘటన చూపవలసి ఉంటుంది. కాని తెలంగాణకు వ్యతిరేకంగా ఢిల్లీలో చక్రం తిప్పుతున్న వారు, ప్రతిరోజూ తెలంగాణకు వ్యతిరేకంగా ప్రచార సాధనాలలో మాట్లాడుతున్నవారు ఇవాళ్టికీ తెలంగాణలో యథేచ్ఛగా తమ దోపిడీని కొనసాగించ గలుగుతున్నారు. సకలజనుల సమ్మె కూడ వారికి వేడి కలిగించలేకపోయింది, వారి ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను దెబ్బతీయలేకపోయింది.

వారికి దళారీలుగా పనిచేస్తూ తెలంగాణకు వ్యతిరేకులుగా పనిచేస్తున్న తెలంగాణ నాయకులు కూడ ఉన్నారు. వారు ఎక్కడ పుట్టారనేదానికన్న ముఖ్యంగా వారు ప్రజా ఆకాంక్షలను వ్యతిరేకిస్తున్నారనే కారణం మీదనే వారిని ఎదిరించవలసి ఉంది. వారి రాజకీయ ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయవలసి ఉంది. సకల జనుల సమ్మె ఇటువంటి వారి మీద విమర్శలు, ఎక్కువలో ఎక్కువ ఇళ్లముందర ప్రదర్శనలు మినహా ఇంకా లోతైన ప్రభావం వేయగల ఆచరణ రూపాలు చేపట్టలేక పోయింది.

ఒకవైపు ఇటువంటి అస్పష్టతలు, అవగాహనాలోపాలు ఉన్నప్పటికీ ప్రజా వెల్లువ అద్భుతంగా సాగింది. విరామం ప్రకటించాలనే ఆలోచనకు నాయకత్వం వచ్చినా ప్రజలు మాత్రం అందుకు సమ్మతించలేదు. నాయకత్వం అటువంటి ఆలోచనకు రావడానికి తగిన కారణాలు ఉన్నాయి. రాజకీయ నాయకత్వాల అవకాశవాద వైఖరి, ఆర్థిక ఇబ్బందులు, చీలికలు వంటి కారణాలతో పాటు, మధ్యతరగతిని ప్రభావితం చేసే "ప్రజల ఇబ్బందులు" అనే సాకును పాలకులు బాగా వాడుకున్నారు. ఒకవైపు తెలంగాణ ప్రజానీకమంతా ఈ ఇబ్బందులను సహిస్తుండగా, పాలకులు మాత్రం కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రుల ను సృష్టించి తమ పిల్లల చదువులు చెడిపోతున్నాయనే గోల ప్రారంభించారు. ప్రయాణ సౌకర్యాలు లేక ఇబ్బంది కలుగుతున్నదని గోల ప్రారంభించారు. ఇబ్బంది లేని ఉద్యమం ఏదీ ఉండదని, ఇవాళ్టి బధిరాంధ ప్రభుత్వాలు ఇబ్బంది కలిగించకుండా మాట వినే స్థితి లేదని, అయినా యాభై ఐదు సంవత్సరాల, రెండు తరాల జీవితమే ధ్వంసమైపోయిన ఇబ్బందిని తొలగించడానికే ఈ ఏడువారాల ఇబ్బంది అని బలంగా చెప్పి ఒప్పించడంలో సకల జనుల సమ్మె నాయకత్వం చేయవలసినంత కృషి చేయలేదు. "అరయంగా కర్ణుడీల్గెనార్గురి చేతన్" అన్నట్టు అనేక కారణాలు కలగలసి సకల జనుల సమ్మె విరమణ దిశగా పయనించవలసి వచ్చింది.

సకల జనుల సమ్మె కొట్టవచ్చినట్టుగా కనిపించింది గనుక, ప్రభావశీలమైన రూపంగా ముందుకు వచ్చింది గనుక అది ఆగిపోతే సమస్తమూ ఆగిపోయినట్టేనేమో అనే సందేహాలు తలెత్తాయి. కాని ఒక వెనుకంజతోనే ఉద్యమం ఆగిపోయినట్టు కాదు. దేశ చరిత్రలో చూస్తే బ్రిటిష్ వలస వ్యతిరేక జాతీయోద్యమం సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక సారాంశం నుంచి పక్కకు జరిగినందువల్ల ఎన్నోసార్లు ఇటువంటి తాత్కాలిక అపజయాలను చూసింది, అయినా మళ్లీ మళ్లీ విజృంభించింది. చివరికి ప్రజా ఆకాంక్షలు నెరవేరకుండానే స్వాతంత్ర్య ప్రకటన అనే పెద్ద అపజయాన్ని కూడ చూసింది. అయినా భారత ప్రజా ఉద్యమం మళ్ళీ నక్సల్బరీ ప్రజా వెల్లువగా నిజమైన సారాంశపు పోరాటంగా మారింది. అది కూడ ఎన్నోసార్లు తాత్కాలిక అపజయాలకూ, వెనుకంజలకూ గురి అయింది. మళ్లీ మళ్లీ తిరిగి తిరిగి తలెత్తుతూనే ఒక చోట అపజయానికి గురయినా మరొకచోట, ఒకచోట వెనుకంజ వేసినా మరొకచోట విస్తరిస్తూనే ఉంది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ చరిత్రలోనే చూస్తే కనీసం మూడు సార్లు 1953, 1969–71, 1999–2000 ఉద్యమం దమననీతికి గురయి అపజయాన్ని ఎదుర్కొంది. కాని చితాభస్మం నుంచి లేచినిలిచిన పక్షి వలె తెలంగాణ ప్రజల ఆకాంక్ష ఎప్పటికప్పుడు కొత్త దశకు ఎదిగింది. ఇప్పుడు కూడ సకల జనుల సమ్మె విరామం అంతిమ విరమణ కాదు, కానక్కరలేదు. వెనుకంజ వేయడమే, తాత్కాలిక విరామమే తప్పు కాదు. దాని నుంచి పాఠాలు నేర్చుకుని మరొక ముందడుగుకు సమాయత్తం కాకపోవడం తప్పు. సకల జనుల సమ్మె అనుభవం నేర్పే పాఠాలను సరిగా గ్రహించి భవిష్యత్తు పోరాటాలలో ఉపయోగించినప్పుడే తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యమైనా, ఇతర ప్రజా ఉద్యమాల లక్ష్యాలైనా నెరవేరుతాయి.

(రచయిత వీక్షణం సంపాదకులు) వీ

తెలంగాణ పేరుతో షోయబుల్లా ఖాన్‌ను తలుచుకున్నా, బి.జె.పి. అసలు ఎజెండా హిందూత్వ ముసుగుతో సామ్రాజ్యవాద ప్రపంచీకరణను అమలు చేయడమేనని అంటున్నారు **వరవరరావు**

తెలంగాణ - సంఘ్ పరివార్ ఎజెండా

ఆగస్ట్ 20న హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'విధ్వంసమైన స్వప్నం' పుస్తకావిష్కరణ సభ ముగిసి అరుంధతీరాయ్ బయటికి వెళ్లినపుడు అక్కడ బి.జె.వై.ఎం. కార్యకర్తలు నినాదాలు ఇచ్చి అడ్డుకున్నట్లు చేసి అరెస్టయ్యారు. వాళ్లు ఐదుగురి కన్నా ఎక్కువ ఉన్నట్లు లేరు. ఢిల్లీలో కాశ్మీర్ స్వయంనిర్ణయాధికారం గురించి జరిగిన సభలోను, భువనేశ్వర్‌లో 'అభివృద్ధి నమూనా' గురించి జరిగిన సభకన్నా ముందు అరుంధతీరాయ్ విషయంలో సంఘ్ పరివార్ వాళ్లు ఈ అడ్డుకునే పని చేసి ఉన్నారు. కాశ్మీర్ విషయంలో అరుంధతీరాయ్ వైఖరికి వ్యతిరేకంగా తాము ఈ నిరసన తెలుపుతున్నట్లు మాట్లాడుతున్నారు. ఢిల్లీ సభ తర్వాతనైతే ఆమె కాశ్మీర్ వేర్పాటు వాదాన్ని బలపరుస్తున్నదని ఆమెతో పాటు మా కొంత మంది మీద ఢిల్లీలో కేసు కూడా పెట్టారు. వాస్తవానికి ఆ సభలో ఆమె కాశ్మీరు ప్రజల స్వయంనిర్ణయాధికారాన్ని గౌరవించాలని మాత్రమే మాట్లాడింది. ఆ సభలో పాల్గొన్న సయ్యదలీ షా గిలానీ ముందు 'మీరు ఎటువంటి కాశ్మీరును కోరుకుంటున్నారు? అది లౌకిక ప్రజాస్వామ్యంగా ఉంటుందా? అందులో జమ్ముకు ఉండే స్థానమేమిటి? కాశ్మీర్ పండిట్ల విషయంలో మీ వైఖరేమిటి?' వంటి ప్రశ్నలు కూడా లేవనెత్తింది. తాను శ్రీనగర్‌లో లక్షమంది ప్రదర్శన ముందు మాట్లాడినపుడు కొందరు చేసిన అభ్యంతరకరమైన నినాదాల ప్రస్తావన కూడా తెచ్చి గిలానీ వివరణ కోరింది.

ఇదంతా ఆ రోజు ఒక్క అక్షరం పొల్లుపోకుండా రికార్డయింది. అందుకే సంఘ్‌పరివార్ శక్తులు ఎంత ఒత్తిడి చేస్తున్నా అరుంధతీరాయ్‌ని ప్రాసిక్యూట్ చేయడానికి పోలీసులకు సాధ్యం కావడం లేదు. అరుంధతీరాయ్ మీద నిజమైన ఆగ్రహం సంఘ్‌పరివార్‌కు మాత్రమే కాదు, వాళ్లను ముందుకు తోస్తున్న రాజ్యానికి వేరే కారణాల వల్ల ఉన్నది. అవి – ఆమె అన్ని ప్రభుత్వాల అభివృద్ధి నమూనాను ప్రశ్నిస్తున్నది. ముఖ్యంగా భూమి, నదులు, గనులు వంటి ప్రకృతి వనర్లను కంపెనీలకు కట్టబెట్టడాన్ని ప్రశ్నిస్తున్నది. అందుకోసం దండకారణ్యంలో యుద్ధాన్ని, సైన్యాన్ని దించడాన్ని ప్రశ్నిస్తున్నది. ఆ యుద్ధాన్ని ప్రతిఘటిస్తున్నందుకు మావోయిస్టులను అభినందిస్తున్నది. 'వాకింగ్ విత్ కామ్రేడ్స్' రాసినందుకు మెకార్థీ నాటి నుంచి చిదంబరం వరకు పాలకవర్గ విధాన నిర్ణేతలకు ఆమె వంటి వాళ్లు ఫెలోట్రావెలర్స్ వలె కనిపించి చికాకుగా ఉన్నది. అంతకన్నా ఇబ్బందికరమైన ప్రశ్నలు ఆమె డిసెంబర్ 13 పార్లమెంట్ దాడిపై వేసిన పుస్తకానికి రాసిన ముందు మాటలోనూ, వ్యాసంలోనూ లేవనెత్తారు. చాల మౌలికమైన ప్రశ్నలు లేవనెత్తారు. అందులో గిలానీనే కాదు అఫ్జల్‌గురును నిందితుడుగా చూపడానికి ఏ ఆధారాలున్నాయని ప్రశ్నించింది. పార్లమెంట్ మీద దాడి జరుగుతుందని వాజ్‌పేయ్, అద్వానీలకు ముందే తెలుసుగదా. ఎట్లా తెలుసు అని అడిగింది, ఎందుకు ఆపలేదని అడిగింది. దాడి చేసినవాళ్లు, గార్డులు ఘర్షణలో మరణించారు గదా, కుట్ర ఎవరు చేసారో ఎట్లా కథ అల్లారని అడిగింది.

దేశభక్తిని కాపాడే బాధ్యత సరిహద్దులు దాటి, కాశ్మీరులో, ఈశాన్య రాష్ట్రాల్లో సైన్యానికి ప్రత్యేకాధికారాలు ఇవ్వడాన్ని దాటి దండకారణ్యం దాకా విస్తరించడాన్ని ప్రశ్నించింది – భారత రాజ్యాంగం తాను రిపబ్లిక్‌నని చెప్పుకున్నందుకు. అందుకే రాజ్యానికున్న హిందుత్వ స్వభావానికే ఇది ఇబ్బందిగా ఉన్నది.

కేవలం సంఘ్‌పరివార్ వాళ్లు అభ్యంతర పెట్టడానికి రావడం లేదు. ఢిల్లీలో కాశ్మీరీ పండిట్లు వచ్చారు. భువనేశ్వర్‌లో ఆవరణ బయట భజరంగ్‌దళ్ కార్యకర్తలు వచ్చారు. ఢిల్లీలో సభకు అనుమతి ఇచ్చిన హాల్ వారికి కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నుంచి అనుమతి రద్దు చేసుకొమ్మని హెచ్చరిక వచ్చింది. హాల్‌లో నినాదాలిచ్చి, ప్రశ్నలు లేపిన వారికి అండగా యూనిఫారాల్లోనే పోలీసులున్నారు.

అన్ని చోట్లా ప్రభుత్వం, మీడియా కూడబలుక్కున్నట్లుగా ఒక అవగాహన ఉన్నది. సహజంగానే సభలు, సదస్సులు ఏర్పాటు చేసేవారి ఆకాంక్షలకు, అవగాహనకు అనుకూలంగా ఉన్నవాళ్లే అత్యధిక సంఖ్యలో ప్రేక్షకులు, శ్రోతలు ఉంటారు. అరుంధతీ రాయ్ విషయంలో ఆమె అంటే గౌరవం, ఆసక్తి ఉన్నవాళ్లు ఉంటారు. ఆమె అభిప్రాయాలతో ఏకీభవించని వాళ్లయినా ఆమె ఏం చెప్తుందో వినాలనో, ఆమెను తమ వాదనతో ఒప్పించగలమనో వస్తారు తప్ప ఆమెను మాట్లాడకుండా అడ్డుకోవాలని రారు. అట్లా అడ్డుకోవడానికి వచ్చే అత్యల్ప సంఖ్యాకులకు అండగా పోలీసులు వస్తారు. ఆ నెపంతో యూనిఫారాల్లోనే సభావరణలోకి కూడా వస్తారు. అట్లా సభావరణలోకి వచ్చే లైసెన్సు తీసేసుకుంటారు. ఇంతకన్నా గర్హించదగిన వైఖరి మీడియాది. నాలుగు గంటలో, ఆరు గంటలో, రెండు గంటలో, భువనేశ్వర్‌లో వలె దినమంతా సభ జరిగి అరుంధతీరాయ్‌తోపాటు ఎందరో మాట్లాడిన విషయాల్లోని విలువైన విషయాలన్నీ పక్కకు జరిగి 'అరుంధతీరాయ్ ప్రసంగాన్ని అడ్డుకున్న దేశభక్తులు' వార్త అవుతుంది. ఆమె ప్రసంగం నుంచి కూడ కొంత భాగం చూపవచ్చు, ప్రచురించవచ్చు. కాని అంతకన్నా నినాదాలు ఇచ్చే, అడ్డుకునే, యాక్షన్‌లో కనిపించే, అరెస్టు చేసే, అరెస్టయ్యే, అరెస్టయ్యే క్రమంలో 'ప్రతిఘటించే' అత్యల్ప సంఖ్యాకుల ఆర్భాటం ఫోకస్ అవుతుంది. ఎందుకంటే దానికి సెన్సేషనల్ న్యూస్ వాల్యూ ఉన్నది.

సభకు రాని వాళ్లందరూ 'అరుంధతీరాయ్ మీటింగ్‌లో గొడవ జరిగిందట కదా?' అని అమాయకంగా అగుడుతుంటారు. సభాసారం కాకుండా ఈ కొసమెరుపు వార్త కావడమే అడ్డుకునేవాళ్ల లక్ష్యం. అది మీడియా పుణ్యమా అని నెరవేరుతుంది. హైదరాబాద్ సభ వరకైతే పోలీసులే ఆ ఇద్దరు ముగ్గురు బిజెవైఎం కార్యకర్తలను పిలిపించినట్లున్నారు. అరుంధతీరాయ్‌కి రక్షణ అన్నట్లుగా హాల్‌లోకి యూనిఫారాల్లో పోలీసులు వచ్చారు. అక్కడి నుంచే సెక్యూరిటీ అన్నట్లుగా కిందికి దిగారు. అక్కడ కావల్సిన డ్రామా అయింది. ఇట్లా జరుగుతుందని మీడియాకు తెలుసు. వాళ్లు కింద కెమెరాలతో, గొట్టాలతో సిద్ధంగా ఉన్నారు. అక్కడున్న మా వైపుకు కెమెరాలు, గొట్టాలు రాబోయాయి. మా ప్రతిక్రియ కోసం. ఇదంతా ప్రజాస్వామికంగా అందరి అభిప్రాయాలు రికార్డు చేయడం అని మనం అనుకోవాలి. అప్పటి నుంచే అరుంధతీరాయ్ ప్రసంగం – అరుంధతీరాయ్ ప్రసంగాన్ని అడ్డుకున్న బిజెవైఎం కార్యకర్తలు – అరెస్టు – అని ట్రోలింగ్.

అరుంధతీరాయ్‌ని అడ్డుకోవడాన్ని తెలంగాణ ఆకాంక్షల వైపు నుంచి కూడా చూసి ఆ సంస్కృతిని హరగోపాల్ తప్పుపట్టాడు. తెలంగాణ ఆకాంక్ష కంటే తమ మతతత్వ సంకుచితత్వమే కాక, ఒక స్త్రీని, ఒక మైనారిటీకి చెందిన మనిషిగా ప్రజాస్వామ్య భావాలు గల వ్యక్తిగా గౌరవించే సంస్కృతి, సంస్కారం లోపించిన ఈ రాజకీయాలు తెలంగాణ ఉద్యమం పేరిట బలపడడం తెలంగాణ ప్రజాస్వామ్య శక్తులు జాగ్రత్తగా గమనించ వలసిన అవసరముంది.

తెలంగాణ సంస్కృతి పేరుతో, ఆచార వ్యవహారాల పేరుతో హిందూ సంస్కృతి ప్రచారం జరుగుతున్నదని ఇప్పటికే తెలంగాణను ఒక ప్రజాస్వామిక డిమాండ్‌గా బలపరుస్తూ పాల్గొంటున్న మైనారిటీ మతాలు, ముఖ్యంగా ముస్లింలు బాధపడుతున్నారు. ఇఫ్తార్ విందులు, షేర్వానీలు, కుచ్చు టోపీలు, ఉస్మానలీ ఖాన్‌ను పొగడడమే ముస్లింల భావాలను గౌరవించడం కాదు. భూమి కొరకు పోరాడి అమరుడయిన బందగీ మొదలు, విముక్తి ఉద్యమానికి నాయకత్వం వహించిన మగ్దూం వరకు గ్రామీణ పేద ముస్లింలు మొదలు విద్యావంతులై కామ్రేడ్స్ అసోసియేషన్ పెట్టిన ముస్లింల వరకు ఎటువంటి భూమి స్వప్నాన్ని కన్నారో, ఎటువంటి ప్రజావిముక్తిని ఆశించారో తెలంగాణ వాద రాజకీయాల్లో ప్రతిఫలించాలి. అన్ని పండుగలను, జనాభా ప్రాతిపదికన ఆర్భాటంగా చేయడం కాదు లౌకికవాదం అంటే. మైనారిటీకి ఒక భరోసా లభించే ప్రజాస్వామిక ఉద్యమం కావాలి తెలంగాణ పోరాటం.

'బిజెపి తెలంగాణ రాష్ట్రం కొరకు పని చేసే అన్ని శక్తులతో, న్యూ డెమోక్రసీ లాంటి పార్టీలతో కూడ కలిసి జెఏసిలో భాగస్వామిగా ఉంది' అని హరగోపాల్ గారు గుర్తు చేసారు.

ఉండికూడ బిజెపి అందరికీ అమోదయోగ్యమైన తెలంగాణ డిమాండ్‌లను కాకుండా సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినంగా ప్రభుత్వమే నిర్వహించాలంటున్నది. సెప్టెంబర్ 17న కేంద్ర ప్రభుత్వ సైనిక దాడిగా, విద్రోహ దినంగా భావిస్తున్న రాజకీయ పార్టీలూ ఉన్నాయి. విమోచన దినంగా జరపాలని తెరాస, సిపిఐ కూడా అంటున్నాయి. కాని రజాకార్ల బూచి చూపి రెండు లక్షలు కాకున్నా నలభై వేల మంది ముస్లింలనైనా యూనియన్ సైన్యాలు చంపాయన్న గాయాన్ని తెలంగాణలో ముస్లింలు ఈనాటికీ భరిస్తున్నారు. ఇది కేవలం ముస్లింల భావమే కాదు. అప్పుడే (48లోనే) నెహ్రూ స్నేహితుడైన సుందర్‌లాల్, డాక్టర్ జయసూర్య వల్లభభాయ్ పటేల్ (అప్పటి కేంద్ర హోం మంత్రి, ఉప ప్రధాని) కార్యదర్శి ముందు ఇచ్చిన నివేదికల్లో ఉన్న విషయం. సెప్టెంబర్ 17ను విమోచన దినంగా జరపాలనే డిమాండ్ కేంద్రంలో బిజెపి అధికారానికి వచ్చినప్పటి నుంచే మొదలైంది. ముఖ్యంగా విద్యాసాగరరావు గారు కేంద్రంలో హోం స్టేట్ మంత్రి కావడం, అద్వానీ హోంమంత్రి, ఉప ప్రధాని కావడం – నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో – ఈ నినాదం ప్రారంభమైంది. (మరొకవైపు ఈ అద్వానీయే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయడం సాధ్యం కాదని, రెండవ ఎస్ఆర్‌సి కూడా సాధ్యం కాదని అదే నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో ప్రకటించాడు. తెలుగుదేశం పార్టీతో పొత్తు వల్ల సాధ్యం కాలేదని తర్వాత సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు.)

ఈ డిమాండ్‌కు సిపిఐ, తెరాస వంతపాడుతుంటే అన్ని పార్టీలను ఇరుకున పెట్టే పని ఒకటి ఈసారి బిజెపి చేపట్టింది. షోయబుల్లాఖాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి సంస్మరణ సభ ఏర్పాటు చేసింది. పత్రికా స్వేచ్ఛకోసం, లౌకిక ప్రజాస్వామ్య భావాల కోసం నిర్భయంగా నిలబడి రజాకార్ల చేతుల్లో అమరుడయిన వీరుడు షోయబుల్లా ఖాన్. ఆయన సంస్మరణను పత్రికా స్వేచ్ఛను కోరేవాళ్లు, లౌకిక ప్రజాస్వామ్య వాదులు అందరూ జరుపుకోవాల్సిందే. సిపిఐ, న్యూ డెమోక్రసీ పార్టీలు లేదా తెలంగాణ వేదికలు, తెరాస ఆ పని తామే చేసి ఉండవచ్చు. తామా చొరవను కోల్పోయి బిజెపి ఆహ్వానాన్ని మన్నించి షోయబుల్లా ఖాన్ కోసం పోయాయి. రజాకార్ల నెపంతో ముస్లిం వ్యతిరేకత ప్రదర్శించడానికి బిజెపికి ఇది మరొక అవకాశం. బిజెపి బందగీని ఎందుకు తలుచుకోదు? మగ్దూంను స్మరించుకుంటుందా? అట్లా స్మరించుకుంటే ఈ పార్టీలు పోతాయా?

రూపాలకు భ్రమసి మనం సారాంశంలోని ఉద్దేశ్యాలను ఉపేక్షిస్తున్నామా? సామాజిక న్యాయం గురించి సామాజిక, ప్రజాస్వామిక తెలంగాణ గురించి మాట్లాడుతున్న, పోరాడుతున్న శక్తులన్నీ సీరియస్‌గా పట్టించుకోవాల్సిన అంశం ఇది. దొరల తెలంగాణ – ప్రధానంగా కాంగ్రెస్, బిజెపిల తెలంగాణగానే ఉండింది. శాసనసభలో స్థానాల లెక్కతో కాకుండా రాజకీయాల్లో పాలకవర్గాల ప్రభావం రీత్యా చూసినపుడు పాలకవర్గాల భావజాలం హిందుత్వ భావజాలంగా, దళిత, ఆదివాసీ, బడుగు వర్గాల భావజాలం రాడికల్ భావజాలంగా ఉండింది. క్యాంపస్‌లలోనైతే ఇది ఎబివిపితో ఆర్ఎస్‌యు, పిడిఎస్‌యు, తర్వాత కాలంలో దళిత శక్తుల సంఘర్షణగానే ఉండింది. దొరలు సాంఘిక బహిష్కరణకు గురయ్యారు. గ్రామాలు వదిలారు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మళ్లీ వాళ్లకు ప్రవేశ మార్గం కాకుండా మనం జాగ్రత్త పడుతున్నామా? జార్జిరెడ్డి, జంపాల ప్రసాద్, జనార్దన్, రాడికల్ శేషయ్యల వారసత్వం ఏమిటి? కులమే కాదు, మతానికి కూడా పెద్దపీట ఈ ఉద్యమంలో దక్కిందా? ఆలోచించాలి.

ఇందిరాగాంధీ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వాళ్లంతా జైళ్లలో ఒకటయారు. జనతా పార్టీ, ప్రభుత్వం ఏర్పడ్డాయి. ఒక నియంతృత్వం తాత్కాలికంగా తొలగింది. కాని ఏ శక్తులు బలపడ్డాయి? విచిత్రంగా ఎమర్జెన్సీ కాలంలోనే ఆర్ఎస్ఎస్ ఎమర్జెన్సీని అనుశాసనపర్వమన్నది. రాజీవ్‌గాంధీ పాలనలో రామజన్మభూమిని ఎజెండా మీదికి తెచ్చింది. బాబ్రీమసీదు ద్వారాలు రామలల్లా పూజల కోసం తెరిపించింది. రథయాత్రలు సాగించింది. మండల్ కమిషన్‌ను వ్యతిరేకించింది. బాబ్రీమసీదు విధ్వంసానికి పూనుకున్నది. అధికారంలోకి వచ్చింది. సోషలిస్టు భావాలుగల ఫైర్ బ్రాండ్ జార్జి ఫెర్నాండెస్ ఇందిరా,

కాంగ్రెస్ వ్యతిరేకతతో జనతాపార్టీలో చేరి ఎన్‌డిఎ ప్రభుత్వంలో రక్షణమంత్రి అయ్యాడు. ఒక 'ఉమ్మడి శత్రువు'తో పోరాటంలో నిర్విచక్షతో కూడిన ఐక్యత ఎక్కడికి దారితీస్తుందో ఇంతకన్నా దాఖలా అక్కర్లేదు. మండల్‌ను వ్యతిరేకించి కమండల్ పాలన తెచ్చిన తేదల్చుకున్న పార్టీని కాంగ్రెస్ వ్యతిరేకిస్తున్నదనో, తెలంగాణను బలపరుస్తున్నదనో నిర్విచక్షగా సమర్థిస్తే గుజరాత్ మారణకాండ వంటి అనుభవాలను చవి చూడాల్సి వస్తుంది.

వాస్తవానికి బాబ్రీమసీదు విధ్వంసం నాటికి మామూలు కంటికి కనిపించని దాని మరొక కోణం అది అధికారంలో వచ్చిన తర్వాత స్పష్టమైంది. అదే నూతన ఆర్థిక విధానం పేరుతో సామ్రాజ్యవాద ప్రపంచీకరణను నెత్తినెత్తుకున్న వాజపేయి ఎన్‌డిఎ పాలన. ఈ విషయంలో యుపిఎకు ఎన్‌డిఎకు సారంలోనే కాదు, రూపంలో కూడా ఏ తేడా లేదు. ఈ అభివృద్ధి నమూనాతో గుజరాత్ మారణకాండ తర్వాత ఇవ్వాళ మీడియాకు, మధ్యతరగతికి కూడా నరేంద్రమోడీ ఒక ఆదర్శ నమూనా అయ్యాడు. నర్మదాలోయ పోరాటాన్ని ఏకాకిని చేసి సింగూరులో ప్రజలు తరిమేసిన టాటాను గుజరాత్‌కు ఆహ్వానించి మోడీ మనం ఏ కారణాల కోసం తెలంగాణను డిమాండు చేస్తున్నామో అందుకు పూర్తి భిన్నమైన అభివృద్ధి నమూనాను అమలు చేస్తున్నాడు. మనం పోలవరంలో ఇందిరా సాగర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నాం. మనం సెజ్‌లను, ఓపెన్‌కాస్ట్‌లను, మైనింగ్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం. బిజెపి అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనైనా ఏం జరుగుతున్నది?

ఒకే ఓటు రెండు రాష్ట్రాల తీర్మానం చేసి బిజెపి తాను అధికారంలో ఉన్నప్పుడు జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, ఉత్తరాంచల్‌లు ఏర్పాటు చేసింది కానీ తెలంగాణ ఏర్పాటు చేయలేదు. పొత్తు ఉన్న టిడిపి వ్యతిరేకించిందన్నది. అధికారంలో లేదు గనుక ఇప్పుడు చాంపియన్ అయింది. ఇపుడయినా బిజెపి అయినా, సిపిఐ అయినా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో తెలంగాణ రాష్ట్ర ఉద్యమ ప్రచారం చేస్తున్నాయా? వాళ్ల శ్రేణులు వ్యతిరేకిస్తున్నాయా? స్థానికులు చెప్పాలి.

ఇటీవల విజయవాడలో వై.కె. నాయకత్వంలో కొన్ని ప్రజాసంఘాలు ప్రత్యేక తెలంగాణ ప్రజాస్వామిక ఉద్యమానికి సంఘీభావంగా ఒక రౌండు టేబుల్ ఏర్పాటు చేశారు. కొందరు 'అసాంఘిక శక్తులు' సమైక్యవాదుల పేరుతో వచ్చి అడ్డుకున్నారు. అక్కడ సిపిఐకి ఎక్కువగా, బిజెపికి ఎంతో కొంత బలముంది కదా. ఈ న్యాయమైన డిమాండ్ కోసం వాళ్ల వైపు ఎందుకు నిలబడలేదు? కోస్తా జిల్లాలల్లో దళిత బహుజనులు, కవులు, రచయితలు, కళాకారులు, రాయలసీమలో విద్యావంతుల వేదిక, కొందరు బుద్ధిజీవులు, ప్రజాస్వామ్యవాదులు మాత్రమే తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌లో ప్రజాస్వామ్య ఆకాంక్ష ఉందని సంఘీభావం తెలిపే స్థితి ఉన్నది. అక్కడ సిపిఐ, బిజెపిలు లేవా? అవి తీసుకుంటున్న కార్యక్రమాలేమిటి?

ఏ ఉద్యమంలోనైనా దూకి, లేదా ప్రారంభించి తన బలాన్ని పెంచుకోవడమే బిజెపి ఏకైక ఎజెండా. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో సిపిఐ, న్యూ డెమొక్రసీలతో కూడ కలిసి పని చేయడానికి అందుకే ముందుకు వచ్చింది. అన్ని విప్లవ శక్తులనూ తన వేదిక మీదికే తీసుకపోగలిగింది. రామ్‌దేవ్ బాబా 'అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని' ప్రారంభించి ఎక్కువ విజయాన్ని సాధించలేకపోతే అన్నా హజారే ఉద్యమంలో దూకింది. ఏ ఉద్యమంలో దూకినా, ప్రారంభించినా, రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమంలో వలె దళిత – ముస్లిం వ్యతిరేకత అనే రహస్య ఎజెండానయితే వదిలి పెట్టదు.

ఇవ్వాళ షోయెబుల్లా ఖాన్ సంస్మరణ సభ నిర్వహించిన బిజెపి రాజేంద్ర సచార్ కమిషన్ రిపోర్టును వ్యతిరేకించింది. ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింలకు రిజర్వేషన్ కల్పించే చట్టాన్ని వ్యతిరేకించింది. తెలంగాణ వచ్చి తాను అధికారంలోకి వస్తే ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తానని వాగ్దానం చేస్తున్న తెరాస బిజెపితో ముస్లింలకు తెలంగాణలో జనాభా ప్రాతిపదికపై రిజర్వేషన్లకు ఒప్పించగలదా? తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్‌లో ముస్లింలకు అన్ని రంగాల్లో కూడా అత్యధిక అవకాశాలు కల్పించాల్సి ఉంటుంది. ముఖ్యంగా విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో, ఆరోగ్య, వైద్య రంగాల్లో, రక్షిత మంచినీరు, విద్యుత రంగాల్లో, సామాజిక న్యాయంలో.

మక్కా మసీదు బాంబు పేలుడు సంఘటనలో నిర్దోషులుగా న్యాయస్థానం ప్రకటించిన యువకులు ఇవ్వాటికీ వివక్షకు, సాంఘిక వెలివేతకు గురవుతున్నారు. హైదరాబాద్‌లో ముస్లిం యువకులకు ఐఎస్ఐ, ఉగ్రవాద బిళ్లలు కనిపించకుండా తగిలించబడినాయి. జైళ్లలో భారత శిక్షాస్మృతిలో, నేరశిక్షా స్మృతిలో ఎక్కడా కనిపించని ఐఎస్ఐ నేరస్తులు, నక్సలైట్ నేరస్తులు కనిపిస్తారు. వాళ్ల కోసం ప్రత్యేకమైన సెల్స్, నిర్మాణమైన ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేశారు. ఇదేమి అన్యాయమని తెలంగాణ వాదులెవరైనా ప్రశ్నించారా?

అరుంధతీరాయ్ బయటికి వస్తుంటే గోబ్యాక్, డౌన్ డౌన్ నినాదాలు ఇచ్చిన బిజెవైఎం యువకుల వైపు చూపుతూ గోరేటి ఎంకన్న 'రేపు మనం వీళ్లతో కలిసే తెలంగాణ కోసం పోరాట వేదికలు పంచుకోవాలి గదా' అని అసహనంగా ఆవేదన వ్యక్తం చేసాడు. వీళ్లు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌ను బలపరుస్తున్న ఒకే ఒక్క కారణంతో విప్లవ శక్తులను, వామపక్ష పార్టీలను తమ వేదికల మీదికి ఆహ్వానించగలరు. వాళ్ల వేదికల ఆహ్వాన సంఘాల్లో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకోగలరు.

ఆ వేదిక దిగగానే దళిత, మైనారిటీ వ్యతిరేక ఎజెండాను అమలు చేయగలరు. అధికారంలోకి రావడానికి ఏమైనా చేయగలరు. తెచ్చేది, ఇచ్చేది కాంగ్రెస్ పార్టీ అయినట్లే అధికారంలోకి వస్తే ఇవ్వగల పార్టీ కూడా అఖిల భారత స్థాయిలో బిజెపి ఒక్కటే ఉంది. ప్రస్తుతానికి వెంటనే తెలంగాణలో అధికారంలోకి వచ్చే శక్తి లేకపోయినా అఖిల భారత స్థాయిలో రెండు సీట్లను, నూటా తొంభై రెండు మెజారిటీ ఎట్లా చేసుకోగలిగిందో, ఏ హిందుత్వ భావాలను ప్రోదిచేసి రెచ్చగొట్టి అధికారానికి రాగలిగిందో అటువంటి రహస్య ఎజెండా తెలంగాణలో బిజెపికి ఉండడం ఆశ్చర్యకరం కాదు. ముస్లింలు, కమ్యూనిస్టుల విషయంలో వాళ్లకు వల్లభభాయ్ పటేల్ మొదలు అద్వానీ, మోడీల దాకా ఇచ్చిన ఎజెండా ఉండనే ఉంది. అది సామ్రాజ్యవాద ప్రపంచీకరణను ఈ దేశంలో అమలు చేసే హిందుత్వ ఎజెండా. తెలంగాణ వాదులు జెండాలు వదిలితే మిగిలేది ఆ కాషాయ జెండానే. 'నార్త్ పోల్, సౌత్ పోల్ తెలంగాణ కోసం ఏక్‌పోల్' అయితే ఏర్పడేది ఏకధృవ ప్రపంచమే. (సెప్టెంబర్ 1 2011 నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రొ. జి. హరగోపాల్ రాసిన 'విధ్వంసమైన స్వప్నం' వ్యాసానికి స్పందనగా).

(రచయిత విరసం సభ్యులు) వీ

అమెరికాలోని న్యూయార్క్‌లో పెల్లుబికిన నిరసనలు అక్కడికే పరిమితం కాకుండా దేశదేశాలకూ విస్తరించడానికి ప్రజల్లో గూడుకట్టుకున్న కార్పొరేట్ వ్యతిరేకతే కారణమంటున్నారు **ఎ. నర్సింహా రెడ్డి**

ప్రపంచీకరణ వ్యతిరేక నిరసన జ్వాలలు

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యుగంలో వర్తక వ్యాపారాలు, డబ్బు, సాంకేతిక పరిజ్ఞానం, సహజ వనరులు, సంస్కృతి సహా అన్ని ప్రపంచీకరణ చెందుతున్నట్లే, మనిషిలోని స్వార్థం, అత్యాశ, దోపిడీ కూడా ప్రపంచీకరణ చెందుతున్నాయి. అందుకే సామాజిక, ఆర్థిక శాస్త్రవేత్తలు ప్రపంచీకరణ యుగంలో 'సంపద కేంద్రీకరణ చెందుతుంటే పేదరికం వికేంద్రీకరణ' చెందుతుందన్నారు. ఫలితంగా అధిక సంఖ్యాకులపై అది విధించిన ఆకలి, అసంతృప్తి, నిరుద్యోగం వెరసి దారిద్ర్యం ప్రపంచీకరణ చెందుతున్నట్లే, నిరసనలు, ఆందోళనలు, తిరుగుబాట్లు సైతం ప్రపంచీకరణ చెందుతున్నాయి. ఆకలి, ఆక్రందనలతో, నిరసన జ్వాలలతో న్యూయార్క్ వంటి నగరం దద్దరిల్లుతుండడమే ఇందుకు సాక్ష్యం. గత రెండు సంవత్సరాలుగా పశ్చిమాసియాలో, ఉత్తర ఆఫ్రికాలో, యూరప్ దేశాలలో ప్రజా తిరుగుబాట్లు ప్రజ్వరిల్లుతున్నాయి.

2011 సెప్టెంబర్ 17న అమెరికాలో న్యూయార్క్‌లోని ప్రపంచ వాణిజ్య మార్కెట్ (స్టాక్‌మార్కెట్ - ఎంఎన్‌సిలు) కేంద్రస్థానం వాల్‌స్ట్రీట్‌ను ఒక వేయి మంది దిగ్బంధించడంతో ఆరంభమైన 'వాల్‌స్ట్రీట్ ఆక్రమిద్దాం' నినాదం ఒక నెల రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తమయ్యింది. ప్రజల నిరసనలతో మహానగరాలన్నీ హోరెత్తాయి. అమెరికాలోని పలు నగరాలలో నిరసనలు వెల్లువెత్తాయి. అత్యంత అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశమైన అమెరికాలోని వాల్‌స్ట్రీట్ ఇప్పుడు ప్రజల ముట్టడిలో ఉంది. కార్పొరేట్ మీడియా వాల్‌స్ట్రీట్‌లోను, ఇతర అమెరికా నగరాలలోనూ జరుగుతున్న సామాన్యుల నిరసన ప్రదర్శనలను 'కమ్యూనిస్టుల కుట్ర' అని ప్రచారం చేస్తోంది. ప్రజల పక్షం వహించిన వారిని, వారికి గొంతునిచ్చిన వారిని కమ్యూనిస్టులుగా ముద్ర వేయడం పెట్టుబడి దారీ పత్రికలకు ఆనవాయితీగా వస్తున్నదే. జనసామాన్యంలోని అత్యధికులు కమ్యూనిస్టులు కారన్నది పత్రికల వారికి తెలుసు, అయినా అసత్య ప్రచారాలను అవి మానుకోవు.

'మేము 99 శాతం మందిమి' అంటూ యావత్తు ప్రజానీకం పెట్టుబడి కోటలపై తిరగబాటు బావుటా నెగరవేస్తోన్నారు. ఈ పెట్టుబడిదారీ విధానంలో బూర్జువా వర్గానికి- సమాజానికి ఇక ఎంత మాత్రం పొత్తు కుదరదని తెగేసి చెబుతున్నారు. నిన్నటి మధ్యతరగతి, చిరుద్యోగులు, కార్మికులు, నిరుద్యోగులు, జనసామాన్యం నేడు ఉపాధి రాహిత్యం, అభద్రతల నడుమ దిక్కుమొక్కులేని వాళ్లుగా మారి పోతున్నారు. నేడు సమాజం అంతకంతకు బూర్జువా వర్గం, కార్మిక వర్గం అనే రెండు శత్రు శిబిరాలుగా, పరస్పరాభిముఖాలైన రెండు వర్గాలుగా చీలిపోతున్నది. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి క్రమం శృతిమించి రాగానపడి, తానిక ఎంతమాత్రం ప్రజలకు ఉపాధిని కల్పించలేని స్థితిలోకి నేడు పెట్టుబడిదారీ వ్యవస్థ పడిపోయింది. ఫలితంగా సంపద కేంద్రీకరణ పెరిగి సంపన్నుల-పేదల మధ్య ఆర్థిక, సామాజిక అంతరాలు పెరిగాయి. ప్రపంచీకరణ విషప్రభావాల దృష్ట్యా పెట్టుబడిదారీ విధాన ప్రయోజకత్వమే ప్రశ్నార్థకమవుతోంది.

నేటి అంతర్జాతీయ ఆర్థిక స్థితిగతుల పట్ల జనంలో గూడు కట్టుకున్న ఆక్రోశం, నిప్పురవ్వ పడితే చాలు దావానలంలా భగ్గుమనేలా ఉందనడానికి వాల్‌స్ట్రీట్ ముట్టడే నిదర్శనం. అమెరికా ఆర్థిక బలాబలాలకే కాక, కార్పొరేట్ల ధనదాహానికి, దోపిడీకి, విచ్చలవిడి పోకడలకు, పెరుగుతున్న ఆదాయ వ్యత్యాసాలకు వాల్‌స్ట్రీట్ చిరునామా. వినియోగ సంస్కృతికి వ్యతిరేకంగా పనిచేస్తోన్న, పర్యావరణ ప్రియ స్వచ్ఛంద సంస్థ యాడ్‌బస్టర్స్ మీడియా ఫౌండేషన్ వాల్‌స్ట్రీట్‌ను ఆక్రమించండని జూలైలో తన బ్లాగ్‌లో పిలుపు ఇచ్చినప్పుడు ఆ పిలుపు ప్రపంచానికే మేలుకొలుపు అవుతుందని అది ఊహించి ఉండదు. ఆదాయ వ్యత్యాసాల కింద అణగారిపోతున్న 99 శాతం ప్రజలుగా తమను అభివర్ణించుకుంటూ సెప్టెంబర్ 17 నుంచి పదులు, వందలు, వేల సంఖ్యలో నిరసనకారులు వీధుల్లోకి వచ్చారు. న్యూయార్క్‌లోని మన్‌హట్టన్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ భవనం ముందు జుకోటి పార్క్ వద్ద చేరి వాల్ స్ట్రీట్ ముట్టడిని 1000 మందితో ప్రారంభించారు. ప్రభుత్వంపై కార్పొరేట్, లాబీయిస్టుల ప్రమేయం ఉండకూడదంటూ నినదించారు. కార్పొరేట్ సంస్థల దురాశను మాటలతో దునుమాడారు. దేశంలో పెరిగిపోతున్న ఆర్థిక, సామాజిక అంతరాలకు వ్యతిరేకంగా గళమెత్తారు. తమ నిరసనకు చిహ్నంగా... వాల్‌స్ట్రీట్‌కు ప్రతీక అయిన బుసకొట్టే వృషభంపై ఒక అమ్మాయి నృత్యం చేస్తున్నట్లుగా ఒక పోస్టర్‌ను రూపొందించారు. అప్పుడు వారి డిమాండ్ ఒక్కటే... రాజకీయాల నుంచి ధన ప్రభావాన్ని వేరుచేయడం. అమెరికా పార్లమెంటులోని తమ ప్రతినిధులపై ధనప్రభావాన్ని అరికట్టేందుకు అధ్యక్షుడు ఒక ప్రెసిడెన్షియల్ కమిషన్‌ను నియమించాలన్న డిమాండ్‌తో మొదలైన నిరసన కేవలం కొద్ది రోజుల వ్యవధిలో అమెరికా అంతటా వ్యాపించింది. అక్టోబర్ 9 నాటికి ఒక్క అమెరికాలోనే ఆ నిరసనజ్వాల 70 ప్రధాన నగరాలకు, 600 కమ్యూనిటీలకు చేరింది. ఆ తర్వాత అమెరికా, యూరప్, ఆసియాలోని 80 దేశాల్లో అక్టోబర్ 15న జోరుగా ఆందోళనలు సాగాయి. ఆర్థిక కేంద్రాలను ఆక్రమించి నిరసన ప్రదర్శనలు చేపట్టారు.

లండన్, కెనడా, రోమ్, బ్రసెల్స్, ఫ్రాంక్‌ఫర్ట్, సిడ్నీ, టోక్యో, బెర్లిన్, మాడ్రిడ్, లిస్బన్, హాంకాంగ్, టోరంటో సహా 951 నగరాల్లో నిరసన ప్రదర్శనలు, నినాదాల ప్రతిధ్వనులతో హోరెత్తిపోయాయి. అక్టోబర్ 17న అమెరికాలోని వాల్‌స్ట్రీట్ భరో ఉద్యమం నిర్వహించారు. ఆందోళన కారులకు పోలీసుల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ క్రమంలో ప్రపంచంలోని ఏ ఒక్క దేశం కంటే ద్రవ్య పెట్టుబడి అత్యంత శక్తివంతమైందని స్పష్టమైంది. అమెరికా కూడా ఇందుకు మినహాయింపు కాదు. అగ్రరాజ్యమని ఎంతగా జబ్బలు చరుచుకున్నప్పటికీ ద్రవ్య పెట్టుబడి ముందు అది దాసోహం అనక తప్పడం లేదు. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అన్ని సవాళ్లకంటే ద్రవ్య పెట్టుబడి అత్యంత ప్రధాన సవాలుగా పరిణమించింది. మొత్తం ప్రపంచాన్ని శాసించగల తారాస్థాయికి అది చేరుకుంది. దీని ప్రభావం ఏ ఒక్క ప్రాంతానికో, దేశానికో పరిమితం కాకుండా మొత్తం ప్రపంచానికి విస్తరించింది. అంతర్జాతీయ ఫైనాన్స్ క్యాపిటల్ స్థాయికి ఎదగడంతో దాని ప్రాధాన్యత మరింత పెరిగింది. ఫైనాన్స్ చిత్త చాపల్యానికి ప్రపంచ దేశాలన్నీ జీ హుజూర్ అనాల్సిన స్థాయిని అది సంపాదించుకుంది. అయితే దీనికి అమెరికా కొంతకాలం మినహాయింపుగా నిలిచింది. అమెరికాను అండగా తీసుకొని ఫైనాన్స్ క్యాపిటల్ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించనారంభించింది. మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచంపై ఆధిపత్యం ప్రదర్శించే ఫైనాన్స్ క్యాపిటల్ సూచనలకు అనుగుణంగా అమెరికా వ్యవహరించసాగింది. ఫైనాన్స్ విశ్వసనీయతను పరిరక్షించడం దాని తక్షణ కర్తవ్యంగా మారింది.

అమెరికాలో 2008లో ఏర్పడిన ఆర్థికమాంద్యం కమ్ముకున్నపుడు కుదేలయిన కార్పొరేట్ సంస్థలను, బ్యాంకులను ఆదుకోవడానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు 'బెయిల్ అవుట్' ప్యాకేజీల పేరిట భారీ మొత్తాలలో ప్రజల సొమ్మును వితరణ చేసింది. దివాళ తీసిన బ్యాంకులకు, ద్రవ్య సంస్థలకు లక్షల కోట్ల డాలర్లు కుమ్మరించాయి. మరోపక్క పొదుపు చర్యల పేరుతో సామాన్యులకు వర్తించే సంక్షేమ పథకాలకు కోతపెట్టాయి. ఈ చర్యలు అమెరికా నుంచి ఆసియా వరకు అన్ని దేశాల్లో సామాన్యుడి కడుపు మంట రగిల్చాయి. పేద, బలహీన వర్గాల సంక్షేమ పథకాలకు ఇచ్చే నిధులకు కోత పెట్టడంతో తీవ్రంగా ప్రభావితమవుతున్న ప్రజలు ఈ ఉద్యమానికి అండగా నిలిచారు. సంపన్న వర్గాలకు అనుకూలంగా ప్రభుత్వాలు రూపొందిస్తున్న ఆర్థిక విధానాలపై నిరసన గళం వినిపిస్తున్నారు. ఆర్థిక విధానాల్లో సమన్యాయం పాటించాలని ఉద్యమిస్తున్నారు. ప్రజల సొమ్ము మేసి కార్పొరేట్లు కోలుకున్నాయి. కానీ, ప్రజలకు ఒరిగింది ఏమి లేదు. ప్రజల నిత్య జీవితాలు నరకానికి నకలుగా మారాయి. ప్రభుత్వం దగ్గర ఆర్థిక సహాయ ప్యాకేజీలు తీసుకొని సంక్షోభం నుంచి గట్టెక్కిన కార్పొరేట్ సంస్థలు ఒకపక్క సీఈవోల జీతాలు భారీగా పెంచి, మరోపక్క పొదుపు చర్యల పేరుతో లక్షలాది మందిని ఉద్యోగాల నుంచి తొలగించాయి. వారే ఈ ఉద్యమానికి చోదకశక్తి. వాల్‌స్ట్రీట్ ఉద్యమం కొద్ది మంది వ్యక్తులతో మొదట ఊపిరి పోసుకుంది. తర్వాత అనేక వర్గాలు వచ్చి చేరాయి. ఇందులో స్త్రీలు, పురుషులు అనే తేడా లేకుండా పాల్గొంటున్నారు. కార్మిక సంఘాలు జత చేరాయి. పార్టీలకు అతీతంగా ఊహించని వ్యక్తులు, సెలబ్రిటీలు వచ్చి సంఘీభావం తెలుపుతున్నారు.

అమెరికాలో 2007 డిసెంబర్ నుంచీ 2009 వరకు నెలకొన్న ఆర్థిక మాంద్యం రెండు భిన్న ఫలితాల్ని ఇచ్చింది. ఒకపక్క పెట్టుబడి దారులూ, సంపన్నులూ తమ సంపదలు, ఆదాయాలు పెంచుకోగా, మరోపక్క సామాన్య కుటుంబాలు, శ్రామిక కుటుంబాలు అతి నిరుద్యోగంతో, అప్పులు చెల్లించలేక కిస్తీలు కట్టలేక లక్షలాది కుటుంబాలు ఇళ్లు వదులుకోవడంతో సతమతమవుతున్నారు. ఇదేకాలంలో సంపన్నుల సంపద సామాన్యుని కుటుంబ ఆస్తికి 225 రెట్లు పెరిగింది. అట్టడుగు కుటుంబాల ఆస్తులు తగ్గాయి. 25 శాతం కుటుంబాలకు ఎలాంటి ఆస్తిలేదు. ఒకవైపు మాంద్యం ముగిసిందని చెబుతూనే మరోవైపు ఈ రెండేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగులను తొలగిస్తునే ఉంది. గత సంవత్సర కాలంలో ప్రభుత్వం 6 లక్షల 40 వేల మందిని ఉద్యోగాల నుండి తొలగించింది. ఇంకా 10 శాతం వరకు ఉద్యోగాల్లో కోత పెట్టాలని రిపబ్లికన్ పార్టీ ప్రతిపాదన. ఒబామా సంపన్నులపై భారం వేయకుండా పేదల సంక్షేమ కార్యక్రమాలకు చేసే వ్యయాన్ని మాత్రం తగ్గిస్తున్నారు. ఫలితంగా 15 శాతం అమెరికా కుటుంబాలు అంటే దాదాపు 5 కోట్ల మంది 2010లో సరిపడినంత ఆహారం కొనుగోలు చేయలేని పేదరికంలో కూరుకుపోయారు. మార్క్స్ తెలిపినట్లు పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలో సంపద పెరుగుదల ఎంతగా ఉంటుందో, పేదరికం కూడా అంతే స్థాయిలో విస్తరిస్తుంది. యంత్రాల వాడకం ఎంతగా పెరుగుతుందో అంతగా నిరుద్యోగం పెరుగుతుంది. అధికోత్పత్తి, అల్ప వినియోగం లాంటి వైరుధ్యాలను సామ్రాజ్యవాద ప్రపంచీకరణ క్రమంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి అవలక్షణాలుగా ప్రజలు జీవితానుభవం ద్వారా గుర్తించగలుగుతున్నారు.

వాల్‌స్ట్రీట్ నిరసనకారులు ఒకానొకదశలో గాంధీజీ సూక్తులను గోడలపై రాశారు. విశేషమేమిటంటే ఈ శాంతియుత నిరసనలు అమెరికా పాలకులకు మింగుడు పడలేదు. 150 ఏళ్ల నాటి చట్టాలను బయటకు తీసి ఈ నినాదాలు రాసిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. కానీ, మరో ప్రక్కన అవకాశం దొరికిన ప్రతిచోటా గాంధీజీ తనకు ఆదర్శమంటూ అమెరికా అధ్యక్షుడు ఒబామా వాగాడంబరం ప్రదర్శిస్తాడు. అంటే గాంధీజీ నినాదాలు కేవలం పాలకపక్షం ఉల్లేఖించు కోవడానికేనన్నమాట. అవి, ప్రజల కార్యాచరణకు ఊతం కారాదన్న మాట. వాల్‌స్ట్రీట్ భరో ఉద్యమానికి వందకు పైగా ప్రముఖ రచయితలు మద్దతు పలికారు. సల్మాన్ రష్దీ, నీల్ గైమన్, పులిట్జర్ అవార్డు గ్రహీత, నవలా రచయిత జెన్నిఫర్ ఈగన్, మైఖేల్ కన్నింగ్‌హమ్ తాము ఈ ఉద్యమానికి మద్దతు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు అక్యూపైరైటర్స్ డాట్‌కామ్‌లో ఓ ప్రకటన వెలువరించారు. ఉద్యమానికి విరాళాలు కూడా దండిగానే వస్తున్నాయి. ఇంటర్నెట్లో అధికారిక ఖాతాకు మూడు లక్షల డాలర్ల విరాళాలు అందినట్లు 'వాల్ స్ట్రీట్ ముట్టడి' మీడియా బాధ్యుడు బిల్ డబ్స్ తెలిపారు.

ఏ దేశంలోనైన రాజకీయాలను, చట్టాలను కార్పొరేట్ సంస్థలు ప్రభావితం చేస్తున్నాయంటే ఆ దేశానికి, ప్రజలకు మెరుగైన భవిష్యత్తు ఉండదని అర్థం. అవి ఎప్పుడూ లాభాలనే కోరుకుంటాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కొల్లగొడుతున్న కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామిక వేత్తల ఆధిపత్యానికి, ప్రభావానికి తమ ఉద్యమంతో గండి పడుతుందని

పెట్టుబడి అరాచకాలకు, కార్పొరేట్ల అవినీతికి వ్యతిరేకంగా అమెరికాలో మొదలై వివిధ దేశాలలో వ్యక్తమవుతున్న ప్రజల నిరసన జ్వాలలు ఏం చెబుతున్నాయో వివరిస్తున్నారు కె.వి. కూర్మనాథ్

'పెట్టుబడిని ముట్టడిద్దాం'

అమెరికా దురాక్రమణల జాబితాలో లిబియా చేరిపోయింది. ఇప్పటికే కొన్ని పదుల దేశాలు పరోక్షంగా అమెరికాకు సామంత రాజ్యాలుగా మారి ఉన్నా, ప్రత్యక్షంగా అమెరికా ఆధీనంలో ఉన్న దేశాల లిస్టులో లిబియా చేరింది. చమురు నిల్వలపై ఆధిపత్యం చేజిక్కించు కోడానికి ఇరాక్, ఈజిప్ట్, లిబియాలను ఆక్రమించుకోగా, చైనా, రష్యా, ఇండియాల పక్కలో బల్లెంలా ఉండడానికి అఫ్ఘనిస్తాన్‌ను అమెరికా ఆక్రమించుకుంది.

దేశం తర్వాత దేశాన్ని ఆక్రమిస్తున్న అమెరికాను చూస్తుంటే దానికిక తిరుగులేదనిపిస్తుంది. అమెరికా మిలిటరీని ఆపగలిగేవారు లేరనిపిస్తుంది. కాని గత రెండు నెలలుగా అమెరికాలోని ప్రధాన నగరాలన్నింటినీ కార్చిచ్చులా చుట్టుముట్టిన నిరసనలు ఆ దేశపు డొల్లతనాన్ని బయటపెడుతున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ అరాచకాలను అంతమొందించాలని, కార్పొరేట్ అవినీతిని నిరోధించాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది ప్రజలు రోడ్ల మీదికొచ్చారు.

'వాల్‌స్ట్రీట్‌ను ఆక్రమించండి' (ఆక్యుపై వాల్‌స్ట్రీట్) అని చాలా కొద్దిమంది ప్రారంభించిన ఉద్యమం ఈరోజు కేవలం అమెరికాలో మాత్రమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా వెయ్యి నగరాలకు విస్తరించింది.

ప్రభుత్వాలు పడిపోతాయో లేదో ఇప్పుడే చెప్పలేం కానీ పెట్టుబడిదారీ సమాజం ఎదుర్కొంటున్న తీవ్రమైన సంక్షోభాన్ని ఈ ఉద్యమాలు బయటపెట్టాయి.

వాల్‌స్ట్రీట్ అంటే న్యూయార్క్ నగరంలోని ముఖ్యమైన ఆర్థిక వాణిజ్య కూడలి. సరళంగా చెప్పాలంటే ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థకు గుండె, మెదడూ కూడా. న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజి, అనేక ఆర్థిక సంస్థలు, బ్రోకరేజి కంపెనీలు, పెద్ద పెద్ద బ్యాంకుల ప్రధాన ఆఫీసులు అన్నీ ఇక్కడే ఉంటాయి. ఇక్కడ స్టాక్ మార్కెట్లకు పొద్దున్న జలుబు చేస్తే ప్రపంచంలోని అన్ని దేశాల స్టాక్ మార్కెట్లు వెంటనే తుమ్ముతాయి.

స్టాక్ మార్కెట్లను తెరవెనుక నుంచి నడిపే చీకటి ఆర్థిక సామ్రాజ్యపు పునాదులు కూడా ఇక్కడే ఉన్నాయి. ప్రపంచ ఆర్థిక రంగాన్ని శాసించి, అమెరికా దురహంకారానికి ప్రతిరూపంగా మారి చివరకు చావు దెబ్బ తిన్న వరల్డ్ ట్రేడ్ సెంటర్ జంట భవనాలు కూడా వాల్‌స్ట్రీట్‌ని ఆనుకొని ఉంటాయి. అమెరికాలోనే కాకుండా ప్రపంచంలోనే అత్యంత సంపన్న ప్రాంతాల్లో ఒకటైన మాన్‌హాటన్ కూడా ఇక్కడే ఉంది. విచ్చలవిడి, రోతపూరితమైన సంస్కృతికి ఆలవాలమైన టైమ్ స్క్వేర్, తన స్వేచ్ఛను కాపాడుకుంటూ, ప్రపంచ దేశాల స్వేచ్ఛను హరిస్తున్నట్టు నిలబడే లిబర్టీ స్టాట్యూ కూడా వాల్‌స్ట్రీట్‌కు చేరువలోనే ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే అమెరికా సామ్రాజ్యపు దురాశకు, దుర్నీతికి కేరాఫ్ ఎడ్రస్ వాల్‌స్ట్రీట్. ధనవంతులకీ, పేదవాళ్లకీ మధ్య వాల్‌స్ట్రీట్ పెద్ద గోడ (వాల్) లాగా తయారయ్యింది.

బహుశా అందుకే నిరసనకారులు వాల్‌స్ట్రీట్‌లోని జుకోటి పార్క్‌ను తమ ఉద్యమానికి వేదికగా మార్చుకున్నారు. (అసలు పార్క్ పేరు వెనుక

ఉద్యమకారులు భావిస్తున్నారు. ఈ ఉద్యమం కార్పొరేట్ గుండెల్లో గుబులు పుట్టిస్తుంది. అయితే ఈ ఉద్యమానికి నిర్మాణం లేదు. స్థిరమైన నాయకత్వం లేదు. ఓ ప్రత్యేకమైన డిమాండ్, లక్ష్యమంటూ లేదు. తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు ఉద్యమకారులు తెలుపుతున్నారు. జుకోటి పార్కు నుంచి తమను ఖాళీ చేయించినా ఉద్యమం కొనసాగుతుందని ఉద్యమకారులు స్పష్టం చేశారు. విచిత్ర మేమిటంటే ఈ ఉద్యమానికి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా సైతం సంఘీభావం తెలుపాల్సి వచ్చింది.

కార్పొరేట్ ధనదాహాలపై ప్రజలు దాడిని కేంద్రీకరించడంలో పెట్టుబడిదారీ వికృతుల పదఘట్టనల క్రింద నలుగుతున్న మానవీయ విలువలను పేద దేశాలతో పాటు సంపన్న దేశాలలో కూడా ప్రజలు గ్రహిస్తున్నట్లు అవి సూచిస్తున్నాయి. 99 శాతం మంది పేదరికపు పాతాళంలోకి పడదొక్కుతూ ఒక్క శాతం మంది సంపద శిఖరాలపైకి ఎగబాకడానికి అవకాశమిస్తున్న పెట్టుబడిదారీ ఆర్థిక విధానపు కార్పొరేట్ సంస్కృతిని ప్రశ్నిస్తున్నారు. అరబ్ దేశాలైన ఈజిప్టు తెహ్రీర్ స్క్వేర్ మొదలు ట్యునీషియా, గ్రీస్, స్పెయిన్, బ్రిటన్ తదితర దేశాలలో జరిగిన నిరసనలే స్ఫూర్తి, పాశ్చాత్య భావజాలంలో వస్తున్న మార్పులకు సంకేతంగా నిలుస్తుంది. ఇవన్నీ ఫేస్‌బుక్ లాంటి సామాజిక వెబ్‌సైట్ల ద్వారా యువతను సమీకరించి నిర్వహించిన ఉద్యమాలే. అన్ని దేశాలలో ఏదో ఒక రూపంలో ప్రపంచీకరణ వికృతులపైనే ప్రజల ఆందోళనను గురిపెడుతున్నారు. ప్రపంచీకరణ వ్యతిరేక శక్తులు ఏకమవుతున్నాయి. ఈనాడు ఉద్యమాలు కూడా ప్రపంచీకరణ చెందుతున్నాయనడానికి వాల్ స్ట్రీట్ ముట్టడి ఒక సంకేతం. వీ

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు)

ఉన్న చరిత్రే వాల్‌స్ట్రీట్ అహానికి ఒక ఉదాహరణ. ఒకప్పటి లిబర్టీ (స్వేచ్ఛ) ప్లాజా పార్క్‌ను అమెరికాలోని అత్యంత ధనవంతులైన ఐదు వందల మందిలో ఒకడైన చుకోటి కొనుక్కుని తన పేరు పెట్టుకున్నాడు.)

నాలుగేళ్లుగా కుంగదీస్తున్న ఆర్థిక మాంద్యం అమెరికా ప్రజల్ని రోడ్ల మీదికి తీసుకొచ్చింది. ఉద్యోగాలు దొరకని, ఉద్యోగాలు పోయిన, బతుకు దుర్భరమైన వేలాది మంది యువతీ, యువకులు, వృద్ధులు గత నలభై రోజులుగా పార్కులో తిష్టవేశారు. ఒకపక్క తమ బతుకులు విధ్వంసమై పోతూంటే, దురాశకు పోయి దివాళా తీసిన కార్పొరేట్ కంపెనీలను రక్షించడానికి ప్రభుత్వం పూనుకోవడాన్ని వారు సహించలేక పోయారు. కేవలం ఒక్క శాతం ప్రజల దగ్గర యాభై శాతానికి పైగా సంపద చేకూరడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని వారు గ్రహించారు. ఒక పక్క నిరుద్యోగం తొమ్మిది శాతం ఉంటే, మరో పక్క కోటీశ్వరుల సంఖ్య తొమ్మిదిశాతం పెరగడాన్ని గ్రహించారు. దివాళా తీసిన కంపెనీల యజమానుల్నీ, వేలమందిని నిరుద్యోగాలుగా మార్చిన కంపెనీల అధికారుల్నీ శిక్షించ కుండా వదిలెయ్యడమే కాకుండా వారిని రక్షించడానికి ప్యాకేజీలను ప్రకటించడాన్ని జీర్ణించుకోలేకపోయారు. అందుకే 'వీ ఆర్ ది 99 పర్సెంట్' (మేం 99 శాతం మంది ప్రజలం) పేరుతో న్యూయార్క్ వీధుల్లో ఉద్యమం వెల్లువెత్తింది. దీని ప్రతిధ్వనులు అమెరికాలోని అన్ని నగరాల్లో మిన్నుముట్టాయి.

పార్కులో కూచున్న నిరసనకారుల్ని బలవంతంగా ఖాళీ చేయించాలని ఒబామా ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ ఉద్యమానికి ఉన్న నైతిక బలం ముందు ఓడిపోయింది. దాదాపు నలభై శాతం మంది అమెరికా ప్రజలు 'వాల్‌స్ట్రీట్‌ను ఆక్రమించండి' ఉద్యమానికి మద్దతు పలుకుతున్నారని ఒక సర్వే వెల్లడించింది. ఉద్యమకారుల డిమాండ్లలో నిజం ఉందని 57 శాతం మంది ప్రజలు అనుకుంటున్నారని కూడా ఆ సర్వే తెలిపింది.

ఈ సంగతి అమెరికా ప్రభుత్వానికి తెలుసు. ఆర్థిక మాంద్యం మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థనే సంక్షోభంలోకి నెట్టిందని అమెరికా మాత్రమే కాదు, అమెరికా దురాక్రమణలకు ఎప్పుడూ వత్తాసు పలికే ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లకు కూడా బాగా తెలుసు. అందుకే తమ తమ దేశాల ప్రజల దృష్టి మరల్చడానికి యుద్ధాన్ని సాకుగా వాడుకుంటున్నాయి. యుద్ధాల్ని చెయ్యడం ద్వారా ప్రపంచంలోని నియంతృత్వాన్ని అంతమొందిస్తున్నామని, తద్వారా టెర్రరిస్టు దాడులు తగ్గుతాయని నమ్మ బలుకుతున్నాయి. ఒకవైపు తమ తమ దేశాల్లో ప్రజల దృష్టిని మరల్చడమే కాకుండా, ప్రపంచంలోని ముఖ్యమైన వనరుల్ని చేజిక్కించు కుంటున్నాయి. తమ దేశాల్లోని యుద్ధ పరిశ్రమ ఆర్థిక మాంద్యం బారిన పడకుండా చూసుకోవడం కూడా వాటి మరో లక్ష్యం.

ప్రపంచంపై తిరుగులేని ఆధిపత్యం సంపాదించిన అమెరికాకు గత దశాబ్దం అత్యంత గడ్డుకాలం. సెప్టెంబర్ 11, 2001న వరల్డ్ ట్రేడ్ సెంటర్ జంట భవనాల్ని లాడెన్ కూల్చివేసిన నాటి నుండి ప్రారంభమైంది. టెర్రరిస్టులను తుదముట్టించే నెపంతో ఇరాక్, అఫ్ఘనిస్తాన్‌లపై అమెరికా దాడులు మొదలుపెట్టింది. దీంతో దెబ్బతిన్న అహం సంతృప్తి చెందినా, మొత్తం ఆర్థిక వ్యవస్థ మీద యుద్ధాల ఖర్చు ప్రభావం పడింది. వెనువెంటనే మొదలైన సబ్‌ప్రైమ్ సంక్షోభం (ఇళ్ల అసలు విలువ కంటే ఎక్కువ మొత్తంలో బ్యాంకులు ఇంటి రుణాలు ఇచ్చాయి. ఆర్థిక మాంద్యం ఫలితంగా ఈ రుణాలన్నీ మొండి బకాయిలుగా మారి బ్యాంకులు, ఆర్థిక సంస్థలు దివాళా తీశాయి), దాంతోపాటుగా మొదలై ఇప్పటికీ కొనసాగుతున్న తీవ్ర ఆర్థిక మాంద్యం అమెరికా పునాదుల్ని కుదిపివేసింది. కొన్ని నెలల క్రితం అమెరికా ప్రభుత్వమే దివాళా ఒడ్డున చేరుకుంది.

అమెరికా స్థూల జాతీయోత్పత్తి 15 ట్రిలియన్ డాలర్లుంటే, అప్పు కూడా దాదాపు అంతే ఉంది. అమెరికా ప్రభుత్వం పెట్టే ఖర్చులో 40 శాతం అప్పు తెచ్చిన డబ్బు మీదనే. గత జూలై నాటికి అప్పు సమస్య తారాస్థాయికి చేరి, ఈ 40 శాతం ఖర్చును మానుకోవాల్సిన స్థితికి అమెరికా వచ్చింది. గడ్డుకాలం నుండి బయటపడడానికి ఒబామా ప్రభుత్వం అశాస్త్రీయ నిర్ణయం తీసుకున్నది. అప్పు తీసుకునే పరిమితిని పెంచుకున్నది. ఖర్చుల కోసం కొత్త అప్పులు తీసుకునే వెసులుబాటు కల్పించుకుని సమస్యని వాయిదా వేసింది. ఇంత తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్నప్పటికీ యుద్ధాల్ని తగ్గించుకొని, ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకునే ప్రయత్నం చెయ్యలేదు.

మీడియా సామ్రాజ్యవాదం

అమెరికాలో వెల్లువెత్తుతున్న నిరసనలను ఆ దేశపు మీడియా పట్టించుకోదలచుకోలేదు. ప్రపంచంలో ఏమూల ఏ చిన్న సమస్య ఉన్నా దాన్ని ప్రచారం చేసి ఎగదోసి, ప్రజా ఉద్యమాలను ఉన్మాద చేష్టలుగా చిత్రీకరించే అమెరికన్ మీడియా తన సామ్రాజ్యవాద లక్షణాలను మరోసారి ప్రకటించింది. అరబ్ దేశాల్లో (తమకు వ్యతిరేకమైన అరబ్ దేశాల్లో మాత్రమే) 'మల్లెపూవు విప్లవాల' గురించి క్షణం తీరికలేకుండా ప్రచారం చేసిన ప్రసార సాధనాలు 'ఆక్యుపై వాల్‌స్ట్రీట్' ఉద్యమాలను కావాలనే ఉపేక్షించాయి. నాయకత్వంలేని ఉద్యమాలనీ, వాటికి డిమాండ్లు లేవనీ, ప్రభుత్వాన్ని సవాలు చెయ్యడం నేరమనీ – వ్యాసాలు, సంపాదకీయాలు, కథనాలు రాసాయి. అంతే తప్ప 'పెట్టుబడి మీద తిరుగుబాటు' అనో, లేకపోతే 'సెప్టెంబర్ విప్లవమనో', 'నియంత ఒబామా, గద్దె దిగు' అనో హెడ్డింగులు రావు. కానీ ప్రజలు తెలివైన వాళ్లు. మైకులు అనుమతించక పోతే వందల మంది శ్రోతలు వక్తల మాటలను రెట్టించిన గొంతులతో పలికి వెనుక ఉన్న వారికి సందేశాన్ని వినిపిస్తున్నారు. తమకు తామే పార్కును శుభ్రం చేసుకుంటున్నారు. టెంట్లను అనుమతించకపోతే స్లీపింగ్ బాగ్స్ (పడుకునే ప్లాస్టిక్ గాలి సంచులు) తెచ్చుకుంటున్నారు. చందాలు వసూలు చేస్తున్నారు. హోటళ్లలో ఉద్యోగాలు పోయిన వంటవాళ్లు ఉద్యమకారులకు వండి పెడుతున్నారు. ఐటి రంగంలో నిపుణులు ఇంటర్నెట్ సదుపాయాల్ని కల్పిస్తున్నారు. ఏ ఇంటర్నెట్‌లో అయితే అమెరికా అరబ్ దేశాల మీదికి ఉసిగొలిపి అగ్గి రాజేసిందో, అదే ఇంటర్నెట్ ఉద్యమకారులకు ఆధారం అయింది. అరెస్టుల గురించి, ఉద్యమ కార్యక్రమం గురించి ఈమెయిళ్ల ద్వారా, ఫేస్‌బుక్, ట్విట్టర్‌ల ద్వారా ప్రచారం చేసుకుంటున్నారు. ప్రజా యుద్ధమంటే ప్రేమ కదా! తనను తాను వ్యక్తీకరించే మార్గాన్ని తనే అన్వేషించు కుంటుందని బ్రెహ్ట్ అన్నది ఎంత నిజం!

'దలాల్ స్ట్రీట్ ఆక్రమణ' ఎప్పుడో?

అమెరికాలో ప్రజలు ఏయే కారణాలతో ఉద్యమిస్తున్నారో, అవన్నీ మన దగ్గర కూడా ఉన్నాయి. ఆర్థిక మాంద్యం, ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నమైతే ప్రభుత్వం కార్పొరేట్ రంగానికి ప్యాకేజీలను ప్రకటించడం, వేలాదిగా కంపెనీలు మూతపడడం వల్ల లక్షలాది ఉద్యోగాలు పోవడం, షేర్ మార్కెట్ల ద్వారా లక్షల కోట్ల రూపాయల చిన్న మదుపర్ల డబ్బును పెట్టుబడిదార్లు కొల్లగొట్టడం, కార్పొరేట్ రంగం – రాజకీయ రంగం చేతులు కలిపి విచ్చలవిడి అవినీతికి పాల్పడడం, ఈ అవినీతికి ప్రభుత్వం మద్దతు పలకడం, గనుల్నీ – నదుల్నీ మల్టీ నేషనల్ కంపెనీలకు ధారాదత్తం చెయ్యడం, ఇవి అడ్డుకున్న వాళ్లని ప్రజావ్యతిరేకులనీ – దేశ వినాశకులనీ ముద్రవేసి చంపడం – ఇలా ఎన్నో కారణాలున్నాయి మనకూ దలాల్ స్ట్రీట్‌ని (అమెరికా వాల్‌స్ట్రీట్‌కు సమానమైన ప్రాంతం, ముంబైలో ఉంది.) ముట్టడించడానికి...

దురాశకు లోనై నిండా మునిగిన కార్పొరేట్ రంగాన్ని రక్షించడానికి పన్నుల రూపంలో సాధారణ ప్రజలు కట్టిన డబ్బును ప్రభుత్వం మళ్లించింది. అంతే తప్ప ఆర్థిక మాంద్యం వల్ల, డబుల్ డిప్ వల్ల (ఒక ఆర్థిక మాంద్యం నుంచి కాస్త తేరుకుని మళ్లీ ఆర్థిక మాంద్యంలో చిక్కుకోవడం) నలిగిపోయిన సామాన్య, మధ్యతరగతి ప్రజలకు చేయూతనిచ్చే ప్రయత్నమేమీ చెయ్యలేదు.

ఈ పరిస్థితికి అసలు కారణం అమెరికా ప్రభుత్వం, పెట్టుబడిదారీ వ్యవస్థ అయినా, ప్రజల స్వయంకృతాపరాధం కూడా ఉంది. తమ ప్రభుత్వం అచ్చోసిన ఆంబోతులా ప్రపంచ సంస్కృతుల్ని కొల్లగొడుతున్నా, ఆనకొండలాగా ఎన్నో దేశాల్ని కబళిస్తున్నా, ఎన్నో దేశాల సార్వభౌమత్వాల్ని కాలరాసివేస్తున్నా, ప్రపంచ వ్యాప్తంగా పౌరహక్కుల్ని హననం చేస్తున్నా అక్కడి ప్రజలు చోద్యం చూస్తూ ఉండిపోయారు. అంటే అందరూ అలాగే ఉండిపోయారని, వంద శాతం మంది ప్రజలు ప్రభుత్వాన్ని సమర్థించారని కాదు. కానీ, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన పద్ధతిలో నిలదీయలేదు. అడగాల్సిన స్థాయిలో అడగలేదు. తమ పట్ల ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తున్నట్టు కనపడే ప్రభుత్వం, ప్రపంచ దేశాల పట్ల అప్రజాస్వామిక విధానాలు అవలంబిస్తున్నపుడు వారు మౌనం దాల్చారు.

ఒక వ్యక్తిగాని, సంస్థగాని, పార్టీగాని, దేశంగాని ప్రజాస్వామికంగా ఉండడం ఒక జీవన విధానంగా ఉండాలి. ఒకచోట అప్రజాస్వామికంగా మరోచోట ప్రజాస్వామికంగా ఉంటే ఎక్కడో లోపం ఉందని అర్థం చేసుకోవాలి. ఇప్పటికీ కూడా నిరసనకారులు ఈ విషయాన్ని అర్థం చేసుకున్నట్టు లేదు. ఇంత స్ఫూర్తిదాయకంగా ఉద్యమం చేస్తూ, పెట్టుబడిదారీ వ్యవస్థను తీవ్రంగా సవాలు చేస్తూ, లిబియాలో అమెరికా, ఫ్రాన్స్, ఇంగ్లండ్ దేశాలు చేస్తున్న ఆకృత్యాల పట్ల మౌనంగా ఉన్నారు నిరసనకారులు.

ఇది ఒక లోపం మాత్రమే కాదు. దాదాపు తొలిసారిగా ఇంత పెద్ద స్థాయిలో పెట్టుబడిని సవాలు చేసిన ఉద్యమం తప్పకుండా పెట్టుబడి పూర్తి స్వభావాన్ని అర్థం చేసుకుని ఉద్యమిస్తారు. ఉద్యమాలు క్రమంగా ఇంటర్నెట్‌కి మాత్రమే పరిమితమైనపోతున్న తరుణంలో ఇంటర్నెట్‌ను వాడుకుని ఉద్యమించడం చాలా సంతోషించాల్సిన విషయం. వస్తు వినియోగ సంస్కృతికి దాసోహమై, ఆ మత్తును ప్రపంచం మొత్తం విస్తరింపచేస్తున్న అమెరికా సామ్రాజ్యవాదానికి 'ఆక్యుపై వాల్‌స్ట్రీట్' ఒక చెప్పు దెబ్బ.

దున్నపోతు మీద వానపడ్డట్టు పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ తాత్కాలిక సంక్షోభం నుంచి బయటపడవచ్చు. నవంబర్ – డిసెంబర్‌లో న్యూయార్క్‌లో ప్రారంభమయ్యే శీతాకాలం నిరసనకారుల్ని రోడ్లమీది నుంచి తరిమివెయ్యవచ్చు. లేకపోతే, తాత్కాలిక ఉపశమనంతో కొందరు వెనక్కి మళ్లవచ్చు. ప్రభుత్వమే ఉక్కుపాదంతో అణిచివెయ్యవచ్చు. కానీ అమెరికాలో మొదలైన సెప్టెంబర్ విప్లవం ప్రపంచవ్యాప్తంగా కొత్త తరంలో కొత్త ఆశల్ని పురికొల్పింది. ప్రపంచ పోలీసైనా సరే పాలించే నైతిక మద్దతు లేకపోతే నిస్సహాయులైనా నిర్భయంగా ప్రతిఘటిస్తారని, ప్రతిఘటించవచ్చని నిరూపించింది.

బహుశా న్యూయార్క్‌లోని నిరసనకారుల్లో ఎవరైనా నడుస్తున్న చరిత్రను అధ్యయనం చేస్తుంటే, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజల్నించి నేర్చుకోవాల్సినది ఎంతో ఉందని అర్థమవుతుంది. ఇండియా, నేపాల్ వంటి దేశాల ప్రజలు అణచివేతని తట్టుకుని పోరాటాల్ని ఎలా కొనసాగిస్తున్నారో కొన్ని పాఠాలు నేర్చుకోవచ్చు. తమ తమ దేశాల ప్రభుత్వాల అణచివేతని మాత్రమే కాక అమెరికా సామ్రాజ్యవాదాన్ని, పెట్టుబడి విస్తరణను ఎలా అడ్డుకుంటున్నారో తెలుసుకోవాలి. పెట్టుబడి, ఆయుధాలు ప్రపంచీకరణలో భాగంగా ఎలా విస్తరించాయో ప్రజల ఉద్యమాలు కూడా కలిసి పనిచెయ్యాలని ఒకరి అణచివేతని మరొకరు సమర్థించకూడదని (మౌనంగా ఉండడం కూడా సమర్థించడమే) తెలుసుకోవాలి.

అమెరికాలో మొదలైన పోరాటరూపం విస్తృతి చెంది తీరుతుందనీ, ప్రస్తుత ఉద్యమాలు అందుకు నాంది కావాలని ఆశించడం అత్యాశ కాదు. శాక్కో–వాంజెట్టీల కాలం నుంచి, అంతకు ముందు నుండీ అమెరికాలో (చాలా తక్కువ స్థాయిలో అయినా) బలమైన ప్రబలమైన ఆకాంక్షలు వ్యక్తమైన సందర్భాలు లేకపోలేదు.

చాలా బలహీనమైన స్వరమైనప్పటికీ, న్యూయార్క్ నగరంలో బ్రెఖ్ట్‌ఫోరం అని ఒక చిన్న సంస్థ ఉంది. జుగుప్సాకర స్థాయిలో ఆస్తి పేరుకున్న మాన్‌హట్టన్ ప్రాంతానికీ, కార్పొరేట్ చీకటి సామ్రాజ్యానికీ కేంద్రమైన వాల్‌స్ట్రీట్‌కూ, స్వేచ్ఛ అంటే అమెరికా స్వేచ్ఛ మాత్రమేననీ నిస్సిగ్గుగా ప్రకటించేట్టు నిల్చున్న లిబర్టీ విగ్రహానికి అతి చేరువలో అతి చిన్న భవనంలో ఠీవిగా ఉంటుందీ ఫోరం. శత్రువు ఎంతటివాడైనా ఎంతటి ఆకృత్యాలకు, అణచివేతకు పాల్పడుతున్నా స్థిరంగా, మొక్కవోని ధైర్యంతో పోరాడే స్ఫూర్తినింపిన బ్రెఖ్ట్ మన ఆశలకు బలం చేకూరుస్తున్నట్టుంటుంది ఆ ఫోరం ఆఫీసు చూస్తుంటే.

బ్రెఖ్ట్ అన్నట్టు, ప్రభుత్వాల, డబ్బున్న వాళ్ల జయాపజయాలు మన జయాపజయాలు కాకూడదు. పెట్టుబడిపై నిరసన వ్యక్తం చేస్తున్న అమెరికా ప్రజలు సామ్రాజ్యవాదం, పెట్టుబడి ప్రపంచవ్యాప్తంగా చేస్తున్న వికృత చేష్టలను తమ జయాపజయాలుగా భావించని రోజులు వస్తాయని, రావాలని ఆశిద్దాం.

(రచయిత పాత్రికేయులు) వీ

పంట విరామం వెనుక కేవలం భూ యజమానుల సమస్యలే కాదు, కౌలు రైతుల, రైతు కూలీల సమస్యలు కూడా ఉన్నాయని చెబుతూ వ్యవసాయ రంగ సమస్యలను వివరిస్తున్నారు **వై. రామచంద్రం**

బీళ్లుగా మారుతున్న పంట భూములు

గ్రామీణవ్యవస్థ మనగలగడానికి వ్యవసాయరంగమే ప్రధాన కారణం. అయితే ఈనాడు రైతులకు పెట్టుబడులు పెరగడం, పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో ప్రభుత్వ విధానాలకు నిరసనగా తూర్పు గోదావరి జిల్లాలోని కోనసీమలో పంట పండే భూములను బీడు పెట్టి, వరికి మద్దతు ధర డిమాండ్ చేస్తున్నారు. సమాజానికి అన్నం పెడుతున్న రైతాంగం ప్రభుత్వాలు అమలుచేసే విధానాల వల్ల ఎన్నడూ లేని విధంగా పంటలకు సెలవు ప్రకటించారు.

ప్రభుత్వం తెచ్చిన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాల వల్ల వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు 'యూరియా తప్ప' అన్నీ ప్రైవేటు కంపెనీల యాజమాన్యంలో ఉన్నాయి. ప్రైవేటు కంపెనీల మీద ప్రభుత్వానికి ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో రైతుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నాయి. దీంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు ఒక సంవత్సరంలో రెండింతలయ్యాయి. పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక రైతులు అప్పులపాలవుతున్నారు. గిట్టుబాటు ధరల కోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రైతాంగం ధర్నాలు, రాస్తా రోకోలు, బంద్‌ల ద్వారా తమ నిరసనను వ్యక్తంచేస్తునేఉన్నారు. ఇప్పుడు ఏకంకా రైతులు తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల ఎకరాల పంట భూములకు విరామం ప్రకటించారు. పంటలకు విరామం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా పంజాబ్, తమిళనాడు, కర్ణాటకలలోనూ ఖరీఫ్‌లో సాగు చేయాల్సిన దాంట్లో మొత్తం సాగు చేయలేదని తెలుస్తోంది. దీంతో దేశవ్యాప్తంగా ఈ సీజన్‌లో రావాల్సిన మొత్తం దిగుబడిలో 15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాల ఉత్పత్తి తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు.

పంట విరామానికి మరో కారణం ఉపాధి హామీ పథకం. దీని వల్ల వ్యవసాయానికి కూలీలు దొరకట్లేదని రైతులు అంటున్నారు. ఒక వేళ వచ్చినా ఎక్కువ కూలీ డిమాండ్ చేస్తున్నారని దీని ద్వారా అన్ని కలిసి పెట్టుబడి పెరిగిపోతుందంటున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నామంటున్నారు. అందుకని ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి వర్తింపచేస్తే రైతుకు కూలీలు అందుబాటులోకి వచ్చి, కూలీలకు చెల్లించే ఖర్చు తగ్గి రైతుకు కొంత భారం తగ్గుతుందని అంటున్నారు. కాని ఇక్కడ మనం గమనించాల్సింది రైతుకూలీలకు సంవత్సరం పొడవునా వ్యవసాయంపై పని దొరకడంలేదు. దొరుకుతున్న వ్యవసాయపని అతి కష్టంగా ఏడు నుంచి ఎనిమిది నెలలు. మిగతా రోజులు ఖాళీగా ఉండే పరిస్థితి. ఆ కాలంలో ఉపాధి హామి పథకం పనికి (2005 నుంచి) వెళుతున్నారు. అదికూడా ఇప్పుడు తగ్గిపోయింది. ఆ రోజులను కూడా వ్యవసాయానికి కలిపితే కూలీలకు నష్టం జరుగుతుంది. రైతులు పెట్టుబడికి కావాల్సిన పంట రుణాలు, గిట్టుబాటు ధరలకోసం ప్రభుత్వాన్ని నిలదీయాలి. కూలీలకు పనిరోజులు తగ్గకుండా చూసుకోవాలి. ఒక వేళ వ్యవసాయాన్ని ఉపాధి హామి పథకం కిందకు తీసుకెళితే పంట ఖర్చును కొంత తగ్గించవచ్చు. ఇలాంటి తాత్కాలిక చర్యల వల్ల దీర్ఘకాలంలో వ్యవసాయం రైతుకూలీల నుంచి కార్పొరేటు బహుళజాతి సంస్థలకు చేరే ప్రమాదం ఉంది.

పంటకు సెలవు ప్రకటించి గత మూడు నెలలుగా రైతులు నిరసన వ్యక్తంచేస్తున్నారు. దీంతో ప్రభుత్వం పంట విరామంపై అధ్యయనం కోసం కేంద్ర వ్యవసాయశాఖ ప్రణాళికా సంఘం స్టీరింగ్ కమిటీ చైర్మన్ మోహన్ కందా అధ్యక్షతన కమిటీని వేసింది. ఈ కమిటీ పంట సెలవు ప్రకటించిన ప్రాంతాల్లో పర్యటించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ కమిటీ ఇచ్చిన నివేదికలో రైతులు పంట విరామం ప్రకటించడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని తేల్చింది. పంట విరామానికి ప్రధాన కారణమైన గిట్టుబాటు ధరకు సంబంధించి కమిటీ నిర్దిష్టమైన ప్రతిపాదనలు ఏమి ప్రభుత్వానికి సూచించలేదు. ఎన్నో కష్టాలు పడి పంట పండిస్తున్న కౌలురైతుల, రైతు కూలీల ప్రస్తావనే ఈ రిపోర్ట్‌లో లేదు. దీన్ని బట్టి చూస్తే వారిని ఉత్పత్తి శక్తులుగా చూడడం లేదనేది అర్థమవుతుంది.

ప్రధానంగా పంట విరామం ప్రకటించిన తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో సాగుచేసున్న వారిలో 60 శాతం కౌలుదారులే ఉన్నారు. పంట విరామం ప్రకటించినది భూయజమానులు. పంట విరామం వల్ల ప్రధానంగా నష్టపోతున్నది భూమి మీద శ్రమ చేసి పంట పండిస్తున్న రైతు కూలీలు, సన్నకారు రైతులు, కౌలుదారులే. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొని పెట్టుబడి పేట్టేది సన్నకారు రైతులు, కౌలుదారులే. కూలీలకు డబ్బులు వీరే చెల్లిస్తారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాన్ని సాగుదారులే భరించాల్సి వస్తోంది. దాని వల్ల వచ్చే నష్టపరిహారం పొందేదీ భూ యజమానులు. పంట విరామానికి వచ్చే నష్టపరిహారం కూడా భూ యజమానులకే దక్కుతుంది తప్ప భూమిపై శ్రమచేసే వారికి దక్కడం లేదు. పంట ఉత్పత్తికి దోహదపడుతున్న వారిని గుర్తించక పోవడానికి కారణం వారికి సొంత భూమి లేకపోవడమే. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో సహా

మొత్తంగా సాగు చేయకుండా వ్యాపారాలు, ఉద్యోగాలు చేసుకొని భూయజమానులుగా ఉన్న వారి భూమిని కౌలుదారులకు, రైతుకూలీలకు ఇవ్వడం వల్ల కొంత సమస్య పరిష్కారమవుతుంది.

ఈ వ్యాసం రాసే నాటికి రాష్ట్రంలో ఒక వైపు గిట్టుబాటు ధరల కోసం పంటకు సెలవు ప్రకటించి రైతులు నిరసన వ్యక్తంచేస్తున్నారు. ఇదే సమయంలో 470 మండలాల్లో వర్షాలు కురువక, దానికి తోడు కరెంట్ కొరతలతో మెట్ట ప్రాంతాలలో కాత, కోత దశలో ఉన్న పంటలు ఎండిపోతున్నాయి. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారమే 12 లక్షల హెక్టార్లు (30 లక్షల ఎకరాలు) పంటచేన్లు ఎండుతున్నట్లు తెలుస్తోంది. చేతిదాక వచ్చిన పంట చేతికి అందకుండా పోవడంతో రైతులు దిక్కుతోచక దిగులు పడుతున్నారు. ఎండిన పంట పోలాలకు నిప్పు పెడుతున్నారు. అప్పులు తీర్చే మార్గం కనబడక రైతుల ఆత్మహత్యలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ప్రభుతం వేచి చూసే ధోరణిని అవలంబిస్తోంది. వ్యవసాయరంగ సంక్షోభానికి తక్షణ చర్యలు చేపట్టి రైతులకు భరోసా ఇవ్వకపోతే రైతుల ఆత్మహత్యలు మరిన్ని పెరిగే ప్రమాదం ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు సమయానికి రాక పంటలు ఆలస్యంగా వేసారు. వేసిన పంటలు ఇప్పుడు ఎండిపోతున్నాయి. దీని వల్ల దిగుబడి తగ్గిపోయి ధరలు సామాన్యులకు అందకుండా పోయే ప్రమాదం ఉంది. కోట్లాది మంది రైతులు, కూలీలను ఆదుకోవడానికి బదులు ప్రభుత్వం కమిటీలకే పరిమితమవుతోంది.

మనదేశంలోని భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా దేశ ప్రజల జీవన ప్రమాణాలు పెరగడానికి మొదటి పంచవర్ష ప్రణాళికలో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ, దాని ఆధారంగా సాగే పారిశ్రామిక రంగానికి రెండవ ప్రాధాన్యతనిచ్చింది. కానీ తరువాతి క్రమంలో ప్రభుత్వం వ్యవసాయరంగానికి ప్రధాన్యత తగ్గిస్తూ వచ్చింది. అదే క్రమంలో సేవల రంగానికి ప్రధాన్యత పెంచింది. 1991 నుండి మన వ్యవసాయరంగంలో సరళీకృత ఆర్థిక విధానాలు అమలు చేయడం ప్రారంభించారు. మన రైతులు విత్తనాల కోసం, ఎరువుల కోసం, పురుగుమందులకోసం పూర్తిగా బహుళజాతి కంపెనీలపై ఆధారపడాల్సి వచ్చింది. ప్రత్యామ్నాయం లేక ఆ కంపెనీలు నిర్ణయించిన రేటుకే కొనాల్సిరావడంతో పెట్టుబడి పెరిగిపోయింది. పెట్టుబడికి తగినట్లు గిట్టుబాటు ధర రాక రైతులు అప్పుల పాలవుతున్నారు. రైతులు వ్యవసాయం చేయడం వల్ల బహుళజాతి కంపెనీలు, మధ్య దళారులు, మిల్లర్లు, లబ్ధిపొందుతున్నారు. ఇటు రైతుకు గాని అటు వినియోగదారుకు గాని ఎటువంటి ప్రయోజనం ఉండడంలేదు. చివరికి ఏమి చేయలేక నిస్సహాయతకు లోనై పంటచేన్లోనే రైతులు తనువు చాలిస్తున్న పరిస్థితి కొనసాగుతోంది.

వ్యవసాయరంగంలో కొనసాగుతున్న ఆత్మహత్యల నివారణకు యు.పి.ఎ ప్రభుత్వం డా. స్వామినాథన్ అధ్యక్షతన జాతీయ వ్యవసాయ కమిషన్ వేసింది. 2006లోనే ఆ కమిషన్ తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. కనీసం ఆ నివేదికలోని సూచనలను అమలు పరుచలేదు. అప్పుల ఊబిలో చిక్కుకుని విశ్వాసం కోల్పోయిన రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. డా. స్వామినాథన్ కమిషన్ వరి ధాన్యానికి మద్దతు ధర క్వింటాలుకు రు. 2,042గా ఉండాలని సూచించింది. 2010-2011లో పండించిన పంటకు కమిషన్ సూచించిన ప్రకారమైతే క్వింటాలు ధర రు. 2,042గా ఉండాల్సి ఉండగా కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రు. 1,030గా నిర్ణయించింది. 2011-2012లో పండిన పంటలకు మద్దతు ధర రు. 2040 ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రు. 1110 మాత్రమే. కమిషన్ సూచించిన దాంట్లో సగం ధరను మాత్రమే కేంద్రం ప్రకటించింది. క్వింటాలు ధాన్యం ఉత్పత్తి వ్యయం మాత్రం రు. 1362 అవుతోంది. దీంతో రైతుకు మిగిలేది అప్పే.

ఈ ఖరీఫ్ సీజన్‌లో పెరిగిన ఎరువుల ధరలను మనం గమనిస్తే, రైతులు పంట భూములను ఎందుకు బీడుగా పెట్టాల్సివస్తుందో అర్థమౌతుంది. ఆగస్టులో ఒకసారి, సెప్టెంబర్‌లో రెండుసార్లు, అక్టోబర్‌లో రెండు సార్లు ఎరువుల ధరలు ఈ విధంగా నాలుగు సార్లు పెంచారు. ఈ నాలుగు సార్లు పెంచిన ధరలు కలిపి ఈ సంవత్సరంలో మొత్తంగా ఆరుసార్లు పెంచినట్లైంది. ఒకసారి పెంచిన ధరతో ఎరువు రైతుకు చేరకముందే మళ్లీ ధరలు పెంచి మరిన్ని అప్పుల్లోకి నెడుతున్న పరిస్థితి ఉంది. ఒకే సీజన్లో డై అమ్మోనియా ఫాస్పేట్ (డిఎపి) ధర దాదాపుగా రెండింతలయింది. పెరిగిన రేట్ల ప్రకారం ఖరీఫ్‌కు అవసరమైన మూడు లక్షల టన్నుల ఎరువులపై రు. 90 కోట్లు, రబీకి వాడబోయే ముప్పయి లక్షల టన్నుల ఎరువులపై రు. 2,040 కోట్లు మొత్తంగా చూస్తే రు. 2,130 కోట్ల అదనపు భారాన్ని రైతులపై మోపింది ప్రభుత్వం.

పండిన పంటలను రక్షించుకోవడానికి అవసరమైన గోదాములు లేక వర్షానికి ధాన్యం తడిసిపోయి నష్టపోవాల్సి వస్తోంది. మన రాష్ట్రంలోని రైతులకు ప్రభుత్వం నుంచి అందుతున్న సబ్సీడీ అంతంత మాత్రమే. మెట్ట ప్రాంతాల్లో వచ్చిపోయే కరెంట్ కోతలతో మోటార్లు, ట్రాన్సఫార్మర్లు కాలడంతో రైతులకు అదనపు ఖర్చులు పెరిగిపోతున్నాయి. చివరికి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక రైతులు ఆత్మహత్యలను పరిష్కారంగా ఎంచుకుంటున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఏర్పడి రకరకాల కారణాలతో సమస్యలను ఎదుర్కొంటున్న కాలంలో, భారతదేశం ఆ సుడి గుండంలో చిక్కుకోకుండా ఉండడానికి ప్రధాన కారణం మన వ్యవసాయరంగమే. అలాంటి వ్యవసాయరంగం ఇప్పుడు సంక్షోభాన్ని ఎదుర్కొంతఓగింది. సంక్షోభాన్ని పరిష్కరించడానికి అవసరమయిన శాశ్వత మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు తాత్కాలిక ఉపశమనంకోసం చేసే చర్యలు సరిపోవు. ఇవేవి వ్యవసాయరంగంలో మౌలికమైన మార్పులకు దోహదపడక పోగా, వ్యవసాయరంగాన్ని పూర్తిగా కార్పొరేటు రంగానికి కట్టబెట్టడానికే దోహదపడతాయి. దీంతో లక్షలాది మంది రైతాంగం పనిలేకుండా పోయే ప్రమాదం ఉంది.

(రచయిత వీక్షణం కరస్పాండెంట్ / సర్క్యులేషన్ మేనేజర్) వీ

రచయితలకు సూచన : తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 23వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. – సం.

హిందూ మతోన్మాద శక్తులను కాస్త నిలువరించడానికీ, ముస్లిం, మైనారిటీ ప్రజానీకానికి కాస్త భద్రత, రక్షణలు కల్పించడానికీ మత హింస బిల్లు అవసరమని అంటున్నారు **మహమ్మద్ లతీఫ్ ఖాన్**

మతహింస బిల్లు - పూర్వాపరాలు

మతఘర్షణలు ఇప్పుడు మన దేశంలో రగులుతున్న అంశం. హిందూ మతోన్మాదం వల్ల భారతదేశంలో ఉన్న మైనారిటీ ప్రజలకు భద్రతలేకుండా ఉంది. హిందూ మతోన్మాదంలో నాజీజం లాంటి ఫాసిజం ఉంది. మన దేశంలో బ్రిటిష్ పాలకులు తమ అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం మతాల మధ్య వైరుధ్యాలకు బీజం వేసారు. హిందూ మతస్తులు దీన్ని పోషించారు. స్వాతంత్ర్యానికి ముందు మన దేశంలో మత అల్లర్లు చాలా జరిగాయి. వీటి వెనుక బ్రిటిష్ వాళ్ల 'విభజించు పాలించు' అనే పద్ధతిని అవలంబించారు. దీనివల్లనే దేశం విభజించబడింది. ఈ విభజన కూడా లక్షలాది మంది మరణంతో జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇంకో రకమైన మత హింస ప్రారంభమైంది. దీనిని మనం నిర్దేశిత హింసగా చెప్పవచ్చు. మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని మెజారిటీ మతస్తులు కుట్రలు చేసి దాడిచేశారు. స్వాతంత్ర్యం తరువాత దాదాపు నలభై వేల మంది మత హింస పేరుతో చంపబడ్డారు. మైనారిటీల ఆస్తులు ధ్వంసమైనాయి. స్వాతంత్ర్యం తరువాత మతశక్తులు రాజకీయాల్లోకి ప్రవేశించాయి. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే స్వాతంత్ర్య పోరాటంలో వారి పాత్ర లేకపోగా వాళ్లు బ్రిటిష్ వారికి సేవ చేస్తూ, వారికి బానిసలుగానే ఉన్నారు. రాజకీయాల్లోకి మతాన్ని చొప్పించి దానితో రాజకీయాధికారాన్ని చేజిక్కించుకొనే ప్రయత్నం చేశారు. గాంధీ లాంటి వ్యక్తిని ముస్లింలకు మద్దతు ఇస్తున్నాడని చంపారు.

1980లో బాబ్రీ మసీదు-రామ జన్మభూమి అంశాన్ని పైకి తీసుకురావడంతో మత విద్వేషం తారాస్థాయికి చేరింది. తరువాత అద్వానీ రథయాత్ర, బాబ్రీ మసీద్ కూల్చివేత, గుజరాత్ జీనోసైడ్, ఒడిశాలోని కందమాల్‌లో క్రిస్టియన్‌లపై దాడులతో హిందుత్వ ఫాసిజం టెర్రరిజం వైపు మళ్లింది. అద్వానీని ముందుపెట్టి ఆర్.ఎస్.ఎస్. హిందూ మతోన్మాదాన్ని సమాజంలో ఒక భాగంగా చేసింది. ప్రభుత్వ శాఖల్లో, మరీ ముఖ్యంగా పోలీసు శాఖలో హిందూ మతోన్మాదందే రాజ్యమైంది. మతహింస ఎక్కడ జరిగినా పోలీసులు హిందూ మతోన్మాదులతో ఉండి, ముస్లింలను టార్గెట్ చేశారు. ఏ మతహింస జరిగినా ముస్లింలే టార్గెట్ అయ్యారు.

భారతదేశంలో ఉన్న ప్రధాన పట్టణాల్లో మతహింస జరిగింది. ఇప్పుడు అది ఒక అలవాటుగా మారిపోయింది. ఉత్తరప్రదేశ్‌లో మురాదాబాద్, మీరట్, గోరక్‌పూర్; గుజరాత్‌లో అహ్మదాబాద్, బరోడా; మహారాష్ట్రలో ముంబై; ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్. అంతే కాకుండా మనదేశ రాజధాని ఢిల్లీలో కూడ మత ఘర్షణలు ఒక అలవాటుగా మారిపోయాయి. ఇలాంటి సంఘటనలు మన కళ్లముందే జరిగాయి. అందులో ముఖ్యంగా గుజరాత్ జినోసైడ్ జరిగింది. ఇందులో వేలాది మంది ముస్లింలను చంపేశారు. అహ్మదాబాద్‌లోని గుల్‌బర్గ్ సొసైటీలో ఉంటున్న ఒక సెక్యులర్ ముస్లిం కాంగ్రెస్ మాజీ ఎం.పి ఎహసాన్ జాఫ్రీని చంపి ముక్కలు చేసి తలను వేరు చేసి ఫుట్‌బాల్‌లా ఆడారు. అహ్మదాబాద్‌లో ఉన్న నరోడా పాటియాలో వందలాది మంది ముస్లిం మహిళలపై అత్యాచారం చేసి కాల్చి చంపారు. అక్కడే గర్భవతియైన స్త్రీ గర్భంలోంచి పిండాన్ని కత్తితో పొడిచి తీసి విసిరేశారు.

1992లో ముంబైలో జరిగిన ఘర్షణలపై జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ ఇచ్చిన రిపోర్ట్‌లో హిందూ మతోన్మాదులు ఒక ప్రణాళికా బద్ధంగానే ముస్లింలపై దాడులు చేస్తున్నారని, దానికి పోలీసులు సహకరిస్తూ భాగస్వాములు అవుతున్నారని చాలా స్పష్టంగా చెప్పింది. ముస్లిం ప్రజలు తమను తాము కాపాడుకోవడానికి ఒకవైపు హిందూ మతోన్మాదులతో, మరొకవైపు పోలీసులతో ప్రతిఘటనకు దిగాల్సి వస్తోంది. ఈ మతోన్మాదానికి హిందూ మతోన్మాదం ఒక కారణమైతే, రాజకీయ పార్టీలు మరో ముఖ్య కారణం. కాంగ్రెస్, బిజెపి పార్టీలు తాము అధికారంలోకి రావడానికి మతోన్మాదాన్ని పెంచి, పోషించి, దానికి సహకారం అందిస్తున్నాయి. దీనివల్లనే వారు అధికారంలోకి రాగలుగుతున్నారు. ఓటు బ్యాంకు కోసం అన్ని రాజకీయ పార్టీలు మతాలను ప్రోత్సహిస్తున్నాయి. దీనివల్ల మతఘర్షణలు జరుగుతున్నాయి. జనాభాను మతపరంగా సమీకరిస్తున్నారు. ఇంకొక పెద్ద కుట్ర ఏమిటంటే ఇవన్నీ కూడా ముస్లిం ప్రజలు ఉండే ప్రాంతాల్లోనే జరిగాయి. వీటికి ముఖ్య కారణం ఆయా ప్రాంతాల్లో ఆర్థిక ఆధిపత్యం కోసం జరిగాయి.

మన దేశంలో మత రాజకీయాలు చాలా సంక్లిష్టంగా మారాయి. దీనివల్ల ఈ దేశంలోని ముస్లింలలో ఒక అభద్రతా భావం వచ్చింది. గుజరాత్ జీనోసైడ్‌లో వేలాది ముస్లిం ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అభద్రతకు లోనైన ముస్లిం ప్రజలకు ఇప్పటికీ ఎలాంటి పునరావాస సౌకర్యం ఏర్పాటు చేయలేదు. పోలీసులు కేసు నమోదు చేయలేదు. న్యాయస్థానాలు తమ కర్తవ్యాన్ని పూర్తి చేయలేదు. బాధితులు బిక్కుబిక్కుమంటూ ఇప్పటికీ క్యాంప్‌లలోనే మగ్గుతున్నారు. ఈ దుర్ఘటనతో ప్రపంచవ్యాప్తంగా మన దేశానికి ఉన్న సెక్యులర్ ఇమేజ్‌కి పెద్ద దెబ్బ

తగిలింది. భారత సెక్యులరిజానికి గుజరాత్ జినోసైడ్ మాయని మచ్చగా ఉండిపోయింది. దీని ప్రభావం ముస్లిం ప్రజలపై ఎక్కువగా ఉంది. దీనివల్ల వారి ఆలోచనలూ మారుతున్నాయి. ముస్లిం ప్రజలు భారతదేశంలో బతకాలంటే నిరంతరం ప్రతిఘటిస్తూ జీవించాలనే భావన ఏర్పడింది.

ముస్లింలలోని మిలిటెన్సీని చూసిన తరువాతనే భారత పాలక వర్గాలు భయపడి పునరాలోచనలో పడ్డాయి. దేశంలోని పౌరసమాజంలో మత ఘర్షణలను ఎట్లా అపాలి అన్న అంశంపై చర్చ మొదలైంది. ఇప్పుడున్న చట్టాలను అమలుపరిచి కూడా ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడవచ్చు. దీనికి రాజకీయ నిర్ణయం తీసుకునే శక్తి అవసరం ఉంది. కాని భారత పాలకవర్గాల్లో ఇలాంటి నిర్ణయం తీసుకునే శక్తిలేదు. ఎందుకంటే వీరు ఓటుబ్యాంక్ రాజకీయాలను నడుపుతున్నారు, నమ్ముతున్నారు.

మన దేశంలోని కాంగ్రెస్, బిజెపి పార్టీల వైఖరిని ఇరవై సంవత్సరాల ఒక ముస్లిం మహిళ చాలా చక్కగా ఒక మాటలో చెప్పింది. ఆమె కుటుంబ సభ్యులు అహ్మదాబాద్‌లోని సబర్మతీ జైలులో ఉన్నారు. ఆమె వారిని చూడడానికి వచ్చింది. వాళ్ల కుటుంబ సభ్యులు జైలులో ఉన్నారన్న విషయం నాకు చెప్పింది. ఇప్పుడు కాంగ్రెస్ (2004లో) పార్టీ అధికారంలోకి వచ్చింది కాబట్టి మీ కుటుంబ సభ్యులను విడిచిపెడతారని చెప్పాను. నా మాట విని ఆమె నవ్వింది. 'బిజెపి, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకే నాణానికి బొమ్మా బొరుసూలాంటివి. కాంగ్రెస్ ముస్లింల శవాలను చూపించి రాజకీయాలు చేసి అధికారంలోకి రావాలని చూస్తోంది. బిజెపి ముస్లింలను చూపించి, చంపి అధికారంలోకి రావాలని చూస్తోంది' అని తన జీవిత అనుభవం నుంచి చెప్పింది.

భారత రాజకీయాలను ముస్లిం సాధారణ ప్రజలు అర్థం చేసుకున్నట్లుగా ముస్లిం మధ్యతరగతి అర్థం చేసుకోలేకపోతోంది. అట్లాగే ముస్లిం పాలకవర్గాలు కూడా సాధారణ ముస్లిం ప్రజల పరిస్థితిని అర్థం చేసుకోలేకపోతున్నారు. ఇలాంటి పరిస్థితిలో భారతదేశ గౌరవాన్ని కాపాడుకోవడానికి మత హింస బిల్లును తేవడానికి ప్రయత్నం జరుగుతోంది.

నేషనల్ ఆడ్వయిజరీ కౌన్సిల్ (ఎన్.ఎ.సి.) ఒక బిల్లు ప్రివెన్షన్ ఆఫ్ కమ్యూనల్ అండ్ టార్గెటడ్ వయొలెన్స్ (ఆక్సెస్ టు జస్టిస్ అండ్ రిపార్టేషన్) బిల్ 2011 తయారు చేసింది. ఎన్.ఎ.సి. ప్రభుత్వం కామన్ మినిమం ప్రోగ్రాం చేయడానికి ఏర్పడిన సంస్థ. ఇందులో పద్నాలుగు మంది సభ్యులుగా ఉన్నారు. దీనికి చైర్మన్ సోనియాగాంధి. దీన్ని 2004లో ఏర్పాటు చేశారు. దీని ముఖ్య ఉద్దేశం ముస్లింలలోని అభద్రతను తొలగించి మెజారిటీ మతోన్మాదుల దాడుల నుంచి రక్షణ కల్పించాలి. ఈ బిల్లులో ప్రత్యేకంగా పోలీసులను జవాబుదారీగా ఉండాలని చెప్పారు. మతోన్మాద ఘటనలు జరిగినపుడు కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా కల్పించుకొని మైనారిటీ ప్రజలకు రక్షణ కల్పించాలని ఇందులో పొందుపరిచారు. కాని ఈ బిల్లుపై అన్ని పార్టీలలో విభేదాలు ఉన్నాయి. దేశంలోని జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఈ బిల్లును వ్యతిరేకిస్తూ దానికి కారణం ఆర్టికల్ 355 ప్రకారం రాష్ట్రంలోని ఘటనలను ఆధారం చేసుకొని కేంద్రం కల్పించుకోవడానికి అవకాశముంటుంది. దీనివల్ల అక్కడ అధికారంలో ఉన్న పార్టీలను రాజకీయంగా దెబ్బ తీయడానికి ఉపయోగించుకుంటుందని భయం వ్యక్తం చేస్తున్నారు. బిజెపి వరకు వస్తే ఎస్.సి., ఎస్.టి. బిల్లును, గృహ హింస బిల్లును, ఉమెన్ రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంది. మతహింస బిల్లును అడ్డుకొని మతోన్మాదాన్ని రెచ్చగొట్టి అధికారంలోకి రావాలని చూస్తోంది. అందులో భాగంగానే ఈ బిల్లునూ అడ్డుకుంది. బిజెపి, ఆర్.ఎస్.ఎస్.లకు సామాన్య ప్రజలను గుర్తించడం గాని, వారికి రక్షణ కల్పించడం గాని నచ్చని విషయం. ఎందుకంటే వారి రాజకీయ ఎజెండానే మతోన్మాద పునాదితో కూడుకున్నది. కాబట్టి సామాన్య ప్రజల అవసరాలు వారికి పట్టవు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కూడా ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నారు.

దీనికి మూలకారణం ఏదో కారణంతో కేంద్రం ముఖ్యమంత్రులను మారుస్తుందని భయపడుతున్నారు. మతహింస బిల్లును అమలు చేయాడనికి ఇదే సరైన సమయం. దానిపైన వచ్చే అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వం నివృత్తి చేయాలి. ఈ బిల్లు పేరులో మత హింస బిల్లు అని ఉందిగాని ఇది ఎస్.టి., ఎస్.సి. అట్రాసిటీ బిల్ లాగానే మైనారిటీలకు రక్షణనిస్తుంది. ఎందుకంటే ఈ బిల్లులో కమ్యూనల్, నిర్దేశిత హింస రెండు అంశాలు వచ్చాయి. దీని ప్రభావ పరిధి ఎక్కువగా ఉంటుంది. ఈ బిల్లు వల్ల వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న అభ్యంతరాలను తొలగించి, పార్లమెంట్ దీనిపై చర్చ పెట్టి దాన్ని అమలులోకి తేవాలి. అప్పుడే మైనారిటీ ప్రజలకు భారత ప్రభుత్వం పై నమ్మకం ఏర్పడుతుంది.

హిందూ మతోన్మాద శక్తులు మతోన్మాదాన్ని రెచ్చగొట్టి 2014లో అధికారంలోకి రావడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగానే ఉత్తర భారతదేశంలో ఉత్తరాఖండ్‌లోని రుద్రాపూర్, మహారాష్ట్రలోని పూసత్, రాజస్థాన్‌లోని భరత్‌పూర్, గోపాల్‌గడ్‌లలో హిందూ మతోన్మాద శక్తులు ముస్లింలపై దాడిచేసి ఖురాన్‌ను తగులబెట్టి దాదాపు 20 మంది ముస్లింలను చంపివేశారు. దక్షిణ భారతదేశంలో అదిలాబాద్ జిల్లాలోని వటోలిలో ముస్లింలను కాల్చిచంపారు. మెదక్ జిల్లాలోని సిద్ధిపేటలో ఖురాన్‌ను చింపి కాల్చివేశారు. మతోన్మాద హింసను నిరోధించడానికి ఈ బిల్లు ఉపయోగపడుతుంది.

ఈ బిల్లులో ప్రత్యేక సెక్షన్ పెట్టి సాయుధ బలగాలను, మత ఘర్షణలు జరిగిన ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రి, హోం మంత్రులను బాధ్యులను చేస్తూ, క్రిమినల్ నెగ్లిజెన్సీ కింద కేసు నమోదు చేసి వారిపై చర్య తీసుకోవాలని ఈ బిల్లులో చేర్చినపుడే ఈ బిల్లుకు బలం చేకూరుతుంది. ఇప్పుడున్న భారతదేశంలో మతోన్మాదం ఫాసిజాన్ని దాటి టెర్రరిజంగా మారిపోయింది. ఈ బిల్లును త్వరగా తెస్తే మైనారిటీల జీవితాలకు కొంత భరోసా ఇచ్చినట్లు అవుతుంది. దీనివల్ల వారికి కొంత న్యాయం జరిగే అవకాశం ఉంటుంది. ఈ బిల్లు వల్ల భారత రాజ్యాంగంలోని గౌరవప్రదమైన జీవించే హక్కును కాపాడుకోవచ్చు. ఎన్ని చట్టాలు తీసుకువచ్చినా అవి అమలు చేసినప్పుడే వాటి ఫలితాలు ఉంటాయి. లేకుంటే ఇప్పుడు ఉన్న చట్టాల మాదిరిగానే కాగితాలకే పరిమితమవుతాయి. ఈ చట్టాలను అమలు చేయక పోవడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా దేశంపట్ల గౌరవం పోతుంది. ఇటువంటి చట్టాలను అమలు పరచకపోతే ప్రజలకు రాజ్యాంగంపై విశ్వాసం సన్నగిల్లి తమను తాము రక్షించుకోవడానికి ప్రతిఘటనకు సిద్ధమవుతారు.

(రచయిత జనరల్ సెక్రటరీ, సివిల్ లిబర్టీస్ మానిటరింగ్ కమిటీ, ఇండియా) వీ

తాను స్వయంగా రాజకీయ పార్టీ ఏర్పాటు చేసినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో విలీనం అయ్యే దాకా వ్యక్తమైన చిరంజీవి అజ్ఞానాన్ని, ఆత్మహత్యాసదృశ రాజకీయాలను వివరిస్తున్నారు **ఎస్. కిశోర్ కుమార్**

సామాజిక న్యాయం నుంచి సమాజ ద్రోహం వరకు..

1993లో విడుదలైన 'ముఠామేస్త్రి' చిత్రం నుంచి 2003లో విడుదలైన 'ఠాగూర్' చిత్రం వరకు సినీనటుడు చిరంజీవి రాజకీయరంగ ప్రవేశం గురించి రాష్ట్రంలో విస్తృతస్థాయిలో ఊహాగానాలు, చర్చలు జరిగాయి. మొత్తానికి చిరంజీవి రాజకీయరంగ ప్రవేశం నిజమైంది. అయితే మరో ఐదేళ్ల సమయం పట్టింది. పదిహేనేళ్ల సుదీర్ఘకాల ఊహాగానాలకు తెరదించుతూ 2008 సంవత్సరం ఆగస్టు 22న తన 53వ పుట్టినరోజు నాడు తాను రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నట్లు చిరంజీవి స్వయంగా, అధికారికంగా ప్రకటించారు. ఆ తరువాత నాలుగు రోజులకు అంటే ఆగస్టు 26న (రాష్ట్ర శాసనసభకు, లోక్‌సభకు జరుగబోయే ఎన్నికలకు సరిగ్గా ఏడు నెలల ముందు) కలియుగదైవంగా పిలిచే శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన, భక్తజనకోటి ఆధ్యాత్మిక మనోభావాలకు నిలయమైన తిరుపతి పట్టణంలో లక్షలాదిమంది ప్రజల సమక్షంలో 'సామాజిక న్యాయం' ప్రధాన ధ్యేయంగా 'ప్రజారాజ్యం' పేరుతో చిరంజీవి ఓ నూతన పార్టీని అట్టహాసంగా ప్రారంభించారు.

అయితే ఆ పార్టీ ఆవిర్భావానికి దాదాపు ఐదారు నెలల ముందు నుంచే చిరంజీవి శ్రేణులు పూర్తిస్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్ పార్టీ నిర్మాణానికి అవసరమైన రాజకీయ కార్యకలాపాలు తెరవెనుక జోరుగా సాగించాయి. అందులో భాగంగా అవగాహన సదస్సులను నిర్వహించడం, ఓటరు నమోదు కార్యక్రమాలు చేపట్టడం, యువతను ఆకర్షించడం, విరామ రాజకీయ నాయకులను, విరామ ఉన్నతాధికారులను, అనుభవ మేధావి వర్గాన్ని కూడగట్టడం, ఇతర పార్టీల నుంచి విస్తృతంగా వలసలను ప్రోత్సహించడం వంటివి అనేకం జరిగాయి. ఈ సందర్భంగా ఆనాడు రాష్ట్ర శాసనసభలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న తెలుగుదేశం పార్టీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్నతస్థాయి నాయకగణం చిరంజీవి సరసన చేరింది. ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం సందర్భంగా చిరంజీవి చేసిన తొలి రాజకీయ ఉపన్యాసం ఆశించిన స్థాయిలో ఏమాత్రం లేదు. అయినప్పటికీ సినీనటుడుగా రాష్ట్రంలో చిరంజీవికున్న 'మెగాస్టార్' ఇమేజ్‌పై నమ్మకంతో వివిధ పార్టీల నుంచి ఆ పార్టీలోకి వలసల పరంపర కొనసాగింది. ఈ వలసల వలన నాటి అధికార కాంగ్రెస్ పార్టీతో పోలిస్తే ఎక్కువ శాతం నాయకగణాన్ని కోల్పోయింది కేవలం ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ మాత్రమే.

చిరంజీవి రాజకీయరంగ ప్రవేశానంతరం చేసిన ప్రసంగాలు కూడా ప్రజలను ఏమాత్రం ఆకట్టుకోలేదు. సినిమా డైలాగుల తరహాలో సాగిన ఆ ప్రసంగాలు చిరంజీవి రాజకీయ అజ్ఞానాన్ని పూర్తిగా బయటపెట్టాయి. అంతేకాదు, చిరంజీవి తన సుదీర్ఘకాల సినీజీవితంలో ఎన్నడైనా జనసామాన్యుల జీవితాలను గాని, వార్తాపత్రికలను గాని కాస్తంతైనా లోతుగా పరిశీలించాడా? అనే సందేహం కూడా రాకపోలేదు. చిరంజీవికి రాజకీయాల పట్లగాని, సామాజిక అంశాలపట్లగాని, జనసామాన్యం దైనందిన సమస్యల పట్ల గాని, ఆనాటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపడుతున్న పథకాల పట్ల గాని, ప్రభుత్వపాలన సంబంధిత అంశాల పట్ల గాని ప్రాథమికస్థాయి అవగాహన కూడా లేదనే విషయం ఆయన ప్రసంగాల్లో స్పష్టంగా కనిపించింది. ఈ విషయంలో ఆయన అనేక ప్రశ్నలను కూడా ఎదుర్కొన్నారు. ఆ ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ, బ్లడ్‌గ్రూపుల గురించి తెలియని తాను కేవలం ప్రజలకు సేవచేసే ఉద్దేశ్యంతో బ్లడ్‌బ్యాంక్ నడుపుతున్నానని, అలాగే రాజకీయాల పట్ల తనకు అవగాహన లేకపోయినప్పటికీ రాజకీయ జీవితం ద్వారా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం మాత్రం ఉందని చెప్పారు.

ఇక్కడ ఒక పూర్వ సంఘటన గురించి చర్చించాల్సిన అవసరముంది. చిరంజీవి రాజకీయరంగ ప్రవేశానికి కొద్దికాలం క్రితం సునీతా నారాయణ్ అనే ఓ మహిళా సైంటిస్టు ఓవైపు సమాజశ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని, దేశంలోని బహుళజాతి కంపెనీలు తయారుచేసే శీతలపానీయాలలో పురుగుమందుల అవశేషాలు ఉన్నాయని ప్రకటించి, వాటికి వ్యతిరేకంగా ఆమె చట్టబద్ధపోరు సాగిస్తుంటే, మరోవైపు చిరంజీవి కనీస సామాజిక బాధ్యతను మరచి 'థమ్స్అప్' అనే వాణిజ్య ప్రకటనలో కనిపించారు. అందులో శీతలపానీయాలకు వత్తాసు పలుకుతూ, తాను స్వయంగా ప్రయోగశాలలో వాటి నాణ్యతను పరీక్షించినట్లు చెప్పారు. పైగా వాటిపై ప్రజలకు భరోసా ఇచ్చారు. వాటి వినియోగాన్ని ఆయన ప్రోత్సహించారు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే బ్లడ్‌బ్యాంక్‌ను నిర్వహిస్తూ బ్లడ్‌గ్రూపుల గురించి అవగాహన లేని చిరంజీవికి ప్రయోగశాలల్లో చేసే రసాయనిక పరీక్షలపై అంత స్పష్టమైన అవగాహన ఎక్కడి నుంచి వచ్చింది? కేవలం డబ్బుకు ఆశపడి ప్రజలను తప్పుదోవ పట్టించే ఆ ప్రకటనలో నటించినందుకు సమాజంలో బాధ్యతగల స్థాయిలో ఉన్న చిరంజీవి ఆనాడు సామాజిక కార్యకర్తల నుంచి, ప్రజాసంఘాల నుంచి, వామపక్షాల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. చివరకు చిరంజీవి తన భవిష్యత్ రాజకీయ జీవితాన్ని దృష్టిలో ఉంచుకొని, విమర్శలకు జడిసి, వ్యక్తిగత అవసర నిమిత్తం ఆ వాణిజ్య ప్రకటన నుంచి బలవంతంగానైనా తప్పుకోక తప్పలేదు. నిస్వార్థ ప్రజాసేవపై, సేవాసంకల్పంపై చిరంజీవికున్న చిత్తశుద్ధికి ఇది ఒక మచ్చుతునక.

రాజకీయ జీవితం ద్వారా ప్రజాసేవ చేయాలనే చిరంజీవి సంకల్పం ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్నికల వరకు కేవలం అధికార దాహానికే పరిమితమైంది. అందుకే ఆ ఏడు నెలల వ్యవధిలో

చిరంజీవి కేవలం ఎన్నికల ప్రచారానికి, అంతర్గత రాజకీయ వ్యవహారా లకు మాత్రమే అంకితమయ్యారు. ఆ సమయంలో ఓపక్క ప్రజారాజ్యం పార్టీలోకి భారీగా చేరికలు జరుగుతుండగా మరోపక్క ఆ పార్టీలో స్వల్పకాల వ్యవధిలో ఎదుర్కొన్న చేదు అనుభవాల దృష్ట్యా తీవ్రవిమర్శలు చేస్తూ పార్టీ నుంచి కొద్దిమంది కీలక వ్యక్తుల నిష్క్రమణ కూడా జరిగింది. ఈ పరిణామం పార్టీకి ఆదిలోనే నష్టదాయకమైంది. పైగా, పార్టీలో వ్యాపారాత్మక ధోరణి తీవ్రంగా ఉందనే విమర్శలు కూడా వెల్లువెత్తాయి. అయినప్పటికీ పార్టీలోగాని, పార్టీ అధినాయకులలో గాని పశ్చాత్తాప ధోరణి, అభద్రత వంటివి కనిపించలేదు. విమర్శలను గాలికొదిలేయడమే ఏకైక ప్రత్యామ్నాయ చర్యగా పాటించారు. సుదీర్ఘకాలంగా చిరంజీవి రాజకీయరంగ ప్రవేశం గురించి ఎదురుచూసిన ప్రజలకు ఇవన్నీ నిరుత్సాహాన్ని కలిగించాయి. ఆనాటికి రాష్ట్రంలో రాజకీయ మెగాస్టార్స్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి, చంద్రబాబునాయుడులను ఎదుర్కోవడం కూడా ఈ సినీ మెగాస్టార్‌కు పెద్ద సవాల్‌గా మారింది.


ఈ క్రమంలో పిఆర్‌పి ప్రకటించిన ఎన్నికల మానిఫెస్టో కూడా ప్రజలను పెద్దగా సంతృప్తి పరచలేదు. పార్టీ ఆవిర్భావం నాటి నుంచీ ఊహించిన విజయావకాశాలు అంచెలంచెలుగా సన్నగిల్లుతున్న విషయం స్పష్టమవుతున్నప్పటికీ అధికారమే ఏకైక లక్ష్యంగా బరిలోకి దిగిన పిఆర్‌పి చివరకు గుడ్డిగా అనూహ్య విజయంపై ఆశలు పెట్టుకుంది. మరో ముఖ్యవిషయం, 2001 నాటి నుంచి నేటి వరకూ రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ పుట్టుకొచ్చినా అపరిష్కృతంగా ఉన్న తెలంగాణ సమస్యపై తమ వైఖరి తెలుపాల్సిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. ప్రజారాజ్యం పార్టీ ఇందుకు మినహాయింపు కాలేదు. ఫలితంగా, తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవిస్తూ ప్రజారాజ్యం పార్టీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా వ్యవహరిస్తుందని చిరంజీవి ప్రకటించారు. అంతేగాకుండా, ప్రాంతాలుగా విడిపోయినప్పటికీ తెలుగు వారందరూ మానసికంగా ఒకటిగానే ఉంటారని అన్నారు. అందుకు ఉదాహరణగా చిరంజీవి తన కుటుంబాన్ని చూపించారు. ఒకప్పుడు అవసరరీత్యా తన కుటుంబ సభ్యులందరూ విడిపోయి వేర్వేరు ప్రాంతాలలో నివసించినప్పటికీ తామంతా ఎల్లప్పుడూ మానసికంగా కలిసే ఉన్నామని ఆయన చెప్పారు. తనపట్ల ప్రజల విశ్వాసాన్ని కోరుతూ తెలంగాణపై తన చిత్తశుద్ధిని చిరంజీవి ఆ విధంగా ప్రజల ముందుంచారు.

2009 ఏప్రిల్–మే నెలలో రాష్ట్ర శాసనసభకు, లోక్‌సభకు జరిగిన ఎన్నికలలో ప్రజారాజ్యం పార్టీ ఒంటరిగా బరిలోకి దిగింది. కడకు, శత్రుపక్షాలు కూడా ఊహించనంత ఘోరంగా ఆ పార్టీ ఓటమి పాలైంది. తెరపై నటుడిగా ముప్ఫై సంవత్సరాల సినీజీవితంలో నిస్సందేహంగా శ్రమించి సంపాదించిన ప్రజాభిమానాన్ని కేవలం స్వల్ప వ్యవధిలో తన రాజకీయ జీవితానికి అనుకూలంగా మార్చుకోడానికి, తద్వారా అధికారంలోకి రావడానికి చిరంజీవి చేసిన ప్రయత్నాలు, వేసిన కల్పిత అంచనాలు ఊహకు తోచనంత అపజయాన్ని అందించాయి. ప్రజారాజ్యం పార్టీ కేవలం 18 శాసనసభ స్థానాలను మాత్రమే గెలుచుకుని తృతీయస్థానంలో నిలిచింది. శాసనసభలో ద్వితీయ ప్రతిపక్ష హోదా దక్కించుకుంది. అయితే, ప్రజాసేవ సంకల్పమున్న చిరంజీవి అధికార కాంక్షకు ప్రతిపక్ష స్థానంలో కూడా ప్రజాసేవకు అత్యున్నత అవకాశముందని స్ఫురించలేదు. అందుకే, 2009లో జరిగిన ఎన్నికల ఫలితాలు వెల్లడైన మరుక్షణం నుంచి ప్రజారాజ్యం పార్టీ అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూల లేదా అనుబంధ లేదా మిత్రపక్ష లేదా భవిష్యత్‌లో ఆ పార్టీలో విలీనమయ్యే పార్టీ అనే బలమైన ఊహాగానాలు, మీడియా కథనాల మధ్య ఊగిసలాడింది. చివరకు అవన్నీ నిజమయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర శాసనసభలో ఓ ప్రతిపక్ష పార్టీ హోదా ధర్మాన్ని పిఆర్‌పి ఎన్నడూ హృదయపూర్వకంగా నిర్వహించలేదు. అంతేగాకుండా, ప్రజారాజ్యం పార్టీ మానసిక ధోరణిపై వచ్చిన మీడియా కథనాలను నిజం చేస్తూ ఆ పార్టీ అధికార కాంగ్రెస్ పార్టీలో త్వరలో విలీనమవు తుందని 6 ఫిబ్రవరి 2011న చిరంజీవి ప్రకటించారు. 2009 ఎన్నికల అనంతరం రాష్ట్ర శాసనసభలో 18 మంది ఎం.ఎల్.ఎ.ల బలంతో ప్రతిపక్ష హోదా పొందిన నాటి నుంచి ప్రజారాజ్యం పార్టీ అధికార కాంగ్రెస్ పార్టీలో విలీనం అవుతుందని చిరంజీవి ప్రకటించిన రోజు వరకు సుమారు ఇరవై నెలల కాలంలో ప్రజారాజ్యం పార్టీ ప్రజా సమస్యలపై ప్రభుత్వంతో పోరాడి సాధించిన ఘనవిజయాలు శూన్యం.

పైగా, తెలంగాణ ప్రజలకు ఎదురైన రాజకీయ ద్రోహులలో చిరంజీవి ఒకడుగా నిలిచారు. ఎన్నికల ముందు తెలంగాణ ఏర్పాటుకు అనుకూలమని చెప్పిన చిరంజీవి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నామని 9 డిసెంబర్ 2009న కేంద్ర హోంశాఖ మంత్రి పి. చిదంబరం ప్రకటించిన మరుదినమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పట్ల చిరంజీవి తన వ్యతిరేకతను వ్యక్తం చేశారు. ఈ విషయంలో తెలంగాణ ప్రజలకు కనీసం వివరణ ఇవ్వాలన్న సంస్కారాన్ని కూడా ఆయన మరిచారు. ఇంకా, కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలపై విరక్తితోనో, 'మెగాస్టార్' చిరంజీవిపై అభిమానంతోనో ప్రజారాజ్యం పార్టీకి అండగా నిలిచిన 70 లక్షల ఓటర్లకు చిరంజీవి ప్రత్యక్షంగా మెగా విలన్ రూపంలో దర్శనమిచ్చారు. గత 28 సంవత్సరాలుగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రధాన శత్రువైన తెలుగుదేశం పార్టీ నుంచి అత్యధిక సంఖ్యలో ప్రజారాజ్యం పార్టీలోకి వలస వచ్చిన నాయకగణంతో సహా, రాష్ట్రవ్యాప్తంగా చిరంజీవిని నమ్ముకుని భారీ అంచనాలతో ప్రజారాజ్యం పార్టీలో చేరిన వారందరికీ నూటపాతిక సంవత్సరాల చరిత్రగల కాంగ్రెస్ పార్టీ గొడుగు కింద నీడ కల్పిస్తూ 22 ఆగస్టు 2011న తన 56వ జన్మదినం నాడు చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్ పార్టీలో అధికారికంగా విలీనం చేశారు.

ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం నుంచి ముఖ్యంగా ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీపై, ఆ పార్టీ నాయకులపై, ఆ పార్టీ సుదీర్ఘకాల పరిపాలనపై తీవ్ర విమర్శలు చేసిన చిరంజీవి చివరకు ఆయన పార్టీని కాంగ్రెస్ పార్టీలోనే విలీనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో ఉన్నందుకు గర్వపడుతున్నానని ప్రకటించారు. అందుకు స్ఫూర్తిదాయకమైన కారణం మాత్రం చెప్పలేదు. ఎందుకంటే మెగాస్టార్ డైలాగులకు స్క్రిప్టు ప్రధాన ఆధారం కనుక. సెప్టెంబర్ 25న 'ఉత్తరాంధ్ర కాంగ్రెస్ గర్జన' పేరిట విశాఖపట్నంలో జరిగిన ప్రజారాజ్యం ప్రాంతీయ విలీన సభలో కూడా చిరంజీవి ఇదే అకారణ, విచిత్ర ధోరణిని కొనసాగించారు. కాంగ్రెస్ పార్టీలో చేరడం తన అదృష్టంగా భావిస్తున్నా నన్నారు. సోనియా గాంధీ సూచన మేరకే ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశానని చాలా సులభంగా చెప్పారు. ప్రజారాజ్యం పేరుతో పుట్టుకొచ్చిన పార్టీకి సోనియాభీష్టం ముందు ప్రజాభీష్టం అప్రధానంగా కనిపించింది. అందుకేనేమో, కాంగ్రెస్ పార్టీ మనకేమి ఇచ్చిందని కాకుండా కాంగ్రెస్ పార్టీకి మనమేమి ఇచ్చాం అనే విధంగా పనిచేయాలని చిరంజీవి ఆయన అనుచర గణానికి హితబోధ చేశారు. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు పార్టీలకే పరిమిత మయ్యాయి కాని, ప్రజలు మనకేమిచ్చారు, ప్రజలకు మనమేమిచ్చాం అనే మాటలు మాత్రం కరువయ్యాయి.

తుమ్మల వేణుగోపాల రావు



ప్రముఖ విద్యావేత్త, సాహితీప్రియుడు, ఆంధ్ర విశ్వ విద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ తుమ్మల వేణుగోపాలరావు సెప్టెంబర్ 21న మధ్యాహ్నం కన్నుమూశారు. ఆరేళ్లుగా ఆయన అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్నారు. వేణుగోపాల రావు కృష్ణా జిల్లా ఘంటసాలపాలెం లో 1928 ఫిబ్రవరి 29న పుట్టారు. కాకినాడ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్, ఖరగ్‌పూర్ ఐఐటిలో ఎం.టెక్ చేసి ఆంధ్రా యూనివర్సిటీలో అధ్యాపకులుగా చేరారు. తరువాత అమెరికాలో ఎం.టెక్ చేసి తిరిగి ఎ.యు.లో చేరి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. విజయవాడ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు సిఆర్ ఇంజనీరింగ్ కళాశాలల వ్యవస్థాపక ప్రిన్సిపాల్‌గాను, కోనేరు లక్ష్మయ్య ఇంజనీరింగ్ కళాశాల, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గాను వేణుగోపాలరావు వ్యవహరించారు. వామపక్ష రాజకీయ అభిమానిగా, హేతువాదిగా ఆయన ఎన్నో సామాజిక, సాహిత్య కార్యకలాపాలలో భాగం పంచుకున్నారు. తెలుగు సాహిత్యాన్ని ఒక మలుపు తిప్పిన శ్రీశ్రీ షష్టిపూర్తి సన్మాన సంఘంలో (1970) కీలక బాధ్యుడిగా వ్యవహరించారు. శ్రీశ్రీ, కాళోజీ నారాయణరావు, కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి, చెరబండరాజు తదితరులతో సన్నిహితంగా మెలిగారు. విప్లవ రచయితల సంఘానికీ, విప్లవ సాహిత్యోద్యమానికీ, విప్లవ ప్రజాసంఘాలకూ అనేక రకాల చేయూతనందించారు. విశాఖ పౌరహక్కుల సంఘం, భారత నాస్తిక సమాజం, విశాఖ ఫిలిం సొసైటీ 'ఛాయ'లకు వెన్నుదన్నుగా ఉన్నారు. 1975 ఎమర్జెన్సీ కాలంలో నిర్బంధానికి గురయ్యారు. ఎమర్జెన్సీ తరువాత విజయవాడ కేంద్రంగా పనిచేస్తూ తమ ఇంటి దగ్గర వారం వారం సాహితీమిత్రుల గోష్ఠి నిర్వహించారు. మార్క్సిజం తరఫున త్రిపురనేని మధుసూదన రావుకు రాడికల్ హ్యూమనిజం తరఫున రావిపూడి వెంకటాద్రికి మధ్య జరిగిన చరిత్రాత్మక చర్చకు అధ్యక్షత వహించారు. తన భౌతికకాయాన్ని విద్యార్థుల ఉపయోగార్థం ఆంధ్ర మెడికల్ కళాశాలకు అందజేయాలని కోరారు.

ఎన్నికలలో ప్రజారాజ్యం పార్టీ ఓటమి వెనుక ఉన్న తప్పులను తెలుసుకుని సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నామని చిరంజీవి చెప్పారు. బహుశా కాంగ్రెస్ పార్టీలో విలీనం అందులో భాగమని చిరంజీవి ప్రజలకిచ్చిన సంకేతపూర్వకమైన సందేశం కావచ్చు. ప్రజల కోసం పోరాడలేని తన నిస్సహాయతను చిరంజీవి గొప్పగా వర్ణించుకున్నారు. చివరకు స్వచ్ఛమైన ప్రజాభిమానానికి వంచనతో కూడిన గుణపాఠం బహుమానమైంది. వాస్తవానికి చిరంజీవి మార్గాన్ని లేదా చర్యని దేశంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ ఆదర్శంగా తీసుకుంటే కడకు ప్రజాస్వామ్య దేశంలో మిగిలేది ఏకస్వామ్య రాజకీయా లు, మితిమీరిన నియంతృత్వం మాత్రమే. అదృష్టవశాత్తూ దేశంలో ప్రజల పక్షాన నిలబడి సుదీర్ఘకాలంగా నిరంతరం శక్తిసామర్థ్యాలను కూడగట్టుకుంటూ అణచివేసే ప్రభుత్వాలపై పోరాడే పార్టీలు ఉన్నందుకు గర్వపడాలి. వాటిని నిజమైన హీరోలుగా అభిమానించాలి, ఆరాధించాలి.

కేవలం మూడు సంవత్సరాల కాలం మాత్రమే జీవించిన ప్రజారాజ్యం పార్టీ, ఒక పార్టీ నుంచి మరొక పార్టీకి నాయకగణాన్ని, ఓటు బ్యాంకును బదలాయించడానికి ఒక అప్రజాస్వామిక, అనైతిక వారధిగా నిలిచింది. ప్రజల దృష్టిలో ప్రజల కోసం ఓ 'పనికిరాని పార్టీ'గా అంతమొందింది. సామాజిక న్యాయం అనే తమ నినాదం సైద్ధాంతికం కాదని, అది కేవలం అలంకారప్రాయమని నిరూపించింది. కాంగ్రెస్ పార్టీకి భారీగా లబ్ది చేకూర్చింది. అందుకు చిరంజీవికి దక్కిన ప్రతిఫలం గురించి ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావానికి సాక్ష్యంగా నిలిచిన, ఏడు కొండల పైన కొలువైన 'వడ్డీకాసుల' వాడినే అడగాలి. అయితే, చివరకు చిరంజీవి నుంచి ప్రజలకు, ప్రజాస్వామిక విలువలకు దక్కింది ద్రోహమే.

ఇక్కడ ఒక విషయం ప్రస్తావించాలి. తమిళనాట పురట్చి తలైవర్ (విప్లవ నాయకుడు) అని ప్రజలు ముద్దుగా పిలుచుకునే నటుడు ఎం.జి. రామచంద్రన్ (ఎంజిఆర్) సుమారు 60 సంవత్సరాల క్రితం రాజకీయాల్లోకి రావాలనుకున్నప్పుడు, రాజకీయజీవనం 'నల్లేరుపై నడక' కాదని తెలిసిన తమిళనాడు ప్రాంతీయపార్టీ ద్రావిడ మున్నేట్ర కళగం (డిఎంకె) వ్యవస్థాపకుడు సి.ఎన్. అణ్ణాదురై, ప్రాచీన చైనా తత్త్వవేత్త, టావోయిజం స్థాపకుడైన లావో ట్జు రచించిన 'బుక్ ఆఫ్ ది వే' అనే గ్రంథం నుంచి సంగ్రహించిన అత్యంత ఇష్టమైన ఓ సూక్తిని ఆయనకు పంపించారు. ఇదీ ఆ సూక్తి సందేశం... ప్రియ సోదరుడా, ప్రజాసేవలో మమేకం అయేందుకు 'ప్రజల వద్దకు వెళ్లు, వారితో కలసి జీవించు, వారి నుంచి నేర్చుకో, వారిని ప్రేమించు, వారికి సేవ చేయి, వారితో ప్రణాళికలు రూపొందించు, వారికేమి తెలుసునో అక్కడ నుంచి ప్రారంభించు, వారికేమి ఉందో ఆ పునాదిపైనే నిర్మించు'. ఈ సూక్తిని ఆచరించిన ఎంజిఆర్ అక్కడ తిరుగులేని ప్రజా నాయకుడుగా ఎదిగారు. అంతేగాకుండా, ఆంధ్రప్రదేశ్‌లో 1982లో తెలుగుదేశం పేరుతో పార్టీ స్థాపించి కేవలం తొమ్మిది నెలల కాలంలోనే అధికారంలోకి వచ్చిన ఎన్.టి. రామారావుకు కూడా ఎంజిఆర్ ఆదర్శం, స్ఫూర్తి అంటుంటారు. వాస్తవానికి రాజకీయజీవనం గడుపుతున్న ప్రతి వ్యక్తికి ఈ సూక్తిలోని సారం సహజ లక్షణంగా ఉండాలి. అయితే ప్రత్యక్షంగా ఈ సూక్తి సారానికి గాని లేదా చిరంజీవి పార్టీకి ఆదర్శమూర్తులైన, ఆచరణలో అక్షరాల ఈ సూక్తికి సమస్థాయిలో తమ జీవితకాలం ప్రజాసేవలో మునిగిపోయిన మహాత్మాగాంధీ, బి.ఆర్. అంబేద్కర్, మదర్‌థెరిస్సా, జ్యోతీరావుపూలేల ఆశయాలకు గాని కనీసం కొంతమేరకైనా న్యాయం చేకూర్చే శక్తి, శ్రద్ధాసక్తి, ఓపిక మూడు సంవత్సరాల చిరంజీవి రాజకీయ ప్రయాణంలో ఎక్కడా కనిపించలేదు. ఇక చిరంజీవి రాజకీయ జీవితం కొనసాగుతుందా అనేది అనుమానాస్పదమే! వీ

(రచయిత పాత్రికేయులు)

ప్రాంతాల మధ్య, సమాజాల మధ్య, కుటుంబంలోని వ్యక్తులమధ్య ఉండే గుణాత్మకమైన తేడాలతో నిమిత్తం లేకుండా, వారి అభివృద్ధితో సంబంధం లేకుండా భూసేకరణ బిల్లు రూపొందిందని అంటున్నారు **ముదునూరి భారతి**

భూసేకరణ చట్టం-2011: నేపథ్యం

గత అరవై ఐదు సంవత్సరాలుగా భారత ఆర్థిక వ్యవస్థని అభివృద్ధి చేసే పేటిట ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. మిగతా వెనుకబడిన దేశాల లాగానే మన దేశాన్ని కూడా ఒక సాంప్రదాయ వ్యవస్థగా గుర్తించడం జరిగింది. మన వ్యవసాయ కేంద్ర సాంప్రదాయ వ్యవస్థని పరిశ్రమల కేంద్ర ఆధునిక వ్యవస్థగా మార్చడానికి పెట్టుబడి – అంటే ధన రూపంలో కాని, జ్ఞాన రూపంలో కాని, టెక్నాలజీ రూపంలో కానీ – ఒక్కటే మనకున్న ఏకైక మార్గమని భావించి అనేక పథకాలు రూపొందించడం జరిగింది. ఈ ప్రతిపాదన ఫలితంగా పెద్ద పెద్ద డ్యాంలు, ఉక్కు పరిశ్రమల నిర్మాణం, సేవారంగంలో విద్య, వైద్యం, ప్రయాణ సౌకర్యాలు మొదలైన సదుపాయాలు కల్పించడంలో, సమాజం అనేక మార్పులకు లోనై ఒక కొత్త ఆధునిక సమాజం ఆవిర్భవించగలదనే ఊహ మన దేశ నేతృత్వానికి బలంగా ఉండేది. అంతేకాకుండా, గత రెండు దశాబ్దాలలో, ఈ అభివృద్ధి క్రమాన్ని వేగవంతం చేసే ప్రయత్నంలో, ప్రపంచీకరణ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ రంగంలో కార్పొరేట్ వ్యవసాయం, పరిశ్రమల రంగంలో ప్రత్యేక ఆర్థిక మండలాలు, సేవారంగంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధారంగా పనిచేసే అనేక సంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రులు, కార్పొరేట్ విద్యా సంస్థలు, ఆధునిక విమానాశ్రయాలు, ఆధునిక ప్రయాణ సౌకర్యాలు మొదలైన ఎన్నో ప్రయోగాలు సమాజంలో చోటు చేసుకున్నాయి. ఇటువంటి పారిశ్రామికీకరణ దశలో మన సమాజంలో ఉత్పత్తులు స్థానిక ప్రజల అవసరాల కోసం కాకుండా, భారీ ఉత్పత్తుల ఆధారంగా బయటి దేశాలకు ఎగుమతులు చేయగలిగే శక్తి, సామర్థ్యం రావడం, దాని వలన మన దేశం కూడా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భాగమై, అమెరికా, ఇంగ్లండ్ లాంటి మిగతా దేశాలలాగా మన దేశం కూడా అభివృద్ధి చెందిపోతుంది అనే ఊహ మన దేశ ప్రముఖ ఆర్థికవేత్తలకి కూడా బలంగా ఉంది.

ఈ ప్రయత్నాలన్నింటికీ ఒక ముఖ్యమైన పోలిక ఏమిటంటే, వీటన్నింటి స్థాపనకి అత్యంత ముఖ్య వనరు భూమి కావడమే. ఇక్కడ ఇంకొక ముఖ్య విషయం, సాంప్రదాయ వ్యవస్థలో లాగా కాకుండా ఆధునిక వ్యవస్థలో ఈ భూమి అనే వనరుకు ఒకటి కాకుండా అనేక ఉపయోగాలు ఉండడంతో భూమికి ఒక ప్రత్యేకమైన విలువ రావడమే కాకుండా దాని విలువ మార్కెట్టు ఆధారితమవడంతో విపరీతంగా పెరిగిపోయింది. నయానో, భయానో, లోకకళ్యాణం కోసమనో ఏదో కారణంగా స్థానిక ప్రజల నుండి వారి భూములను తీసివేసుకోవడం, వారు నిర్వాసితులై నిరాధారులుగా మారిపోవడం జరిగింది. గత 65 సంవత్సరాలలో జరిగిన అత్యంత శక్తిమంతమైన పారిశ్రామికీకరణ ద్వారా అభివృద్ధి చేసే ఈ క్రమం సమాజాన్ని పూర్తిగా కుదిపి వేయడం కాక, ఈ నిర్వాసిత ప్రజలు తమ జీవనాధారమైన భూమి, నీరు, అడవి లాంటి వనరులను పోగొట్టుకోవడం, దానితో తమ జీవనాధార మైన నైపుణ్యం, దానికి సంబంధించిన జ్ఞానాన్ని కూడా పోగొట్టుకోవడం జరిగింది. ఇంక వీరికి మిగిలింది కొత్తగా ఆవిర్భవిస్తున్న నూతన సమాజంలో ప్రత్యామ్నాయ అవకాశాలు. ఇది భారీ పెట్టుబడులు, అధిక సాంకేతిక నైపుణ్యతతో కూడిన పారిశ్రామికీకరణ అవడంతో నిర్వాసిత ప్రజలకు దీనిలో స్థానం లేకపోయింది. వీరు కొత్త సమాజంలో అభివృద్ధి క్రమంలో భాగస్వాములు కాలేకపోయారు. పాత సమాజం నుండి తోసివేయబడి, కొత్త సమాజంలో స్థానం లేకపోవడంతో, సమాజపు అంచులలో మిగులు మనుషులుగా, కొత్త సమాజ గమనానికి అడ్డంకిగా కనిపించసాగారు. ఈ పారిశ్రామికీకరణ క్రమంలో వృద్ధి సాధ్యపడినా కూడా, మిగులు మనుషుల సమస్యలు తీరలేకపోవడం, అవి పేదరికం, నిరుద్యోగం అనే అంకెలలో ప్రస్ఫుటంగా కనిపించడం, వీరు ప్రభుత్వం దయాదాక్షిణ్యాలు, అది పంచే డబ్బు సహాయంకోసం ఎదురు చూస్తూ మిగిలిపోయే మనుషులు గా, సమాజ ప్రగతికి ఒక అడ్డంకిగా చూడబడడం జరిగిపోతోంది.

ఈ పారిశ్రామికీకరణ జరిగిన ఈ అన్ని సంవత్సరాలలో ఈ మిగులు మనుషుల సంఖ్య తగ్గకపోగా అది పెరుగుతూ వస్తోంది. ఈక్రమం ఒక వైరుధ్య ఫలితం – అధిక పెట్టుబడులురావడం, దానితో పాటే అధికంగా మిగులు మనుషులు తయారుకావడం – మన సమాజంలో కనిపిస్తోంది. ఈ నిర్వాసిత ప్రజలకు భవిష్యత్ గురించిన ఆశ సుదూరంలోనైనా కనిపించకపోవడంతో భూసేకరణ వ్యతిరేక ఉద్యమాల దారిపట్టారు. అభివృద్ధి పథకాల నేపథ్యంలో దేశమంతటా ప్రస్తుత పరిస్థితులలో ఈ భూపోరాటాలు తీవ్రతరమౌతున్నాయి.

అభివృద్ధి పథకాల వ్యతిరేక ఉద్యమాలు

అభివృద్ధి పథకాల నిర్మాణం మొదలుపెట్టినప్పటి నుండి అత్యవసరమైన సమాజ అవసరాల కోసం 1894 భూసేకరణ చట్టాన్ని ఆధారంగా చేసుకొని బలప్రయోగం ద్వారా భూసేకరణ జరుగుతూనే ఉంది. స్థానిక ప్రజలు దీనికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. ఉదాహరణకు 1947లోనే హిరాకుడ్ డ్యాంకి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించారు. ఒడిశాలోనే రెంగాలి డ్యాంకి వ్యతిరేకంగా జరిగిన ప్రజా ఉద్యమం తీవ్రతరం కావడంతో మొట్టమొదటిసారిగా ఉద్యమకారుల మీద పోలీసులు కాల్పులు జరపడం, కొంతమంది చనిపోవడంతో ఉద్యమాలలో హింస పరిపాటిగా మారింది. పశ్చిమ బెంగాల్‌లో టాటా కంపెనీకి, సేలం కంపెనీకి వ్యతిరేకంగా సింగూరు, నందిగ్రాంలలో,

ఒడిశాలో కళింగనగర్‌లో టాటా వారి ఉక్కు పరిశ్రమ, జగత్‌సింగ్‌పూర్‌లోని వేదాంత అల్యూమినియం కంపెనీ, పోస్కో ఉక్కు పరిశ్రమ, ఆంధ్రప్రదేశ్‌లో సోంపేట థర్మల్ ప్రాజెక్ట్ ఇలాంటివెన్నో కాకుండా ఢిల్లీకి సమీపంగా ఉండే గ్రేటర్ నోయిడాలోని రైతులు తమ భూములను చౌకగా సేకరించే విధానానికి వ్యతిరేకంగా ఉద్యమం చేయడం, దానిని అణచివేసే ఉద్దేశ్యంతో పోలీసులు కాల్పులు జరపడం తో హింసాత్మకంగా మారిపోయింది. సింగూరు, నందిగ్రాంలలో బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం శక్తిమంతమైన ప్రభావంతో రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడం, రాష్ట్రంలో అమలు చేయడానికి కొత్తగా ఏర్పడిన త్రిణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక కొత్త భూసేకరణ చట్టం తయారు చేసింది. నోయిడా ఉద్యమం అనేక కారణాల మూలంగా రాజకీయ ప్రాముఖ్యత సంతరించుకుంది.

భూసేకరణ ఉద్యమాల గురించి ప్రాచుర్యంలో ఉన్న అభిప్రాయ మేమిటంటే పథకాల వలన ప్రభావిత ప్రజలు (వీరిని ప్రస్తుతం నిర్వాసితులనే అందాం) ఇప్పటికంటే ఎక్కువ నష్టపరిహారం, ఇంకా ఇంకా లాభాల కోసం బేరమాడే దురాశాపరులుగా చిత్రింపబడు తున్నారు. దీనికి కారణం మన దేశంలో మార్కెట్ వ్యవస్థ పూర్తిగా రాని కారణంగా భూమికి అమ్మకం ధరని సరిగా నిర్ణయించడం జరగదనీ, మార్కెట్టు వ్యవస్థలో భూమి వినియోగ విధానాన్ని బట్టి దాని ధర నిర్ణయింపబడుతుందనీ, బేరసారాల ద్వారానే భూమికి ఒక అమ్మకం ధర నిర్ణయించబడుతుందనే అభిప్రాయం కూడా ఉంది. ఈ దృక్పథం కొంతవరకు నిజమని నొయిడా ఉదంతం చెబుతుంది. రైతుల ఉద్యమం రాజకీయంగా మారిన వెంటనే ప్రభుత్వం వారికిచ్చే నష్ట పరిహారాన్ని కొని రెట్లు (అప్పట్లో ఆరు రెట్లుగా) పెంచడంతో ఉద్యమం తగ్గుముఖం పట్టింది. దీనికి అనుబంధంగానే ప్రభుత్వం అతి వేగంగా శతాబ్దికిపైగా అమలులో ఉన్న పాత భూసేకరణ చట్టాన్ని తొలగించి, దాని స్థానంలో కొత్త చట్టాన్ని దేశంలో అన్ని ప్రాంతాలలో అమలు చేసే విధంగా రూపొందించే ప్రయత్నం మొదలు పెట్టింది. ఈ ఉద్యమాలను దాని రూపం ద్వారా పరిశీలించితే (నొయిడాలో జరిగినట్లుగా) రైతులు మేలైన నష్టపరిహారం, ఇంకా మేలైన ఇతర లాభాల కోసం చేసినట్లుగానే కనిపిస్తుంది. కాని దాని సారం పరిశీలించితే ఈ ఉద్యమాలు అభివృద్ధి పథకాల మీద స్థానిక ప్రజల వ్యతిరేకతకి (సింగూరులో జరిగినట్లుగా) నిదర్శనాలవుతాయి. గత చరిత్ర వీరికి సూచించిన విషయాలేమిటంటే ఈ అభివృద్ధి పథకాల ద్వారా జరిగే విధ్వంసంలో తాము తమ జీవనాధారంతో పాటు తమ వనరులన్నీ పోగొట్టుకుంటామని, కొత్త సమాజంలో తమకు స్థానం దొరకడం కష్టమని, ఉద్యమమొక్కటే దారి అని తెలుసుకున్నారు. దేశంలో అభివృద్ధి పథకాలకు వ్యతిరేకంగా వస్తున్న ఉద్యమాలు ప్రభుత్వానికి ఒక హెచ్చరికగా, పథకాలు తమకు సరిపోవని, వాటిని సరిదిద్దవలసిన అవసరాన్ని గుర్తు చేసుకున్నట్లుగా చూడవచ్చును. ఈ రెండవ అభిప్రాయం మనకు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాలలో అంటే మావోయిస్టు ప్రభావం అధికంగా ఉన్న రాష్ట్రాలలో కనిపిస్తుంది. మావోయిస్టుల తాత్విక సిద్ధాంతం శ్రమ ఆధారిత అభివృద్ధి కార్యక్రమం అయిన కారణంగా, ఈ రాష్ట్రాలలో జరుగుతున్న పెట్టుబడి ఆధారిత అభివృద్ధి మార్గాలను వ్యతిరేకించడంతో హింస, ప్రతిహింసల క్రమం మొదలైంది. ఈ రాష్ట్రాల పారిశ్రామికీకరణ ప్రయత్నాలకు అడ్డు తగలడంతో ఈ రాష్ట్రాలలో అస్థిరత్వం నెలకొంది.

ఈ మధ్యనే జరిగిన నొయిడాలోని రైతుల ఉద్యమం, ఇంకా చాలా కాలంగా కొనసాగుతున్న మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలలోని అభివృద్ధి పథకాల వ్యతిరేక ఉద్యమం వాటితో వెన్నంటి ఉండే ఇంకొన్ని ఉద్యమాలు – ఈ రెండింటి మూలాన వస్తున్న రాజకీయ ఒత్తిడులు కలిసి ఒక ట్రిగర్‌గా పనిచేయడం మొదలైంది. దాంతో ప్రభుత్వం మార్కెట్ సహాయం తీసుకుని భూమికి సరియైన ధరను నిర్ణయించి, వారికి సంతృప్తికరమైన పునర్ నివాసం, పునఃస్థిరీకరణ (రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్మెంట్ – ఆర్ అండ్ ఆర్) పాలసీ రూపొందించగలిగితే, ఈ భూసేకరణకి సంబంధించిన సమస్యలన్నీ తొలగిపోతాయనీ, పారిశ్రామికీకరణ అడ్డంకులేవీ ఉండవని ఆలోచించి 1894 భూసేకరణ చట్టం స్థానంలో ఒక కొత్త భూసేకరణ చట్టాన్ని రూపొందించే కార్యక్రమానికి పూనుకుంది. గ్రామీణాభివృద్ధి శాఖకు మంత్రి అయిన జయరాం రమేష్ ఆధ్వర్యంలో కొత్త చట్టాన్ని కాలయాపనలు ఏమీ లేకుండా మెరుపు వేగంతో రూపొందించడమే కాకుండా, ప్రజలు దానిని చదివి స్పందించగలిగే విధంగా ఇంటర్నెట్‌లో పెట్టడం, తరువాత పార్లమెంట్‌లో బిల్లు రూపంలో ప్రవేశపెట్టడం, రాష్ట్ర ముఖ్యమంత్రు లందరి సహకారాలు తీసుకోవడం, స్టాండింగ్ కమిటీలో ఒప్పందం కుదిరిన వెంటనే అది భూసేకరణ, పునర్ నివాసం, పునఃస్థిరీకరణ 2011 (క్లుప్తంగా భూసేకరణ బిల్ 2011) పేరుతో దేశంలో అన్నీ చోట్లా వర్తింపచేసే విధంగా ప్రయత్నాలన్నీ జరిగిపోయాయి.

భూసేకరణ చట్టం, దానిలోని ముఖ్యాంశాలు

పారిశ్రామికీకరణ ఒక్కటే మన దేశంలో అధిక ఉత్పత్తులు సాధ్యం చెయ్యగలదనీ, మన దేశం ఒక ఆర్థిక శక్తిగా ఎదగడానికి మనకున్న ఒకే ఒక మార్గం అదేనని, మరొక ప్రత్యామ్నాయ మార్గం లేదనీ – (ఇదే మనలాంటి దేశాలకు అప్పులు ఇచ్చే ప్రపంచ బ్యాంక్ నిర్ధారించిన మార్గం కూడా) ఒక గట్టి నమ్మకం మన నేతృత్వానికి ఉంది. అందుచేత అభివృద్ధి అనే భావనని వెనుకకు నెట్టివేసి వృద్ధి అనే దానిని ముందుకు తీసుకుని వచ్చాయి. పారిశ్రామికీకరణ, మౌలిక వసతుల సదుపాయాలు, పట్టణీకరణ మన వృద్ధికి కావలసిన మూడు మంత్రాలయ్యాయి. ఈ నవీన భారతం గురించిన కల నిజం కావాలంటే బలవంతంగానైనా సరే, భూసేకరణ కార్యక్రమం కొనసాగించడం, దానితోపాటే వచ్చే నిర్వాసిత కుటుంబాల సమస్యలకి ఒక సంతృప్తికరమైన సమాధానం చూపించడం అత్యవసరమయ్యాయి. మొదటి దశలో ఈ నిర్వాసిత ప్రజల సమస్యలు తప్పించుకోలేని సాంఘిక సమస్యగా చూడడంతో, దేశమంతటికి ఉపయోగపడే ఒకే ఆర్&ఆర్ పాలసీ తయారు చెయ్యకుండా, ఏ రాష్ట్రానికా రాష్ట్రం తనకనువైన పథకాలను రూపొందించుకునే బాధ్యతనీ, అధికారాన్ని రాష్ట్రాలకే ఇచ్చేసారు. కొంతకాలం తరువాత రెండవ దశలో నొయిడా రైతు ఉద్యమాలు దానిలో కాంగ్రెస్ పార్టీ కలుగజేసుకోవడం ఒక పక్క, పారిశ్రామికీకరణకి అవసరమైన ఖనిజ సంపద అధికంగా ఉన్న వెనుకబడిన రాష్ట్రాలలో మావోయిస్టు ప్రభావంతో వస్తున్న అభివృద్ధి వ్యతిరేక ఉద్యమాల కారణంగా నిర్వాసిత ప్రజల సమస్య రాజకీయ సమస్యగా మారడం జరిగింది. ఈ సందర్భంలో పెట్టుబడులు నిరంతరాయంగా దేశంలో అన్నిచోట్ల ప్రవహించాలంటే అత్యంత వేగంగా నిర్వాసితుల సమస్యకి ఒక సంతృప్తికరమైన సమాధానం కావలసి వచ్చింది. కొత్త భూసేకరణ బిల్లు 2011 తయారైంది.

ఈ బిల్లు పేరు లాండ్ అక్విసిషన్, రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్మెంట్ బిల్ 2011 (ఎల్.ఎ.ఆర్.ఆర్. బిల్ 2011). దేశమంతటా

జమ్ము కాశ్మీర్‌ను మినహాయించి, వర్తింపబడే ఈ బిల్లులో రెండు ముఖ్య ఉద్దేశాలు మనం గమనించవచ్చును.

మొదటిది, దేశంలో అడ్డంకులు లేకుండా పెట్టుబడి ప్రవేశం. రెండవది దీనివలన తోసివేయబడే ప్రభావిత (నిర్వాసిత) ప్రజల సంక్షేమం. మొదటి ఉద్దేశ్య సాఫల్యం కోసం భూసేకరణ సక్రమంగా, కట్టుదిట్టంగా జరిగేటట్లుగా బిల్లును రూపొందించడం, రెండవ దాని కోసం నిర్వాసితప్రజల ఆశలు, సంస్కృతి, కమ్యూనిటీ, ప్రకృతి వనరులు, వారి నైపుణ్యత ఆధారంగా ఒక న్యాయమైన, సంతృప్తి కలిగించే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని ఇవ్వడం, వీటి ద్వారా పారిశ్రామికీకరణ సజావుగా జరిగిపోతుందనే ఊహ ఈ బిల్లు రూపొందించడానికి ఆధారం.

బిల్లులోని కొన్ని ముఖ్యాంశాలు

1. 80 శాతం ప్రభావిత కుటుంబాల అంగీకారం ఉన్నప్పుడే వారి భూములను ప్రజావసరాల (పబ్లిక్ పర్పస్) కోసం సేకరించే అవకాశం ఉంటుంది.
2. రైతులకిచ్చే నష్టపరిహారం గ్రామీణ ప్రాంతాలలో మార్కెట్‌లో ఉన్న భూమి ధరకు రెండు రెట్లు. ఇల్లు, చెట్లు, బావులు, పొలంలో ఉన్న పంటలు మొదలైన అసెట్స్ విలువ. ఇంకా పైన చెప్పిన నష్టపరిహారం మీద వంద శాతం సోలేషియా - ఇవన్నీ భాగమవుతాయి.
3. రైతుకిచ్చే సమగ్రమైన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో జీవించడానికి అనువైన అలవెన్సులు, ఒక్కొక్క కుటుంబానికి - అన్యూటీగా నెలకు రెండు వేల రూపాయల చొప్పున ఇరవై సంవత్సరాలు, రవాణా ఖర్చుల నిమిత్తం యాభై వేల రూపాయలు, తాత్కాలిక ఉపశమన గ్రాంటుగా నెలకి మూడు వేల రూపాయల చొప్పున ఒక సంవత్సరం, పశుశాల, చిన్నకొట్ల నిర్మాణానికి ఇరవై ఐదు వేల రూపాయలు, కాలనీలో స్థిరపడడానికి యాభై వేల రూపాయలు, నీటి పారుదల ప్రాజెక్టులయితే కమాండ్ ఏరియాలో కనీసం ఎకరా భూమి, పరిశ్రమలయితే కుటుంబంలో కనీసం ఒక వ్యక్తికి ఉద్యోగం, లేని పక్షంలో దీనికి బదులుగా ఐదు లక్షల రూపాయలు ప్రతిపాదించారు.
4. ఎస్.సి., ఎస్.టి.లకు ప్రత్యేక ప్యాకేజ్ పెట్టి అందులో 2.5 ఎకరాల సాగుభూమి, డబ్బు రూపేణా యాభై వేల రూపాయల సహాయం ప్రతిపాదించారు.
   ఇక్కడ మనం ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఎస్.టి.లను సమాజంలో ఉండే నష్టపోయే వ్యక్తులుగానే గుర్తించి వారి అభివృద్ధికి కొన్ని సూచనలు చేసారు. కాని వారిని వారి ప్రత్యేక ఆర్థిక వ్యవస్థ, దాని ప్రత్యేకతల ద్వారా గుర్తించినపుడే వారి అభివృద్ధి సాధ్యమౌతుంది.
5. ఆర్&ఆర్ కాలనీలో ఇరవై ఐదు రకాల మౌలిక వసతుల సదుపాయాల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు.
6. సామాజిక తనిఖీని కూడా పొందుపరిచారు.

ఈ బిల్లులో కొన్ని సమస్యాత్మకమైన అంశాలు (అసంప్షన్) ఉన్నాయి.

ముసాయిదా బిల్లును రూపొందించిన నిపుణులు రాజధానీ నగరమైన ఢిల్లీ నుండి దేశంలోని ప్రాంతీయ ప్రజల సమస్యలను అవగాహన చేసుకునే క్రమంలో కొన్ని అవకతవకలకు (డిస్టార్షన్స్‌కు) దారి తీసింది.

1. దేశమంటే సారూప్యత కల రాష్ట్రాల కలయిక : రాష్ట్రాల మధ్య తేడాలేమైనా ఉంటే అవి వృద్ధిలో మాత్రమే తేడాలుగా గుర్తించిన కారణంగా దేశం గ్రామీణ, పట్టణ ప్రాంతాల విభజనగా కనిపించింది.
2. కుటుంబమంటే సాలోచన కల వ్యక్తుల కలయిక : ఆలోచనా విధానంలో తేడాలు లేకుండా కలిసి మెలిసి ఉండే వ్యక్తుల కలయికగా కుటుంబాన్ని చూస్తే, ఆధిపత్య వ్యక్తి ఆలోచనే కుటుంబంలోని వ్యక్తుల ఆలోచనగా చలామణీ అవుతుంది.
3. భూమికి బదులుగా డబ్బు రూపంలో నష్టపరిహారం : నిర్వాసిత ప్రజలు పోగొట్టుకున్న భూమికి బదులుగా భూమిని ఇచ్చే నష్టపరిహారం పద్ధతిని తొలగించి, భూమికి బదులుగా ఇచ్చే నష్టపరిహారాన్ని, దానితో పాటే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో ఇచ్చే ఇతర సదుపాయాలలో చాలా అంశాలను డబ్బు రూపంలోకి మార్చివేసి, మార్కెట్లు సజావుగా పనిచేయని చోట్లలో కూడా అమలు చేసేటట్లుగా బిల్లును రూపొందించారు.

ప్రస్తుత నేపథ్యంలో దేశంలో పరిశ్రమలు నెలకొల్పే ఉద్దేశంతో ఖనిజ సంపద సమృద్ధిగా ఉన్న, ఆదివాసీ ప్రజలు ఎక్కువగా ఉన్న ఒడిశా లాంటి రాష్ట్రాలలో వివిధ కంపెనీల పేరుతో భూసేకరణ ప్రయత్నాలు జరుగుతున్నాయి. తత్ఫలితంగా ఏర్పడిన వైరుధ్య పరిస్థితుల కారణంగా రాష్ట్రాలలో హింస-ప్రతిహింసల క్రమానికి దారితీయడమేగాక ఆర్థిక అస్థిరతకి కూడా దారితీస్తోంది. దేశమంతటా అమలు చేయగలిగే విధంగా కొత్తగా రూపుతీసుకుంటున్న భూసేకరణ చట్టం ప్రభావం ముందు ప్రస్తావించిన ఆదివాసీ ఆర్థిక వ్యవస్థ అమలులో ఉండే ప్రాంతాలలో అధికంగా ఉంటుందనే నమ్మకంతో ప్రస్తుత వ్యాసం ఈ భూసేకరణ చట్టం అమలు ద్వారా ఆదివాసీ వ్యవస్థలో వచ్చే విపరీత పరిణామాల మీద కేంద్రీకరిస్తుంది.

1. దేశమంటే సారూప్యత కల రాష్ట్రాల కలయిక

దేశమంతటా, ఒక్క జమ్ము కాశ్మీర్ మినహాయించి, ప్రతిపాదిత బిల్లు వర్తిస్తుందనీ, అసంకల్పిత విస్థాపన జరిగిన అన్ని ప్రాజెక్టుల ప్రాంతాలలో కూడా ఒక బిల్లులో ప్రతిపాదించిన ఆర్&ఆర్ సదుపాయాలు ఒనగూర్చే విధంగా బిల్లును రూపొందించారు. దీని వలన మనం గ్రహించవలసిన విషయం ఏమిటంటే బిల్లులో 'దేశం' అంటే సారుప్యత కల కొన్ని రాష్ట్రాల కలయిక అనీ, ఈ కారణంగా కేంద్రం రూపొందింది. ఒక్కటే బిల్లు దేశంలోని అన్ని రాష్ట్రాలకు సరిపోతుందనే ఒక భావన అంతర్లీనంగా ఉంటుంది. ఇంకొక ప్రతిపాదన - ప్రైవేట్ కంపెనీలు తమ ప్రాజెక్ట్ కోసం గ్రామీణ ప్రాంతంలో వంద ఎకరాలకంటే ఎక్కువగానూ, పట్టణ ప్రాంతంలో యాభై ఎకరాల కంటె ఎక్కువగానూ అవసరమై భూమిని కొనదలచి నప్పుడు, ఆర్&ఆర్ సదుపాయాలు ఇవ్వక తప్పదనీ, గ్రామీణ ప్రాంతంలో భూమికి మార్కెట్టు ధర కంటే రెట్టింపు ధర, పట్టణ ప్రాంతాలలో అదే మార్కెట్టు ధరని నష్టపరిహారంగా ఇవ్వాలని నిర్ధారించడంలో, ఒక విషయం స్పష్టమవుతుంది. అది దేశం అంటే గుణాత్మకమైన తేడాలు ఉన్న రాష్ట్రాలుగా కాకుండా, పరిమాణాత్మకంగా మాత్రమే తేడాలు ఉన్న రాష్ట్రాలుగా అంగీకరించడంతో నష్టపరిహారం నిర్ధారించడంలో కూడా పరిమాణాత్మక తేడాలే బిల్లులో కనిపిస్తాయి. ఈ క్రమంలో ఢిల్లీ, ముంబై లాంటి నగరానికి చుట్టుపక్కల ఉన్న గ్రామీణ ప్రాంతాలను, రాజమండ్రి, సంబల్‌పూర్ లాంటి పట్టణాలకు దరిదాపులలో ఉన్న గ్రామీణ

ప్రాంతాలను, కోరాపుట్ జయపూర్ లాంటి కొండ ప్రాంతాలను ఒకే గాటన కట్టడంతో చివరి రెండు ప్రాంతాల మనుషులకు అన్యాయం జరిగిపోతుంది. ఒకసారి ఢిల్లీ దరిదాపుల్లో ఉన్న నొయిడాలోని భూములు పోగొట్టుకొన్న రైతు ఉద్యమాన్ని గమనించితే, ప్రభుత్వం కొన్ని రెట్లు నష్టపరిహారాన్ని పెంచి వేయడంతో, ఆ రైతులే వారి పొలాలను అమ్మేయడానికి ముందుకు వచ్చారు. దీనికి కారణం పెట్టుబడికి ప్రభావితం అధికంగా కనిపించే ఢిల్లీ పక్కనే వారి గ్రామాలు ఉండడం, దానితో వారికి డబ్బుల విలువ, దాని ప్రభావం బాగా తెలియడంగా చూడవచ్చును.

దీనికి విరుద్ధంగా, ఒడిశాలో జరిగే భూసేకరణ వ్యతిరేక ఉద్యమాలు కానీ, పశ్చిమబెంగాల్‌లోని సింగూర్‌లో జరిగిన ఉద్యమాలు కాని గమనిస్తే వాటిలో వారి జీవన విధానం పోగొట్టుకుంటున్నామనే తపన కనిపిస్తుంది. పై రెండు ఉదాహరణలు తైపారు పోసి చూస్తే ఈ రెండూ కూడా గ్రామీణ ప్రాంతాలే అయినా కూడా అక్కడి ప్రజల దృష్టిలో భూమిని ఒక వనరుగా చూడడంలో తేడా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. క్షేత్రస్థాయిలో, నాకు బాగా పరిచయమున్న సమాజం కంటే ఎంతో భిన్నంగా ఉండే ఆదివాసీ సమాజంతో నా అనుభవాలు నన్ను బాగా ఆలోచింపచేసాయి. నాకు కొత్తగా పరిచయమైన ఆదివాసీ సమాజంలో, వారికి సాగుభూమి మీద కాని వారుండే ఇంటి మీద కాని ధృవీకరణ పట్టాలేవీ ఉండవు. వారికి సొంత ఆస్తికంటే, ప్రకృతి సిద్ధంగా ఉండే వనరుల అందుబాటు మాత్రమే ముఖ్యం. వారి జీవనశైలి, సంస్కృతి, జీవనాధారం మొదలైనవన్నీ ప్రకృతి అందించిన వనరుల మీదే ఆధారపడతాయి. ఈ వనరులన్నింటిలో హద్దులు కనిపించని, విశాలమైన భూమి కూడా ఒకటి. ఈ సమాజంలో భూమికి అధిక ప్రాధాన్యత ఉండదు. ఇది సులభంగా లభ్యమయ్యే వనరు మాత్రమే. బిల్లులో భూమి విలువని మార్కెట్టు ధరతో సమన్వయించడం జరిగింది. కాని వ్యవస్థలతో భూమికుండే విలువ మార్కెట్టుకి సంబంధించిన ధర మాత్రమే కాకుండా, భూమిని ఇతర ఉత్పత్తికి సంబంధించిన శ్రమ, పెట్టుబడి అనే వనరులతో పోల్చి చూస్తే, దాని కొరతని బట్టి కూడా భూమి విలువ మారుతూ ఉంటుంది. ఆదివాసీ వ్యవస్థలో అధికారికంగా భూమికి సంబంధించిన అమ్మకం, కొనుగోలులు అంతగా కనిపించవు. గ్రామీణ స్థిర వ్యవసాయ వ్యవస్థలో అత్యవసర పరిస్థితులలో మాత్రమే భూమిని అమ్మినప్పటికీ, వీలు దొరికిన వెంటనే ఆ భూమిని తిరిగి కొనే ప్రయత్నం జరుగుతుంది. చివరగా పెట్టుబడి, పరిశ్రమలు ప్రాధాన్యత సంతరించుకున్న వ్యవస్థలో ఆ భూమికి భవిష్యత్తులో రాగలిగే అనేక ఉపయోగాల ఆధారంగా ఆ భూమి విలువ మార్కెట్ ద్వారా నిర్ధారించబడుతుంది. ఆ భూమి అమ్మకానికి తయారుగా ఉంటుంది.

వాస్తవ ప్రపంచంలో ప్రజల దృష్టికోణం నుండి చూస్తే, మొదటి వ్యవస్థలో భూమి ప్రకృతిలో సులభంగా లభ్యమయ్యే విశాలమైన వనరుగా చూడడంతో దానికి ప్రత్యేకంగా విలువ ఉండదు. రెండవ దానిలో భూమికి ఒకే ఉపయోగం, అది వ్యవసాయపరంగా పంటలు పండించడంగా చూడడంతో వ్యవసాయదారునికి అదే జీవనంగా ఉంటుంది. మూడవ దానిలో భూమికి అనేక ఉపయోగాలు ఉండడంతో మార్కెట్టులో దాని ధర కూడా అధికంగానే ఉంటుంది. ఇక్కడ భూమి ఒక వస్తువుగా, మార్కెట్లలో మారకం చెందే వస్తువుగా మారిపోతుంది. అంటే ఉత్పత్తిలో ఒక వనరుగా ఉపయోగపడే భూమిని పై మూడు వ్యవస్థలలో వివిధ రకాలుగా అక్కడి ప్రజలు ఆకళింపు చేసుకుంటారు. అలాగే మిగతా వనరుల గురించిన అవగాహనలో కూడా ప్రస్ఫుటమైన తేడాలు ఉంటాయి. అంతే కాకుండా, భిన్నమైన ఉత్పత్తి పద్ధతులున్న వీటికి అనుబంధంగా మిగతా సామాజిక సంబంధాలు ఏర్పడి, ప్రత్యేక గుణాలు కల మూడు వేర్వేరు వ్యవస్థలుగా ఇవి గుర్తింపు పొందుతాయి. ఇవి తమ ఉత్పత్తి విధానాలలోనే కాకుండా, తమదైన జ్ఞానం, తమదైన ఆస్తి సంబంధాలు, తమదైన సంస్కృతి, జీవన విధానాలలో కూడా గమనించతగ్గ తేడాలుంటాయి. ఈ మూడు వ్యవస్థలు గుణాత్మకమైన తేడాలున్న మూడు వేరు వేరు వ్యవస్థలు, వాటి మధ్యన ఉండే అంతః సంబంధాలు (ఇంటర్ లింకేజస్) కలయికగా దేశాన్ని అర్థం చేసుకోవచ్చును.

ఇటువంటి గుణాత్మకమైన తేడాలన్నింటిని చదును చేసేసి, బిల్లులో పరిమాణాత్మక తేడాలుండే గ్రామీణ పట్టణ ప్రాంతాలను మాత్రమే గణనలోకి తీసుకుని, దేశమంతటిలో అమలు చేయగలిగిన ఒకే భూసేకరణ బిల్లు – 2011 బిల్లును రూపొందించడం జరిగింది. ఆ క్రమంలో దేశ ఆర్థిక వ్యవస్థలో అస్థిరత చోటు చేసుకోవడమే కాకుండా, సామాజిక సంక్షోభానికి దారితీయడం, ప్రభావిత ప్రజలు ఇంకా ఇంకా నష్టపోయే పరిస్థితులు రావడం జరుగుతుంది.

2. కుటుంబం అంటే సాలోచన కలిగిన వ్యక్తుల కలయిక

నష్టపరిహారం గురించిన లెక్కలు కట్టేటపుడు 'కుటుంబం' కేంద్రంగా జరిగినా, సమయానుకూలంగా ఇది ఒక వ్యక్తి కేంద్రంగా మారడం, ఆ వ్యక్తి కుటుంబ ఆధిపత్యానికి చిహ్నంగా ఉండే పురుషునిగా మారిపోవడం జరిగింది. మార్కెట్టు విలువల ప్రకారం లెక్కకట్టిన భూమి మొదలైన వాటికి ఇచ్చే నష్టపరిహారమైన, ఆర్&ఆర్ ప్యాకేజీ ద్వారా ఇచ్చే ఇతర సదుపాయాలైనా డబ్బు రూపంలో ఉండి, బ్యాంకులో ఖాతా ఉన్న పురుషుని పేరుతో నమోదు చేయబడుతుంది. ఈ బిల్లులో స్త్రీల గురించిన ప్రస్తావన ఒక్కచోట మాత్రమే ఉంది. అది పునరావాస కాలనీలో నిర్వాసిత కుటుంబానికి ఇచ్చే ఇల్లు కాని, భూమి కాని ఉమ్మడిగా భార్య, భర్తల పేర్ల మీద ఇవ్వవచ్చును అన్నారే కాని ఇవ్వాలి అని లేదు.

ఒక్కసారి మన చూపును ఆదివాసీ స్త్రీలవైపు కేంద్రీకరిస్తే, వారుండే సమాజం పూర్తిగా ప్రకృతి మీద ఆధారపడిందనీ, స్త్రీలే ఆ సమాజ స్థితికి కారణమని తెలుస్తుంది. ఆర్థికపరమైన అన్ని పనులు – వ్యవసాయపు పనులన్నింటిలో చేయి కలపడం, ఇల్లు కట్టడంలో, కుటుంబానికి జరుగుబాటుకి కావలసిన ఆకులు, దుంపలు, పండ్లు, వంటకి కావలసిన వంట చెరుకు లాంటి వస్తువులను సేకరించడం, పసుపు, కరక్కాయ, ఉసిరి, కుంకుడు, చింతపండు, విస్తరాకులు, కొండ చీపుళ్లు లాంటి అటవీ ఉత్పత్తులను సేకరించి, సంతలో అమ్మి తమ కుటుంబానికి కావలసిన సరుకులు తేవడం, ఇల్లు నడపడం, పిల్లా పాపలను పెంచడం, ఇంటి పనులన్నీ చక్కబెట్టుకోవడం, పక్క కుటుంబాలలోని స్త్రీలకు కాన్పు సమయంలో సహాయం చెయ్యడం... ఈ లిస్టు అనంతం.. ఇవన్నీ కూడా ఆదివాసీ స్త్రీలందరూ ఒకే సమూహంగా కలిసి చేయడంతో వారికి ఉమ్మడి బలం ఉంటుంది. సమాజానికి కుటుంబానికి అవసరమైన పనులు చేయడం ద్వారా స్త్రీ కుటుంబానికే కాకుండా సమాజ పునరుత్పత్తికి బాధ్యత తీసుకుంటుంది. ఈ సమాజంలో పురుషాధిక్య ప్రభావం చాలా తక్కువగా ఉండి, కుటుంబానికి సంబంధించిన కట్టుబాట్లు, నియమాలు, సాంప్రదాయాలు బలంగా లేక కుటుంబం ఇద్దరు విడివిడి వ్యక్తుల కలయికగానే ఉంటుంది కాని ఒకరి ఆధీనంలో ఉండే సముదాయం లాగా ఉండదు.

ఇటువంటి సమాజంలో పారిశ్రామికీకరణ కోసం భూసేకరణ

జరిగి ఆదివాసీ కుటుంబాలను నిర్వాసితులను చేసేస్తే, ముఖ్యంగా నష్టపోయేది స్త్రీలే. ఈ క్రమంలో స్త్రీలు తాము పూర్వసమాజంలో చేసే పనులతోపాటే వారి నైపుణ్యం, జ్ఞానం కూడా కోల్పోవడం, ఆవిర్భవిస్తున్న కొత్త సమాజానికి కావలసిన నిపుణత లేకపోవడంతో స్త్రీలు తమ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కోల్పోయి, గృహపరిధిలోకి నెట్టివేయ బడతారు. ఇక్కడ ఏ పనీ చేయలేని నిస్సహాయులుగా మారిపోతారు. ఇదే సమయంలో కుటుంబంలో పురుషాధిపత్యం చోటు చేసుకోవడం, పురుషుని ప్రాముఖ్యత పెరగడం జరుగుతుంది. విస్థాపన, పునరావాస పథకాల ద్వారా అధికార యంత్రాంగం తమ వెసులుబాటు కోసం, పురుషునికి అన్ని రకాల లాభాలు – ఇంటికి, భూమికి పట్టా, ఆర్థిక సంబంధమైన లావాదేవీలు అతని పేరున బ్యాంకులో జమ అవడం, ఆర్&ఆర్ కాలనీలో స్థిరపడడానికి కావలసిన సోలేషియం, యాన్యుటీ, రవాణా ఖర్చులు లాంటి అనేక సదుపాయాలన్నీ డబ్బు రూపంలో అందుకోవడం, చివరికి ఒకవేళ కంపెనీ కోసం భూసేకరణ జరిగితే, ఆ కంపెనీలో ఒక ఉద్యోగం, అది ఇవ్వలేకపోతే డబ్బు రూపంలో సహాయం – సమకూడేలా బిల్లు రూపొందింది. ఇవన్నీ కూడా పురుషుడు అడగకుండా, శ్రమ పడకుండా, సంఘర్షణ చేయకుండా ప్రభుత్వం ద్వారా అధికారికంగా దక్కినవే. కుటుంబానికి ఒక రూపురేఖలు, నియమాలు వచ్చే అవకాశం కూడా ఉంది. ఇక్కడ స్త్రీల బహుముఖ కార్యక్రమాలు కాని, స్త్రీలు పోగొట్టుకునే సమాజంలో ఉండే నైపుణ్యం కాని, ఆమె పాత్ర దానితో వచ్చే హోదాకాని, జీవన విధానం కాని నష్టపరిహారపు విలువలు కట్టడంలో భాగం కాలేక పోయాయి. సరికదా అవన్నీ అనవసరపు అంశాలుగా పక్కకు నెట్టివేయ బడ్డాయి. భూసేకరణ బిల్లు 2011 ఆదివాసీ ప్రాంతాలలో అమలు చేస్తే, ఇంతవరకూ పూర్తిగా మనిషిగా జీవించి, తమదైన ఆలోచన, దానిననుసరించి ఆచరణ ఉన్న స్త్రీలు క్రమంగా తమ అస్తిత్వాన్ని పోగొట్టుకోవడమే కాక సమాజపు దృష్టినుంచి కూడా కనుమరుగై పోతారు.

3. భూమికి బదులుగా డబ్బు రూపంలో నష్టపరిహారం

బిల్లు ప్రకారం, ఒక్క డ్యాం ప్రాజెక్టులో మాత్రమే ఒక కుటుంబం పోగొట్టుకున్న భూమికి బదులుగా భూమిని నష్టపరిహారంగా ఇచ్చే ప్రతిపాదన ఉంది. మిగతా వాటిలో భూమికి బదులుగా నష్టపరిహారం డబ్బు రూపంలో ప్రతిపాదించారు. నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ లో ఇచ్చే కొన్ని సదుపాయాలను మొత్తం డబ్బు రూపంలోకి మార్చివేసి కుటుంబంలో ఒక వ్యక్తికి, బ్యాంకులో అకౌంటు ఉన్న వ్యక్తికి ఇవ్వడం జరుగుతుంది. ఈ పద్ధతిలో మొదటిలో ప్రభావిత కుటుంబాలు కొంత అస్థిరతకు లోనైనా, సమయానుసారంగా మార్కెట్లు వీటిని సరిదిద్ద గలవనీ, అప్పుడు వీరంతా ఏజెంట్లుగా మారి, అభివృద్ధి క్రమంలో భాగస్తులయి స్టేక్‌హోల్డర్స్‌గా మారే అవకాశం ఉంటుందనే అభిప్రాయం బలంగా ఉంది. మార్కెట్లు సమర్థవంతంగా పనిచేసే వ్యవస్థలో డబ్బు రూపంలో నష్టపరిహారం భూమి అమ్మకందారుకీ కొనుగోలు దారుకీ కూడా సంతృప్తికరంగా పనిచేసే అవకాశం ఉంది. ఏవైనా హెచ్చు తగ్గులుంటే ధరల మార్పు ద్వారా దిద్దుబాటు కూడా జరిగే అవకాశం ఉంది. ఇదే నొయిడాలో జరిగింది. నష్టపరిహారం కొన్ని రెట్లు పెరిగిన వెంటనే రైతులు తమ పొలాలను అమ్మివేయడానికి ముందుకు వచ్చారు. కాని మార్కెట్లు నిశ్చిత రూపంలో ఉండి సమర్థవంతంగా పనిచేయని వ్యవస్థలో వీటి గురించిన ఊహ, అవి పనిచేసే విధానాలకు సంబంధించిన జ్ఞానం, అవి చేయగలిగే పనుల గురించిన అవగాహన ఉండదు. కనుక సాగు భూమికి డబ్బు రూపంలో నష్టపరిహారం ఇస్తున్న సందర్భంలో, ముఖ్యంగా ఆదివాసీ వ్యవస్థలో, విధ్వంసానికి దారితీస్తుంది. ఉపయోగపు విలువల ఆధారంగా ఒక మానిక ఉప్పుని అదే మానిక నైజర్ (నూనె గింజలు)తో మార్పిడి చేసుకుంటారు. ఉప్పు మార్కెట్ ప్రకారం పది రూపాయల ఖరీదు చేస్తే నైజర్ రెండు వందల రూపాయలకు వస్తుంది. ఇటువంటి మార్పిడే అన్నింటా జరుగుతుంది. ఆదివాసీ సంస్కృతిలో సామూహిక జీవనశైలికి ప్రాధాన్యముండడంతో, ఈ నష్టపరిహారంగా ఇచ్చిన డబ్బుని సామూహిక విందులు, సామూహికంగా తాగడం, ఇతరులకు కావలసిన డబ్బు సహాయం చేయడం లాంటి పనులలో ఖర్చుపెట్టి, తాము డబ్బును చాలా ఆనందంగా, ఉపయోగకరంగా ఖర్చు పెట్టామని అనుకుంటారు. తమ ప్రాంతంలో ఒక కంపెనీ పెట్టబోతున్నారు అనే వార్త ప్రచారం కాగానే ఆ చుట్టుపక్కల ఉన్న భూముల ధరలకు రెక్కలు వచ్చి ఒక తీరు తెన్ను లేకుండా విపరీతంగా పెరిగిపోతాయి. దానితో అమ్మబోతే అడవి కొనబోతే కొరివిలా మారిపోయి తమకు మునుపు ఉన్నంత భూమిని ఈ డబ్బుతో కొనలేక పోతారు. మొత్తం క్రమంలో భూమిని, ఇంటిని, జీవనాధారాన్ని, నైపుణ్యాన్ని పోగొట్టుకోవడమే కాకుండా, ఆర్ అండ్ ఆర్ కాలనీలో నివాసముంటూ, కొత్త ఆధునిక సమాజానికి కావలసిన నైపుణ్యం లేని కారణంగా, భవిష్యత్‌లో ఈ సమాజంలో తాము కూడా భాగస్తులమవుతామనే ఆశ లేకుండా జీవితాలు గడిపేస్తుంటారు.

ముగింపుగా చెప్పుకోవాలంటే –

ఎంతో కాలంగా దేశంలో ఒక సమగ్రమైన భూసేకరణ బిల్లు అవసరముండడం, ప్రజా ఉద్యమాల ఒత్తిడి కారణంగా ఒక బిల్లును రూపొందించడం, నష్టపరిహారం, పునరావాసం అనే అంశాలను కలిపి ఒకే బిల్లులో, దేశమంతటా అమలయ్యే విధంగా తయారు చెయ్యడమూ అభిలషణీయమే. పారిశ్రామికీకరణ ద్వారా అభివృద్ధి క్రమాన్ని వేగవంతం చెయ్యడమూ, ప్రభావిత ప్రజలను దీనిలో భాగస్వాములను చెయ్యడం దీని ఆశయాలు. అంటే పారిశ్రామికీకరణ కేంద్రంగా అభివృద్ధి, దీని వలన సంభవించే విస్థాపన – తిరిగి వీరి అభివృద్ధి – అనే క్రమాన్ని ఊహించినట్లుగా కనిపిస్తుంది. కాని దేశాన్ని, ప్రజలను, కుటుంబాన్ని నిర్వచించడంలో ఇక్కడ ఉండే భిన్నతని పక్కకు తోసివేసి, పారిశ్రామికీకరణ క్రమంలో వచ్చే సమస్యలకు కొన్ని సులభమైన సమాధానాలను వెతకడం జరిగింది. ఈ భిన్నత్వాన్ని తిరిగి ముందుకు తీసుకొని రావడం ద్వారా అభివృద్ధి మార్గంలో ముఖ్యంగా ఆదివాసీ సమాజంలో, రాగల సమస్యలకు ఈ వ్యాసంలో ఓ సమాధానం వెతకడం జరిగింది. మిగతా ప్రాంతాలలో ఈ బిల్లు కొన్ని సవరణలతో అమలు చేయడానికి సాధ్యమవుతుంది. స్త్రీల విషయంలో, మిగతా అన్ని చోట్ల జరిగే అన్యాయం ఇక్కడ కూడా జరుగుతుంది. సమాజంలో ఉన్న భిన్నత్వాన్ని లెక్కలోకి తీసుకోవాలనుకుంటే కింది సూచనలు ఉపయోగపడతాయి.

1. దేశాన్ని గ్రామీణ ప్రాంతం, పట్టణ ప్రాంతం అనే పరిమాణాత్మక విభజనలో కుదించకుండా, అంతః సంబంధాలు ఉండే మూడు గుణాత్మకమైన తేడాలున్న విభిన్న ఉత్పత్తి విధానాల కలయికగా గుర్తించి, వాటికనుగుణంగా భూసేకరణ విధానాలు తయారు చెయ్యాలి.

2. కుటుంబాన్ని సత్సంబంధాలు కలిగిన ఇద్దరు వ్యక్తుల కూడలిగా, వారిద్దరిదీ ఒకటే మాటగా కుటుంబ పెద్ద అయిన పురుషుని ద్వారా వ్యక్తమయ్యే స్పర్థలు లేని నిలయంలా కాకుండా, భిన్నమైన ఆలోచనాధోరణి, భిన్నమైన అభిప్రాయాలు ఉన్న వ్యక్తుల కూడలిగా గుర్తించాలి. ఆదివాసీ సమాజంలో ఇదే కనిపిస్తుంది.

భూసేకరణ బిల్లు చాలా లోపాలతో ఉందనీ, భూమిని కోల్పోయే బాధితుల వైపు నుంచి ఆలోచించి బిల్లును సరిచేయాల్సిన అవసరం ఉందనీ అంటున్నారు **లోకే రాజ్‌పవన్**

కోటి లోపాల కొత్త బిల్లు

ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన జాతీయ భూసేకరణ - పునరావాసం బిల్లు - 2011 గురించి దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్నది. సెప్టెంబర్ 7న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబడ్డ ఈ బిల్లులో మొత్తం 13 అధ్యాయాలు, 107 సెక్షన్‌లు ఉన్నాయి. బిల్ నెం.77గా ప్రవేశపెట్టబడిన ఈ బిల్లు డిసెంబర్‌లో చట్టంగా మారబోతున్నది. జమ్మూ కాశ్మీర్ మినహా దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఈ చట్టం వర్తిస్తుంది. 1991 తర్వాత దేశవ్యాప్తంగా సరళీకరణ విధానాలు ప్రజల మధ్య అంతరాలు పెంచి, ఆ సరళీకరణ మరింత వ్యాపితమై ప్రపంచీకరణ రూపాన్ని తీసుకుని ప్రజల మధ్య అసమానతలను తీవ్రం చేశాయి. ఇరవై ఏళ్లుగా ఈ ప్రపంచీకరణ ఫలితాల వల్ల దెబ్బతినని సగటు జీవి లేడంటే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రపంచీకరణ ప్రధానంగా కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు సహాయకారిగా ఉండడం, ఆ కంపెనీలకు తమ వ్యాపార ప్రయోజనాల కోసం భూమి అవసరమవడం వల్ల ప్రపంచీకరణ విధులలో భూసేకరణ ముఖ్యమైన విధి అయిపోయింది. ప్రభుత్వాలను మచ్చిక చేసుకుని, చట్టాలలోని లొసుగులను వాడుకుని ఆయా కంపెనీలు భూసేకరణను జరుపుతూ తమ వ్యాపారాలను విస్తృత పరుచుకుంటున్నాయి. తద్వారా భూములు కోల్పోయిన రైతులు, ప్రజలు బికారులై మిగిలిపోతున్నారు. తలదాచుకోవడానికి కూడా స్థలం లేకుండా అభాగ్యులై ఆవాసం కోసం దేహీ అంటున్నారు. ఇరవై ఏళ్లుగా ప్రపంచీకరణలో భాగంగా జరుగుతున్న ఈ భూసేకరణ లోతుల్లోకి వెళ్లి చర్చించుకోకపోతే, ఆ ప్రక్రియ మూలాలను గురించి తెలుసుకోకపోతే రానురాను కార్పొరేట్ కంపెనీల వల్ల మాయమైపోతున్న ఊర్లు, పట్టణాల ప్రజలు న్యాయానికి దూరంగా విసిరివేయబడతారు. కనుక బ్రిటిష్ వారు తమ ప్రయోజనాల కోసం భూసేకరణ చట్టం - 1894లో ఉన్న లోపాలను సవరిస్తున్నామంటూ ప్రభుత్వం చేసిన ప్రస్తుత భూసేకరణ- పునరావాస బిల్లు - 2011ను ఈ నేపథ్యంలో పరిశీలించి చర్చించుకోవాల్సిన సందర్భం వచ్చింది.

ఈ బిల్లు ప్రభుత్వాల స్వంత వినియోగ పనులకు, ప్రజల కోసం ప్రైవేట్ కంపెనీలకు భూమి బదలాయించడానికి, ప్రైవేట్ కంపెనీల అభ్యర్థనల మేరకు భూమి సేకరించడానికి ఉద్దేశించినది. అయితే గత చట్టంలో భూమిని ఏ అవసరాల కోసం సేకరించాలో ఉన్న నిబంధనలను

---

3. ఆదివాసీ సమాజాలలో, భూ సేకరణకి పూర్వం స్త్రీలే కుటుంబ బాధ్యతలన్నీ, సమాజ స్థితికి కావలసిన కార్యకలాపాలన్నీ నెరవేర్చిన కారణంగా, భూసేకరణ అనంతరం కూడా స్త్రీని కుటుంబ పెద్దగా, నిజమైన హక్కుదారుగా గుర్తించి, కుటుంబానికి ఇచ్చే ఇల్లు, పొలం మొదలైన వాటినన్నింటినీ ఆమె పేరు మీద నమోదు చెయ్యాలి.

4. నష్టపరిహారం డబ్బు రూపంలో కంటే భూమికి బదులుగా భూమిని ఇచ్చే పద్ధతి ఎక్కువ ఆమోదకరమైనది. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో డబ్బు రూపంలో ఇచ్చే సదుపాయాలన్నీ తొలగించివేసి, ప్రభుత్వం కాని, కంపెనీ కాని ఈ సదుపాయాలను ఒనగూర్చే బాధ్యత చేపట్టాలి.

5. కుటుంబంలో ప్రతి వ్యక్తి, స్త్రీ అయినా పురుషుడైనా, ఉద్యోగానికి అర్హులేనని, ఇష్టముండి శ్రమ చెయ్యగలిగిన ప్రతి వ్యక్తిని, మిగులు మనుష్యులని చులకనగా చూడకుండా మిగులును ఉత్పత్తి చేసే మనుషులుగా గుర్తించి, వారికి ఉద్యోగ సదుపాయం కల్పించాలి.

6. ఇలా ప్రతివ్యక్తికి ఒక ఉద్యోగం రావాలంటే అధిక పెట్టుబడితో కూడిన భారీ పరిశ్రమలు, సాంకేతిక పరిజ్ఞానం అవసరమయ్యే భారీ పరిశ్రమలు కాకుండా ఎక్కువ మంది శ్రామికులను చేర్చుకోగలిగే, మానవ శ్రమ ఎక్కువగా ఉపయోగపడే పరిశ్రమలను ఎంచుకోవాలి.

ఇవి సమాజంలో నిజం కావాలంటే, ప్రజల అవసరాల కనుగుణంగా స్థానికంగా దొరికే వనరులు, స్థానిక ప్రజలకుండే నైపుణ్యం, పునాది అయి వికేంద్రీకరణ జరిగినప్పుడే సాధ్యమవుతుంది. ఈ అభివృద్ధి క్రమంలో 'కంపెనీ నుండి నిర్వాసిత ప్రజలకు' చేరే ప్రక్రియ తిరగబడి, 'ప్రజల నుండి కంపెనీకి' చేరే ప్రక్రియ మొదలవు తుంది. మొదటిదానికి పెట్టుబడి ప్రాధాన్యత ఉన్న అభివృద్ధి మార్గమని దీనిలో వృద్ధి మాత్రమే జరుగుతుందని అనుకోవచ్చును. రెండవది మానవ శ్రమ ప్రాధాన్యత ఉన్న అభివృద్ధి మార్గం, దీనిలో వ్యక్తుల, సమాజ అభివృద్ధికి అవకాశముంటుందనీ అనుకోవచ్చును. ఇంకొక విషయం అధికార యంత్రాంగం చెబుతున్నట్లుగా, కల్లోల ప్రాంతాలైన ఆదివాసీ ప్రజల అవసరాల కనుగుణంగా సరియైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి సమగ్ర చర్యలు తీసుకోవాలంటే, ప్రజలు నివసించే పరిసరాల కనుగుణంగానే వారి అవసరాలు ఉంటాయనీ, ఈ కార్యక్రమాలు ప్రజలు ఎంచుకున్నవయితే వాటిలో తాము కూడా భాగస్తులవడమే కాకుండా అవి విజయవంతమయ్యే అవకాశాలు ఉంటాయని అనుకోవచ్చును. ప్రజల వృత్తికి సంబంధించిన నైపుణ్యత, సామర్థ్యం, రానున్న కొత్త సమాజపు అవసరాలకు ఒక సంతులనం ఉండే విధంగా పారిశ్రామికీకరణ కార్యక్రమాలు చేపడితే, సమగ్రమైన అభివృద్ధి సాధ్యపడుతుంది.

(రచయిత సామాజిక శాస్త్రవేత్త) వీ

గాలికి వదిలేసి ఇష్టం వచ్చినట్లుగా నిబంధనలకు విరుద్ధమైన అవసరాల కోసం భూసేకరణ జరిపారు. ఈ లోపాన్ని సరిదిద్దేలా ఈ కొత్త చట్టంలో నిబంధనలకు విరుద్ధమైన అవసరాల కోసం భూమి సేకరిస్తే ఏ చర్యలు తీసుకోవాలో వివరించవలసి ఉంది. కానీ అలాంటి చర్యలను పేర్కొనలేదు. దీనివల్ల చట్టం మారినా గత చట్టం మాదిరిగానే చట్ట విరుద్ధంగా భూసేకరణ జరిపే అవకాశం ఉందని తెలుస్తోంది.

గత చట్టంలో కొన్ని ప్రత్యేక ప్రాంతాల భూములను సేకరించ కూడదని పేర్కొన్నా వాస్తవానికి యథేచ్ఛగా సేకరిస్తూ పోయారు. ఆ అవకాశం చట్టంలోనే ఉండేది. ఈ చట్టం కూడా షెడ్యూల్డ్ ప్రాంతాలలోని వివాదాస్పద భూములను సేకరించరాదని పేర్కొంది. కానీ ఒకవేళ గతంలో లాగా సేకరిస్తే ఎలా? అనే ప్రశ్నకు మాత్రం బిల్లులో సమాధానం లేదు. గిరిజనుల భూములైన షెడ్యూల్డ్ భూములలో బడా కంపెనీలు తిష్టవేసిన అనేక ఉదాహరణలు కళ్లముందు కనిపిస్తున్నా కఠిన నిబంధనలు ఏర్పరచాలనే ఆలోచన బిల్లు తయారు చేసిన వారికి లేదు. కనుక చూడడానికి ఇది చిన్న లోపమే అయినా బడా కంపెనీలు ఆ లొసుగుతో సునాయాసంగా భూములను మింగేయగలవు.

బిల్లులో పేర్కొన్న అంశాల నిర్వచనాలు చాలా మట్టుకు అసంబద్ధంగా, గందరగోళ పరిచేలా ఉన్నాయి. బాధిత కుటుంబాలకు పునరావాసం, పునర్నివాసం కోసం నియమించబడిన అధికారిని 'అడ్మినిస్ట్రేటర్'గా పేర్కొన్నారు. అయితే అడ్మినిస్ట్రేటర్‌గా ఏ వ్యక్తిని నియమించాలో, ఆ వ్యక్తికి ఉండే అర్హతలేమిటో, అనుభవాలేమిటో ఎక్కడా పేర్కొనలేదు. ప్రజల పునరావాసం గురించి, భూసేకరణ గురించి తెలిసి ఉండే అధికారిని కాకుండా ప్రభుత్వం తనకు అనుకూలమైన అధికారిని నియమించే అవకాశముంది. ప్రభుత్వాలు కంపెనీలకు దాసోహమైన సందర్భంలో అలాంటి అధికారి నిర్వాసితులకు ఏం న్యాయం చేయగలడు? కనుక ఉద్దేశ్యపూర్వకంగానే అడ్మినిస్ట్రేటర్ అర్హతలు ప్రకటించలేదని తెలుస్తోంది.

ఇక భూసేకరణకై ప్రభుత్వంచే గుర్తించబడ్డ స్థలాన్ని 'బాధితస్థలం' అని నిర్వచించారు. ఇది పూర్తిగా అన్యాయమైన నిర్వచనం. ఒక ప్రాజెక్ట్ నిర్వహిస్తున్న స్థలాన్ని మాత్రమే బాధిత స్థలంగా గుర్తించి, ఆ ప్రాజెక్ట్ ఉత్పత్తుల ఫలితంగా నష్టపోయే ప్రాంతాన్ని మాత్రం గుర్తించక పోవడం ఎంతవరకు సమంజసం? ఉదాహరణకు ఒక అణువిద్యుత్ ప్రాజెక్ట్ కోసం ఇరవై ఎకరాల భూసేకరణ జరిపితే దాని ఫలితంగా కాలుష్యం, విషవాయువులు వ్యాపించే వందల ఎకరాల భూమిని మాత్రం బాధిత స్థలంగా తీసుకోకుంటే ఆ భూమికి గానీ, అందులో నివసించే ప్రజలకు గానీ కలిగే నష్టానికి కారకులెవరు? వారి బాధలకు జవాబుదారీ ఎవరు?

ఎవరి భూమిని సేకరించారో లేదా ఎవరు భూమి నుండి దూరం చేయబడ్డారో వారి కుటుంబాలను 'బాధిత కుటుంబాలు' అని నిర్వచించారు. రైతులు, కూలీలు, కౌలుదార్లు, మూడు సంవత్సరాల నుండి భూమిలో పనిచేస్తున్నవారు, అడవులు, నీటి వనరులపై గత మూడు సంవత్సరాలుగా ఆధారపడుతున్నవారు, వేటగాళ్లు, మత్స్యకారులు, పడవదార్లు, వివిధ పథకాలలో భాగంగా అసైన్డ్ భూములు కలిగి ఉన్నవారు, మూడేళ్లుగా పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్న వారిని బాధిత కుటుంబాలుగా వివరించారు. ఇందులో ప్రాతిపదికగా పేర్కొన్న మూడు సంవత్సరాలనే ఎందుకు తీసుకోవలసి వచ్చిందో వివరణ లేదు. మూడు సంవత్సరాల కాలాన్నే పరిమితిగా తీసుకోవడంలో గల హేతుబద్ధత ఏమిటో అర్థం కావడం లేదు. ఒక భూమిని ఏడాదిగానో, రెండేళ్లుగానో వినియోగించుకున్న వారికి భూమి పోతే బాధ ఉండదా? అతని కుటుంబం బాధిత కుటుంబం కాదా? అలాగే ఒక పట్టణంలో మూడేళ్ల కంటే తక్కువ కాలం నుంచి నివసిస్తున్నంత మాత్రాన ఆ కుటుంబం మాత్రం బాధిత కుటుంబం కాకుండా పోతుందా? ఇదేం మెలికనో ముసాయిదా తయారు చేసిన వారికే తెలియాలి. మూడేళ్ల కాలం అని నిబంధన పెట్టి ఎన్నో పేద, మధ్యతరగతి కుటుంబాలను భూసేకరణ రక్షణల నుంచి తప్పించవూనుకోవడం సబబు కాదు. అందుకే మూడేళ్లు అనే నిబంధనను వెంటనే తొలగించవలసిన అవసరముంది. అలాగే ప్రాజెక్ట్ పరిధిలో నివాసముంటున్న చిన్న చిన్న ఉపాధులపై ఆధారపడ్డ స్థిర, సంచార కుటుంబాలన్నింటినీ బాధిత కుటుంబాలుగా పరిగణిస్తున్నట్లు నిర్దిష్టంగా ప్రకటించాలి.

వ్యవసాయం, తోటల పెంపకం, పాల, కోళ్ల, పట్టుపురుగుల, ఔషధ మొక్కల పెంపకం, పశు సంపద గల, తోట ఉత్పత్తులు గల భూములను వ్యవసాయ భూమిగా నిర్వచించారు. అయితే ఈ నిర్వచనంలో ఇంతకంటే స్పష్టత లేకపోవడం వల్ల అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. బీడు భూములు అని ఏ ప్రాతిపదికన పరిగణిస్తారు? అంటే ఉదాహరణకు ఏడాదిగానో రెండేళ్లుగానో బీడు పడి ఉన్న భూమిని వ్యవసాయ భూమిగా పరిగణిస్తారా లేదా? ఎన్ని సంవత్సరాలుగా బీడు ఉంటే పరిగణించరు? అనే స్పష్టత నిర్వచనంలో లేదు. కనుక వెంటనే దానికి స్పష్టత ఇస్తూ కనీసం 15 సంవత్సరాల క్రితం నుండి బీడు ఉంటేనే దాన్ని బీడుగా చూడాలి. లేకుంటే వ్యవసాయ భూమిగానే పరిగణించాలి. మరో అస్పష్టత ఏమిటంటే భూమిని ఫలానా వ్యక్తిదనో, కుటుంబానిదనో ఎలా నిర్ణయిస్తారో వివరించలేదు. అయితే మరో చోట పట్టా ఆధారంగానే పరిగణిస్తామని అన్నారు. అదే జరిగితే చాలా మంది దళితులు, పేద రైతులు పేదరికం కారణంగా కనీసం పట్టాకయ్యే ఖర్చులు కూడా భరించలేని స్థితిలో పట్టాలు లేకుండానే సాగు చేసుకుంటున్నారు. అలాగే అనేక మంది గిరిజనులు అటవీ ప్రాంతాలలో ఆదివాసీ భూములను ఉపయోగించుకుంటున్నారు. ఈ పట్టా నిబంధన నిజమే అయితే దానివల్ల పేదవాళ్లయిన దళితులు, గిరిజనులు చాలా నష్టపోతారని గమనించాలి. కనుక ఇందుకు సంబంధించిన స్పష్టమైన వివరణ ఇవ్వాల్సి ఉంది.

భూమిని ఏ అవసరాల కోసం సేకరిస్తారో తెలిపేందుకు ప్రజా ప్రయోజనం అనే పదాన్ని నిర్వచించారు. కేంద్ర నావిక, మిలిటరీ, వైమానిక, సైనిక, రక్షణ, రైల్వే, జాతీయ రహదార్లు, రేవులు, నీటిపారుదల, విద్యుత్, విద్యా, వైద్య, వ్యవసాయిక, పరిశోధన, వస్తు ఉత్పత్తి అవసరాల కోసం చేసే ఏ పనులైనా ప్రజా ప్రయోజనం పరిధిలోకి వస్తాయని నిర్వచించారు. అసలు ఎలాంటి పని అయినా పై పనులలో ఏదో ఒక దానికిందకు వస్తుంది. ఏదో ఒక రూపంలో ఆయా పనుల్లోని ఏదో ఒక అవసరం కిందకు వస్తుంది. అలాంటపుడు భూసేకరణలో నుంచి ఏ పనులను మినహాయించారో తెలియడం లేదు. ప్రతి పని ప్రజా ప్రయోజనం పరిధిలోకి వచ్చేట్లుగా భాషా చాతుర్యంతో నిర్వచించి, ప్రజా ప్రయోజనార్థమే అంటూ భూమిని సేకరించే హక్కును పొందడం అంటే తమకిష్టమైన ఏ పనికోసమైనా భూమిని సేకరించుకోమని అభిప్రాయమివ్వడమే. ఎవరైనా అడ్డు చెప్తే అది ప్రజా ప్రయోజనం కోసమే అని దబాయించడానికే ఈ నిర్వచనాన్ని జోడించారు. యథేచ్ఛగా ఎవరూ అడ్డు చెప్పకుండా భూమిని సేకరించే రాజమార్గానికి ఈ నిర్వచనం వీలు కల్పిస్తుంది. ఇదే నిర్వచనంలో సేకరించదలచిన

భూమిలో 80 శాతం బాధిత వ్యక్తుల అంగీకారం మేరకు భూమి సేకరించవచ్చునని చెప్పబడింది. అంటే మిగిలిన ఇరవై శాతం మంది ఇష్టాయిష్టాలతో, అంగీకారాలతో సంబంధం లేకుండా భూసేకరణ జరపవచ్చునన్న మాట. తమ భూమిని తమ అంగీకారం లేకుండా ఆక్రమించుకోవద్దని వ్యతిరేకించినందుకు ఈ ఇరవై శాతం మైనారిటీలో ఉన్నారన్న కారణంగా భూమిని కోల్పోవాలన్న మాట. ఇది వారి ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమే అవుతుంది. కనుక 80 శాతాన్ని వంద శాతంగా మార్చాలి. అందరూ ఒప్పుకుంటేనే ఆ ప్రాంతంలో భూమిని సేకరించాలి. లేకుంటే మరోచోటును వెతుక్కునే లాగా నిర్వచనాన్ని మార్చాలి.

భూసేకరణకు గాను సాంఘిక ప్రభావ మదింపు (సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ స్టడీ) అధ్యయనం చేయవచ్చు. ప్రజాభీష్టం, కుటుంబాలపై సాంఘిక, ఆర్థిక అంశాల ప్రభావం, భూముల పరిధి తదితర అంశాలపై ఈ అధ్యయనం జరుగుతుంది. ఇందులో ఇద్దరు సామాజిక శాస్త్రవేత్తలు, ఇద్దరు పునరావాస సంబంధిత నిపుణులు, ఒక సాంకేతిక నిపుణులుంటారని వారిలోంచి ఒకరిని ప్రభుత్వం చైర్‌పర్సన్‌గా నియమిస్తుందని, పర్యావరణ ప్రభావ మదింపు కోసం ఈ రిపోర్టు తప్పనిసరి అని అందులో పేర్కొన్నారు. ఇదంతా సాధారణంగా ప్రభుత్వాలు చేసే పనే. ఏదో ఒక కమిటీ నియమించడం, తమకు అనుకూలమైన వారిని అందులో నియమించడం, వారి ద్వారా అసలు పని నత్తనడకన సాగేటట్లు చూడడం, కంపెనీలకు భూమిని అప్పనంగా కట్టబెట్టే పనిలో వారు అడ్డు చెప్పకుండా చూడడం, అలా లేకుంటే తొలగించడం.. ఇవన్నీ వేలాది కమిటీలలో చూస్తూనే ఉన్నాం. అయితే ఈ కమిటీ బలహీనమైనపుడో, సభ్యుల పనితీరు సరిగ్గా లేనపుడో పారదర్శకంగా ఉన్నట్లు కనిపించేది. కానీ ఆ వివరాలు లేకపోవడం వల్ల ఈ కమిటీ ప్రజలకు ఏదో ఒరగబెడుతుందనే నమ్మకం మాత్రం కలగడం లేదు.

వంద కంటే ఎక్కువ ఎకరాల భూసేకరణ జరిగినపుడు పరీక్షించడానికి ప్రభుత్వం ఒక కమిటీని నియమించవచ్చునని బిల్లులో ఉంది. వారిలో రాష్ట్ర లేదా కేంద్రపాలిత ప్రాంత ముఖ్య కార్యదర్శి లేదా తత్సమాన అధికారి ఎక్స్ అఫిషియో చైర్మన్‌గా, ఆర్థిక, రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల కార్యదర్శులు ఎక్స్ అఫిషియో సభ్యులుగా, సంబంధిత రంగాల నుంచి ముగ్గురు అనధికారిక నిపుణులు సభ్యులుగా ఉంటారు. వంద కంటే తక్కువ ఎకరాల భూసేకరణకు మాత్రం ఒక చిన్నపాటి కమిటీ వేస్తారు. అసలు కమిటీలతో ఏదో ఒరుగుతుందని కాదు గానీ, వంద ఎకరాల కంటే తక్కువ భూమిని చిన్నచూపు చూడడమే కదా ఇది! అలాంటి సందర్భంలో కూడా పై కమిటీలాగే కొంత వ్యవస్థీకృతంగా ఏర్పరిచితే కనీసం చదివే వారికి ఒక తృప్తి అయినా కలుగుండేది.

ఇక నష్టపరిహారం విషయం చూస్తే భూమి దెబ్బతింటే లేదా పంట నష్టం కలిగితే, లేదా అంతర్గత సదుపాయాల కోసం, బాధిత కుటుంబాల పునర్నిర్మాణానికి గాని అవసరమైతే వడ్డీతో సహా నష్ట పరిహారం కల్పిస్తామని పేర్కొనబడింది. కానీ ఇందులో కూడా వివరాలు లేవు. స్పష్టత లేదు. ఒక సాగుభూమిని సేకరిస్తున్నప్పుడు రాబోయే రెండేళ్ల వరకు పంట విలువను చెల్లించడం న్యాయం అనిపించు కుంటుంది. భూమిని తీసుకున్న వెంటనే వెళ్లిపొమంటే అతని పొట్ట గడవడం ఎంత కష్టమవుతుందో ఆలోచించాలి. అందుకే రెండేళ్ల పంట విలువ అతనికి చెల్లిస్తే కొంత ఆసరా అయ్యే అవకాశముంటుంది. బిల్లులో చెప్పినట్లు 1899 భారత స్టాంపుల చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ ఆధారంగా పేర్కొన్న విలువ లేదా గత మూడేళ్ల రిజిస్ట్రేషన్ విలువలో సగం వ్యవహారాల వరకు చెల్లించిన గరిష్ట ధరలలో ఏది ఎక్కువ ధర అయితే దాన్ని మార్కెట్ ధరగా తీసుకుంటారు. అసలు మార్కెట్ ధరను నిర్ణయించాలంటే మార్కెట్‌లో పలుకుతున్న ధరను ప్రామాణికంగా తీసుకుంటే పోయేదానికి ఈ డొంక తిరుగుడు, అడ్డదిడ్డం ధరల లెక్కలు ఎందుకు? మార్కెట్‌లో ఉన్న ధరనే కదా ఆ భూమికి న్యాయమైన ధర? దానికి రూపాయి తగ్గించి ఇచ్చినా అన్యాయమే కదా? మరి ఈ లెక్కలన్నీ చేసి మార్కెట్ ధర కంటే తక్కువ ముట్టజెప్పడం, పైగా దానికి అర్థశాస్త్ర, గణాంక శాస్త్ర నైపుణ్యతను అడ్డుపెట్టుకోవడం ఏ మాత్రం సరైన చర్య అవుతుంది? నష్టపరిహారాన్ని కూడా అనేక దఫాలలో కాకుండా ఒకే దఫాలో ఇవ్వడం న్యాయం. లేకుంటే అన్ని వస్తువుల, అవసరాల ధరలు పెరిగిపోయి వచ్చిన పరిహారం వల్ల ప్రయోజనం లేకుండా పోతుంది. నష్టపరిహారం ఇచ్చేటపుడు కోల్పోయిన చెట్లు, మొక్కలు, పంటల విలువను కూడా జమకట్టాలి. నష్టపరిహారాన్ని చెల్లించిన తర్వాతే భూమిని స్వాధీనం చేసుకోవాలి. షెడ్యూల్డ్ 2బి ప్రకారం నష్టపరిహారంలో 25 శాతం షేర్లలో ఉంచుతామని అంటున్నారు. షేర్లు ఎప్పటికీ లాభాలలో ఉంటాయని చెప్పలేం కనుక అలాంటి ఆలోచనను విరమించుకోవాలి.

పునరావాస నిబంధనలను చూస్తే గ్రామీణ ప్రాంతాలలో వంద ఎకరాలు, పట్టణాలలో 50 ఎకరాల భూమిని ప్రైవేట్ అంగీకారాన ద్వారా సేకరించినపుడు సెక్షన్ 42 ప్రకారం పునరావాసం కల్పించాలి. ఇందుకు సంబంధించిన వివరాలు ఎక్కువగా లేవు. షెడ్యూల్ 3 ప్రకారం 25 రకాల వసతులను పునరావాస ప్రాంతంలో కల్పించాలని పేర్కొన్నా వాటికి హామీ ఇవ్వలేదు. భూమికి బదులు భూమి, ఇల్లుకు బదులు ఇల్లు, కుటుంబంలో ఒకరికైనా ఉద్యోగం, కోల్పోయిన సాంస్కృతిక జీవనం తిరిగి పొందేలా బస్తీలు, కాలనీల తరహా నిర్మాణాలు చేయడం లాంటి చర్యలను ఇందులో పేర్కొనలేదు.

ఇలా చెప్పుకుంటూ పోతే ముసాయిదా బిల్లు పొడుగునా అనేకానేక లోపాలు, లొసుగులు దర్శనమిస్తూనే ఉంటాయి. దేశవ్యాప్తంగా సెజ్‌లు, ప్రాజెక్టులు, వాటి అనుభవాలను నిరంతరం చూస్తూనే ఉన్నా వాటి ఆధారంగా బిల్లు రూపొందించాల్సింది పోయి బాధితుల బాధలను కనీసంగానైనా లెక్కలోకి తీసుకోకుండా చాలా నిర్లక్ష్యంగా ఈ బిల్లు రూపొందించబడింది. పర్యావరణ పరిరక్షణ విషయంలో, నిర్వాసిత కుటుంబాలు నష్టపోయిన సామాజిక, ఆర్థిక, జీవనానికి భద్రతనివ్వడంలో, వృత్తికారులు కోల్పోయిన వృత్తుల పునర్నిర్మాణం విషయంలో, భూమిని, ఇల్లును కోల్పోవడం అంటే సామాజిక చట్రంలో ప్రాథమిక పునాదిని కోల్పోవడమే అని, తద్వారా సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా కోలుకోలేనంత నష్టాన్ని పొందుతారని గ్రహించే మానవీయ జ్ఞానానికి సంబంధించిన అవగాహనను కనబరిచి నిర్వాసితు లకు ధైర్యాన్నివ్వడం విషయంలో, జాతీయ భూసేకరణ అవగాహనను కనబరచడంలో పునరావాస బిల్లు– 2011 విఫలమైందని చెప్పవచ్చు. భూమిని కోల్పోవడం అంటే తినే తిండిని, కన్నతల్లిని పోగొట్టుకోవడమే అని గ్రహించే విశాల హృదయం అలవడనంత వరకు ప్రజా ప్రభుత్వాలు తయారు చేసే ఇలాంటి బిల్లుల నుంచి ప్రయోజనాలను ఆశించడం అత్యాశ, దురాశ, పేరాశే అవుతుంది.

(రచయిత ఉపాధ్యాయులు, తెలంగాణ ఉద్యమ కార్యకర్త) వీ

ఈ దేశంలో భూ సంస్కరణల అవసరం ఎందుకుందో, ఎంత అవసరమో వివరిస్తున్నారు

ఎం. కోదండరాం, కె. సీతారామారావు

భూసంస్కరణ విధానాలు - ఒక సమీక్ష

1

రెండవ ప్రపంచ యుద్ధానంతరం పేదరికాన్ని నిర్మూలించడానికి, అసమానతలు తొలగించడానికి ఎన్నో ప్రపంచ దేశాలు భూసంస్కరణల విధానాలను రూపొందించి అమలుచేయడం జరిగింది. కులం సామాజిక పునాదిగా గల భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని విస్తరించడానికి, ప్రతి వ్యక్తికి ఒక విలువను ఆపాదించడానికి భూసంస్కరణలు ప్రధాన విధాన సాధనాలైనవి. భూసంస్కరణల ప్రధాన లక్ష్యం ఆర్థిక సమానత్వం ద్వారా రాజకీయ ప్రజాస్వామ్యాన్ని విస్తరించడం. జన సామాన్య సామాజిక-ఆర్థిక జీవితాన్ని నియంత్రించే కొద్దిమంది వ్యక్తుల శక్తిని భూమి పంపిణీ ద్వారా తొలగించవచ్చునని బాబాసాహెబ్ అంబేద్కర్ స్పష్టంగా తెలియ చేసినారు. భారతదేశంలో గత నాలుగున్నర దశాబ్దాలుగా జరిగిన అభివృద్ధి క్రమాన్ని, వ్యవసాయరంగంలో వచ్చిన మార్పులను పరిశీలిస్తే ఈ మార్పుకు దోహదం చేసిన ప్రధానమైన అభివృద్ధి విధానాలు, భూ సంస్కరణలు, సహకారోద్యమం, పంచాయితీరాజ్ ద్వారా ప్రజాస్వామ్య వికేంద్రీకరణ.

మనదేశంలోని వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాల చట్టాల ద్వారా భూ సంస్కరణల కార్యక్రమం అమలు చేయడం జరిగింది కాబట్టి ఇంక భూసంస్కరణలు అవసరంలేదని, భారత రాజకీయాల్లో భూసంస్కరణలు కాలం చెల్లిన విషయమని కొందరు వాదిస్తున్నారు. కాని ఇది సరైనది కాదు. భూసంస్కరణల అవసరాన్ని వ్యతిరేకించే వాదనకు అనుకూలంగా పేర్కొనబడే కారణాలు ప్రధానంగా :

1) భూసంస్కరణల విధానం ఇంతకు ముందువలె వ్యవసాయ రంగంలో ఉత్పాదకతనుగాని, గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగితా వకాశాలను గాని పెంచే పరిష్కార మార్గంగా తన శక్తిని కోల్పోయింది. భూకమతాల ఉపాంతీకరణ లేదా పరిమితీకరణ (Marginalisation) మూలంగా గ్రామీణ ప్రాంతాల్లో భూ-మానవ సంబంధాల్లో పెరుగుతున్న ఒత్తిడివల్ల భూమి పంపకానికున్న అవకాశాలు పూర్తిగా సన్నగిల్లి పోయినవి.
2) ఒకవేళ భూ పంపిణీ కార్యక్రమాన్ని మళ్లీ చేపడితే గ్రామీణ ప్రాంతాల్లో ప్రతికూల వాతావరణం ప్రబలుతుంది. అది సాంకేతికంగా ఉత్పాదకత పెరగడానికి ప్రతిబంధకం కలిగించడమే గాక వ్యవసాయరంగం నుండి వ్యవసాయేతర రంగాలకు శ్రమశక్తి తరలిపోవడాన్ని నిరోధిస్తుంది.
3) ప్రస్తుతం ప్రభుత్వాలు, స్థూలస్థాయిలో ప్రవేశపెడుతున్న ఆర్థిక, మార్కెట్ సంస్కరణలకు భూసంస్కరణల కార్యక్రమం అనుకూలించే అంశం కాదు. కాబట్టి భూసంస్కరణల వ్యతిరేక వాదులకు గ్రామీణ ప్రాంతాల్లో భూసంస్కరణలు ఒక అభివృద్ధి-సంక్షేమ విధానంగా కాలం చెల్లిన విషయంగా మారింది.
4) ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ ద్రవ్య సహాయ సంస్థలు వెనుకబడిన దేశాల అభివృద్ధి కోసం భూసంస్కరణలు సరియైన పరిష్కారమని ఒకనాడు భావించేవి. కాని ప్రస్తుతం ఇవి మార్కెట్టు ఆధారిత సంస్కరణలకిస్తున్న ప్రాధాన్యత అభివృద్ధి సంక్షేమ విధానాల కివ్వడం లేదు. ఈ పరిస్థితుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రభుత్వాలు భూసంస్కరణల అవసరాన్ని పూర్తిగా మరచినవి. పైన పేర్కొన్న వాదనలన్నీ కేవలం అపోహలపై, అనుమానాలపై అధారపడ్డవే కానీ వాస్తవాలపై మాత్రం కాదు.

భూసంస్కరణల విధానంపై ఇన్ని వ్యతిరేక వాదనలున్నప్పటికీ నోబెల్ బహుమతి గ్రహీత అయిన అమర్త్యసేన్ లాంటి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అభివృద్ధి ఆర్థికశాస్త్రవేత్తలు ప్రస్తుతం అమలవుతున్న నవ్య ఉదారవాద ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో కూడా ఒక సంక్షేమ విధానంగా భూసంస్కరణల అవసరముందని నొక్కి చెబుతున్నారు. అమర్త్యసేన్ అభిప్రాయం ప్రకారం 'సమాజ పునాదిని పటిష్టం చేయ కుండా ఆర్థిక సంస్కరణలు అమలుచేస్తే అవి ప్రతికూల ఫలితాలనిస్తాయి. సమర్థవంతమైన పరిపాలన అత్యంత కీలకమైన అంశం. విద్య (ప్రాథమిక, ఉన్నత), ప్రజారోగ్యం, సంక్షేమం, భూసంస్కరణలు, ఆర్థిక అవకాశాల విస్తరణ, స్త్రీ పురుష సమానత్వం మొదలైనటువంటి విషయాల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని ప్రభుత్వాలు ముందుకే పోవాలి కాని వెనక్కి తగ్గకూడదు' ఈ విలువైన అభిప్రాయాన్ని సులభంగా తిరస్కరించకుండా ప్రత్యేకంగా దృష్టిలో ఉంచుకోవాలి.

గ్రామీణ ప్రాంతాల్లో సమగ్రమైన, మౌలికమైన వ్యవసాయ సంస్కరణల్లో భాగంగా అమలుచేయాల్సిన భూసంస్కరణల విధాన అవశ్యకతను ఇక్కడ పేర్కొన్న వాస్తవాధారిత ప్రతిపాదనలు తెలియ చేస్తాయి. అవి ప్రధానంగా;

1. జాతీయాదాయంలో వ్యవసాయోత్పత్తి శాతం 60 నుంచి 24కి పడిపోయినా వ్యవసాయం దాని అనుబంధిత కార్యకలాపాల మీద ఆధారపడి జీవించే 60 శాతం జనాభా జీవితాల్లో ఆశించిన మార్పులేమీ రాలేదు,
2. అభివృద్ధి చెందిన దేశాల వ్యవసాయరంగంతో మనదేశ వ్యవసాయ రంగాన్ని పోల్చి చూస్తే అది ఇంకా ఆధునీకరింపబడక పోవడమే కాక, దాని ఉత్పాదకత చాలా తక్కువ స్థాయిలో ఉన్నది. దీనికి

కారణం వెనుకబడ్డ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడమే,

3. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో సంపన్నమైన, వ్యవసాయ యోగ్యమైన భూమి అతి కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరింపబడి ఉండి పోయింది. అది సమాజంలోని వివిధ వర్గాల మధ్య సమాన నిష్పత్తిలో పంపిణీ లేదు,
4. రైతాంగంలోని కిందిస్థాయిల్లో ఉన్న మధ్యతరగతి రైతులు, పేద రైతులు లేదా సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీవర్గాలు అనుభవిస్తున్న పేదరికం, దైన్యం, రుణభారం, రైతుల బలవన్మరణాలు వీటి ఫలితంగా ఏర్పడే గ్రామీణ అశాంతి, వ్యవసాయ సంక్షోభం, రైతాంగ ఉద్యమాలు,
5. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఆదాయాల మధ్య నిరంతరంగా పెరుగుతున్న అంతరం, వ్యవసాయోత్పత్తుల పారిశ్రామికోత్పత్తుల అసమ మార్పిడి అసమ సంబంధాలు,
6. గిరిజన ప్రాంతాల్లో ఆగకుండా కొనసాగుతున్న భూపరాయీ కరణ వంటి విషయాలు పరిశీలిస్తే మనదేశ రాజకీయాల్లో ఇప్పటికీ భూమి సమస్య అత్యంత ప్రధాన సమస్య అనేది నిర్వివాదాంశం.

ఈ మధ్యకాలంలో భారతదేశంలో వివిధ ప్రాంతాల్లోని వ్యవసాయ రంగంలో వైవిధ్యభరితమైన మార్పులు, ధోరణులు రావడాన్ని స్పష్టంగా గుర్తించవచ్చు. అవి: (1) ముఖ్యంగా వెనుకబడ్డ ప్రాంతాల్లో, సాగునీటి వసతి లేక మెట్ట వ్యవసాయం జరుగుతున్న ప్రాంతాల్లో వ్యవసాయ సంక్షోభం తీవ్రతరమవుతున్నది. రైతుల బలవన్మరణాలు నిరాఘాటంగా కొనసాగుతున్నవి. రైతాంగ ఉద్యమాలు బలంగా ఉన్న ఈ ప్రాంతాల్లో యాజమాన్యపు కమతాలు, సాగుచేయబడే కమతాలు (Ownership holdings and Operational holdings) ఉపాంతీకరించబడి భూ కమతాలపై క్రమంగా ఒత్తిడి పెరుగుతున్నది. ఫలితంగా ఈ ప్రాంతాల్లో భూ పునఃపంపిణీ కార్యక్రమాన్నికున్న అవకాశాలు అత్యంత వేగవంతంగా సన్నగిల్లిపోతున్నవి. (2) అభివృద్ధి చెందిన వ్యవసాయ ప్రాంతాల్లో లేదా హరిత విప్లవ ప్రాంతాల్లో పైన పేర్కొన్న ధోరణికి పూర్తిగా వ్యతిరేకమైన ధోరణి ప్రబలుతున్నది. ఈ ప్రాంతాల్లో వ్యవసాయ కమతాల ఏకీకరణ లేదా సంఘటితీకరణ (Consolidation of Operational holdings) ధోరణి క్రమంగా పెరుగుతున్నది. ఈ క్రమంలో విశాల భూకమతాల్లో భూ కేంద్రీకరణ ధోరణి త్వరితగతిన పెరుగుతున్నది. అంతేగాకుండా ఈ ప్రాంతాల్లో రివర్స్ టెనెన్సీ విధానం అమలవుతున్నది. అంటే సన్నకారు రైతులు వ్యవసాయ ఆధునీకరణలో భాగంగా పెరిగిన పెట్టుబడి ఖర్చులను భరించలేక తమ చిన్న చిన్న కమతాలను పెద్ద భూ యజమానులకు కౌలుకిచ్చి లేదా అమ్మివేసి వ్యవసాయ కూలీలుగా మారిపోతున్నారు. (3) అభివృద్ధి చెందిన, చెందని గ్రామీణ ప్రాంతాల్లో అలిఖిత కౌల్దారీ విధానం నిరాఘాటంగా అమలవుతున్నది. ఈ పరిస్థితి భూస్వాములకు, ధనిక రైతులకు అనుకూలించి చిన్న రైతాంగ వర్గానికి చెందిన కౌల్దార్లను మరింత కుంగదీస్తోంది. కౌల్దార్ల హక్కులకు రక్షణ కల్పించడానికి, న్యాయమైన కౌలు రేట్లు అమలు చేయడానికి ఇది పూర్తిగా ప్రతికూలమైన పరిస్థితి. (4) సమగ్ర, మౌలిక భూసంస్కరణల కార్యక్రమాన్ని తమకున్న భయంతో, అపోహలతో వ్యతిరేకించే గ్రామీణ ప్రాంతాల్లోని వర్గాలు ప్రధానంగా రెండు. అవి; ఒకటి, అస్థానిక, సాగుచేయని భూ యాజమాన్య వర్గం (Absentee non-cultivating land owners) ఇది ప్రధానంగా పట్టణ వాసానికి పరిమితమై ఉద్యోగ, దళారీ వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో స్థిరపడి గ్రామాల్లో ఇంకా భూవసతి కలిగిన వర్గం. వీరు ప్రధానంగా కౌలు గ్రహీతలు (Rent collectors), రెండవది స్థానిక వ్యవసాయవర్గం. వీరు ప్రధానంగా లాభార్జనాపరులు (Profit earners). ప్రభుత్వ నిర్దేశిత భూసంస్కరణల కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో ఈ రెండు వర్గాల నుండి ప్రధానమైన ప్రతిబంధకాల్ని ఎదుర్కోవాల్సివస్తుంది. వ్యవసాయరంగంలో ఉద్భవిస్తున్న ధోరణులను సమర్థవంతంగా ఎదుర్కొనాలంటే వ్యవసాయరంగ పరిస్థితిని కింది తరగతి రైతాంగ వర్గాలకు అనుకూలంగా మార్చాలంటే సమగ్ర వ్యవసాయ సంస్కరణల్లో భాగంగా భూసంస్కరణల కార్యక్రమం పన్నెండు సంవత్సరాల విరామంతో సమీక్షించబడి నిరంతరంగా అమలు చేయాల్సిందే. భూసంస్కరణల కార్యక్రమాన్ని కేవలం భూ పంపిణీ కార్యక్రమంగా గాక అనుబంధిత వ్యవసాయ సంస్కరణల్లో భాగంగా చూడాలి. అంతేగాకుండా భూకమతాల ఉపాంతీకరణ జరిగి భూమిపై ఒత్తిడి పెరుగుతున్న ప్రాంతాలకు, భూకేంద్రీకరణ పెరుగుతున్న ప్రాంతాలకు ఒకేరకమైన భూసంస్కరణల విధానం రూపొందించి అమలు చేయడం సాధ్యం కాదు. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న స్థూలమైన మార్పుల కనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో చలనశీలమైన చిన్న రైతాంగ వర్గాన్ని, సాంకేతికంగా స్థితి స్థాపకత్వం (Technologically resilient) కలిగిన వ్యవసాయార్థిక వ్యవస్థను అభివృద్ధి చేయాలంటే ఆయా ప్రాంతీయ పరిస్థితులకనుగుణమైన వికేంద్రీకృత నూతన భూసంస్కరణల విధానాలను రూపొందించి అమలుచేయక తప్పదు. కాబట్టి ఇప్పటికీ దేశ రాజకీయ ఆర్థికరంగంలో ఎల్.పి.జి. విధానాల మూలంగా వస్తున్న మార్పుల కనుగుణంగా వ్యవసాయ సంస్కరణలు, భూసంస్కరణలు పునర్నిర్వచించబడి ఎన్నో ప్రభుత్వ, ప్రజావేదికలపై చర్చించబడి నిజాయితీతో అమలు చేయాల్సిన అవసరమున్నదని చెప్పడానికి సందేహించాల్సిన అవసరం లేదు.

2

భారతదేశ రాజకీయ వ్యవస్థ సమాఖ్య రాజ్య వ్యవస్థ కాబట్టి భూసంస్కరణలకు చెందిన విధాన నిర్ణయం కేంద్ర ప్రభుత్వం చేస్తే రాష్ట్ర ప్రభుత్వాలు దీనికి అనుకూలంగా చట్టాలు రూపొందించి అమలుచేసే బాధ్యత వహించినవి. ఇప్పటివరకు భారతదేశంలో భూసంస్కరణల విధానం మూడు దశల్లో వివిధ మార్పులకులోనై రూపొందించబడి అమలుచేయబడింది. ప్రస్తుతం అమలవుతున్నవి మూడవ దశ భూసంస్కరణలు. మొదటి దశ 1950–65 మధ్యకాలం, 1951లో నిర్దిష్టంగా మొదటి దశకు చెందిన విధానం రూపొందడానికి ముందున్న కాలాన్ని స్వాతంత్ర్య పూర్వదశ, 1947–50ల మధ్యకాలంగా విభజించవచ్చు. స్వాతంత్ర్యం రావడానికి ముందు భారత జాతీయ కాంగ్రెస్‌లో వ్యవసాయ సంస్కరణలకు చెందిన రెండు భిన్నమైన ధోరణుల – సాంకేతిక, సంస్థానుగత ధోరణుల–మధ్య స్పష్టమైన చర్చ జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే 1947–50ల మధ్యకాలంలో కాంగ్రెస్ పార్టీచే నియమించబడ్డ వివిధ సంఘాలు వ్యవసాయ సంస్కరణలకు సంబంధించిన ప్రధానమైన సూచనలు చేశాయి. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఈ సమస్య మీద జరిగిన చర్చ 1947–50ల మధ్య కాలంలో వివిధ సంఘాలు చేసిన సిఫారసులు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం (1946–51) వంటి శక్తివంతమైన రైతాంగ ఉద్యమాలు మొదటి దశ భూసంస్కరణల విధానం రూపొందడానికి ప్రాతిపదికగా పనిచేశాయి.

రెండో దశ, 1970–83ల మధ్యకాలంలో భూసంస్కరణల విధానం రూపొందడానికి ప్రాతిపదికగా పనిచేసిన అంశాలు : భూ

సంస్కరణల చట్టాల గురించి పార్లమెంటు, శాసనసభల్లో జరిగిన చర్చ, వీటికి బయట పార్లమెంటరీ, పార్లమెంటేతర వామపక్ష పార్టీలు తమ రైతాంగ ఉద్యమాల్లో భాగంగా వ్యవసాయ సంస్కరణల మీద లేవదీసిన చర్చలో భాగంగా వచ్చిన అభిప్రాయాలు, 1969లో జరిగిన ముఖ్య మంత్రుల సమావేశంలో భూసంస్కరణల అమలును సమీక్షించి వెలిబుచ్చిన అభిప్రాయాలు, ప్రణాళికా సంఘంచే నియమించబడిన అధ్యయన సంఘం (Task Force Committee) వెలిబుచ్చిన అభిప్రాయాలు, 1970లో CLRC- కేంద్ర భూసంస్కరణల సంఘం సూచించిన మార్గదర్శక సూత్రాలు మొదలైనవి. మొదటి దశ భూసంస్కరణల అమలులో జమిందారీ రద్దు, కౌలుదార్ల రక్షణ వంటి చట్టాల అమలుకు ప్రాధాన్యతనిస్తే రెండోదశలో భూగరిష్ట పరిమితి చట్టాల అమలుకు, ప్రభుత్వ భూముల పంపిణీకి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్లు గమనించ వచ్చు.

మూడో దశ భూసంస్కరణలు సమకాలీన ప్రపంచీకరణ నేపథ్యంలో రూపొందించబడి అమలవుతున్న భూ పంపిణీ కార్యక్రమాలు. ఈ దశలో ప్రభుత్వం భూసంస్కరణల చట్టాలను సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలకు అనుకూలంగా, అనుగుణంగా మార్చి వేయడాన్ని గమనించవచ్చు. ప్రస్తుత దశలో అమలవుతున్న భూసంస్కరణ విధానాలకు స్త్రీల సాధికారికత (Women Empowerment) అనే కొత్త కోణాన్ని జతచేయడం జరిగింది. దీనితో పాటు యాజమాన్యపు హక్కులకు సంబంధించిన RoR పట్టాలు, ప్రభుత్వ భూముల పంపిణీ, అస్సైన్డ్ భూముల రక్షణ, అభివృద్ధి వంటి కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టడం గమనించవచ్చు.

3

ఇదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా మూడుదశల్లో భూసంస్కరణల చట్టాలు రూపొందించబడి అమలుకావడాన్ని పరిశీలించ వచ్చు. తెలంగాణలో భూదానోద్యమంతో పాటు జాగీర్దారీ రద్దు, కౌలుదారీ చట్టాలు రావడానికి ప్రధాన కారణం 1946-51 మధ్య కాలంలో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, వ్యవసాయ సామాజిక సంబంధాలపై దాని ప్రభావం ఇతర ప్రాంతంలో భూసంస్కరణల చట్టాల కంటే ఆనాటి కాలంలో తెలంగాణ ప్రాంతానికి వర్తించే భూసంస్కరణలు అత్యధిక ప్రగతిశీలమైనవిగా భావించడం జరిగింది. అటువంటి ప్రగతిశీలమైన భూసంస్కరణలు కూడా గ్రామాల్లోని రైతాంగం జీవితాల్లో ఆశించిన మార్పులు తీసుకొని రాలేకపోయినవి.

భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లో వలె తెలంగాణలో కూడా జాగీర్దారీ రద్దువల్ల వ్యవసాయ సంబంధాల్లో మౌలికమైన మార్పులేమీ రాలేదు. ఒక్క కలం పోటుతో కాగితాలపై జాగీర్దారీ విధానం రద్దయినది అంటే రాజ్యానికి రైతుకు మధ్యనున్న మధ్యంతర (Intermediary) వ్యవస్థ రద్దయిపోయింది. కానీ ఈ విధానానికి సారాంశమైన భూస్వామ్య సంబంధాలు అంటే జమీందార్ల, జాగీర్దార్ల, దేశ్‌ముఖ్‌ల రాజకీయార్థిక అధికారం మాత్రం రద్దు కాలేదు. ఖుద్ కాస్త్ (Khud Khast) - అంటే స్వంత సేద్యం పేరుతో సారవంతమైన భూములు స్వాధీనంలో ఉంచుకొని పూర్వపు జాగీర్దారులంతా పెద్ద భూస్వాములై నారు. జాగీర్దారీ విధానం రద్దు చేసినప్పటికీ దాని వెంటనే ఇతర సంబంధిత భూసంస్కరణల చట్టాలు సమర్థవంతంగా అమలు చేయక పోవడంవల్ల సారాంశంలో, జమీందారీ జాగీర్దారీ విధానంలో అంతర్భాగమైన అర్ధ-భూస్వామ్య వ్యవసాయ సంబంధాలు సమసిపోలేదు.

ప్రముఖ అర్థశాస్త్రవేత్త ఎ.ఎం. కుస్రో హైదరాబాద్ రాష్ట్రంలో జాగీర్దారీ విధానం రద్దు, వ్యవసాయ సంస్కరణల అమలు ప్రభావం అనే విషయం మీద చేసిన అధ్యయనం ఎన్నో నిజాలను వెలికితీసి మరెన్నో విలువైన అభిప్రాయాలను తెలిపింది. భారతదేశంలో ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే కౌల్దారీ రక్షణ చట్టాలు తెలంగాణ ప్రాంతంలో సమర్థవంతంగా అమలుచేయబడి పాక్షికమైన విజయాన్ని సాధించాయని చెప్పవచ్చు. తెలంగాణ రైతాంగ పోరాట ప్రభావమున్న ప్రాంతాల్లోనే ఈ కౌల్దారీ రక్షణ చట్టం మరింత సమర్థవంతంగా అమలు చేయడం జరిగింది.

తెలంగాణ ప్రాంతంలో ఈ చట్టం ద్వారా 32 వేలమంది కౌలుదార్లు భూ యజమానులైనారు. దాదాపు 82 వేల హెక్టార్ల భూమి కౌలుదారులకు బదిలీ చేయడం జరిగింది. అయినప్పటికీ కౌలుదారీ చట్టాల విజయం పాక్షికం మాత్రమేనని కుస్రో అభిప్రాయం. తెలంగాణ ప్రాంతంలో కౌల్దారీ చట్టాలవల్ల ఎక్కువగా లాభపడింది రైతాంగంలోని అగ్ర కులాలకు చెందిన ధనిక, మధ్యతరగతి రైతులే గాని నిమ్నకులాల్లోని పేదరైతులు, వ్యవసాయ కూలీలు మాత్రం కాదు. భూస్వాములు కౌలుకిచ్చిన భూములు తిరిగి స్వాధీనపరచుకొనే హక్కు, కౌలుదారులు తాము సాగుచేసే భూమిపై యాజమాన్యం పొందే హక్కులు, కౌలుదారులు ధాన్యం లేదా ధన రూపంలో చెల్లించే కౌలు లేదా రెంటు నియంత్రణకు సంబంధించిన అంశాలను దృష్టిలో ఉంచుకొని పరిశీలిస్తే కౌలుదారీ చట్టం విఫలమైందని చెప్పవచ్చు. భూస్వాములు కౌలుదారులను కౌలుకు చేసే భూముల నుంచి నిర్దాక్షిణ్యంగా వివిధ రకాల ఒత్తిడుల ద్వారా బేదఖల్ చేశారు. ఈ విధంగా బేదఖల్ చేయడాన్ని స్వచ్ఛంద లొంగుబాటు (Voluntary surrender) అనే అబద్ధపు ప్రచారంతో కప్పిపెట్టారు. అంటే కౌలుదారు తాము దున్నుతున్న భూములు స్వచ్ఛందంగా వదులుకొని భూస్వాములకు స్వాధీనపరిచారని నమ్మించారు. ఈ విధంగా భూస్వాములు కౌలుదారీ చట్టం అమలును సమర్థవంతంగా నిరోధించారు.

ఆచార్య వినోభా బావే నాయకత్వం కింద భూదానోద్యమం తెలంగాణ లోని పోచంపల్లి నుంచి మొదలు కావడంవల్ల ఆ ఊరిపేరు భూదాన్ పోచంపల్లిగా మారింది. భూదాన యజ్ఞాన్ని అహింసాయుత విప్లవంగా పేర్కొన్నారు. గాంధేయ మార్గంలో నడిచిన భూదానోద్యమం లక్ష్యం భూస్వాముల మంచి మనస్సును, దయాగుణాన్ని కదిలించి వాళ్లను ఒప్పించి తమకున్న మిగులు భూమిని పేదలకు పంచేటట్లు చేయడం. వినోబాజీతో సహా భూదానోద్యమ కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి సమావేశాలు నిర్వహించి మిగులు భూమిని సేకరించి భూమిలేని వారికి పంచారు. ఆ రోజుల్లో ప్రకటించిన గణాంక వివరాల ప్రకారం తెలంగాణ - ఆంధ్ర ప్రాంతం కలిసి మూడువేల గ్రామాల్లో దాదాపు రెండున్నర లక్షల ఎకరాలు స్వీకరించి ఒక లక్ష ఎకరాలు పంచగలిగారు. ఆ తరువాత కాలంలో భూదానోద్యమ లక్ష్యాలకు భూస్వాములు స్పందించడం మానేశారు. భూమి పంపకంలో రైతులు, వ్యవసాయ కూలీలు వారి పాత్రేమిలేకుండా కేవలం ప్రేక్షకులుగానే మిగిలిపోయారు. దానమిచ్చిన భూముల్లో ఎక్కువ భాగం వ్యవసాయ యోగ్యమైనవి కావు. భూస్వాములు తమ దయాగుణానికి చిహ్నంగా గుట్టలు, వాగులు-వంకలు కూడా దానం చేశారు. భూస్వాముల దయాగుణం మీద ఆధారపడితే భూములు వస్తాయనే భ్రమ రైతాంగానికి క్రమంగా తొలిగిపోయింది. చివరకు భూదానోద్యమం ఆశించి ఫలితాల నివ్వక హాస్యాస్పదంగా, అసంపూర్తిగా మిగిలిపోయింది.

(ఇంకా ఉంది)

(రచయితలు ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలలో రాజనీతి శాస్త్ర, ప్రభుత్వ పాలనాశాస్త్ర ప్రొఫెసర్) వీ

ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా రాష్ట్రంలో ఏర్పాటు కాబోతున్న యురేనియం ప్రాజెక్టులు ప్రజలకూ, పర్యావరణానికీ, భవిష్యత్తుకూ ప్రమాదకరమని అంటున్నారు **పి. వరలక్ష్మి**

మరో జాదూగూడ కానున్న కడప

భారతదేశ భవిష్యత్తు అణుశక్తి అవసరాల కోసం యుసిఐఎల్ (యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్) ఆంధ్రప్రదేశ్‌ను కీలక యురేనియం కేంద్రంగా చేయడానికి అత్యుత్సాహం ప్రదర్శిస్తోంది. దేశ అవసరాల్లో దాదాపు 25 శాతం యురేనియం ఖనిజాన్ని ఇక్కడి నుండి అది ఆశిస్తోంది. 1987 ఎన్.టి. రామారావు హయాంలోనే నాగార్జునసాగర్ దగ్గర, ఆ తర్వాత రణక్షేత్రంలో అణుకేంద్రాన్ని నిర్మించే ప్రయత్నాలు చేసి విఫలమైంది. మళ్లీ 2003లో నల్గొండ యురేనియం ప్రాజెక్టు లంబాపూర్, పెదగట్టు ఆదివాసీ ప్రజల తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంది. కడప జిల్లాలో విజయం సాధించాక అది రాష్ట్రమంతా విస్తరించే ప్రయత్నం చేస్తోంది. కాని 2009లో మరోసారి పెద్దమూల గ్రామస్తులు నల్గొండ జిల్లా చందాపేట వద్ద చిత్రియాల్ గ్రామంలో జరుగుతున్న సర్వే పనులను అడ్డుకున్నారు. ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో యురేనియం మైనింగ్ అవకాశాల గురించి అణుశక్తి విశ్లేషకులు చాలా మాట్లాడుతున్నారు. తుమ్మలపల్లి (పులివెందుల), కడపజిల్లాలోని దాని పరిసర ప్రాంతాలు కలిపి ప్రపంచం లోనే అతి పెద్ద యురేనియం స్థావరాల్లో ఒకటి అవుతుందని, కొత్తగా కనీసం ఒక డజను భారీ యురేనియం గనుల నుండి ఖనిజాన్ని వెలికి తీయొచ్చని అంటున్నారు. వేంపల్లెలో 160 కిలోమీటర్ల పొడుగునా మద్దిమడుగు నుండి చేలుపల్లి దాకా యురేనియం ఖనిజం లభ్యమవు తుందని అంచనా వేస్తున్నారు. ఒక్క తుమ్మలపల్లె చుట్టూతా 30 కిలోమీటర్ల లోపల 10 యురేనియం బ్లాకులు కనుగొన్నట్టు చెప్తున్నారు.

యుసిఐఎల్ 2007లో తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టు రూపంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి దన్నుతో ఆంధ్రప్రదేశ్‌లో కాలుమోపింది. తుమ్మలపల్లె యురేనియం నిక్షేపాలు వై.ఎస్. సొంత నియోజకవర్గం పులివెందులలో ఉన్నాయి. రాష్ట్రంలో యుసిఐల్ కార్యకలాపాలు మొదలు పెట్టడానికి అది వ్యూహాత్మకంగా మంచి ప్రారంభం అయింది. అయితే తొలుత సహజంగానే అది ప్రజల నిరసనను ఎదుర్కోవలసి వచ్చింది. పర్యావరణవాదులు, పౌర ప్రజాస్వామిక హక్కుల సంఘాలు వాళ్లను నడిపించాయి. 30ఏళ్ల వై.ఎస్. కుటుంబ నియంతృత్వంలో ఎన్నడూ వినపడని ధిక్కార స్వరం అది. కాని ఇక్కడి గ్రామీణ ఫ్యాక్షన్ రాజకీయ పద్ధతిలో తొందరగానే దాన్ని అణచివేయడం వాళ్లకు పెద్ద కష్టం కాలేదు.

పులివెందులలోకి రాకముందు అది ప్రవేశించిన ప్రతిచోటా గట్టి ప్రతిఘటనను ఎదుర్కొంది. ఒకరకంగా యుసిఐఎల్‌పై నల్గొండ ప్రజల పోరాటవిజయం ఇక్కడ జనాన్ని కదిలించడానికి పర్యావరణ వాదులకు, హక్కుల సంఘాలకు నైతికబలంగా ఉండింది. అయితే ఒకప్పుడు నల్గొండ యురేనియం మైనింగును గట్టిగా వ్యతిరేకిస్తూ 'ఒక ప్రతిపక్ష నాయకుడిగా కంటే వైద్యుడిగా' ఆయన వైఖరి ప్రకటించిన వైఎస్ ముఖ్యమంత్రి హోదాలో సొంత నియోకవర్గంలోకి దాన్ని స్వాగతించడం కడపజిల్లా దురదృష్టం.

10 సెప్టెంబర్ 2006న తుమ్మలపల్లెలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ ఆధునిక ప్రజాస్వామ్యాన్ని పరిహసించిందని హక్కుల సంఘాలు వ్యాఖ్యానించాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి తమ్ముడు, స్థానిక ఎం.పి. వైఎస్ వివేకానందరెడ్డి కనుసన్నలలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ ప్రజల అభిప్రాయాన్ని వినేందుకు నిరాకరించింది. స్వయంగా మానవ హక్కుల కార్యకర్త బాలగోపాల్‌తో సహా అణుశాస్త్రవేత్త గడేకర్‌కు చేదు అనుభవం ఎదురైంది. ఫ్యాక్షన్ మూకలు విసిరిన రాళ్లలో ఒకదాని నుండి గడేకర్ వెంట్రుకవాసిలో తప్పించుకున్నారు. జనాన్ని చాలా సునాయసంగా అంతే వ్యూహాత్మకంగా ఉద్యోగాల ఆశ చూపించి వర్గాలుగా చీల్చారు. మైనింగ్ ప్రాంతంలో గ్రామాలు భిన్న భౌగోళిక పరిస్థితులలో ఉండడం వాళ్లకు కలిసి వచ్చింది. నీటిసౌకర్యం ఉండి, మంచి వ్యవసాయ భూములున్న భూమయ్యగారి పల్లె ప్రజలు వాళ్ల భూములకు బదులుగా ఇవ్వజూపిన నష్టపరిహారాన్ని తిరస్కరించారు. కాని కనాకష్టంగా పండే బీడు భూములున్న వాళ్లను స్థానిక రాజకీయ నాయకులు యుసిఐఎల్ అధికారులు సులభంగా బుట్టలో పడేశారు. చాలామంది తమ భూముల్ని ముందుగానే మూడోపార్టీలకు అమ్మేసుకున్నారు. ఆ గ్రామాల వాళ్లు, భూములు కొన్న బైటి ప్రాంతాల వాళ్లు ప్రాజెక్టు వ్యతిరేకుల మీద తిరగబడ్డారు. నిస్సందేహంగా అది పాలకులు పన్నిన వ్యూహంలో భాగమే. ఇరువర్గాలు యురేనియం వ్యతిరేక, అనుకూల నినాదాలు చేస్తూ రాళ్లు రువ్వుకున్నారు. పోలీసులు ప్రాజెక్టు వ్యతిరేకులపైనే లాఠీచార్జీ చేసి కేసులు బనాయించి ఆ తర్వాత తీవ్ర పరిణామాలుంటాయంటూ బెదిరించారు. ఫలితంగా 971.63 హెక్టార్లలో విస్తరించిన యురేనియం ప్రాజెక్టు వచ్చింది. అక్కడి భూగర్భం నుండి యురేనియం ఖనిజాన్ని హైడ్రోమెటలర్జికల్ విధానంలో వెలికితీయడానికి అన్నీ సిద్ధమయ్యాయి. దేని ముందైతే మానవ జీవితాలకు ఏ విలువా లేకుండా అయిపోయిందో ఆ అత్యంత విధ్వంసక పదార్థం అక్కడ మొలకెత్తింది.

నాలుగు సంవత్సరాలు గడిచాయి. గ్రామస్తులకు స్థానిక నాయకులు, యుసిఐఎల్ హామీ ఇచ్చిన ఉద్యోగాలు రాలేదు. కాని మొదటి దశ మైనింగ్ వాళ్లపై సమ్మెట దెబ్బలు వేసింది. భూగర్భ జలాలు వేగంగా అడుగంటిపోతూ 200బోర్లు ఎండిపోయాయని, ఉన్న భూగర్భ

జలాలు కలుషితమవుతున్నాయని, వాటివల్ల పాత్రలకు చిల్లులు పడుతున్నాయని వాళ్లు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్నవారు లేరు. వాటిని పరీక్షించేందుకు కూడ ఎవరూ రాలేదు. ఇదిలా ఉండగా ఉత్పత్తి లక్ష్యాలను పెంచుతూ (రోజకు 3000టన్నుల నుండి 4500టన్నులకు) మైనింగ్ విస్తరణ కోసం యుసిఐఎల్ పెట్టిన ప్రతిపాదన మరింతగా మంటలు రేపింది.

ఈలోగా ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి మరణం, అతని కొడుకు జగన్మోహనరెడ్డి కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా మారడం రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసింది. తండ్రి రాజకీయ వారసత్వాన్ని ఆశిస్తున్న జగన్ ఇప్పుడు ప్రజల తరపున మాట్లాడుతున్నాడు. ప్రజల డిమాండ్లు నెరవేర్చేంత వరకు ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటామంటూ యుసిఐఎల్‌ను హెచ్చరిస్తున్నాడు. కాని ఇక్కడ సమస్యను ఉద్యోగకల్పన చుట్టూ తిప్పుతూ దాన్నే ముందుకు పెట్టి కీలకమైన పర్యావరణ, ప్రజారోగ్య విషయాలను పక్కకు నెడుతున్నారు. అయితే ప్రజాభిప్రాయ సేకరణ మూడుసార్లు వాయిదా వేయవలసి రావడం చూస్తే యుసిఐఎల్ ఎలా ఉక్కిరిబిక్కిరి అవుతోందో అర్థమవుతుంది. ఏ ప్రజలనైతే ప్రహరీ గోడ ఆవలకు గెంటివేశారో వాళ్లకిప్పుడు సమాధానం చెప్పుకోవాలి. చెప్పుకునే అవసరం ఉండకనూ పోవచ్చు. ఎందుకంటే భూగర్భ జలాలన్నీ ఎండిపోతే జీవనాధారాన్ని కోల్పోయిన ప్రజలు అనివార్యంగా ఊళ్లొదిలి వెళ్లిపోవచ్చు.

అయితే ఈ ఆందోళనల నేపథ్యంలో యుసిఐఎల్ ఇక్కడ ఒక సర్వే నిర్వహించి అవన్నీ అర్థరహితమైన భయాలని కొట్టిపడేస్తూ ప్రకటన విడుదల చేసింది. ప్రజాసంఘాలు చొరవ చూపి శాస్త్రవేత్తలచే ఒక స్వతంత్ర్య పరిశీలన జరిపించింది.గ్రామాల్లో పర్యటించాక ఇక్కడి ప్రజలు లేవనెత్తిన సమస్యలను పరిశీలించిన జియాలజీ ప్రొఫెసర్ జి.కృష్ణారావు వాటి కారణాలను విశ్లేషిస్తూ ఒక రిపోర్టు తయారుచేశారు. ఒకసారి గనిలో ఉత్పత్తి మొదలయితే ఈ ప్రాంతంలో భూగర్భజలం భవిష్యత్తు ఆందోళనకరంగా ఉన్న విషయాన్ని ఆయన రిపోర్టు నొక్కిచెబుతుంది. జూన్ నెలలో జరిపిన ఈ పరిశోధన గ్రామస్తులు పదే పదే చేస్తున్న ఫిర్యాదులపై దృష్టి పెట్టింది.

మైనింగ్ లోతు భూగర్భజలం కన్నా 75 నుండి 145 మీటర్ల వరకు పోయింది. ఇక్కడ భూ ఉపరితలం నుండి 13, 14మీటర్ల లోపల నీటినిలువ ఉంటుంది. ఈ నీటిని వెడల్పాటి దిగుడు బావుల ద్వారా లేదా ఇటీవలి కాలంలో బాగా ఎక్కువగా 19 నుండి 58 మీటర్ల వరకు దించిన బోరు పంపుల ద్వారా వినియోగించుకుంటు న్నారు. గని నుంచి నీటి విడుదల రోజుకు 1845క్యూబిక్ మీటర్లుగా చెప్తున్నారు.

మైనింగ్ వల్ల పరిసర గ్రామ ప్రజలు అనుభవిస్తున్న దుష్పరిణా మాలపై శాస్త్రీయ వివరణలు ఇవి:

1. ఈ ప్రాంతంలో భూగర్భజలాలు ఇంకిపోవడం వల్ల 130బోర్లు ఎండిపోయాయి. మైనింగ్ లోతు బోరుబావుల లోతుకన్నా ఎక్కువ ఉండటం వల్లే ఈ పరిస్థితి. ఈ యురేనియం ప్రాజెక్టు ప్రాంతంలో ప్రతి ఏటా వర్షపాతం వల్ల 4,90,000 క్యూబిక్ మీటర్ల నీరు భూగర్భం లోకి చేరుతుంటుంది (8.4 శాతం ఇన్‌ఫిల్ట్రేషన్ ఫ్యాక్టర్ ప్రకారం). గని తవ్వడం వల్ల బైటికిపోయే నీరేమో ఏడాదికి 6,70,000 క్యూబిక్ మీటర్లు. అంటే నీటి విడుదల, నీటి పునరుద్ధరణ కన్నా ఎక్కువన్నమాట. అంటే ప్రకృతి నుండి మితిమీరిన నీటి దోపిడి జరుగుతోంది. ఇక్కడి భూగర్భ నీటితో అనుసంధానంలో ఉన్న పరిసర ప్రాంతలకు కూడ ఈ పరిస్థితి విస్తరిస్తుంది. మైనింగ్ కార్యకలాపాలు నడిచే 30 ఏళ్లపాటు భూగర్భ జలాన్ని గనులు తోడేస్తాయి. దాంతో అన్ని నీటివనరులు కాలక్రమేణా ఎండిపోయి జనానికి తాగు, సాగు నీటి కరవు ఏర్పడు తుంది. ప్రభావిత ప్రాంత విస్తీర్ణం నమూనా అధ్యనాల నుండి అంచనా వేయొచ్చు. ఇప్పటికే జిల్లాలో ప్రాజెక్టు ప్రాంతం, దాని పక్కగ్రామాలు భూగర్భజలం లభ్యతలో ప్రమాదస్థాయిని (సెమీ క్రిటికల్ స్థాయిని మించి) చేరుకున్నాయి.

2. ఈ ప్రాంతంలో భూగర్భజలాలు కలుషితమయినట్లు, వాటివల్ల పాత్రలకు చిల్లులు పడుతున్నాయని చెప్తున్నారు.

మైనింగ్ ప్రాంతాల్లో తవ్వకాల వద్ద, ఖనిజం కుప్పగా పోసిన దగ్గర, శుద్ధి చేసేటప్పుడు వెలువడే వ్యర్థాల వల్ల ఉపరితల, భూగర్భ జలాల కాలుష్యం తెలిసిందే. కాల్షియం, మెగ్నీషియం, ఇనుము వంటి రసాయనాలు ఖనిజం ఉన్న రాతిలోకన్నా గని అంచుల(టెయిల్ ఎండ్స్) వద్ద తక్కువగా ఉండటాన్నిబట్టి అవి నీటి ప్రవాహాలకు గురయ్యాయని చెప్పొచ్చు. నీటిలో కరగని నికెల్, మాంగనీస్ టెయిల్ ఎండ్స్ వద్ద కేంద్రీకరించడ్డాయి.

మైనింగ్ ప్రాజెక్టు ఉన్న ప్రాంతం, దాని పరిసర ప్రాంతాలు భూగర్భజల కాలుష్యానికి గురవుతాయి. ఈ నేల స్వభావరీత్యా పెద్ద రంధ్రాలున్న జల్లెడలాగా ఉండటం వల్ల కలుషిత పదార్థాలను దూరాలకు వ్యాపింప జేయగలవు. మొత్తం భూగర్భ జలమంతా పోయి ఇది బీడుబారి పోతుంది. తిండి, నీళ్లులేక జనం ఊర్లు ఖాళీ చేసిపోయే పరిస్థితి రావచ్చు.

3. ప్రాజెక్టు ప్రాంతంలో ఖనిజ నిల్వలు, వ్యర్థాలు నిలువేసే టెయిల్ పాండ్స్‌కు సంబంధించి ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టక వాటిని నిర్లక్ష్యంగా నేలపైనే వదిలేశారు. మొట్టమొదట వాటిని నీళ్లకని ప్రత్యేక గుంటల్లో, చెరువుల్లో నిల్వచేయాలి. వ్యర్థాలు భూమిలోకి ఇంకకుండా వాటిని సాంకేతిక పద్ధతిలో నిర్మించాలి. తర్వాత రేడాన్ వాయువు, రేడియోధార్మికతను తగ్గించడానికి వ్యర్థాలను ఉపరితలంలో నీటితో తడపాలి. చివరిగా వాటిని కేవలం మట్టితోకాక రెండు మీటర్ల మందంతో బంకమట్టి, ఇసుకతో కప్పాలి.

4. ఖనిజాన్ని చాలా మెత్తని పొడిగా (100 మెష్ గుండా పోయేంత సున్నగా) చేస్తున్నారు. మెత్తని పిండిలాగా ఉన్నప్పుడు ఆల్ఫా కిరణాల ప్రభావం ప్రమాదకర స్థాయిలో ఉంటుంది.

తాజాగా సెప్టెంబర్ 9న ప్రొ.కృష్ణారావు స్వయంగా యురేనియం మైనింగ్ జరుగుతున్న ప్రాజెక్టు పరిధిలోని మొత్తం ఐదు గ్రామాలనూ – తుమ్మలపల్లె, రాయకుంటపల్లె, మబ్బుచింతలపల్లె, భూమయ్యగారిపల్లె, కొట్టాలు – పర్యటించి మరోసారి ఇక్కడి నేలస్వభావాన్ని, నీటి పరిస్థితిని అధ్యయనం చేసి ఈ కింది అంచనాలకు వచ్చారు.

మైనింగ్ ప్రాంతం ఎగుడుదిగుడు గుట్టలు, లోయలతో కొండప్రాంతపు భౌగోళిక స్వరూపంతో ఉంది. యురేనియం ఖనిజం డోలమైట్ ఉన్న సున్నపురాయి, బంకమట్టితో ఏర్పడిన పర్పుల్ షేల్, క్వార్ట్జైట్‌లతో కూడిన ఎగుడుదిగుడు కడపరాతి పలకలతో (షియర్ జోన్) ఏర్పడిన నేలలో ఉంది. ఈ రాయి దట్టంగా, చీలికలతో ఏర్పడుతుంది. ఈ చీలికలు మరింత ఎక్కువై రాతిని రెండుగా చీల్చాయా అన్నట్టు ఉంటుంది. (జియాలజీలో వీటిని జాయింట్ సెట్స్ అంటారు). ఇలాంటి ప్రాంతంలో పుష్కలంగా భూగర్భజలం ఉంటుంది. ఇక్కడ అధిక సంఖ్యలో వేసిన బోర్లు, వాటికింద అరటి తోటల సాగు ఇందుకు రుజువుగా కనపడుతుంది.

రాజ్ బహదూర్ గౌర్



తొలితరం కమ్యూనిస్టు నేత, తెలంగాణ సాయుధపోరాట సేనాని, కార్మికోద్యమ నాయకుడు, సాహితీవేత్త, డా. రాజబహదూర్ గౌర్ (94) అనారోగ్యంతో 7 అక్టోబర్ 2011న చనిపోయారు. ఆయన 1918 జూలై 21న హైదరాబాద్ పాత నగరంలోని గౌలిపురాలో అమరావతి, రాయ్ మహబూబ్ రాయ్ దంపతులకు పుట్టిన రెండవ సంతానం. ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాద్ జిల్లా కిషన్‌పూర్ గ్రామానికి చెందిన గౌర్ తండ్రి హైదరాబాద్ నగరానికి వచ్చి స్థిరపడ్డారు. గౌర్ తెలంగాణ సాయుధ పోరాటంలో ముందు వరుసన నిలిచారు. 1940లో ఆయన భారత కమ్యూనిస్టు పార్టీలో సభ్యులయ్యారు. కమ్యూనిస్టు ఉర్దూ కవి మఖ్దూం మొహియొద్దీన్ సహచరుడు. స్వయంగా తుపాకి చేతపట్టి పోరాడారు. దళాల సాయుధ చర్యలకు నేతృత్వం వహించారు. భారత సైన్యాల ప్రవేశించిన అనంతరం పలు పరిణామాల్లో భాగంగా ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ఆయుధం వదిలి పెట్టింది. ఆ సమయంలో జైలులో ఉన్న గౌర్ 1952లో పార్టీ నిర్ణయం మేరకు అక్కడి నుంచే రాజ్యసభకు ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ప్రజాస్వామిక పద్ధతుల్లో ప్రజల, కార్మికుల సమస్యలపై పోరాటం చేశారు. సాహిత్య ఉద్యమాలపైన తనదైన ముద్ర వేశారు. 'ట్రై కలర్ షల్ ఫ్లై ఓవర్ హైదరాబాద్', మఖ్దూం సాహిత్యాన్ని పరిచయం చేస్తూ ఆంగ్లంలో ఒక గ్రంథం, 'గ్లోరియస్ తెలంగాణ ఆర్మ్‌డ్ స్ట్రగుల్', 'అదబీ ముతల్‌హే' ఉర్దూ వ్యాస సంకలనం, 'రాండం రాంబ్లింగ్స్' గ్రంథాలతో పాటు దాదాపు 100కు పైగా రాజకీయ, ఆర్థిక, సాహిత్య, సాంస్కృతిక సంబంధమైన వ్యాసాలను రాశారు. ఉర్దూ సాహిత్య అకాడమీ 1991లో 'బహదూర్ షా జఫర్' అవార్డ్‌తో సత్కరించింది. ఇటీవల హైదరాబాద్ లోని ఉర్దూ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సన్మానించింది. ఆయన తన వీలునామాలో కోరుకున్న విధంగా ఆయన భౌతిక కాయాన్ని ఆయన వైద్య విద్యను అభ్యసించిన ఉస్మానియా మెడికల్ కాలేజీకి వైద్య విద్యార్థుల పరిశోధన కోసం అక్టోబర్ 8న అప్పగించారు. అంతిమయాత్రలో పెద్దఎత్తున ప్రజలు, ప్రజా సంఘాల నేతలు, నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.

యురేనియం కోసం సర్వేలు చేస్తున్నపుడు వాటికి సంబంధించిన చర్యల వల్ల బోర్లనుండి నీళ్లు పైకి వచ్చాయని తెలిసింది. అంటే భూగర్భజలం మహా అయితే ఐదారేళ్ల క్రితం నుండి వృద్ధి చెంది ఉండొచ్చు. భూమి స్వభావాన్నిబట్టి బోరుబావుల లోతు 150నుండి 300అడుగుల వరకు ఉంది. 2-3 ఇంచిల వ్యాసార్థంగల పైపుల నుండి వారు నీటిని తోడుకుంటున్నరు. జిల్లాలో మిగతా ప్రాంతాలతో పోలిస్తే పరిమాణంలో ఇవి చాలా పెద్దవి. మైనింగ్ మొదలవ్వడం వల్ల రెండు సంవత్సరాల నుండి చాలా వరకు బోర్లు ఎండిపోయాయి. జనం ఇంకా లోతుకు 350 నుండి 450 అడుగుల వరకు బోర్లు దించారు. కొన్ని చోట్ల 600 నుండి 800 అడుగుల లోతుకు పోయారు. వీటిలో కొన్ని ఫెయిలయ్యాయి. లోతుకు పోవడంతో రాతి స్వభావంలో మార్పురావడం వల్ల అలా జరిగిందనేది స్పష్టం.

మొదట్లో స్థిర నీటి నిలువలు అంతలోతుకు లేకుండా ఉండేవి. సబ్‌మెర్సిబుల్ పంపులు 100 అడుగుల వరకు ఉండేవి. కొత్తగా వేసిన బోర్లలో ఇప్పుడవి 300 నుండ 400 అడుగుల వద్ద ఉన్నాయి. భూమయ్యగారిపల్లెలో 50అడుగుల దూరంలో ఉన్న రెండు తాగునీటి బావుల్లో నీటి నిలువ (అవి నిజానికి వాస్తవమైనవి కావు - సూడో వాటర్ లెవెల్స్) భూమినుండి 132 అడుగుల లోతున ఉన్నాయి. కాని స్విచ్చి వేసిన 5ని మిషాలకే నీళ్లెపోయాయి. బోరు 350 అడుగులకు తవ్వితే పంపు 300 అడుగుల వద్ద పెట్టారు. అంటే మొదటి నీటి ఊట ఎండిపోయింది. ప్రస్తుతం అది 350 అడుగుల లోపల ఉండొచ్చు. ఒకప్పుడవి 50 అడుగుల లోతులోను ఉండేవి. ఈ లెక్కన నీటి మట్టం పడిపోతూ వస్తే 2000 అడుగులలోతు వరకు మైనింగ్ చేరుకునేసరికి క్రమంగా ఆ ప్రాంతంలో పూర్తిగా నీరు మాయమవుతుంది. ఇక నీటి నాణ్యత భూమిపొరలనుబట్టి, అందులోని ఖనిజాలనుబట్టి మారిపోతూ ఉంటుంది. ఏమైనా నీరే లేకుండా పోతున్నప్పుడు దాని నాణ్యత అంత ప్రాముఖ్యతున్న విషయం అవదు.

అణువిద్యుత్ ఒక విధ్వంసకశక్తి రూపమే కాదు. అది పెట్టుబడి సంచయనానికి, మానవసమాజంపై ఆధిపత్యానికి ఒక నమూనా. అది అమెరికా వంటి సామ్రాజ్యవాద దేశాలకు ప్రపంచాన్ని బెదిరించి వనరులను దోచుకునే శక్తిగా ఉపయోగపడుతుంది. జపాన్‌పై అణుబాంబు దాడి సామ్రాజ్యవాద శక్తి ఎంత గొప్పదో ప్రపంచానికి చాటింది. అప్పటి నుండి మిలిటరీ శక్తికో, ఆత్మరక్షణకో అణుశక్తి దేశాల రక్షణ వ్యయంలో ప్రధాన భాగమైపోయింది. సామ్రాజ్యవాదం యురేనియం అన్వేషణ, దిగుమతి, అణుసాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేసుకోడమో, కొనుక్కోడమో తప్పనిసరి చేసింది. ఇదంతా అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందాల మాటునే జరుగుతుంది. ఎవరికి అణు సహకారం అందించాలి (అమ్మాలి), అణ్వాయుధాల్ని తయారు చేస్తున్నారన్న నెపంతో ఏ దేశాలపై దాడులు చేయాలి అన్నది సామ్రాజ్యవాద మార్కెట్ వ్యూహాల్లో భాగం. మరోవైపు అణువిద్యుదుత్పత్తి భారీ ఖర్చుతో కూడిన వ్యవహారం. ఇందులో ఎంత తక్కువ శాతం చేతులు మారినా విపరీతంగా డబ్బు కూడబెట్టుకోవచ్చు. అందుకే కావొచ్చు, అధికార్లకు, ప్రజాప్రతినిధులకు దీని పట్ల విపరీతమైన ఆసక్తి.

నేరుగా ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని ప్రభావితం చేసే అణువిద్యుత్ గురించి కాని అణు ఒప్పదాల గురించి కాని చర్చ ప్రజల్లోకి వెళ్లింది చాలా తక్కువ. అణుశక్తిని వ్యతిరేకిస్తే వాళ్లు తరచుగా దేశభక్తి దాబాయింపులను, అభివృద్ధివాదాన్ని ఎదుర్కోవలసి వస్తుంది. అణుశక్తికి వ్యతిరేకంగా నిర్మాణమయ్యే సామాజిక ఉద్యమాలు దానిని రాజకీయంగా, భావజాలపరంగా ఎదుర్కోవలసిన అవసరం ఉంది.

(రచయిత విప్లవ రచయితల సంఘం కార్యవర్గ సభ్యురాలు) వీ

అంబేద్కర్ చిన్న రాష్ట్రాల విషయంలో వ్యక్తం చేసిన అభిప్రాయాలను తప్పుగా అన్వయిస్తున్నారంటూ, అంబేద్కర్ చెప్పిన విషయాలను వివరిస్తున్నారు **ఎం. కృష్ణ ఆదిత్య**

భాషా ప్రయుక్త రాష్ట్రాలపై అంబేద్కర్

తెలంగాణ సమస్యపై కేంద్రం ఏం చేయబోతున్నది? ప్రత్యేక వాదుల ఆందోళనలు ఏ మలుపులు తిరగనున్నాయి? అన్న ప్రశ్నలు ముందుకొస్తాయి. అంబేద్కర్ ఇవాళ ఉండి ఉంటే, తప్పకుండా తెలంగాణ ఏర్పాటుని సమర్థించి ఉండేవారు – అన్నట్లుగా పదేపదే బల్లలు గుద్దుతున్నారు. ఈ పూర్వరంగంలో అసలు ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాల విశ్లేషణ సముచితంగా ఉంటుంది. అయితే స్థలాభావం వల్ల కొద్ది అంశాలకే పరిమితమవడం అనివార్యం.

23 ఏప్రిల్ 1953లో నాటి టైమ్స్ ఆఫ్ ఇండియాలో భాషా ప్రయుక్త రాష్ట్రాల సమస్యపై అంబేద్కర్ వ్యాసం ఒకటి ప్రచురితమైంది. పార్లమెంట్‌లో 1951 ఫిబ్రవరిలో కేంద్ర న్యాయశాఖ మంత్రిగా 'హిందూ కోడ్' బిల్లుని ప్రవేశపెట్టారు. ముందిచ్చిన మాటతప్పి ప్రధాని నెహ్రూ కాంగ్రెస్ నాయకత్వం ఆ బిల్లును బలపరచడం మానుకొన్నాయి. విరక్తి చెందిన అంబేద్కర్ 1951 సెప్టెంబర్‌లో మంత్రివర్గం నుంచి రాజీనామా చేశారు. ఆ తరువాత కాలంలో రాసిన వ్యాసం ఇది. పొట్టి శ్రీరాములు మరణం తరువాత ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు సమస్యను చర్చించిన ఆ వ్యాసం విశ్లేషణ ఇది. భాషా ప్రయుక్త రాష్ట్రాల సూత్రాన్ని కాంగ్రెస్ వాదులంతా అంగీకరించిన వారే, అయినా పొట్టి శ్రీరాములు చావాల్సి రావడం విషాదకరం. ఇప్పుడు ఆలోచిస్తున్న ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు ప్రధానిచే 'పిండ ప్రదానం' వంటిది. మరే దేశంలోనైనా ఇలాంటివి సహించేవారా? అని ఇప్పుడు ఆలోచించడం వల్ల ఉపయోగం లేదు అంటారు అంబేద్కర్. ఈ వ్యాసంలో భాషా రాష్ట్రాలు అవసరమే అని చెప్తూ, అయితే దానికి కొన్ని 'చెక్స్ అండ్ బ్యాలెన్సెస్' ఉండాలంటూ ఈ వ్యాసం ముగించారు.

సమస్య చారిత్రక నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ, ఈ సమస్య ఎప్పుడూ ఉన్నదేకానీ బహుభాషా ప్రాంతాల్లో ఆయా ప్రజల సాంస్కృతిక ఆకాంక్ష లని బ్రిటిష్‌వారు అంతగా పట్టించుకోలేదు. అయితే బ్రిటిష్ హయాంలోనే బెంగాల్, బీహార్, ఒడిశాలను భాషా రాష్ట్రాలుగా పునర్విభజించారు. ఇలా మొదలుపెట్టిన ప్రక్రియని చివరి దాకా తీసుకెళ్లేవారా అంటే జవాబు చెప్పడం కష్టమే అన్నారు అంబేద్కర్. ఇక కాంగ్రెస్ వైఖరి? 1920లోనే గాంధీ నాయకత్వంలో ఈ సూత్రాన్ని తమ నిబంధనావళిలో ఆమోదించారని గుర్తు చేశారు. అయితే ఒక సిద్ధాంతంగా ఆ పని చేసారా? ప్రజలని ఆకట్టుకోవడానికా అన్నది అప్రస్తుతం అంటూ ముందుకు సాగారు.

1945లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు కాగానే, 'భాషా రాష్ట్రాల ఏర్పాటు సమస్య' మళ్లీ ముందుకొచ్చింది, ఒక పార్లమెంట్ సభ్యుడి తీర్మానం రూపంలో అని గుర్తుచేశారు. పార్లమెంట్‌లో ప్రభుత్వం పక్షాన ఈ చర్చకు జవాబు చెప్పాల్సిరావడంతో 'ఉన్నతాధి కారులను' సంప్రదించాను. వింతగా కనిపించవచ్చు, కాని భాషా రాష్ట్రాల ఏర్పాటుకి పూర్తిగా వ్యతిరేకంగా ఉండింది. దానితో ప్రధాని (నెహ్రూ) యే జవాబు చెప్పడం మంచిదని భావించారు. మొత్తం భాషా రాష్ట్రాల సమస్యకు పరిష్కారం కాకుండా, 'వెంటనే ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకి వాగ్దాన ప్రకటన' చేశారు. ప్రధాని దానితో ఆ తీర్మానాన్ని వెనక్కి తీసుకున్నారు అని రాశారు అంబేద్కర్.

ఆ తర్వాత, రాజ్యాంగ రచనా కమిటీ అధ్యక్షుడిగా రెండోసారి ఈ సమస్యని ఎదుర్కోవాల్సి వచ్చిందని రాశారు. రాజ్యాంగ ముసాయిదా రచన 'ముగిసిన దశలో', పై వాగ్దానం పూర్వ రంగంలో, ఆంధ్ర రాష్ట్రాన్ని పార్టీ 'ఎ' రాష్ట్రాల జాబితాలో చేర్చమంటారా? అని ప్రధానికి లేఖ రాశాను. ఏమైందో ఏమో గుర్తులేదు కానీ, భాషా రాష్ట్రాల సమస్యపై ధార్ కమిటీని రాజ్యాంగసభ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ నియమించారని అంటారు అంబేద్కర్. ఆ కమిటీ రిపోర్టుని పరిశీలించిన జైపూర్ ఎఐసిసి సభ దానిపై 'జెవిపి' కమిటీని నియమించింది. జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్య దాని సభ్యులు. ఆ కమిటీ తీర్పు సారాంశం– వెంటనే ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలి; అయితే మద్రాసుని తమిళులకు వదిలి వేయాలి. దీనికి సంబంధించిన వివరాల పరిశీలనకై నియమించబడిన మరో కమిటీ ఏకగ్రీవంగా ఒక రిపోర్టు నిచ్చింది. అయితే మద్రాసు విషయంలో టంగుటూరి ఇంకా బలీయమైన శక్తులు పట్టుబట్టడంతో, ఆ సమస్య అక్కడ ఆగిపోయింది. ఆ తర్వాత పొట్టి శ్రీరాములు మరణం, 'పిండ ప్రదానం'గా నెహ్రూ ప్రకటనతో అప్పటి చరిత్ర ప్రస్తావన ముగుస్తుంది. 1920 నుంచీ కాంగ్రెస్ ద్వంద్వ విధానాలు, అధికారంలోకి వచ్చాక మాట మార్చడం, కమిటీలతో దోబూచులాడడం, పీకలదాక వచ్చాక గాని చర్య తీసుకోకపోవడం ఇవన్నీ కన్పిస్తాయి. అంబేద్కర్ వ్యాసంలో (1953), దాదాపు అరవై ఏళ్లు దొర్లినా ఇప్పటికీ ఇదే చాణక్య నీతి?

పై చరిత్ర ప్రస్తావన తర్వాత–భాషా రాష్ట్రాల ఏర్పాటు సందర్భంగా మూడు షరతులను పూరించాక తన అభిప్రాయాన్ని ప్రకటిస్తారు అంబేద్కర్; 1). ఆ రాష్ట్రం ఆర్థికంగా మనగలుగుతుందా? అన్నది ముఖ్యం. రాజధాని ఖర్చులు ఎవరు భరిస్తారు? అన్నది చూడాలి. 2). భాషా రాష్ట్రాల ఏర్పాటు వలన వివిధ సామాజిక వర్గాల ఆర్థిక, రాజకీయ భవితవ్యం ఏమిటి? కొత్త రాష్ట్రంలో ఎవరు పెత్తనం చేస్తారు. ఎవరు నలుగుతారు? అణగారిన వర్గాల, ఆర్థిక రాజకీయ భవితవ్యం ఏమిటి? ఆలోచించాలి. 3). ఒకే భాష మాట్లాడేవారు ఒకే రాష్ట్రంగా సంఘటితం కావాలా? ఈ ప్రశ్న కొత్తగా ఏర్పడే (ఆంధ్ర, మహారాష్ట్ర) రాష్ట్రాలకే

కాక, ఇప్పటికే ఏర్పడి ఉన్న పెద్ద పెద్ద రాష్ట్రాలకూ (ఉత్తర ప్రదేశ్, బీహార్, బెంగాల్) వర్తిస్తుంది. విశాల హిందీ ప్రాంతమంతా ఉత్తరప్రదేశ్ అన్న ఒకే రాష్ట్రంలో ఎందుకుండాలి?

ఈ ప్రశ్నలను లేవనెత్తారంటే భాషా రాష్ట్రాలు వద్దని కాదు, ఆ పేరిట కొందరు అధికార దుర్వినియోగం చేయరాదని, దానికి కావాల్సిన కొన్ని నియమాలు చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ ఉండాలని చెప్తూ ముగిస్తారు.

భాషా రాష్ట్రాల ఏర్పాటు సమ్మతిని, అందునా ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకి మద్దతుని అంబేద్కర్ వ్యాసంలో చూడవచ్చును. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ విధానాల పట్ల పొట్టి శ్రీరాములు 'పిండ ప్రదానం'వరకు వేచి చూసిన నెహ్రూ ప్రభుత్వ తాత్సారం పట్ల అంబేద్కర్ విమర్శలను పైన గమనించాం. పైన లేవనెత్తిన మూడవ షరతు దరిమిలా-అంబేద్కర్ విశాలాంధ్రని వ్యతిరేకించారని, చెప్పవచ్చునా? ఒక భాష వారికి ఒకే రాష్ట్రం ఉండాలా? అన్న ప్రశ్న రూపంలో చిన్న రాష్ట్రాల సమస్యను లేవనెత్తారా? అలాంటి అర్థంలో కొందరు అంబేద్కర్ వాదులు, చాలా మంది ప్రత్యేక రాష్ట్రవాదులు బల్లగుద్దుతున్నారు. అంబేద్కర్ జయంతిని చిన్న రాష్ట్రాల దినోత్సవంగా జరపాలని దూకుడుగా ప్రకటనలు గుప్పిస్తూ వస్తున్నారు. అయితే అంబేద్కర్ అసలు ఏమని భావించారు? ఇదే వ్యాసంలో ఈ ప్రశ్నలకు సమాధానం చూడవచ్చును. ఆంధ్ర రాష్ట్రం రాజధాని సమస్యని కూడా ఆయన ఈ వ్యాసంలో చర్చించారు.

కొత్తగా ఏర్పడబోయే ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని లేదు. రాజధాని ఏర్పాటు లేకుండా ఒక రాష్ట్రం ఏర్పాటు గురించి ఇంతకు మందెన్నడూ నేనూ వినలేదు, అంటూ ఈ సమస్యని ప్రస్తావిస్తారు. అంబేద్కర్, అతిథికి ఒక్క రాత్రయినా ఆతిథ్యం ఇవ్వాలన్నది హిందూ ధర్మం! కాని, 'తమిళ తెగ పెద్ద మనుషుల్లో కెల్లా గట్టివాడైన రాజాజీ కొత్త ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని మద్రాస్ నగరంలో ఒక్క రాత్రయినా ఉండనివ్వరట' అని వ్యంగ్యంగా ప్రస్తావించారు అంబేద్కర్. రాజాజీ ఒక దేశ నాయకుడిగా రాజనీతిజ్ఞుడిగా కాక, తమిళవాదిగా ప్రవర్తించాడన్న భావం ఆ వ్యంగ్యంలో ధ్వనిస్తుంది.

స్థిర రాజధాని లేని ఆంధ్రరాష్ట్రం 'ఒయాసిస్సు లేని ఎడారి'లాగా ఉండాల్సి వస్తుందని అంటారు అంబేద్కర్. 'తాత్కాలిక రాజధాని కోసం అనవసర ఖర్చులు పెట్టాల్సి వస్తుందని అంటూ, శాశ్వత రాజధానిగా తయారయ్యే అవకాశంగల ప్రదేశాన్ని ఇప్పుడు ఎందుకు ఇవ్వకూడదు?' అన్న ప్రశ్నలు లేవనెత్తారు అంబేద్కర్.

ఈ ప్రశ్నకు జవాబులిచ్చి ఒక పరిష్కారం కూడా చూపించారు. ఇదే వ్యాసంలో 'ఈ దరిమిలా అందుకు తగిన ప్రదేశం వరంగల్ అంటూ, అది ఆంధ్రుల ప్రాచీన రాజధానిగా ఉండేది. అది ఒక రైల్వే జంక్షన్. అక్కడ చాలా భవనాలున్నాయి' అని నిర్దిష్ట సూచన చేశారు. దానిలో ఇమిడి ఉన్న రహస్యాన్ని కూడా చర్చించారు. 'వరంగల్ హైదరాబాద్ సంస్థానంలో భాగమైన ఆంధ్ర (తెలుగు) ప్రాంత భాగంలో ఉన్న మాట నిజమే. సూత్రబద్ధంగా చూసినట్టయితే, భారీ వికృతాకారంతో ఉన్న హైదరాబాద్ సంస్థానాన్ని ముక్కలు చేసి ఉండాల్సింది. సంపూర్ణమైన ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయల్సి ఉంది' అని రాశారు అంబేద్కర్. ఆంధ్ర రాష్ట్రం 1953 అక్టోబర్‌లో ఏర్పడిందన్నది తెలిసిందే. దానికి ఆరు నెలల ముందే ఏప్రిల్‌లో రాశారు ఈ వ్యాసం. పొట్టి శ్రీరాములు చనిపోయిన నాలుగు నెలలకు రాశారు. అప్పటికే సంపూర్ణ ఆంధ్ర (విశాలాంధ్ర) గురించి, అలాంటి రాష్ట్రానికి తెలంగాణలోని పట్టణాన్ని రాజధానిగా సూచించడాన్ని ఇక్కడ చూడవచ్చును.

ప్రధాని నెహ్రూకి హైదరాబాద్‌ని విడగొట్టడం ఇష్టం లేదు. బహు భాషా రాష్ట్రంగా అలాగే కొనసాగించాలని ఆయన కోరిక. అది అసాధ్యమని (హైదరాబాద్ సంస్థానంలో కూడా ఆమోదయోగ్యం కాదని తరువాత తేలిపోయింది.) దాన్ని నెహ్రూయే ప్రకటించారు. దాని దరిమిలా అంబేద్కర్ ఇలా రాశారు (సంస్థాన విభజన పట్ల) 'ప్రధానికి ఏదైనా న్యాయమైన అభ్యంతరం ఉంటే సంస్థానంలోని ఒక భాగాన్ని (ఎంక్లేవ్‌ని) ఏర్పరచి కొత్త ఆంధ్ర రాష్ట్రానికి చేర్చి వరంగల్లుని కలిపే రీతిలో చేయెుచ్చు కదా! ఇలాంటి ప్రాంతాలు ఇండియాలో కొత్త కాదు. (నల్లగొండ జిల్లాలోని మునగాల పరగణా క్రిష్ణా జిల్లాలో భాగంగా ఉండేది - వ్యాస రచయిత) కాని ప్రధాని దైవేచ్ఛకి వ్యతిరేకంగా నడవాలనుకుంటున్నాడు. ఆయన త్వరలోనే దాని పర్యావసానాలను చవిచూడడం ఖాయం అని నా అభిప్రాయం.'

రాజ్యాంగ రచనా కమిటీ అధ్యక్షుడి అభిప్రాయాలివి. నెహ్రూ మాటను ఎవ్వరూ ఖాతరు చేయలేదు. చివరకు తెలంగాణ నుంచి సంతకాలు చేసిన జెంటిల్మెన్ కూడా 1956లోనే విలీనానికి వారు అంగీకరించారు. భాషాపరంగా హైదరాబాద్‌ను ముక్కలు చేయడానికి సంపూర్ణమైన ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుని ఆయన బలపరిచారు. ప్రధానికి అది సమ్మతం కాకపోతే కొత్త రాష్ట్రాన్ని వరంగల్ రాజధానిగా ఏర్పాటు చేసి ఆ మేరకు కలపాలని మధ్యే మార్గంగా సూచించారు. శ్రీకృష్ణ కమిటీ తెలంగాణ జిల్లాలో కొంతభాగాన్ని సీమాంధ్రతో చేర్చే ప్రతిపాదనని పోలిన సూచన ఇది అని గమనించాలి. ఇది 1953 వ్యాసంలోని ఒక కీలక భాగం.

భాషా రాష్ట్రాల ఏర్పాటు వల్ల కలిగే సామాజిక పర్యవసానాల్లో భాగంగా ఏవో కొన్ని కులాల పెత్తనం స్థిరపడకుండా చూడాలని, దానికి చెక్స్ అండ్ బాలెన్సెస్ ఉండాలని సూచించారు. కొత్త ఆంధ్ర రాష్ట్రంలో అలాంటి అవకాశం కలవి - రెడ్డి, కమ్మ, కాపు కులాలను ప్రస్తావించారు.

ఇవాళ రాష్ట్ర వ్యాప్తంగా పంచాయితీ రాజ్‌లో ఎస్.సి., ఎస్.టి., బి.సి. రిజర్వేషన్‌ల లాగే వాటిల్లో మహిళాపరంగా రాజకీయ రిజర్వేషన్లు చట్టబద్ధంగా ఉన్నాయి. కాబట్టి ఏవో కొన్ని కులాల రాజకీయ పెత్తనానికి అవకాశాలు తగ్గాయి. చట్టపరంగా కాకున్నా ఆచరణలో రాజకీయ పరంగా బి.సి.లకు శాసనసభలో కూడా గణనీయమైన వాటా ఉంది. ప్రతి కులం రాజకీయ పార్టీగా చీలి ఉండడంతో, ఏ ఒక్క అగ్రకులానికి తిరుగులేని పెత్తనం, అవకాశం లేదు. రాష్ట్రాన్ని చీల్చితేనే కింది కులాలకు తగిన ప్రాధాన్యత ఉంటుందనడానికి ఎలాంటి వాస్తవిక ఆధారం లేదు. ఇది ఊహాజనితమే. ఆయా పీడితవర్గాల ఆర్థిక, రాజకీయ పరిపుష్టియే కచ్చితంగా ఉండగలుగుతుంది.

1953 ఏప్రిల్‌లో రాసిన పై వ్యాసం చాలా ముఖ్యమైనది. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడబోతున్న తరుణంలో రాసినది. అందులో హైదరాబాద్‌ని ముక్కలు చేసి సంపూర్ణ ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలన్న సూచన ఉంది. ప్రధానికి అది సమ్మతం కాకపోతే... అని మధ్యేమార్గం సూచించారు. కాగా 1955 డిసెంబర్‌లో 'భాషా రాష్ట్రాలు - కొన్ని ఆలోచనలు' పేరిట ఒక చిన్న పుస్తకం ఒకటి రాశారు. అందులోని కొన్ని ముఖ్యాంశాలను మాత్రమే ప్రస్తావించడమే సాధ్యపడుతుంది.

ఈ పుస్తకంలోని ముందుమాటలో కొన్ని విషయాలను స్పష్టపరిచారు.

1) తన అనారోగ్యం వల్ల రాష్ట్రాల పునర్విభజన కమిటీ (ఎస్.ఆర్.పి.) చర్చల్లో పాల్గొన లేకపోయాను.

ప్రత్యామ్నాయ ఉద్యమాలు ఈ దేశంలోని ఉత్పత్తి సంబంధాలను విశ్లేషిస్తూ చేసుకున్న సూత్రీకరణను మారిన పరిస్థితుల్లో పునర్నిర్వచించుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు **రమేష్ పట్నాయక్**

భారతదేశంలో భూస్వామ్య విధానం ఉందా? - 3

(గత సంచిక తరువాయి...)

నేటి భారత కౌలు రైతులను ఆనాటి అస్వతంత్ర రైతులతో పోల్చగలమా?

ఐరోపాలో, భూస్వామ్య విధానం మూడవ దశలో అంటే కౌలు డబ్బు రూపంలో చెల్లించిన దశలో వ్యవస్థ క్రమంగా అస్థిరత్వానికి గురైందని చూసాం. ఈ దశలో జమీందారీలో ఉన్న రైతులే రెండు వర్గాలుగా ధనిక రైతులు, వ్యవసాయ కూలీలుగా విడిపోయారు. మనదేశంలో బ్రిటిష్ వారు రైత్వారీ విధానం ప్రవేశపెట్టిన తరువాత, అనంతర కాలంలో భారత పాలకులు రెండు దశలలో భూ సంస్కరణలు ప్రవేశపెట్టిన తరువాత సుమారు అదే వర్గ విభజన క్రమం కొనసాగుతోంది. అధికాధికంగా రైతులు భూమి కోల్పోయి వ్యవసాయ కూలీలవుతున్నారు. రెండవ వేపు పెద్ద భూ కమతాలు విచ్చిన్నమైపోతున్నాయి. (పట్టిక నెం. 1 చూడండి) మధ్యతరగతి, ధనిక రైతులు అధికాధికంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అమలు చేస్తున్నారు. (పట్టిన నెం. 2 చూడండి) అయితే అదనపు ఉత్పత్తి లేదా అదనపు విలువ వారి చేతుల్లో ఉంటుందా, మార్కెట్ శక్తుల హస్తగతమవుతుందా అన్నది వేరే విషయం. తమ చేతులలో మిగిలిన అదనపు విలువను ధనిక రైతులు వ్యవసాయంలో పెట్టుబడిగా పెడుతున్నారా లేక ఇతర రంగాలకు తరలిస్తున్నారా అన్నది కూడా వేరే విషయం. అదనపు విలువ ఎవరో ఒకరి చేతుల్లో, ఏదో ఒక రంగంలో పెట్టుబడిగా మారడమే ప్రధాన విషయం.

ధనిక రైతులు స్వంతంగా వ్యవసాయం చేయించినప్పుడు కూలీ దోపిడీయే తప్పితే కౌలు దోపిడీ ఉండదు కాబట్టి వారిని మనం భూస్వాములనలేం. ఇక కొద్దిమంది పెద్ద కమతాలు గల ఆసాములు తమ భూమిని ఇతరులకు కౌలుకిస్తున్నారు. వీరి నుండి భూమిని కౌలుకు తీసుకుంటున్నారు. ధనిక రైతులైతే వారు స్పష్టంగా పెట్టుబడిదారీ

---

2) ఇంతకు ముందటి అభిప్రాయాలకు, ఈ పుస్తకంలోని వాటికి కొద్దితేడా ఉండవచ్చును. అవి చాలా కొద్ది సంఖ్యలోనే ఉన్నాయి. కొన్ని అభిప్రాయాలు కొద్దిగా మారి ఉండవచ్చును. ఒక బాధ్యతగల వ్యక్తిగా అలా కొన్ని మార్చుకున్నాను అని చెప్పారు. కొన్ని 'ఆలోచనలు' అని రాశారు. ఆలోచనల్లో తిరుగులేని ఫైనాలజీ ఉండజాలదు అని రాశారు.

3) భాషా రాష్ట్రాల ఏర్పాటు అవశ్యం అని రాశారు. అయితే ఈ సమస్యని రౌడీయిజంతో నిర్ణయించడానికి వీల్లేదు.

4) ఏదో ఒక పార్టీ ప్రయోజనంతో సమస్యను పరిష్కరించరాదు.

5) సమస్యని రాగద్వేషాలకు తావులేని రీతిలో కచ్చితమైన, హేతుపద్ధతిలో (కోల్డ్ బ్లడెడ్ రీజనింగ్) పరిష్కరించాలి.

ఇదే పుస్తకం మొదటి భాగంలో మరికొన్ని వ్యాఖ్యలు చేశారు.

6) రాజ్యాంగం 3వ అధికరణంలో కొత్త రాష్ట్రాల ఏర్పాటుకి పార్లమెంట్‌కి అధికారం కల్పించారు. 'భాషా రాష్ట్రాల ఏర్పాటుకై చాలా గట్టి డిమాండ్ ఉన్న దరిమిలా అది నిరంతరం డిమాండ్‌గా ఉన్నందువల్ల అలాంటి పునర్విభజనకు ఘాటైన విమర్శ చేశారు. రిపోర్టులో కోటి జనాభా గల చిన్న రాష్ట్రం ఒకవైపు 6.32 కోట్ల జనాభా గల ఉత్తరప్రదేశ్ మరొక వైపు సూచించబడినాయి. పై రెండు రాష్ట్రాల ఈ వ్యత్యాసం అంత ముఖ్యం కాదన్నట్లు సూచనలు చేసింది. మొదటిది, ఆ తర్వాతది భయంకరమైన తప్పు. దీన్ని సరిదిద్దకపోతే 'బహుశా మరుగుపరచిన మరొక తప్పు' అంటూ ఉత్తర, దక్షిణ భారత్ రాష్ట్రాల (జనాభా పరంగా) అసమతుల్యతను ప్రస్తావించారు. 'కమిషన్లు భావిస్తున్నట్లుగా ఇదేమీ అమాయకమైన తప్పు కాదు. ఇది పూర్తిగా విషంతో నిండి ఉంది. ఈ విషాన్ని ఇప్పుడే తొలగించి తీరాలి' అని రాశారు. 'భాషా రాష్ట్రాల పేరుతో దేశాన్ని ఇలా విభజించడాన్ని విస్మరించ రాదన్నారు.' 'భారత సంయుక్త రాష్ట్రాలు'గా ఉండాల్సిన మనదేశం ఆ లక్ష్యానికి చాలా దూరంలో ఉంది అంటూ ఈలోగా 'ఉత్తర భారత్‌ని సంఘటితపరచడం, దక్షిణ భారత్‌ను ఖండఖండాలుగా చేయడం, ఆ లక్ష్యం చేరుకొనే మార్గం కాదు' అని అంబేడ్కర్ రాశారు.

భాషా రాష్ట్రాలను బలపరచిన అంబేద్కర్ ఒక భాషకు ఒకే రాష్ట్రం ఉండాలనేముంది అన్న ప్రశ్నను లేవనెత్తారు. అయితే ఇది ఆయన విశాలాంధ్రకు వ్యతిరేకంగా చెప్పారనడానికి వీల్లేదు. 'సంపూర్ణ ఆంధ్ర రాష్ట్రాన్ని' బలపరిచారని పైన చూసాం.

హైదరాబాద్ సంస్థానాన్ని ముక్కలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. హిందీ భాషా రాష్ట్రాల పేరిట ఉత్తరప్రదేశ్ (6.32 కోట్లు), బీహార్ (3.85 కోట్లు) వంటి భారీ రాష్ట్రాలను కొనసాగించి, ఉత్తర – దక్షిణ భారత్‌ల మధ్య అలాంటి అసమతుల్యతను అట్టిపెట్టడం 'విషతుల్యమైనది' అని విమర్శించారు. ప్రత్యేకించి ఉత్తరప్రదేశ్‌ను అంత పెద్ద రాష్ట్రంగా ఎందుకు కొనసాగనివ్వాలి అని లేవనెత్తి, ఇది అంత అమాయకమైన తప్పు కాదన్నారు. ఏదో ఒక పార్టీ (కాంగ్రెస్) ప్రయోజనాలతో రాష్ట్రాల పునర్విభజనకు పూనుకోవడం తగదన్నారు.

ఇవీ ఈ పుస్తకం మొదటి భాగంలోని ముఖ్యాంశాలు.

(రచయిత పాత్రికేయులు) వీ

విధానాన్ని అవలంబిస్తున్నారు. కూలీ శ్రమ నుంచి వారు దోచుకున్న అదనపు విలువలో కొంత భాగాన్ని కౌలుగా చెల్లిస్తారు. అయితే కనీసం ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద కమతాదారుల భూమిని కౌలుకు తీసుకునే ధనిక రైతులు సుమారు లేరని చెప్పవచ్చు. కౌలుకు తీసుకున్న వారు చిన్న రైతులైతే, ఉత్పాదకత తక్కువగా ఉండడం వలన వారు వ్యవసాయంలో సృష్టించిన అదనపు ఉత్పత్తి లేదా దాని విలువ మొత్తాన్ని, సుమారు మొత్తాన్ని, ఆసామికి కౌలుగా కొలుస్తారు. శ్రమదోపిడీకి గురవుతారు. కాని భూమిపై ఎటువంటి హక్కు లేని ఈ రైతులను భూస్వామ్య వ్యవస్థ రైతులుగా చెప్పలేం. భూస్వామ్య వ్యవస్థలో రైతు తన భూమిపై వంశపారంపర్య హక్కు ఉన్నా, ఆ భూమి లీగల్‌గా భూస్వామికి చెందింది కాబట్టి కౌలు చెల్లిస్తాడు. అంతేకాదు ఈ రైతు అస్వతంత్రుడు. కౌలుకాని అనేక పన్నులు, వెట్టి సేవలు ఈ రైతు భూస్వామికి అందించవలసి ఉంటుంది. ఇంగ్లాండ్‌లో 12వ శతాబ్దం నాటికి భూస్వాములు కౌలు కంటే ఇతర జమీందారీ సుంకాలు, 'నేరాల'పై వసూలు చేసే జుర్మానాలు అధికంగా పొందారు. వారి పిండి మిల్లులలోనూ, ద్రాక్ష సారాయి పరిశ్రమలలోనూ వీరు తమ జమీందారీలో ఉన్నవారిచే వెట్టి చేయించుకునే వారు.

'నిజానికి 12వ శతాబ్దం నాటికి రైతుల అదనపు విలువ భూస్వాములకు చేరడం, భూ పరిమాణాన్ని బట్టి శ్రమ, ఉత్పత్తి, డబ్బు ఏ విధంగానైనా వసూలు చేయబడిన కౌలుకంటే ఇతర జమీందారీ పన్నులు, లాభాల ద్వారానే అధికంగా జరిగింది.'

రోడ్నీ హిల్టన్, (ముందుమాట, డాబ్, స్వీజీ చర్చ)

ఇప్పుడు భారతదేశంలో రైతులెవరూ భూ యజమానులకు సుంకాలు గాని, జుర్మానాలు గాని చెల్లించడం లేదు. లేదా వారి వ్యవసాయంలో, అనుబంధ పరిశ్రమలలో వెట్టి చేయడం లేదు. నేడు భారతదేశపు పేద కౌలుదారీ రైతు తాను కౌలుకు చేస్తున్న భూమిపై ఎటువంటి హక్కూ లేనివాడు. అలాగే భారతదేశపు భూ యజమాని కౌలుదారుడు పై ఎటువంటి అధికారం లేనివాడు. వీరి మధ్య సంబంధం పూర్తిగా స్వతంత్రమైన కాంట్రాక్టు భూస్వామ్య వ్యవస్థలో రైతుకు భూమిపై హక్కు ఉంటుంది. కాగా తాను దాస్య స్థితిలో ఉంటాడు. ఇప్పటి కౌలుదారులకు భూమిపై హక్కులేదు. తాము మాత్రం స్వతంత్ర స్థితిలో ఉంటారు. అందుకే ఇప్పుడు భూమిలేని స్వతంత్ర కౌలుదారులను అప్పటి 'భూమి ఉన్న' అస్వతంత్ర రైతులతో పోల్చలేం. ఇక కౌలు వసూలు చేసుకుంటున్న ఆసామి దానిని విలాస వస్తువులకు, యుద్ధాలకు భూస్వాముల వలె ఖర్చు చేస్తున్నాడా? లేదా వసూలు చేసిన కౌలును వ్యవసాయం లేదా ఇతర రంగాలలో పెట్టుబడిగా పెడుతున్నాడా అన్న విషయాన్ని గమనించవలసి ఉంది. ఆ ఆసామి తను వసూలు చేస్తున్న కౌలును ఏదో ఒక రూపంలో పెట్టుబడిగా మారుస్తున్నప్పుడు మనం ఆ ఆసామిని పెట్టుబడిదారుడు అని ఎందుకనగూడదు? కౌలు చెల్లించిన వాడు అస్వతంత్ర రైతు కానప్పుడు, కౌలు స్వీకరించిన వాడు భూస్వామి కానప్పుడు వారి మధ్య సంబంధాన్ని భూస్వామ్య సంబంధం అనగలమా!

ధనిక రైతుల భూమిలో వ్యవసాయం - ఆసామి భూమిలో వ్యవసాయం

నేడు ఆంధ్రప్రదేశ్‌లో స్వంత భూమిలో స్వయంగా కూలీలతో వ్యవసాయం చేయించే ధనిక రైతు వ్యవసాయాన్ని, స్వంత భూమిని పేద రైతుకు కౌలుకిచ్చే ఆసామి భూమిలో వ్యవసాయాన్ని మనం పోల్చి చూద్దాం. రెండు సందర్భాలలోనూ ఉత్పత్తిదారుడి (కూలీ, కౌలు రైతు)కి ఉత్పత్తి సాధనం (భూమి)పై ఎటువంటి సాంప్రదాయ హక్కూ లేదు. మొదటి సందర్భంలో అవసర శ్రమ విలువ వ్యవసాయ కూలీకి కూలీగా అందుతుంది. కాగా రెండవ సందర్భంలో అవసరపు శ్రమ ఉత్పాదితాలు కౌలు రైతుకు తన వాటాగా లభిస్తాయి. మొదటి సందర్భంలో అదనపు ఉత్పత్తి ధనిక రైతుకు లాభంగా మిగులుతుంది. కాగా రెండవ సందర్భంలో అదనపు ఉత్పత్తి లేదా దాని విలువ ఆసామికి కౌలుగా చెల్లించబడుతుంది. మొదటి సందర్భంలో వ్యవసాయ కూలీకి కూలీ అంటే 'అవసరపు శ్రమ విలువ' పంటతో సంబంధం లేకుండా ముందుగానే ముడుతుంది. కాగా రెండవ సందర్భంలో కౌలు రైతుకు 'అవసర శ్రమ ఉత్పాదితాలు' పంట పండిన తరువాత అందుతాయి. మొదటి, రెండవ సందర్భాలలో కూడా ఉత్పత్తిదారుడు భూమినుంచి పరాయీకరణ పొంది ఉంటాడు. కాగా రెండవ సందర్భంలో ఉత్పత్తిదారుడు (కౌలు రైతు) ఉత్పత్తి ప్రక్రియ, ఉత్పత్తులతో సంబంధం కలిగి ఉండడం విశేషం. మొదటి సందర్భంలో పంట పోతే లేదా పంటకు ధర రాకపోతే ధనిక రైతుకు లాభం రాకపోవడమే గాక నష్టం రావచ్చు. కూలీ వేతనాన్ని ఇది ప్రభావం చెయ్యదు. రెండవ సందర్భంలో పంట పోయినా, పంటకు ధర రాకపోయినా ఆసామికి నష్టం అయితే రాదు. మహా అయితే కౌలు తగ్గవచ్చు. కాని కౌలు రైతుకు అది తీవ్ర నష్టానికి దారితీస్తుంది. తన అవసర శ్రమ విలువ కూడా తనకు అందదు.

మొదటి సందర్భంలో ఉత్పత్తిదారుడికి రిస్క్ ఉండదు, భూ యజమానికి రిస్క్ ఉంటుంది. రెండవ సందర్భంలో ఉత్పత్తిదారుడికి రిస్క్ ఉంటుంది. ఆసామికి రిస్క్ ఉండదు. ఈ పోలికలను, వ్యత్యాసాలను క్రోడీకరించేటట్లయితే - రెండు సందర్భాల లోనూ ఉత్పత్తి సాధనాలపై ఉత్పత్తిదారుడికి యాజమాన్యం ఉండదు. రెండు సందర్భాలలోనూ ఉత్పత్తిదారుడు శ్రమ దోపిడీకి గురవుతాడు. రెండు సందర్భాలలో ఉత్పత్తిదారుడు స్వతంత్రుడే - దాస్య స్థితి కాదు అన్న అర్థంలో. రెండు సందర్భాలలోనూ అదనపు శ్రమ లేదా దాని ఉత్పాదితాలు లేదా వాటి విలువ భూ యజమానికి దఖలు పడతాయి. కాబట్టి వస్తుపరంగా పరిశీలించినపుడు అంటే భూమిపై యాజమాన్యం, అదనపు శ్రమ భుక్తం చేసుకోవడం విషయాలను పరిశీలించినపుడు మొదటి, రెండు సందర్భాల మధ్య ప్రధానమైన తేడా ఏమీ లేదు. వ్యవసాయ ప్రక్రియను ఎవరు నిర్వహిస్తారు? పెట్టుబడులు ఎవరు పెడతారు, ఫలితంగా ఉత్పాదకత ఎగుడు దిగుడులు, ధరల ఎగుడు దిగుడులు వంటి ఆటుపోట్లు (రిస్క్) ఎవరు భరిస్తారు? అన్న విషయమే రెండు సంవత్సరాల మధ్య ప్రధాన వ్యత్యాసం. మొదటి సందర్భంలో పెట్టుబడి పెట్టేది భూ యజమాని. 'పెట్టుబడిపై వడ్డీ' అదనపు విలువలో భాగంగా ఈ భూయజమానికే చేరుతుంది. రెండవ సందర్భంలో పెట్టుబడి కౌలు రైతు పెడితే అదనపు ఉత్పత్తి లేదా దాని విలువ అంతా ఆసామికి పోకుండా వడ్డీ భాగం కౌలుదారుడికి చేరుతుంది. అయితే కౌలుదారుడు అంతకన్నా ఎక్కువగానే వడ్డీ వ్యాపారస్తుడికి చెల్లిస్తాడు. కౌలుదారుడికి తిరిగి మిగిలేది గరిష్టంగా అవసర శ్రమ ఉత్పాదితాలే. కౌలు రైతు కొంత, ఆసామి కొంత పెట్టుబడి పెట్టే సంర్భాలుంటాయి. అటువంటి పరిస్థితులలో వడ్డీ భాగంతో సహా అదనపు విలువ, రిస్క్ ఫలితాలు కూడా పంపకమవుతాయి. అయితే ఇటువంటి సందర్భాలలో పంటలో నిర్దిష్టమైన వాటా కౌలుగా చెల్లించే పద్ధతి ఉంటుంది. పెట్టుబడి కౌలు రైతు మాత్రమే పెట్టే సందర్భంలో కౌలు ఉత్పత్తిలో వాటాగా ఉండదు. ఈ సందర్భంలో కౌలు నిర్దిష్టమైన

కొలతగా గాని, డబ్బుగా గాని ఉంటుంది. రిస్క్ పూర్తిగా కౌలు రైతే భరించవలసి వస్తుంది. అదనపు విలువ ఏదైనా తన చేతిలో మిగిలితే ఈ పేద రైతు దానిని ప్రకృతి వైపరీత్యాల వలన లేదా మార్కెట్ ఎగుడు దిగుడుల వలన 3, 4 ఏళ్లకొక్క సారి పూర్తిగా పోగొట్టుకుంటున్నాడు. మొత్తం వ్యవసాయం లాభసాటిగా లేకపోవడంతో ఏ పరిస్థితిలోనూ పేద కౌలు రైతులు అదనపు విలువలో కొంత భాగాన్ని పొందే అవకాశం కనిపించడం లేదు. ఆ మాటను పక్కన పెట్టి తిరిగి ఈ తులనాత్మక పరిశీలనను క్రోడీకరిస్తే రెండు సందర్భాలలో ఉన్న తేడా రిస్క్ ఫ్యాక్టర్ మాత్రమేనని తెలుస్తుంది.

వ్యవసాయ కూలీ, పేద కౌలు రైతులను తులనాత్మకంగా పరిశీలించినపుడు – 1) భూమిపై యాజమాన్యం, 2) అదనపు విలువ పరాయీకరణ విషయంలో వారికి తేడా లేదని గమనించాం. వారి మధ్య ప్రధానమైన తేడా అంతా వ్యవసాయ కూలీకి ప్రతిరోజు పనివెదుక్కొనే రిస్క్ ఉంటుంది. కాగా పేద కౌలు రైతు పంట పండక పోవడం, పురుగు పట్టడం వంటి రిస్క్‌లు, ధర రాకపోవడం వంటి రిస్క్ ఎదుర్కొంటాడు. అందుకే వ్యవసాయ క్రమంపైన, పంట అమ్మకం పైన ఈ పేదకౌలు రైతుకుండే 'యాజమాన్యం' ఆయనను వ్యవసాయ కూలీకంటే వేరుగా చూపిస్తుంది. ఈ 'యాజమాన్యం' ఒక నిర్దిష్టమైన కాంట్రాక్ట్ ద్వారా వచ్చిందే తప్ప ఈ పేద కౌలు రైతు సంప్రదాయకమైన హక్కు కాదు, లేదా, ఆయనపై భూ యజమాని బలవంతంగా రుద్దిన బాధ్యతా కాదు. ఒక నిర్దిష్ట కాంట్రాక్ట్ ద్వారా ఏర్పడిన ఈ సంబంధం, కాంట్రాక్ట్ కాలం తరువాత ఎవరైనా తెంచి వేయవచ్చు. కాంట్రాక్ట్ కాలం (సాధారణంగా ఒక సంవత్సరం) తరువాత భూ యజమాని కోరుకుంటే భూమిపై పేద కౌలు రైతు యాజమాన్యాన్ని తొలగించగలడు. ఇంకా ప్రధానంగా పేద కౌలు రైతు కోరుకుంటే ఈ రిస్క్‌ను తొలగించుకోగలడు. కౌలుదారుల హక్కులు సాధించబడిన ప్రాంతాలలో, రాష్ట్రాలలో ఆసామి రైతులను తొలగించే 'హక్కు' పరిమితం చేయబడినా యాజమాన్య రిస్క్‌ను తొలగించుకునే హక్కు రైతుకుంది. అంటే ఉత్పత్తి సంబంధంలో ఉన్న ఈ అంశం ఉత్పత్తిదారునికి వ్యతిరేకంగా రాజ్యబలంచే మద్దతు పొందే విషయం కాదు. అందుకే ఇది ఉత్పత్తి సంబంధాన్ని నిర్దేశించే అంశం కాదు. దీనిపై ఆధారపడి సదరు పేద కౌలురైతును మనం అస్వతంత్ర రైతుగా పేర్కొనలేం. ధనిక భూ యజమాని వద్ద భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసి సుమారు అదనపు ఉత్పత్తి లేదా అదనపు విలువనంతా భూ యజమానికి, వడ్డీ వ్యాపారస్తునికి చెల్లించే పేద కౌలు రైతు ఉత్పత్తి, మార్కెటింగ్ రిస్క్ కూడా భరించేది వ్యవసాయ కూలీ మాత్రమే. వ్యవసాయ కూలీలకు సంవత్సరం పొడుగునా పని దొరకక పోవడం కారణంగా పని దొరకని రిస్క్‌కు బదులు – ఉత్పత్తి, మార్కెటింగ్ రిస్క్‌లను భరించడానికి గ్రామీణ పేదలు సిద్ధమవుతున్నారు. పేద రైతు, ఆసామి భూమిలో కౌలు చేసిన ఈ సందర్భంలో అదనపు విలువ మొత్తాన్ని సుమారు మొత్తాన్ని కౌలుగా కొలవడం వలన ఆయన పెట్టుబడిదారీ కౌలుదారుడు కాదని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. అదే సందర్భంలో ఈ కౌలురైతు భూమిపై హక్కు కలిగి, తనపై తనకు హక్కులేని భూస్వామ్య వ్యవస్థలోని అస్వతంత్ర రైతుకుంటే, తాను సృష్టించిన అదనపు విలువ మొత్తం నుండి పరాయీకరణ పొందే పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యవసాయ కూలీనే సరిపోలుతాడు.

ఆచరణలో కౌలు పరిస్థితులను పరిశీలించినపుడు భూ యజమానులు ఉత్పాదకత రిస్క్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో కౌలుకిచ్చే రెండవ సందర్భాన్ని, ఉత్పాదకత రిస్క్ తక్కువగా ఉండే ప్రాంతాలలో వ్యవసాయాన్ని స్వయంగా నిర్వహించే మొదటి సందర్భాన్ని ఎంచు కుంటారు. అంతేకాదు గ్రామంలోనే ఉండే భూ యజమాని స్వయంగా వ్యవసాయం నిర్వహించడానికి, కారణాంతరాల వలన పట్టణాలకు వెళ్లి స్థిరపడిన భూయజమాని భూమిని కౌలుకిచ్చే విధానాన్ని అమలు చేస్తాడు. ఈ భూయజమానులు, పరిస్థితులను బట్టి ఒకటి రెండు విధానాల మధ్య మారుతుంటారు కూడా. అలాగే కౌలు గిట్టుబాటు కాదనుకున్న రైతు వ్యవసాయం మానుకుని కూలీగా మారిపోవచ్చు. కొన్నాళ్లు కూలీగా ఉన్న వ్యక్తి అనుకూల పరిస్థితులేర్పడినప్పుడు భూమిని కౌలుకు తీసుకోవచ్చు. పరస్పరం మారే ఈ విధానాల, పాత్రల విషయం పరిశీలిస్తే అవి ఒకే ఉత్పత్తి విధానం (మోడ్ ఆఫ్ ప్రొడక్షన్) రెండు రూపాలని స్పష్టమవుతుంది. అందుకే భూమిపై ఉత్పత్తిదారుడికి ఏ విధమైన హక్కులేని, అదనపు ఉత్పత్తి విలువ ఏదో ఒక రూపంలో పెట్టుబడిగా మారే ఈ ఉత్పత్తి విధానాన్ని భూస్వామ్య విధానంగా చెప్పడం కష్టం.

మధ్యతరగతి రైతు విషయంవేరు. కొంత భూమి ఉండి, వ్యవసాయ పరికరాలు, పశువులు స్వంతంగా ఉన్న మధ్యతరగతి రైతులు ధనిక భూయజమాని వద్ద భూమిని కౌలుకు తీసుకున్నప్పుడు, వ్యవసాయ కూలీలను కూడా పనిలో పెట్టుకున్నప్పుడు వచ్చిన అదనపు విలువలో కొంతభాగాన్ని, భూ యజమానికి కౌలుగా బదలాయించి మిగిలినది తనకే ఉంచుకుంటాడు. మార్కెట్ దోపిడీ లేకపోయి ఉంటే ఇటువంటి వారు క్రమంగా ధనిక రైతులయ్యే వారు. ఐరోపాలో, ప్రధానంగా ఇంగ్లాండ్‌లో వ్యవసాయంలో ఉత్పత్తి సంబంధాలు మారిన సందర్భంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ఎక్కువగా ఉన్న విషయాన్ని మార్క్స్ చూపిస్తాడు. 'వ్యవసాయ ఉత్పత్తిరంగంలో పెట్టుబడిదారుడు ప్రవేశించడం, కనీసం మొదటి దశలో, వ్యవసాయ ఉత్పాదితాల ధరలు, పారిశ్రామిక ఉత్పాదితాల ధరల కంటె అధికంగా ఉండడాన్ని రుజువు చేస్తాయి. అలా కాకుంటే భూమికి ఒకవైపు కౌలు చెల్లిస్తూ, రెండవ వైపు వ్యవసాయ పెట్టుబడిదారుడు తన పెట్టుబడికి పారిశ్రామిక పెట్టుబడిదారుడితో సమానమైన లాభ శాతాన్ని (రేట్ ఆఫ్ ప్రాఫిట్) పొందగలిగే వాడుకాదు. అలా పొందలేక పోయి ఉంటే వ్యవసాయ రంగానికి పట్టణ పెట్టుబడి ప్రవహించేదే కాదు.' కాగా భారతదేశంలో వ్యవసాయంలో ఉత్పత్తి సంబంధాలు మారిన, మారుతున్న సందర్భంలో రైతులు చాలా తక్కువ ధరలకు తమ ఉత్పత్తులను అమ్ముకోవలసి వస్తోంది. ప్రధానంగా ఈ మార్కెట్ పరిస్థితులలో ఉన్న వ్యత్యాసం, నిజానికి పూర్తిగా విరుద్ధమైన మార్కెట్ పరిస్థితి ఈ మధ్యతరగతి రైతులు ధనిక పెట్టుబడిదారీ రైతులుగా ఎదగకుండా అడ్డుకుంటుంది. ఇదే విరుద్ధమైన మార్కెట్ పరిస్థితి గ్రామాలలో పెట్టుబడిదారీ దోపిడీకి కొత్త రూపాలను సంక్రమింప జేసింది. ఉత్పత్తి, మార్కెట్ రిస్క్‌లను కూడా వ్యవసాయ కూలీల మీదికి నెట్టివేసే దోపిడీ రూపాలను సృష్టించింది. ఆ రూపమే పేదకౌలు రైతు. ఈ పేదరైతులకు భూమిపై ఎటువంటి యాజమాన్యం ఉండదు, అదనపు విలువలో ఏమాత్రం వాటా ఉండదు. కాని ఉత్పత్తి ప్రక్రియలో, ఉత్పత్తిని మార్కెట్ చేయడంలో ఉన్న రిస్క్ మాత్రం భరించవలసి ఉంటుంది. కూలీపని ప్రతిరోజూ దొరకనందున గ్రామీణ పేదలు ఈ రిస్క్‌ను స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. అంతేకాక చిన్న కమతాల, పేద కౌలు రైతులు పెట్టుబడిదారీ వ్యవస్థలో సుదీర్ఘకాలం కొనసాగడం అధిక జనాభా కలిగిన దేశాలకు ఒక ప్రత్యేక లక్షణం కూడా. ఒక వ్యవస్థ మౌలిక స్వరూపాన్ని తెలుసుకోవడానికి వర్గ విశ్లేషణ

అవసరం. కాగా ఒక వ్యవస్థలో పరిమాణాత్మక మార్పులు అధ్యయనం చేసినప్పుడు జనాభా వంటి విషయాలను కూడా గణనలోనికి తీసుకో వలసి ఉంటుంది. ఈ విషయమై 'బ్రెన్నర్ డిబేట్'లో విస్తృతమైన చర్చ ఉంది.

కౌలు, అదనపు లాభంగా ఇప్పుడు ఎక్కడా లేదు

భూస్వామ్య వ్యవస్థ మూడు రూపాలలో అస్వతంత్ర రైతు సృష్టించే అదనపు శ్రమ, అదనపు ఉత్పత్తి, చివరి దశలో డబ్బు రూపంలోనికి మారిన అదనపు ఉత్పత్తి అన్నీ నేటి శ్రమ ఉత్పత్తి చేసే అదనపు విలువకు నాటి చారిత్రక రూపాలేనని మార్క్స్ వివరించాడు. డబ్బు రూపంలో కౌలు చెల్లించే దశ ప్రారంభ దినాలలో అస్వతంత్ర రైతులు భూస్వామికి చెల్లించిన కౌలుకు భూస్వామ్య వ్యవస్థ మూడవ దశ చివరి కాలంలో పెట్టుబడి కౌలుదారుడు భూస్వామికి చెల్లించిన కౌలుకు ఉన్న వ్యత్యాసాన్ని మార్క్స్ వివరించాడు. భూస్వామ్య విధానం ఈ మూడవ దశ తొలినాళ్లలో అస్వతంత్ర రైతు తన పొలంలో పండించిన పంటలో తన కుటుంబ అవసరాలకు, తరువాత సంవత్సరం వ్యవసాయ మదుపులకు 'అవసరమైన ఉత్పత్తి'ని తన వద్ద ఉంచుకుని మిగిలిన 'అదనపు ఉత్పత్తి'ని మార్కెట్‌లో అమ్మి దాని విలువను మొత్తం అంటే అదనపు విలువను మొత్తం భూస్వామికి కౌలుగా చెల్లించేవాడని ఇంతకు ముందే గమనించాం. (తాను ఉత్పత్తి చేయలేని, తన కుటుంబానికీ, వ్యవసాయానికీ అవసరమైన ఇతర ఉత్పత్తులు ప్రధానంగా తయారీ వస్తువులు కొనుక్కోవడానికి అవసరపు ఉత్పత్తిని కూడా కొంత భాగం క్రమక్రమంగా పెరిగిన భాగం – రైతు మార్కెట్లో అమ్మడం ప్రస్తుత విషయం కాదు). అయితే ఇదే మూడవదశ చివరి కాలంలో పెట్టుబడిదారీ కౌలుదారుడు అదనపు విలువను మొత్తం భూస్వామికి కౌలుగా చెల్లించలేదు. అందులో పెట్టుబడికి జాతీయ స్థాయిలో ఉండే 'సాధారణ లాభాలను' మినహాయించుకుని మిగిలిన దానిని మాత్రమే 'అదనపు లాభం' భూస్వామికిచ్చాడు. ఈ పెట్టుబడిదారీ కౌలుదారుడు ఇంతకు ముందే చెప్పుకున్నట్లు భూస్వామి నుంచి పెద్ద కమతాలలో ఉన్న భూములను కౌలుకు తీసుకుని, మధ్యలో రైతుల భూమి ఉంటే వాటిని 'ఎన్‌క్లోజర్స్' ద్వారా ఆక్రమించుకుని భూమిలేని కూలీలను పనిలో పెట్టుకుని ఉత్పత్తిచేసి (మొదట్లో ప్రధానంగా వాణిజ్య పంటలు) కూలీలు ఉత్పత్తిచేసే అదనపు విలువను దోపిడీ చేసి అందులో 'సాధారణ లాభాలను' మినహాయించుకుని మిగిలిన దానినే అంటే అదనపు లాభాన్ని మాత్రమే భూస్వామికి కౌలుగా చెల్లించాడు. కౌలు ముందుగానే నిర్ణయమయినా అది 'అదనపు విలువ'లో సాధారణ లాభాలు మినహాయించగా మిగిలిన దానికి అంటే అదనపు లాభానికి ఇంచుమించు సరిపోయేది. (ఈ వివరణ నుండి సాధారణంగా ఒక అభిప్రాయం ముందుకువస్తుంది. వ్యవసాయపు అదనపు విలువంతా కౌలుగానూ మారితే అది భూస్వామ్య దోపిడీ అని' అందులో అధిక భాగం (సాధారణ లాభాలు) పెట్టుబడి దారుడికి లాభంగానూ కొద్దిభాగం 'అదనపు లాభం' మాత్రమే భూ యజమానికి కౌలుగా మారితే అది పెట్టుబడిదారీ దోపిడీ అనే అభిప్రాయం ఏర్పడుతుంది. అటువంటి అభిప్రాయంలో అసంబద్ధతను పైన చర్చించాం. తాను స్వతంత్రుడై భూమిపై హక్కులేని కౌలు రైతు మొత్తం అదనపు విలువను – సప్లై, డిమాండ్ పరిస్థితి వలన – భూ యజమానికి బదలాయించినా ఆ దోపిడీని, భూస్వామ్య దోపిడీని అనలేమని చర్చించాం. ఆ విషయాన్ని అలా ఉంచి అదనపు లాభం విషయమై చర్చ కొనసాగిద్దాం.'

ఇంతకుముందే సూచించిన పెట్టుబడి సంపుటి 3, అధ్యాయం 47లో వ్యవసాయరంగంలో పెట్టుబడిదారుడు, భూస్వామికి చెల్లించే కౌలు అదనపు విలువలో భాగమేనని వ్యవసాయపు అదనపు విలువలో సాధారణ లాభాలు, అదనపు లాభాలు అనే రెండు భాగాలుండేవని మార్క్స్ చూపిస్తాడు. ఆ కాలంలో ఇతర పరిశ్రమలలో ఉత్పత్తుల ధరల కంటే వ్యవసాయ రంగంలో ధరలు అధికంగా ఉన్నాయని ఫలితంగా జాతీయ సాధారణ లాభాల కంటె వ్యవసాయంలో అధిక లాభాలు వచ్చేవని, వ్యవసాయంలో పెట్టుబడి దృష్ట్యా వచ్చిన లాభశాతంలో సాధారణ లాభశాతం మినహాయించగా అదనపు లాభశాతం ఉండేదని మార్క్స్ చూపిస్తాడు. ఈ భాగాన్నే వ్యవసాయ పెట్టుబడిదారుడు భూస్వామికి కౌలుగా చెల్లించేవాడని విశ్లేషించాడు. పెట్టుబడిదారీ కౌలుదారులు ప్రారంభ కాలంలో వారు అధిక ఉత్పాదకత ఉన్న భూములను కౌలు చేయడం ద్వారా కూడా అధిక లాభాలు గడించారని అలాగే ఉన్ని పరిశ్రమ పెరుగుతున్న ఆ రోజుల్లో ఉన్ని ధరలు అధికంగా ఉండేవని, ఆ కారణంగా కూడా ఉన్ని ఉత్పత్తిదారులకు అదనపు లాభాలు వచ్చేవని మార్క్స్ చూపించాడు. అయితే ఇది అంతా పరిణామ దశకు చెందిన వ్యవహారంగానే గుర్తించాలి. అంతేకాదు ఒకవైపు పెరిగిన పెట్టుబడిదారీ వాతావరణంలో అస్వంతంత్ర రైతులు భూస్వామికి ఎంతో కొంత చెల్లించి తమ స్వాధీనంలో ఉన్న భూములకు పూర్తి యజమానులుగా మారిపోవడం, రెండవ వైపు పట్టణాలలో వ్యాపారస్తులు, పెట్టుబడిదారులు గ్రామాలలో భూమిని (దివాళా తీసిన రైతులది లేక జులాయి ఖర్చు పెట్టే భూస్వాములది) కొనివేసి దానిని తామే కూలీలతో వ్యవసాయం చేయడం గాని, లేదా ఇతరులకు కౌలుకివ్వడం గాని జరిగింది. ఇతరులకు కౌలుకిచ్చినప్పుడు వారు పొందే కౌలు తాము భూమి కొన్నప్పుడు చెల్లించిన ధనానికి వడ్డీగా భావించేవారు. అయితే ఇప్పుడు ఐరోపాలో ప్రధానంగా వ్యవసాయ పెట్టుబడిదారులే భూమి యజమానులు కూడా. కౌలు ప్రత్యేకంగా వ్యక్తం కావడం లేదు. కొద్దిమంది భూస్వాములు వారే వ్యవసాయ పెట్టుబడిదారులుగా మారిపోగా మిగిలినవారు భూమిని వ్యవసాయ పెట్టుబడిదారులకు తెగనమ్ముకున్నారు. ఆ విధంగా భూమి వ్యవసాయ పెట్టుబడిదారుల చేతికి చేరిపోయింది. భూమి చిన్న రైతుల దగ్గరగాని, పెద్ద వ్యవసాయ పెట్టుబడిదారుల వద్ద గాని ప్రైవేట్ ఆస్తిగా ఉండడం అనే పరిస్థితి అభివృద్ధి నిరోధక ప్రభావాలను కలిగించగలదని మార్క్స్ చేసిన విశ్లేషణ ఇక్కడ పరిశీలిద్దాం. ఐరోపాలో వ్యవసాయ పెట్టుబడిదారులు భూస్వాముల నుంచి భూమిని కొన్నప్పుడు పెట్టుబడిగా ఉపయోగపడవలసిన ధనాన్ని వారికి ధరగా చెల్లించారు. అంటే చలనశీలమైన పెట్టుబడి ఒట్టి డబ్బుగా మారిపోయింది. ఇది అభివృద్ధి నిరోధకమైన ప్రక్రియయే. దీనినే మార్క్స్ ఎత్తి చూపాడు. అయితే ఈ భూస్వాములు ప్రధానంగా పెట్టుబడిదారులుగా పరిణామం చెందని భూస్వాములు తమ జులాయితనం వలన క్రమంగా తమ వద్ద ఉన్న ధనాన్ని మార్కెట్‌కు అప్పజెప్పారు. మార్కెట్ సహజంగానే దానిని క్యాపిటల్‌గా మార్చేసింది. మరొక విధంగా చెప్పాలంటే భూమి, ధనం రెండూ పెట్టుబడిదారీ వర్గానికే చేరిపోయాయి. భూస్వాములు పెట్టుబడిదారులుగా నైనా మారిపోయారు, లేదా భూమిని, ధనాన్ని కోల్పోయి నిరాస్థిపరులైనా అయిపోయారు. ఐరోపాలో జరిగింది ఇదీ. కాబట్టి మార్క్స్ చెప్పిన అభివృద్ధి నిరోధక ప్రభావం పరిణామ కాలానికి చెందిందని గ్రహించగలాలి.

(ఇంకా ఉంది)

(రచయిత విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు) వీ

మల్కన్‌గిరి ప్రాంత ఆదివాసుల రాజకీయార్థిక జీవన స్థితిగతులు, వారిపై కొనసాగుతున్న దోపిడీ, అణచివేతలను వివరిస్తూ, వారి అభివృద్ధికి ఏం చేయాలో వివరిస్తున్నారు **శ్రీరాముల శ్రీనివాస్**

మల్కన్‌గిరిలో ఏం జరుగుతోంది? - 2

(..గత సంచిక తరువాయి)

మల్కన్‌గిరి కేంద్రంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలలో వేరు వేరు వ్యాపార, వాణిజ్య కార్యక్రమాలను కొనసాగిస్తూ ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడులకు వేరుశనగ, నువ్వులు, సారాపప్పు, ఇప్పపువ్వు, ధాన్యం, విత్తనాలు మొదలైన దినుసులు వేల కొలది లారీలను ఎగుమతులు చేస్తున్నారు. పప్పులు, నూనెలు, విత్తనాలు, ఎరువులు, మందులు, బట్టలు, ఇనుము, సిమెంట్, అల్యూమినియం, స్టీల్, ప్లాస్టిక్‌లతో తయారు చేసిన వివిధ పరికరాలు, మిషన్లు దిగుమతులు చేసుకోవడం జరుగుతోంది. రైస్ మిల్లులు, లారీలు, వ్యాన్లు, టయోట, డి.సి.ఎం. వంటి వాహనాలు 25 నుండి 400 వరకు కలిగి ఉండి పెట్రోల్‌బంక్‌లు, గ్యాస్ ఏజెన్సీలు, ప్రభుత్వ బియ్యం సప్లయ్, మద్యం, శీతల పానీయాల పంపిణీ డీలర్‌షిప్‌లను కలిగి ఉండి రాయ్‌పూర్, జగ్దల్‌పూర్, ముంబాయి, కలకత్తా, జయ్‌పూర్, నాగ్‌పూర్‌లలో గృహ సముదాయాలు, శీతల గిడ్డంగులను కలిగి ఉన్నవారు కూడా ఉన్నారు. మరొక పెద్ద వ్యాపారం బీడీ తయారీ, అమ్మకాలు. ఈ ప్రముఖులు ఒక్కొక్కరు సంవత్సరానికి 500 కోట్లు, 900 కోట్లు, 1200 కోట్ల రూపాయలను ఆర్జిస్తున్నట్లుగా ప్రజల అంచనా. వీరు మల్కన్‌గిరి వచ్చినప్పుడు సైకిళ్లపై ఎండు చాపలు తదితర వ్యాపారాలతో జీవితం ఆరంభించినవారు.

సొర్గి (సారా పప్పు) విత్తనాల నుండి మిఠాయిలో ఉపయోగించే పప్పును తీస్తారు. దీనిని ఆదివాసుల నుండి షావుకార్లు కిలోకు 3 నుండి 6 రూపాయలకు కొంటారు. టోలా (ఇప్ప విత్తనాలు) కిలో 6 నుండి 10 రూపాయల చొప్పున తీసుకుంటారు. స్థానికంగా కొద్దిమంది ఆదివాసులు టోలా నుండి నూనె తీసి కూరలలోకి ఉపయోగిస్తారు. సేకరించిన దాంట్లో 90 శాతం షావుకార్లకే అమ్ముతారు. మోల్ (ఇప్ప పువ్వు) సారాయి వండుకోవడానికి ఉపయోగించుకున్నా 70 శాతాన్ని అమ్ముకుంటారు. సారా పప్పు ధర మార్కెట్లో 120 రూపాయల నుండి 150 రూపాయలు. ఇప్ప విత్తనాల కిలో ధర 15 నుండి 20 రూపాయలు ఉంటుంది. దీని నుండి వీరు ఆదివాసులను ఏ విధంగా దోపిడీ చేస్తున్నారో అర్థం చేసుకోవడానికి దోహదపడుతుంది.

ఇంత సంపదను దోపిడీదారులు పోగేసుకుంటుంటే మల్కన్‌గిరి జిల్లా ప్రజానీకం వెనకబాటుతనానికి, కడు పేదరికానికి కారణాలు చూడడం... దీనికి పరిష్కారాలు చూపడంలోనే లోపం ఉంది. కలెక్టరుగా ఆర్. వినీల్ కృష్ణ – మల్కన్‌గిరికి వచ్చిన తరువాత ఆదివాసుల అభివృద్ధికి పాల్పడినట్టుగా చేస్తున్న ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదు. 'గోరంతను' 'కొండంతలుగా' చేసి చెప్పడమే తప్ప మరొకటి కాదు. గోరంతలు పూర్వం కూడా జరుగుతూనే వస్తోంది. అయినా ఆదివాసుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. ఇక్కడ ఉత్పత్తి అవుతున్న విద్యుత్ వీరికి దక్కక చీకటిలోనే మగ్గుతున్నారు. ఇప్పటికీ సాంప్రదాయిక పోడు వ్యవసాయమే. నీటి వనరులున్నా ఒక్క పంటనే పండిస్తారు. సుర్లుకొండ డ్యాం నుండి పొట్టేరు నదిలోకి విడుదలయ్యే నీటిలో కొంత భాగాన్ని కొద్ది ప్రాంతాలలో వ్యవసాయానికి పంపిణీ చేయడం జరుగుతోంది. ఈ నీరు కూడా కొన్ని గ్రామాల రెఫ్యూజ్డ్ బెంగాలీ ప్రజానీకానికి మాత్రమే ఉపయోగపడుతుంది. ఇది కూడా ఒక పంట ధాన్యం, మరొక పంట వేరుశనగ లేదా కూరగాయలు. పంటలకు అనుగుణంగా నీరు విడుదల చేయడం జరుగుతోంది. ఆదివాసీ ప్రాంతాలకు చెక్ డ్యాంలు నిర్మించాలనీ, ఎత్తిపోతల పథకాల ద్వారా, కాలువల ద్వారా నీరందించాలనీ గత ఇరవై సంవత్సరాలుగా మావోయిస్టు పార్టీ నాయకత్వంలో ఆదివాసీ ప్రజలు పోరాడుతూనే ఉన్నారు. మావోయిస్టుల 14 డిమాండ్లలో ఒకటైన పొల్లూరు దగ్గర ఎత్తిపోతల పథకం ద్వారా మన్యంకొండ ప్రాంతానికి నీరందించాలన్నది ఒక డిమాండ్. దీని ద్వారా ఆదివాసులకు, పీడితులకు ఎంతో మేలు జరుగుతుంది.

అభివృద్ధి అనేది మానవ వికాసానికి దోహదపడాలి. వారి జీవితాలలో మార్పును తీసుకురావాలి. అంటే కనీస అవసరాలయిన తిండి, ఇల్లు, బట్టలు లభించేలా ఉండాలి. గౌరవప్రదంగా, స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించగలగాలి. విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధిని పొందేలా ఉండాలి. ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడేలా పరిశ్రమలు, వ్యవసాయరంగాలపై దృష్టి పెట్టాలి. రాజకీయాలలో ఆదివాసులు క్రియాశీలమైన భూమికను కలిగి అధికారంలో భాగం కావాలి. కాని పాలకుల 'గోరంతల' అభివృద్ధి ఆదివాసులకు అడవి, భూమి, నీరు పైన హక్కులనే గాక తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను, భాషలను ధ్వంసం చేస్తూ జాతుల లేదా తెగల మనుగడే లేకుండా చేస్తోంది. దీనిని మార్చాలి. మానవ సమాజ పటిష్టమైన నిర్మాణానికి, సాంస్కృతిక వికాసానికి కృషి చేయాలి. అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసానికి వ్యతిరేకంగా పోరాడాలి.

పి.ఎచ్.సి.లు, స్కూల్స్, రోడ్ల నిర్మాణం చేపట్టిన గ్రామాలలో లింక్ రోడ్ల నిర్మాణం చేసినా ప్రజల ప్రయోజనం ఏమాత్రం నెరవేర్చనప్పుడు అభివృద్ధి ఎలా అవుతుంది? అభివృద్ధి పేర కోట్లాది రూపాయలు అప్పనంగా 'స్వాహా' చేయడం తప్ప. పి.ఎచ్.సి.లు, స్కూళ్లు, హాస్టళ్లు గత ఐదు సంవత్సరాలుగా కూంబింగ్ నిర్వహించే పోలీసుల విడిదికి లేదా క్యాంప్‌లకు వినియోగించుకుంటున్నారు. ఈ అరకొర పి.ఎచ్.సి., స్కూళ్లు, హాస్టళ్లు ఉన్నా అవి ఆదివాసుల వికాసానికి ఏ మాత్రం దోహదపడడం లేదని నేను అరెస్టు అవ్వడానికి ముందు చేసిన అధ్యయనంలో తేటతెల్లం అయింది. నా అధ్యయనం లో ఎన్నో విషాదకరమైన, దైన్యమైన సంఘటనలు బయటకొచ్చాయి.

అవి, 1) ఆదివాసీ భాషలు, సంస్కృతి, సాంప్రదాయాలు కృశించిపోవడం; 2) ఆదివాసీ జనాభా రోజురోజుకూ వేగవంతంగా తగ్గిపోవడం; 3) జీవనాధారమైన భూములను, వనరులను కోల్పోవడం వంటి గమనించాల్సిన ప్రముఖమైన అంశాలు. ఒక్కొక్కటిగా విశ్లేషించి వాస్తవిక పరిస్థితిని పరిశీలిద్దాం.

ఆదివాసులు దైనందిన సమస్యలు పరిష్కరించుకోవడానికి అత్యల్పమైన సాధన సంపత్తితో అన్నీ తానే అయ్యి జీవించడం ఒక వాస్తవం. కమ్మరి, వడ్రంగి, నాయీ బ్రాహ్మణ, గౌడ్ మొదలైన వృత్తులతో పాటు అల్లికలు, కళలు, సంస్కృతిలో ఎంతో సుందరంగా తీర్చిదిద్దడం చూస్తే ఆదివాసులు తమ జీవిక సంఘర్షణలో నైపుణ్యతను సాధించిన కళాకారులు. ఏకలవ్య అవార్డులు పొందిన ఆధునిక శిక్షణలో కూడిన విల్లుకాడులు, షూటర్స్ అంతా ఆదివాసుల విల్లు- కాడి, బర్మార్‌ల ముందు దిమ్మెతిరిగి పోవాల్సిందే. చెట్లను ఎక్కడం- దిగడం నుండి అడవితో పెనవేసుకున్న వారి జీవితం ఇందులో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోవడానికి తనే ఇంజినీర్, డాక్టర్, సైంటిస్ట్, సామాజికవేత్త. ఇంతటి శక్తియుక్తులను కలిగి ఉన్న ఆదివాసులు తమ భాష, సంస్కృతి నుండి తప్పుకుంటూ తెలియకుండానే ఒడియా, బెంగాలీ సంస్కృతుల వైపు మొగ్గుతున్నారు. అయినప్పటికీ విద్య, ఉద్యోగ రంగాలలో 99 శాతం వెనుకబడడానికి గల కారణాలు చూద్దాం.

ఆదివాసీ తెగలకు చెందిన పిల్లలు విద్యను అభ్యసించక పోవడానికి కారణాలు అనేకం ఉన్నాయి. నేను ఆదివాసీ విద్యార్థినీ, విద్యార్థులతో చర్చించి పరిశీలించిన మేరకు అర్థమైనది భాషను సమస్య ప్రధానమైన అడ్డంకిగా కనిపించింది. వీరు వీరి మాతృభాష మాత్రమే అర్థం చేసుకోగలుగుతారు. స్కూల్‌కు వెళ్లిన దగ్గరి నుండి ఒడియా భాషను అభ్యసించాలి. వీరు భాషను వినడం ఇక్కడ నుండే ప్రారంభ మవుతుంది. నిత్యం మాట్లాడుకొనేది (ఇంట్లో, గ్రామాలలో) వారి వారి మాతృభాషలే. భాష సమస్యను అధిగమించడం పెద్ద సమస్యగా మారుతుంది. ఒడియా చదివిన కోయ విద్యార్థులతో మాట్లాడినప్పుడు వ్యాకరణం, పదాలను అర్థం చేసుకోవడం, ఉచ్చరించడం లాంటి భాషా సమస్యలు, ఇందులో ఉన్న కఠినత్వం వీరిని ఆత్మన్యూనతకు గురిచేస్తాయి. ఈ భాష ఇక మాకు రాదు అనే నిరాశలోకి వెళ్తుంటారు. మాట్లాడడం వస్తే చదవడం రాదు, చదవడం వస్తే రాయడం రాదు. ఈ విధమైన భాషా సమస్యలను అన్ని ఆదివాసీ తెగలు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారు కూడా ఒక పిటిషన్ రాయాలంటే రాయడానికి సిద్ధపడకపోవడం వంటివి వారిని భాషాపరమైన సమస్యలు ఎలా పీడిస్తున్నాయో అర్థమవుతుంది. ఈ సమస్యలతోనే చదువును మధ్యలో మానేయడం, లేదా ఫెయిల్ అవ్వడం వంటి అతి సున్నిత విషయాలను పాలకులు దృష్టిలో పెట్టుకోకపోవడమే ప్రధాన సమస్య. పై పరిస్థితిలో కూలీనాలో, షికారో, వలసపోవడమో, వ్యవసాయమో చేసి జీవించవచ్చు అనే భావనకు రావడం జరుగు తుంది. జైలుకు వచ్చిన యువకులతో – చదువెందుకు మానేశారు అని ప్రశ్నిస్తే పై పరిస్థితితో పాటు పేదరికం కూడా పేర్కొన్నారు. ఒడియాతో పాటు ఇంగ్లిష్, హిందీ వంటి తమ భాషగాని భాషలంటేనే భయం అన్నది గుర్తించడం అవసరం. పై పరిస్థితులు పాలకులకే అర్థం కానప్పుడు ఎలాంటి వసతులు లేకుండా ఉపాధ్యాయులు అనేకమైన మానసిక ఒత్తిడులతో మొక్కుబడి వ్యవహారంగా తరగతులు నిర్వహించడం మరో ముఖ్యమైన సమస్య.

గ్రామాలలో పాఠశాలలు ఉన్నా పిల్లలు రారు. ఇంటింటికెళ్లి పిల్లలను పిలుచుకు రావాలి. జ్వరాలు, అనారోగ్యా లతో పిల్లలు బాధపడుతుంటారు. పిల్లలు వచ్చినప్పుడు ఉపాధ్యాయులు రారు. ఈ పరిస్థితుల్లో ఉపాధ్యాయులు నెలకు ఒకటి, రెండుసార్లకంటే ఎక్కువగా పాఠశాలకు వెళ్లనివారి సంఖ్య పెద్ద మొత్తంలోనే ఉంటుందని జైలుకు వచ్చిన ఒక ఉపాధ్యాయునితో చర్చించడం ద్వారా అర్థమైంది. ఈ విధంగా విద్యా, ఉద్యోగరంగాలలో ఆకాశమంత దూరాన ఉంటూ, తమ భాష, సంస్కృతి, సాంప్రదాయాలకు దూరమైపోతున్నారు. ఆదివాసీ భాషా, సంస్కృతులలో ఒడియా, బెంగాలీ సంస్కృతులు వచ్చి పడుతున్నాయి. ఆదివాసీ యువతీ యువకులు తమ తమ భాషలలో మాట్లాడడమే నామోషిగా భావిస్తున్నారు. ఇదంతా ఆదివాసీ ప్రజల భాషా సంస్కృతులు, సాంప్రదాయాలు కృశించి పోయేలా చేస్తున్నాయి. హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, స్కూళ్లు, కాలేజీలు ఏర్పాటు చేయడమే పరిష్కారం కాదు. ఆదివాసీ పిల్లలు విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో రాణించడంతో పాటు వారి భాష, సంస్కృతి, జాతిని సంరక్షించబడేలా విద్యావిధానాన్ని రూపొందించాలి. తమ భాష, సంస్కృతుల ఔన్నత్యాన్ని చాటుకునేలా చారిత్రక మూలాల అన్వేషణలు జరిపి తగిన ప్రాధాన్యతలను కల్పించి ప్రోత్సహించాలి.

అన్ని కాలాలలో ప్రజలు మలేరియా పీడనకు గురవుతుంటారు. మేం ఏ గ్రామానికి వెళ్లినా గ్రామంలోని అన్నిరకాల వ్యాధుల వారు మా దగ్గరకు వస్తారు. అంటురోగాలు నిత్యం వెన్నంటే ఉంటాయి. రోగులు చనిపోయే పరిస్థితి ఉన్నా వారి కుటుంబాలు, ప్రజలు పట్టించుకోరు. బతికించడానికి ఏ అధికారి, ప్రజా ప్రతినిధులు, మంత్రులు పట్టించుకోరు. కాబట్టి ఏం చేసినా లాభం ఉండదు అనే నిరాశయే పట్టించుకోకపోవడానికి కారణం. పది సంవత్సరాల లోపు బాల బాలికలు, యాభై సంవత్సరాలు పైబడినవారు కనిపించని గ్రామాలు చాలానే ఉన్నాయి అంటే ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. డయేరియాకు గురై అన్ని వయస్సుల వారు మరణిస్తుంటారు. ఎం.వి. 88 సంత పక్క గ్రామాలలో మూడు రోజుల్లో 25 మంది చనిపోగా మిగిలిన పది, పదిహేను మంది గ్రామం విడిచి వెళ్లారు.

ప్రతి రెండు సంవత్సరాలలో పదుల సంఖ్యలో మరణించడం సర్వ సాధారణం. కన్నగూడ అనే గ్రామంలో ఐదు సంవత్సరాల క్రితం

నాలుగు రోజుల వ్యవధిలో పన్నెండు మంది చనిపోయారు. గుంటబేడ పంచాయితీ కంకరపాడు గ్రామంలో గత సంవత్సరం ఒక స్త్రీ, ఇద్దరు పురుషులు మరణించారు. మల్కన్‌గిరి నుండి అనుభవజ్ఞులైన డాక్టర్ వెళ్లినా వారిని రక్షించలేకపోయాడు. ఈవిధంగా సంవత్సరం మొత్తం ప్రతి కుటుంబం ఏదో ఒక రోగానికి గురవుతూ మూల్గుతూ ఎండలో పడుకొని అవస్థను వెళ్లదీసుకుంటారు. ప్రతి పది సంవత్సరాలలో ఒక్కొక్క కుటుంబంలో రోగాల బారినపడి చనిపోయిన వారి సంఖ్య నాలుగు నుంచి ఐదు వరకు ఉంటుంది. చిన్న గ్రామంలో కూడా పది సంవత్సరాల కాలంలో నలభై నుండి యాభై మంది చనిపోతున్నారు అని చెప్పడం తక్కువే. ఇదే విధమైన పరిస్థితి కొనసాగినట్లయితే మరో పాతిక సంవత్సరాలలో ఆదివాసీ జనాభా అంతరించిపోయే పరిస్థితిలో ఉన్నదని చెప్పడం వింతేమీ కాదు. ఇంత పెద్ద మొత్తంలో ఆదివాసులు అనారోగ్యానికి గురై చనిపోతుంటే పాలకులకు చీమకుట్టినట్టుగా కూడా లేకపోవడం బాధాకరం.

మావోయిస్ట్ పార్టీ కలెక్టర్ ఆర్. వినీల్‌కృష్ణను విడుదల చేసిన సందర్భంలో కలెక్టర్ ఒక్క విషయాన్ని బాధ్యతగా మాట్లాడడం జరిగింది. 'నేను ప్రజల వద్దకు వెళ్లకుండా కింది సిబ్బందిని వెళ్లమని ఆదేశించడం ఉచితం కాదు' అని అన్నాడు. కానీ మేం మార్చ్ 22న సమస్యల పరిష్కారానికి స్ట్రైక్ చేసినప్పుడు జైలు సూపరింటెండెంట్ కలెక్టర్‌ను ఆహ్వానించడానికి వెళ్లగా నన్ను ప్రభుత్వం ఎక్కడకు వెళ్లవద్దని ఆదేశించిందని సబ్‌కలెక్టర్‌ను పంపిస్తానని చెప్పడం ద్వారా మారిన స్థితి అర్థమైంది. మంత్రులవుస ఎం.ఎల్.ఎ., ఎం.పిలకు, కలెక్టర్లకు కట్టుదిట్టమైన రక్షణ కల్పిస్తూ ఇతర ఉద్యోగస్తులకు రక్షణ వసతులు కల్పించకుండా వెళ్లి పనిచేయమని ప్రభుత్వం ఆదేశించడానికి నైతికతా, ఆదర్శాలు ఉన్నట్టా? లేనట్టా? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. చిన్న ఉద్యోగస్తుల రక్షణ, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా మారుమూల ప్రాంతాల అభివృద్ధి గురించి మాట్లాడడం బోగస్.

జిల్లాలో ఉన్న పి.ఎచ్.సి.లను పరిశీలిస్తే పేరుకు మాత్రమే ఉన్నట్టు. డాక్టర్ ఉండడు, సిబ్బంది ఉండరు. ఉన్న దగ్గర ఇచ్చే మందులు పనిచేయవు. ఒక్క మందులు మాత్రమే వాడితే రోగాలు తగ్గిపోవు అనేది తెలిసిందే. పోషకాహారం కాదు కనీస ఆహారం లేకుండా మందులు తినడం వల్ల వచ్చే రియాక్షన్స్ వలన మందులు తినడం కన్నా తినకుండా ఉంటే మంచిగుంటుంది అనే భావన బలంగా నాటుకుపోయింది. గతంలో మలేరియా జ్వరం వచ్చినప్పుడు ఇచ్చే క్వినైన్ ఔషధం మెదడు, నాడీ వ్యవస్థను తీవ్ర ప్రభావానికి గురిచేయడం మూలంగా మందులు తీసుకోవడానికే భయపడేవారు. ఇలాంటి దుర్భలమైన పరిస్థితుల్లో ఎ.ఎన్.ఎం.లు గ్రామాలలోని కొద్దిమంది యువకులకు జ్వరానికి, నొప్పులకు, సడిదికి, వాంతులు-విరోచనాలకు వేరు వేరుగా మాత్రలు ఇచ్చి వెళ్తారు. నెలకు ఒకసారి ఎక్కువలో ఎక్కువగా రెండుసార్లు వస్తారు. డయేరియా లాంటి ప్రాణాంతక వ్యాపిత రోగాలు వచ్చినప్పుడు పరిస్థితి ఎంత తీవ్రస్థాయికి చేరుతుందో అర్థమవ్వడం కష్టమేమి కాదు. చికున్‌గున్యా లాంటి వింత వింత రోగాలు దాడులు చేస్తుంటే విషయ పరిజ్ఞానం లేని సిబ్బంది, అరకొర వనరులతో ప్రజలను చావకుండా ఆపాలని తపనతో ఉన్న డాక్టర్లు ఉన్నప్పటికీ సమస్యకు పరిష్కారం దొరకదు. పై సమస్యలన్నింటికి పరిష్కారం చూపకుండా అభివృద్ధి గురించి ఊదరగొట్టడం వల్ల ప్రయోజనం ఏమీ ఉండదు.

ఆదివాసుల ప్రధానమైన ఆర్థిక వనరు పోడు వ్యవసాయం. గత నాలుగైదు దశాబ్దాలలో గిరిజనేతరులు వచ్చి చేరుతుంటే సామాజిక అసమానతలు విపరీతంగా పేరుకుపోతున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణం, రవాణా, కమ్యూనికేషన్స్ విస్తరించి, వ్యాపార, వాణిజ్య రంగాలు అభివృద్ధి చెందాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు, అటవీ ప్రాంతాలు, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలుగా వర్గీకరించవచ్చు. ఒక్కొక్కటిగా పరిశీలిద్దాం.

లోతట్టు ప్రాంతాలు : వీరిది సాంప్రదాయిక వ్యవసాయం. రాగులు, కొర్రలు ప్రధానంగా పండిస్తారు. అక్కడక్కడ కందులు, అలసింతలు, పెసల్లు పండించినా వారి రెండు, మూడు నెలల అవసరాలను కూడా తీర్చవు. గోంగూర, గుమ్మడి, చిక్కుళ్లు, పచ్చిమిర్చి, టమాట, వంకాయ విత్తనాలు నాటుతారు. కొండలకు వాలుగా చదును చేసి వ్యవసాయం చేస్తారు. అన్ని కల్సివచ్చి మంచిగా పండితే మూడు, నాలుగు నెలలకు సరిపడా ధాన్యం వస్తుంది. సంవత్సరంలో నాలుగు నెలలు వెదురుకొమ్ములు, పనసకాయలు, పండ్లు, దుంపలపై ఆధారపడి కాలం వెళ్లదీస్తారు. వీరికి రోజుకు ఒక్క రూపాయి ఆదాయమని చెప్పడం కూడా అన్యాయమే అవుతుంది. కొందరికి పశువులు, కోళ్లు, మేకలు, పందులు ఉన్నా చాలా తక్కువే. పెద్దల ఆగ్రహానికి గురికాకుండా ఉండడానికి వారి అవసరం వచ్చినప్పుడల్లా ఏదో ఒక పేరుతో పంది లేదా మేకను సమర్పించుకోవాల్సిందే. ఈ మధ్య కాలంలో పోలీసులు మేకలు, కోళ్లు, పందులు చంపి లేదా చంపక తీసుకెళ్లడం జరుగుతోంది. కోళ్లు, చీపుర్లు, వెదురు బుట్టలు, పనస పండ్లు, అటవీ ఉత్పత్తులను కొండలు ఎక్కుతూ దిగుతూ ఎంతో కష్టంతో సంతకు తీసుకెళ్లితే షావుకారులు ఆదివాసులకు కావాల్సిన దినుసులు నాసిరకంవి ఎక్కువ ధరకు ఇచ్చి, ఆదివాసులు తీసుకెళ్లిన వాటికి చాలా తక్కువ ధర చెల్లిస్తారు. ఆదివాసులు వారంకు సరిపడ వచ్చాయా? లేదా? అనేదే చూస్తారు తప్ప, ధర నాణ్యతలను చూడరు. 15, 20 కిలోల బరువుండే పనసపండు మోసుకెళ్లితే ఐదు రూపాయలు ఎక్కువలో ఎక్కువగా పది రూపాయలు ఇస్తారు. సంతకెళ్లిన వారు ఏదో ఒక రకమైన సారాయి తాగాల్సిందే. లేకుంటే కొండలు ఎక్కడం, దిగడం సాధ్యపడదు. పై పరిస్థితులను గమనించిన షావుకార్లు తమిళనాడు, కేరళ నుండి వచ్చి స్థానికుల సహాయంతో గంజాయి వ్యవసాయం చేస్తున్నారు. స్థానికులు కూడా పెద్ద మొత్తంలోనే గంజాయి వ్యవసాయాన్ని చేస్తున్నారు. చత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ముంబై, సూరత్, బెంగళూర్, చెన్నై, హైదరాబాద్ మొదలైన ప్రాంతాలలో వ్యాపారం చేస్తున్న వారంతా ఇక్కడి వారితో సంబంధాలు పెట్టుకొని వ్యాపారం చేస్తున్నారు. స్థానికులకు నేర్పింది దేశీయ గంజాయి సేద్యం చేయడం. దీనికి పెద్దగా ఖర్చు ఉండదు. ఆ తరువాత మోటార్ల సహాయంతో వాగులు, వంకల్లోని నీటినితోడి, ఎరువుల వాడకం ద్వారా 'శీలవతి' అనే హైబ్రీడ్ వంగడాలను సాగుచేయడం ప్రారంభించారు. దీంతో దేశీయ గంజాయి కొనుగోళ్లు పడిపోయి ధర తగ్గించారు. దళారీలు షావుకార్లతో సంబంధాలు కొనసాగిస్తూ రైతులకు కొద్దిపాటి డబ్బు ఇవ్వడం, తరువాత ఇస్తానని వివిధ కారణాలు చెప్తూతూ ఇవ్వని

భూమికీ, మనిషికీ సంబంధాన్ని నిర్దేశించే రెవెన్యూ పాలన ప్రారంభం, పూర్వాపరాల చరిత్రను వివరిస్తున్నారు

ఎస్. సరళా వందనం

ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన - 9

(గత సంచిక తరువాయి...)

బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో రెవెన్యూ పరిపాలన (1766–1856)

ఈస్ట్ ఇండియా కంపెనీ తన పాలనలో ఉన్న మద్రాస్ ప్రెసిడెన్సీలో రెవెన్యూ యంత్రాంగాన్ని ఈ కింది విధంగా నియమించింది.

రెవెన్యూ బోర్డు (సభ్యులు ఉంటారు).

↓

జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ (యూరప్ సిబ్బంది)
(కార్యాలయంలో హుజూరు శిరస్థదారు పరిపాలనా వ్యవహారాలు చూస్తాడు. నాయబ్‌శిరస్థదారు సహాయకులుగా ఉంటారు)

↓

సబ్ కలెక్టర్ లేదా రెవెన్యూ డివిజనల్ అధికారి

↓

అమీన్, సమల్‌దార్ / తాహసిల్దార్
(తాలూకాకు ఉంటారు. వీరి కింద డిప్యూటీ తహసిల్దార్ ఒకరు హెడ్ క్వార్టర్‌లో ఉండి పాలనా వ్యవహారాలు చూస్తుంటే ఇంకొక డిప్యూటీ తహసిల్దార్ తాలూకా అంతా పర్యటిస్తూ అధికారులకు రెవెన్యూ విధులలో సహాయం చేయడానికి ఉంటారు)

↓

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్
(తాలూకాలో పరిపాలనా సౌలభ్యం కోసం కొన్ని గ్రామాలకు రెవెన్యూ విధులను నిర్వహించడానికి ఇద్దరు లేక ముగ్గురు ఉంటారు)

↓

కరణం, మున్సిఫ్ (వారసత్వ రీత్యా నియమింపబడతారు)
((గ్రామ లెక్కలు, రెవెన్యూ నిర్ధారణ, రెవెన్యూ వసూలు, సర్వే పనులు, పోలీసు విధులు, గ్రామంలోని భూ తగాదాల పరిష్కారం నిర్వహిస్తారు

↓

గ్రామ సేవకులు (నీరు కట్టు, తలారి, వెట్టి)
((గ్రామాధికారులకు రెవెన్యూ, ఇతర విధుల్లో, గ్రామాల్లో జరిగే విషయాలపై సమాచారం, సహకారం అందిస్తారు.)

1841–1850ల మధ్య గుంటూరుకు అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేసిన 'హెన్రీ నెవిల్' రెవెన్యూ అమీన్ విధులను చక్కగా వివరించాడు.

1) కలెక్టర్ ఉత్తర్వులను బట్టి మాత్రమే భూములను స్వాధీనం చేసుకోవడం, వదిలేయడం, సాగు చేయడం జరిగేలా చూడాలి. 2) హుజూర్ సిరస్థదారు ఆధ్వర్యంలో సాలీనా జమాబందీ లెక్కలు, తదితర సమాచార వివరాలు నిర్ణీత ఫారాలలో సిద్ధం చేయాలి. జమాబంది అయిపోయిన తరువాత హుజూరుకు సమర్పించడం. 3) పశువుల

సంఘటనలు ఎన్నో ఉన్నాయి. చుట్టూ తిరిగి చివరకు రైతులకు మిగిలింది అప్పులే. మొదట్లో కొద్దిమంది డబ్బులు సంపాదించినా అత్యధిక లాభాలను గడిస్తుంది షావుకార్లు, దళారీలు, పోలీసులే. ఇందుకోసం వినియోగించే కూలీలు, డ్రైవర్లు, క్లీనర్లు దళారీల మోసాలకు, ఆశలకు గురవుతూ చేసేది గంజాయి వ్యాపారం అని తెలియక అరెస్టయ్యి జైళ్లలో సంవత్సరాలుగా మగ్గుతున్నారు. శిక్షలు పడేది కూడా వీరికే. కోట్ల రూపాయలు ఆర్జించిన దళారీలు రోజూ పోలీసు అధికార్లతో కలిసి చాయితాగడం అనేది వాస్తవం. మావోయిస్టు పార్టీ గంజాయి పంటను నిరుత్సాహపర్చుతూ ప్రత్యామ్నాయంగా జొన్నలు, మక్క జొన్నలు, పప్పు దినుసులు, కూరగాయలు, పండ్లు, చేపల పెంపకం వంటివి సూచించడమే గాక విత్తనాలు, పండ్ల మొక్కలు, చేప పిల్లల పంపిణీ చేయడం జరుగుతోంది. మోటార్లు పెట్టి 'శీలవతి' గంజాయి పంటకు పండిస్తున్న వారి పంటను ధ్వంసం చేసే కార్యక్రమం ప్రజలకు ఇవ్వడం జరిగింది.

ఆదివాసుల కోసం అని చెప్పబడతున్న ప్రభుత్వ పథకాలు వారికి చేరుతున్నది చాలా తక్కువ. లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ఆదివాసులందరు ఉచిత బియ్యానికి అర్హులు. కాని వీరికి అవి అందడం లేదు. కొద్దిమంది బిపిఎల్ కార్డులు ఉన్నా క్రమం తప్పకుండా ప్రతి నెల అందేది లేదు. మూడు–నాలుగు నెలలకు ఒక్కసారి అందడం మహా ఎక్కువ. ఇందులో రెండు ప్రకారాల సమస్యలు ఉన్నాయి. ఆదివాసుల దగ్గర డబ్బులు ఉన్నప్పుడు బియ్యం రావు. బియ్యం వచ్చినప్పుడు డబ్బులుండని పరిస్థితి. వీరికి చెందాల్సిన బియ్యాన్నే తిరిగి షావుకార్ల దగ్గర పది రూపాయలకు కిలో కొనుగోలు చేయడం నేను స్వయంగా చూశాను. కిరోసిన్ 90 శాతం బ్లాక్ మార్కెట్‌లోకి వెళ్లుతోంది. రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, పెద్ద షావుకార్లు కల్సి చేస్తున్న పెద్ద దోపిడీ. ఇదంతా బహిరంగ రహస్యమే.

(ఇంకా వుంది)

(రచయిత మావోయిస్ట్ నాయకులు, రాజకీయ ఖైదీ) వీ

మేత తదితర పన్ను వసూళ్లు. 4) కింది స్థాయి క్షేత్ర పరిశీలకులను పర్యవేక్షించడం. 5) రైతు రసీదులకు పోల్చి ప్రతి గ్రామకరణం చిట్టా పుస్తకాలను తనిఖీ చెయ్యడం. 6) రెవెన్యూ వచ్చే ఇతర లెక్కలను తయారు చేయించడం. 7) రెవెన్యూ వసూలును నెలవారీ హుజూరు ట్రెజరీకి జమ చేయడం. 8) తాలూకా కచేరీలలో రికార్డులు భద్రపరచడం, వాటిని తరచూ తనిఖీ చేయండి. 9) నెలవారి పెన్షన్ల పంపిణీ తనిఖీ, వాటి లెక్కల్ని హుజూర్‌కు అందజేయడం. 10) టీకాల కార్యక్రమం పరిశీలించడం. 11) అబ్కారీ షాపుల నియమావళిని పరిశీలించడం, తనిఖీలు చేయడం. 12) తహసిల్దారు, షరాఫ్‌లకు కుదువబెట్టిన ఆస్తులను పరిశీలించడం. 13.) చెరువుల కాల్వల నీటి సరఫరా పర్యవేక్షణ. 14) కాలదోషం పట్టిన ఇనాము భూములను నమోదు చయడం. 15) నిధులు, ధనం కాజేసిన వాటిని తనిఖీ చేయడం. 16) గుప్త నిధులను ట్రెజరీకి అందజేసి, వాటికి సంబంధించిన సమాచారం హుజూరుకు అందించడం. 17) సరిహద్దు తగాదాలు పరిష్కరించడం. 18) సాధారణ విషయాలన్నీ కలెక్టర్‌కు నివేదించడం, అన్నింటిపై నివేదికలు పంపడం, అసాధారణ విషయాలను అత్యవసరంగా కలెక్టర్‌కు నివేదించడం. ఈ అమీన్ల కింద గ్రామ రెవెన్యూ యంత్రాంగం, తాలూకా రెవెన్యూ యంత్రాంగం విధులు నిర్వర్తించేది.

ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో మద్రాస్ ప్రెసిడెన్సీ ఉత్తర కోస్తా తీర జిల్లాలు (గంజాం నుండి నెల్లూరు), రేనాడు (రాయలసీమ జిల్లాలు)లలోని ప్రజలు ఎండిన భూములతో చాలా దీనస్థితిలో బతుకుతుండే వారు. వీటికి తోడు కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాలలోనైతే తరచూ వరదలు, అవి పోగానే కరువు మార్చి మార్చి వచ్చేవి. ఒకవైపు గాలివానలతో, ఉప్పెనలతో మరోవైపు మిడతల దండు దాడులతో ప్రజల జీవనం అస్తవ్యస్తమవుతుండేది. 1832-33లో మద్రాస్ ప్రెసిడెన్సీలో ఉన్న ఆంధ్ర రాష్ట్ర ప్రాంతాలలో పెద్ద కరువు వచ్చి 1832-35 మధ్య సగం జనాభా చనిపోయారు. గార్డన్ మెకంజీ చెప్పినట్లు రోజూ వందలాది మంది ఆకలితో చనిపోయేవారు. దృఢకాయులైన పోలీసులను శవాలను పోగుచేయడానికి పెట్టినా చాలక మృతదేహాలను కుక్కలు, గద్దలు, డేగలు పిక్కు తింటుండేవి. 1822 నుంచి మద్రాస్ ప్రెసిడెన్సీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్న **'ఆర్థర్ కాటన్'** 1833లో వచ్చిన కరువుతో ప్రజలు చనిపోవడం, కుటుంబాలు చిన్నా భిన్నం కావడం దగ్గర నుంచి చూసి చలించిపోయాడు. దానితో కృష్ణా, గోదావరీ నదుల పరీవాహక ప్రాంతాలలోని ప్రజలను కరువు బారినుండి కాపాడడానికి, వరదల ముప్పు తొలగించడానికి, వరద కాల్వలు, నదుల నుంచి నీరు వృథాగా పోకుండా నీరు నిల్వ ఉంచడానికి 1844లో కృష్ణా గోదావరి పరీవాహక ప్రాంతాలలో కాలువలు, కట్టలు నిర్మించడం, గట్లు పోయడం, ఆనకట్టలు కట్టడం మొదలగు సమగ్ర ప్రణాళికను తయారు చేసి బోర్డు ఆఫ్ రెవెన్యూకు సమర్పించాడు. బోర్డు అనుమతితో 1847లో గోదావరి నదిపై ధవళేశ్వరం వద్ద ఆనకట్ట మొదలుపెట్టి 1852లో పూర్తిచేశాడు. కృష్ణా నదిపై 1851లో విజయవాడ దగ్గర ఆనకట్ట కట్టడం మొదలుపెట్టి 1855లో పూర్తిచేశాడు. ఈ రెండు నదుల పరీవాహక ప్రాంతాల భూములలో సక్రమ నీటి పారుదల కోసం కాలువలను నిర్మించి గట్లు పోయడం, కట్టలు కట్టడం, చెరువులకు నీళ్లు మళ్లించడం, రహదారులు నిర్మించడం కాల పరిమితితో కూడిన సమగ్ర ప్రణాళికతో అప్పట్లో ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం లేకపోయినా ఇప్పటికి 150 సంవత్సరాలు గడిచిపోయినా చెక్కుచెదరకుండా దృఢంగా కట్టాడు. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో ఒక పెద్ద నీటిపారుదల వ్యవస్థను నిర్మించి, బ్రిటిష్ వారికి రెవెన్యూ వచ్చే విధంగా, రాష్ట్రానికి మేలు కలిగే విధంగా చేశాడు.

బ్రిటిష్ ప్రభుత్వ పాలనలో రెవెన్యూ పరిపాలన (1857-1947)

ఈస్ట్ ఇండియా కంపెనీ ఒక ప్రణాళిక ప్రకారం భారతదేశ భూభాగాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకోవడానికి, తద్వారా రెవెన్యూ వసూలు చేసుకొని తన దేశానికి పంపడానికి, ముందుగా మొఘలుల దగ్గర, స్థానిక రాజుల దగ్గర నుంచి రెవెన్యూ వసూలు చేసుకొనే అధికారం పొందింది. తరువాత స్వయంగా తనే రాజ్యాలను ఆక్రమించుకోవడం, ఆక్రమించుకున్న ప్రతిచోట రెవెన్యూ బోర్డును నెలకొల్పడం, అలానే పరిపాలన కోసం రెవెన్యూ వసూలు కోసం కలెక్టర్ల వ్యవస్థ, కింది స్థాయి రెవెన్యూ వ్యవస్థను నియమించుకొంది. రకరకాల చట్టాలు చేసి వాటి ద్వారా భూమిపై అధికారం ఉండి పరిపాలన చేస్తున్న వారినీ, తమ సేవల ద్వారా భూమిని పొంది పంట పండించుకొని బతికేవారినీ, వారసులు లేరనే సాకుతోనో, రెవెన్యూ కట్టడం లేదనే సాకుతోనో ప్రతి ఒక్కరాజునూ, జమీందారునూ, ఇనాము దారులనూ, మామూలు రైతులనూ ఇలా అందరినీ తన సంపాదన కోసం చట్టాలను అతిక్రమించి నట్లుగా చూపి తనకు బానిసలుగా, తను ఇస్తే మాత్రమే ఏదైనా లభిస్తుంది అనే విధంగా చేసింది. ప్రతి పాలకుని ఆధీనంలో ఉన్న భూమికి రెవెన్యూ తనకు పెద్ద మొత్తంలో కట్టాలని చట్టాల ద్వారా, అధికారిక ఉత్తర్వుల ద్వారా చూయించి, వారు కట్టకపోతే వారి పాలనలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకోవడం, వారసులు లేరని భూమిని స్వాధీనం చేసుకోవడం (ఝాన్సీ లక్ష్మీబాయి విషయంలో జరిగినట్లుగా), పాలకుల కుటుంబ అవసరాలకు మాత్రమే సరిపడా భూమిని ఉంచి మిగతా భూమిని స్వాధీనం చేసుకొని వారికి పెన్షను ఇవ్వడం (ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి), సేవా భూములన్నింటికీ కొత్తగా భూమి శిస్తు విధించడం వారు కట్టలేని పక్షంలో ఆ భూములను స్వాధీనం చేసుకోవడం చేసింది. మిలిటరీ వారు ఇక భవిష్యత్తులో సైన్యాన్ని తయారు చేయాల్సిన అవసరం లేదని వారి భూమిని స్వాధీనం చేసుకోవడమే కాకుండా జంగి కట్టుబడులకు ఇచ్చిన ఇనాం భూములను కూడా రద్దు చేసింది. ఇలా ఒక పథకం ప్రకారం అన్ని రకాల వ్యక్తులనూ, అధికారులనూ, రైతులనూ, ముందుగా రెవెన్యూ డిమాండ్‌ను పెంచడం, కట్టలేదనే సాకుతో భూములను స్వాధీనం చేసుకోవడం, తరువాత రెవెన్యూను తాము పొందడానికి రకరకాల చట్టాల్ని సాకుగా చూపి భూమిపై, భూసంపదపై రెవెన్యూ వసూలు చేసుకొనే అధికారాన్ని బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పొందడమే 1857లో జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామానికి ముఖ్య కారణం. అది సిపాయిల తిరుగుబాటు రూపంలో తుపాకులకు ఆవు కొవ్వు, పంది కొవ్వు పూస్తున్నారనే కారణంతో బయటికొచ్చింది.

రెవెన్యూ వసూలు కోసమే, దానిపై పట్టుకోసం మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామం 1857లో జరిగిందనేది ఒక చారిత్రక వాస్తవం.

మొదటి స్వాతంత్ర్య సంగ్రామంలో నిజాం తన సంపూర్ణ మద్దతును ఈస్ట్ ఇండియా కంపెనీకి తెలిపి, సైన్యంతో యుద్ధంలో కూడా సహాయం చేసి దానికి బదులుగా ఉస్మానాబాద్, రాయచూర్, బీదర్‌లను తిరిగి పొందాడని కూడా ఇదివరకే చెప్పుకున్నాం. 1857 తరువాత ఆంధ్రప్రదేశ్ లోని కోస్తా తీర ప్రాంతంలోని గంజాం నుంచి నెల్లూరు వరకూ, దత్త మండలాలైన రాయలసీమ జిల్లాలు బ్రిటిష్‌రాణి పూర్తిపాలనలోకి మిగిలిన భారతదేశంలోని ఈస్ట్ ఇండియా పాలనలో ఉన్న ప్రాంతాల లాగానే చేరాయి.

మద్రాస్ ఇరిగేషన్, కెనాల్ కంపెనీని 1857లో స్థాపించారు. ప్రైవేట్ వ్యక్తులు కానీ, కంపెనీలు కాని కాలువలు తవ్వి నీటి పారుదల వ్యవస్థలను కల్పిస్తే, తరువాత ప్రభుత్వం ఐదు శాతం వడ్డీతో పెట్టిన పెట్టుబడికి గ్యారంటీ ఇచ్చేటట్లు ఒప్పందం చేసుకొనే విధంగా కెనాల్ కంపెనీని స్థాపించారు. ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టల వలన వాటి అనుబంధ కాలువల ద్వారా రెవెన్యూ బాగా పెరగడంతో ముందుగా 1860లో ఆలంపూర్ దగ్గర తుంగభద్ర నదిపై ఆనకట్ట కట్టడానికి నిర్ణయించుకొని లక్ష రూపాయలు ఖర్చు చేసిన తరువాత అక్కడ లోతు చాలా తక్కువ ఉందని ఆనకట్ట వలన కర్నూలు, ఆలంపూర్ ఎక్కువ మునిగిపోవడమే కాకుండా, ఉపయోగం కూడా పెద్దగా ఉండదని వదిలేశారు. ఈ ఓటమితో 'మేజర్ ఓర్'తో ముందుగా సమగ్ర విచారణ చేయించి 1861లో కర్నూలు జిల్లా సుంకేసుల నుంచి కడప వరకూ 189 మైళ్ల కాలువను నిర్మించాలని ఒక మిలియన్ పౌండ్లు ఖర్చవుతుందనే అంచనాతో మొదలుపెట్టారు. కాని ఇప్పుడు జరుగుతున్నట్లుగానే కెనాల్ కంపెనీ పర్యవేక్షణ లోపం వలన, అప్పటి ప్రభుత్వాధికారుల పాలనాపరమైన తప్పు వలన కాంట్రాక్టర్ ఎక్కువ మొత్తంలో డబ్బు తిని, సరైన పని చెయ్యక పోవడంతో 1864లో 21వ మైలు నుంచి 40వ మైలు మధ్య కాలువ తెగిపోయి గండ్లు పడ్డాయి. తరువాత సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఆధ్వర్యంలో చివరకు 1882లో కాలువ నిర్మాణం మొత్తం పూర్తి చేశారు. ప్రభుత్వం 1882లో ఈ కాలువను రు. 1,78,61,901ను ఖర్చుగా నిర్ణయించి ప్రైవేట్ కంపెనీ నుంచి కొనుక్కొంది. ప్రభుత్వం కాలువను తీసుకోకముందే అంచనా కన్నా చాలా ఎక్కువ ఖర్చైనందుకు ఎ.ఎల్. లిస్టెన్ అనే అధికారిని కర్నూలు కడప కెనాల్ నుండి నీటిని వాడుకునేందుకు విధించాల్సిన నీటి పన్ను నిర్ధారణ కొరకు ప్రత్యేక అధికారిగా నియమించారు. అన్ని ఖర్చులు, జరిగిన తప్పులను పన్ను ద్వారానే పూడ్చుకోవాలని ఎకరానికి నీటి పన్నును ఆరు రూపాయలుగా నిర్ణయించాడు. సరిగ్గా నీరుపారించుకోలేక

		రు. ఆ.పై
1వ పంటకు నీరు పారిస్తే	రు. 4; ఎత్తిపోతల ద్వారా	3.0.0
2వ పంటకు నీరు పారిస్తే	రు. 3; ఎత్తిపోతల ద్వారా	2.4.0
2వ పంటలకు నీరు పారిస్తే	రు. 6 ఎత్తిపోతల ద్వారా	4.8.0
1వ మెట్ట పంటకు నీరు పారిస్తే	రు. 1 ఎత్తిపోతల ద్వారా	0.12.0
తోటల పంటలకు నీరు పారిస్తే	రు. 3. ఎత్తిపోతల ద్వారా	2.4.0
చెరకు తమలపాకు		
పంటలకు నీరు పారిస్తే	రు. 6 ఎత్తిపోతల ద్వారా	4.8.0
(8 నెలల పంటలు)		

పోవడం, పన్ను చాలా ఎక్కువ ఉండడం వలన రైతులు వ్యవసాయం చేయకుండా తమ పొలాలను బీడు భూములుగా వదిలిపెట్టారు. ప్రభుత్వానికి బదిలీ అయిన తరువాత నీటి పన్నును క్రమబద్ధీకరించి జి.ఒ. నెం. 448-1, తేది 6 జూన్ 1882 పబ్లిక్ వర్క్స్ ద్వారా ఎకరానికి నీరు పారించుకున్నందుకు ఈ కింద విధంగా నీటి పన్నును వసూలు చేయాలని నిర్ణయించారు.

ఈ పన్ను కాకుండా నీరు పారని భూమిని తరి భూమిగా మార్చుకోవడానికి ముందు ఐదు సంవత్సరాలు 50 శాతం నీటి పన్నును, తరువాత ఐదు సంవత్సరాలు 25 శాతం నీటి పన్నును తగ్గించి విధించారు. బాగా ధనిక రైతుల 50 ఎకరాల మెట్ట పొలాన్ని మాగాణి భూమిగా మార్చి వ్యవసాయం చేయడానికి తీసుకుంటే ముందు ఐదు సంవత్సరాలు నీటి పన్నును రద్దుచేసి, తరువాత ఐదు సంవత్సరాలు 50 శాతం పన్ను మాత్రమే కట్టే విధంగా నిర్ణయం తీసుకున్నారు.

ఒకవైపు నీటిపారుదల సౌకర్యాలు కల్పించడంతో పాటు మరోవైపు 1840 నుండి మొదలు పెట్టిన సేవా ఇనాముల క్రమబద్ధీకరణలో భాగంగా ముందుగా దేవాలయాలకు, మసీదులకు ఇచ్చిన భూములను వాటి అసలు సేవకు, నడపడానికి కావలసిన అవసరాలకు పోగా మిగిలిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొంది. వారసులు లేని స్వంత ఇనాములను వెనక్కు తీసుకున్నారు లేదా వారికి 1/8 వంతు నుంచి 1/2 వంతు పంటను భూమి శిస్తుగా విధించి, వారు కట్టలేని పక్షంలో భూములను స్వాధీనం చేసుకున్నారు. రెడ్డి, కరణాలు, మున్సిఫ్‌లు, పోలీసు ప్యూనులకు ఇచ్చిన ఇనాం భూములను రద్దు చేసి, వసూలు చేసిన భూమి శిస్తులో రూపాయిలో 5/8 వంతు భూమి పన్నును వీరందరికీ ప్రతి నెలా జీతం ఇచ్చే పద్ధతిగా నిర్ణయించి, వారి భూములను కూడా స్వాధీనం చేసుకున్నారు. చివరకు మాదిగ, తోటి, పాకీ పనిచేసే వారి భూములకు కూడా క్విట్ రెంట్ వసూలు చేయడం మొదలు పెట్టారు. నవాబు మిలిటరీ కోసం గ్రామాల్లో సైనిక శిక్షణ పొందిన జంగి కట్టుబడులకు ఇచ్చిన భూములను కూడా రద్దు చేశారు. 1861 కల్లా సేవా ఇనాం భూములను క్రమబద్ధీకరించి 1866లో 'ఎన్‌ఫ్రాంచైజ్డ్ ఇనాం' చట్టాన్ని తీసుకొచ్చారు. దీంతో చాలామంది భూమి శిస్తు కట్టలేక, వ్యవసాయం చేయడం మానుకొని, తమ భూములను రాజీనామా (రెలిన్‌క్విష్మెంట్) చేశారు, లేదా ప్రభుత్వం వారి భూములను స్వాధీనం చేసుకొంది. ఇలా పెద్ద విస్తీర్ణాలలో భూములు ప్రభుత్వపరమైనాయి.

1854-55లో ప్రొటెస్టంట్ మిషనరీల ద్వారా, కాథలిక్ మిషనరీల ద్వారా మాల, మాదిగ కులాల ప్రజలు విద్యకు, సాంఘిక జీవనానికి దూరమై చాలా ఘోరమైన స్థితిలో బతుకుతున్నారని తెలుసుకొని వారికి మిషనరీల ద్వారా ఆంగ్ల బోధనలో నడిచే పాఠశాలలు తెరిచి విద్య నందించడం మొదలుపెట్టారు. దళితులకు ప్రభుత్వ భూములను, బంజరు భూములను సాగు చేసుకోవడానికి ఇవ్వడం మొదలుపెట్టారు. చదువులేని దళితులను 4వ తరగతి ఉద్యోగులుగా రెవెన్యూ కార్యాలయాలలో చేర్చుకోవడమే కాకుండా రెవెన్యూ గ్రామ సేవకుల ఉద్యోగాలలో వారికి కూడా అవకాశం కల్పించి నియమించారు.

(ఇంకా ఉంది)

(రచయిత రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ అధికారి)
saralareddy007@gmail.com


వీ

సూర్యుడి నుండి, నక్షత్రాల నుండి వెలువడే వెలుతురు, ఉష్ణోగ్రత, శక్తి వెనుక గల భౌతిక నియమాలే హైడ్రోజన్ బాంబులోనూ ఇమిడి ఉన్నాయని అంటున్నారు **డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్**

హైడ్రోజన్ బాంబు భౌతిక సూత్రాలు

మన సూర్యుడూ, ఇతర నక్షత్రాలూ నిత్యమూ వెలుగుతూ, ఉష్ణాన్నీ, శక్తినీ వెలువరిస్తున్నాయంటే వాటిలో అణుసంయోగ ప్రక్రియలు జరుగుతూ ఉన్నందువల్లనే. మనం హైడ్రొజన్ బాంబులుగా వర్ణించేవి కూడా అదే భౌతిక సూత్రం మీద పనిచేస్తాయి. అణువిచ్ఛిత్తిలో జరిగినట్టుగానే అణు సంయోగంలో కూడా అతిస్వల్పమైన పదార్థరాశి శక్తిగా రూపాంతరం చెందుతుంది. కొన్నిరకాల అణువులు చీలడంతో అణుబాంబు పేలినట్టే కొన్నిరకాల అణువులు కలవడంతో హైడ్రొజన్ బాంబు పేలుతుంది. ఎటొచ్చీ అణువిచ్ఛిత్తిలో యురేనియంవంటి బరువైన అణువులు పాల్గొంటే అణు సంయోగంలో హైడ్రొజన్‌వంటి తేలికైనవి పాల్గొంటాయి.

హైడ్రొజన్ అణువుల కేంద్రకాల్లో ధనవిద్యుత్తు కలిగిన ఒక ప్రోటాన్ ఉంటుంది కనక రెండు హైడ్రొజన్ అణువుల మధ్య వికర్షణ ఉంటుంది. విద్యుత్తుతో సంబంధం లేకుండా, న్యూట్రాన్లూ, ప్రోటాన్లూ అనే విచక్షణ లేకుండా అణువుల న్యూక్లియస్‌లో ఉండే ఈ సూక్ష్మకణాల మధ్య విపరీతమైన ఆకర్షకశక్తి పనిచేస్తుంది. అయితే దీనికోసం కణాలు అతిదగ్గరగా పోగుపడాలి. విద్యుద్వికర్షణ మాత్రం ఎంత దూరాన ఉన్నప్పటికీ పనిచేస్తుంది. దీని శక్తి దూరం పెరిగినకొద్దీ తగ్గుతుందే కాని మాయమవదు. కణాలమధ్య దూరం రెండింతలైతే విద్యుద్వికర్షణ నాలుగో వంతుకూ, మూడింతలైతే తొమ్మిదోవంతుకూ ఇలా తగ్గుతూ పోతుంది. నాలుగు ప్రోటాన్లను దగ్గరగా చేస్తున్నప్పుడు వాటిమధ్య విద్యుత్తుతో ప్రమేయంలేని ఆకర్షణ పనిచేసేంతవరకూ విద్యుద్వికర్షణ ఎక్కువై ఒక తారస్థాయికి చేరుకుంటుంది. దీన్ని అధిగమించడానికి వాటికి బైటినుంచి శక్తిని అందించాలి.



నక్షత్రాల్లోని హైడ్రొజన్ హీలియం-4గా మారే విధానం


ఈ శక్తి ఉష్ణం రూపంలో ఉండవచ్చు. ప్రకృతిలో సహజంగా తలెత్తే అణుసంయోగం నక్షత్రాల్లో కనిపిస్తుంది. సూర్యుడివంటి సగటు పరిమాణం నక్షత్రాల్లో హైడ్రొజన్ అణువులు హీలియం అణువులుగా కలవడానికి ఒకటిన్నర కోట్ల డిగ్రీల ఉష్ణోగ్రత అవసరమవుతుంది. తారలన్నీ విశ్వమంతటా పలచగా వ్యాపించి ఉండే హైడ్రొజన్ వాయువు పోగుపడగా ఏర్పడినవే. తారల అంతర్భాగంలో గురుత్వాకర్షణవల్ల విపరీతమైన ఒత్తిడి పెరిగి వేడిమి జనిస్తుంది. ఇది ఒకటిన్నర కోట్ల డిగ్రీల స్థాయిని మించగానే రెండు ప్రోటాన్లు ఒకటయ్యే అవకాశం ఏర్పడుతుంది. వేడిమివల్ల జరిగే సంయోగం కనకనే అణుసంయోగానికి థర్మోన్యూక్లియర్ అనే మాటను వాడతారు.

ఒకటయ్యే రెండు ప్రోటాన్లలో ఒకటి తన ధనవిద్యుత్తును కోల్పోయి న్యూట్రాన్‌గా మారుతుంది. 'అతిదగ్గరగా వచ్చినప్పుడు రెండు ప్రోటాన్ల మధ్యగాని, రెండు న్యూట్రాన్లమధ్యగాని విద్యుత్తుకు సంబంధించని ఆకర్షణ ఉన్నప్పటికీ అవి జంటగా ఒక కేంద్రకంలో ఇమడలేవు. ఇక్కడ పౌలీ అనే శాస్త్రవేత్త నిర్వచించిన వర్జనసూత్రం (ఎక్స్‌క్లూషన్) పనిచేస్తుంది. అందుచేతనే రెండు ప్రోటాన్లలో ఒకటి న్యూట్రాన్‌గా మారుతుంది.' ఇలాంటి ప్రోటాన్, న్యూట్రాన్ల ద్వయాన్ని డ్యూటీరియం అంటారు. దీనికి మరొక ప్రోటాన్ తోడవడంతో హీలియం-3 కణాలు తయారవుతాయి (పటం). ఇటువంటి హీలియం-3 కణాలు రెండు జతకట్టగానే ఒక హీలియం-4 కణం ఏర్పడి, రెండు ప్రోటాన్లు విడుదల అవుతాయి. ఈ పద్ధతిలో నక్షత్రంలోని హైడ్రొజన్ ద్రవ్యరాశి క్రమంగా హీలియం-4గా రూపాంతరం చెందడం మొదలుపెడుతుంది (పటం). చిన్నవైన హైడ్రొజన్ అణువులు కలిసి హీలియం అణువుగా సంయోగం చెందేటప్పుడు ఊహించరానంత తేలికపాటి ద్రవ్యరాశి మాయమై శక్తిగా రూపాంతరం చెందుతుంది.


ఆల్ఫాకణంగా పేరున్న హీలియం-4 అణుకేంద్రం ప్రత్యేకమైనది. ఇందులోని రెండేసి ప్రోటాన్లూ, రెండేసి న్యూట్రాన్లూ వ్యతిరేకదిశలో ఆత్మభ్రమణం (స్పిన్) కలిగినవి కనక ఈ నాలుగూ ఎంతో గాఢంగా బంధించబడి ఉంటాయి. అందుకనే ఆల్ఫాకణాన్ని విడగొట్టడం చాలాకష్టం. ఇతరకణాలు కలిసి హీలియం-4గా ఏర్పడితే కొంత ద్రవ్యరాశి తగ్గడానికి కారణం ఇదే. హైడ్రొజన్ బాంబు పేలడానికి డ్యూటీరియం అనబడే భారహైడ్రొజన్ (ఒక ప్రోటాన్, ఒక న్యూట్రాన్), దానికన్నా బరువైన ట్రీటియం (ఒక ప్రోటాన్, రెండు న్యూట్రాన్లు)

కలవాలి. దీనివల్ల ముందు హీలియం-5 రూపొంది అందులోనుంచి ఒక న్యూట్రాన్ వెలువడగా స్థిరమైన హీలియం-4 మిగులుతుంది. ఇటువంటి ప్రక్రియ జరిగినప్పుడల్లా మొత్తం 1.76 కోట్ల ఎలక్ట్రాన్ వోల్ట్‌ల శక్తి విడుదల అవుతుంది (పటం). సిద్ధాంతరీత్యా డ్యూటీరియం, ట్రీటియం రెండూ కలవడానికి 12 కోట్ల డిగ్రీల ఉష్ణోగ్రత అవసరమవుతుంది. యురేనియం-235వంటి అణువుల విచ్ఛిత్తితో పోలిస్తే ఇది పదోవంతే అయినప్పటికీ అణుసంయోగంలో పాల్గొనే కణాల బరువు యురేనియం బరువులో యాభయ్యోవంతే. అందువల్ల అణుబాంబుకన్నా హైడ్రొజన్ బాంబు శక్తివంతమైనది. డ్యూటీరియం, డ్యూటీరియం కలవడంవల్ల కూడా అణుసంయోగం జరుగుతుంది.

హైడ్రొజన్ బాంబు తయారీకి అవసరమైన డ్యూటీరియం, ట్రీటియం రెండూ వాయువులే. వీటిని నిలవచెయ్యడం కష్టం. వీటిలో ట్రీటియం అస్థిరమైనది కనక అది కొంతకాలానికి రేడియో ధార్మికతవల్ల క్షీణిస్తుంది. అందుకని దీన్ని అవసరమైనప్పుడల్లా అదనంగా సరఫరా చెయ్యాలి. అంతేకాక పేల్చడానికి వీటిని అధిక ఉష్ణోగ్రతకూ, ఒత్తిడికీ గురిచెయ్యాలి. డ్యూటీరియం వాయువును ఘనపదార్థమైన లీథియంతో కలిపి ఘనపదార్థంగా చేస్తారు. అలాగే ట్రీటియంను ఉత్పత్తి చేసేందుకు లీథియం-6ను న్యూట్రాన్ల తాకిడికి గురిచేస్తారు. దానివల్ల ట్రీటియం, ఒక ఆల్ఫాకణం రూపొందుతాయి. అలాగే లీథియం-7 అయితే అందులోంచి ట్రీటియం, ఒక ఆల్ఫాకణం, ఒక న్యూట్రాన్ ఏర్పడతాయి.



డ్యూటీరియం (1), ట్రీటియం(2)ల అణుసంయోగంతో హీలియం-4 (3), న్యూట్రాన్ (4), విపరీతమైన శక్తీ వెలువడుతాయి



హైడ్రొజన్ బాంబు నిర్మాణం
1. ఏటం బాంబు
2. యురేనియం-238 టాంపర్
3. లీథియం డ్యూటిరైడ్ ఇంధనం
4. ప్లూటోనియం-239 గొట్టం

ఇదిలా ఉంటే అణువిచ్ఛిత్తివల్ల కలిగే విస్ఫోటనంలో ఇతర పదార్థాలతోబాటు ఎక్స్‌రే ప్రసారం విపరీతంగా జరుగుతుందనీ, వాటి తీవ్రత ద్వారా అణుసంయోగానికి కావలసిన ఉష్ణోగ్రతనూ, ఒత్తిడినీ సాధించవచ్చనీ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ కారణంగా ప్రతి హైడ్రొజన్ బాంబు కవచంలోనూ తప్పనిసరిగా ఒక ఏటం బాంబును అమర్చ వలసివస్తుంది.

మొత్తంమీద హైడ్రొజన్ బాంబు నిర్మాణం ఈ ప్రకారంగా ఉంటుంది (పటం). పెద్ద గొట్టం ఆకారంలో ఉన్న యురేనియం-238 టాంపర్ లోపల అంతస్స్ఫోటనం, లేదా ఇంప్లోషన్ పద్ధతిలో పేలే అణుబాంబు ఉంటుంది. లీథియం డ్యూటిరైడ్ ఇంధనంలో ప్లూటోనియం-239 గొట్టాన్ని అమరుస్తారు. టాంపర్, అణుబాంబులను వేరుచేసే ఒక యురేనియం-238 కవచమూ, కొంత ప్లాస్టిక్ పదార్థమూ ఉంటాయి. ముందుగా అణుబాంబు అంతస్స్ఫోటనం పద్ధతిలో పేలుతుంది. వాటి తీవ్రతవల్ల లోపలి భాగమూ, టాంపర్ విపరీతంగా వేడెక్కుతాయి. మధ్యనుండే కవచం మొత్తం బాంబు ముందుగానే పేలిపోకుండా నిరోధిస్తుంది. అయితే వేడిమివల్ల టాంపర్ వ్యాకోచించి, కరిగిపోవడంతో లీథియం డ్యూటిరైడ్ మీద 30 రెట్లు అధికంగా ఒత్తిడి ఏర్పడుతుంది.

ఈ ఒత్తిడి కారణంగా ప్లూటోనియం-239 గొట్టంలో అణు విచ్ఛిత్తి కలుగుతుంది. అందులోనుంచి విపరీతమైన వేడిమీ, వికిరణమూ, న్యూట్రాన్లూ వెలువడుతాయి. ఈ న్యూట్రాన్లు లీథియం నుంచి ట్రీటియంను విడుదల చేస్తాయి. ఉష్ణోగ్రతా, ఒత్తిడీ తీవ్రం కావడంతో డ్యూటీరియం ట్రీటియంతోనూ, డ్యూటీరియం డ్యూటీరియంతోనూ సంయోగం చెంద గలుగుతాయి. దీనితో మరింత ఉష్ణోగ్రతా, ఒత్తిడీ, న్యూట్రాన్లూ పెరగడంతో యురేనియం-238 టాంపర్, కవచమూ కూడా అణు విచ్ఛిత్తికిలోనై, మరింత వేడిమిని కలిగిస్తాయి. బాంబు మొత్తం పేలిపోతుంది.

(రచయిత అణుధార్మిక శాస్త్రవేత్త)

వీ

ఆలోచనల గూటికి పుల్లా పుడకా

సమాజంలోనూ, పుస్తకాలలోనూ, పత్రికలలోనూ, ఇతర ప్రచార సాధనాలలోనూ ఎన్నెన్నో తెలుసుకోవలసిన, ఆలోచించవలసిన విషయాలు ఉన్నప్పటికీ, వెలువడుతున్నప్పటికీ ప్రత్యేకంగా ఎత్తిచూపక పోవడం వల్ల వెలుగులోకి రాకుండా, ఆలోచనాపరుల దృష్టికి రాకుండా పోతున్నాయి. అటువంటి తెలుసుకోవలసిన విషయాలను మా దృష్టికి వచ్చినంతవరకు సేకరించి అందించడం ఈ శీర్షిక లక్ష్యం. ప్రజల అవగాహనల గూడును సుస్థిరంగా నిర్మించడానికే ఈ పుల్లా పుడకా.

* * * * *

ప్రభుత్వ గణాంకాలను చాల పవిత్రంగా భావించి వాటి మీద ఆధారపడి ప్రజాజీవితాన్ని విశ్లేషించే ఆర్థిక, సామాజిక వ్యాఖ్యాతలు చాలమంది ఉన్నారు. సామాజిక వాస్తవాన్ని అర్థం చేసుకోవడానికి గణాంకాలు అవసరమనే మాట, ఉపయోగపడతాయనే మాట నిజమే గాని, వాటి మీద మితిమీరిన నమ్మకం ఉంచితే, వాటిని జాగ్రత్తగా వాడకపోతే సమస్యలు తలెత్తుతాయి. ఒక తాజా ఉదాహరణ చూస్తే ప్రభుత్వ గణాంకాల మాయ, అబద్ధాలు, అక్రమాలు స్పష్టంగా తెలుస్తాయి. భారత విదేశీ వాణిజ్యం గురించిన ముఖ్యమైన అధికారిక గణాంకాలలోనే ఈ అక్రమాలు, అబద్ధాలు బయటపడ్డాయి. అట్లాంటిక్ మహా సముద్రంలో క్యూబాకు ఉత్తరాన బహామాస్ అనే ఒక ద్వీప సముదాయపు దేశం ఉంది. ఐదువేల చదరపు మైళ్లలో, మూడున్నర లక్షల జనాభా మాత్రమే ఉన్న ఈ చిన్న దేశం దేశదేశాల అక్రమ ధనం నిలువ చేసుకునే బ్యాంకులకూ, పర్యాటక రంగానికీ ప్రసిద్ధమయింది. ఆ దేశానికి భారతదేశం నుంచి 2010లో రెండు వేల రెండువందల కోట్ల (2.2 బిలియన్) డాలర్ల ఎగుమతులు జరిగాయని ప్రభుత్వ లెక్కలు చెపుతున్నాయి. రెండు సంవత్సరాల కింద, 2008లో ఆ ఎగుమతులు ఇరవై రెండు లక్షల (2.2 మిలియన్) డాలర్లు మాత్రమే ఉండేవి. అంటే రెండేళ్లలో వెయ్యి రెట్లు పెరిగిపోయాయి. ఇది పచ్చి దొంగలెక్క. ప్రపంచ వాణిజ్య గణాంకాలు ప్రకటించే ఐక్యరాజ్యసమితి సంస్థ ప్రకారం బహామాస్ మొత్తం వార్షిక దిగుమతుల విలువ 2.8 బిలియన్ డాలర్లు మాత్రమే. కాని భారత ప్రభుత్వ లెక్కల ప్రకారం బహామాస్ దిగుమతులలో ఎనభై శాతం పైగా భారతదేశం నుంచే వెళ్లాయన్నమాట. మరొక వైపు బహామాస్ అధికారిక లెక్కల ప్రకారం ఆ దేశపు దిగుమతులలో భారత్ వాటా ఒక్క శాతం కన్న తక్కువ. సిఐఎ లెక్కల ప్రకారం భారత్ వాటా 7.5 శాతం. నిజానికి బహామాస్ కు ప్రత్యేకంగా భారతదేశం ఎగుమతి చేసే వస్తువులేమీ లేవు. బహామాస్ పన్నుల స్వర్గంగా (అంటే పన్నులు లేని, అక్రమ ధనం మూలాలు అడగకుండా దాచిపెట్టుకోవడానికి వీలు కల్పించే దేశంగా) ఉన్నది గనుక అక్కడ ఇంతకాలంగా తమ అక్రమ సంపదను దాచుకున్న సంపన్నులు దొంగ బిల్లుల ద్వారా దేశంలోకి తమ ధనాన్ని తీసుకురావడానికి ఈ ఎగుమతి-దిగుమతుల మార్గాన్ని ఎంచుకుని ఉండవచ్చు. ఈ పద్ధతిలో భారత్ నుంచి బహామాస్‌కు ఎగుమతి అయ్యే వస్తువులకు వేలరెట్లు ఎక్కువ ధరలు వేసి బిల్లులు తయారు చేస్తారు. పదివేల రూపాయల వస్తువును ఎగుమతి చేసి దానికి కోటి రూపాయల బిల్లు వేస్తారు. అలా అక్కడినుంచి వచ్చే అక్రమ ధనం సక్రమ ధనంగా మారిపోతుంది. ఈ ఎగుమతి ఆదాయం ఎక్కువ చేసి చూపడానికి మరొక కారణం కూడ ఉండవచ్చునని ఎకనమిక్ టైమ్స్ వ్యాఖ్యానించింది. భారతదేశంలో వడ్డీరేట్లు ఎక్కువ కాబట్టి, ఇతర దేశాలలో వడ్డీరేట్లు తక్కువ కాబట్టి, తక్కువ రేట్లు ఉన్న దేశాల నుంచి, బహామాస్ మీదుగా ఈ ధనం వస్తూ ఉండవచ్చునని, అది కేవలం వడ్డీ సంపాదించడానికి, స్వల్పకాలిక మదుపుగా వస్తున్నదేమోనని వ్యాఖ్యానించింది. ఈ వివరణలలో ఏది నిజమైనా, మొత్తంగా తేలేదేమంటే భారత ప్రభుత్వం తన విదేశీ వాణిజ్యం గురించి చెప్తున్న గణాంకాలు అనుమానాస్పదమైనవి. దేశంలోకీ దేశంలోనుంచీ అక్రమ ధన ప్రవాహం అటూ ఇటూ నిరాటంకంగా సాగుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ దేశదేశాల సంపన్నుల జూద క్రీడకు రంగస్థలంగా ఉన్నది. వారు ఎప్పుడు తలచుకుంటే అప్పుడు ఈ ఆర్థికవ్యవస్థను తలకిందులు చేయగలరు.

* * * * *

అలా ప్రభుత్వ గణాంకాలలోనే అధికారికంగా అక్రమాలు సాగుతుండగా చట్టపరమైన అక్రమాలు చేశారనో, అవినీతికి పాల్పడ్డారనో, కుంభకోణాలలో పాలు పంచుకున్నారనో వ్యాపార, పారిశ్రామిక వేత్తలను నిర్బంధించడం ఏం సబబు అనే సందేహం స్వయంగా కేంద్ర ప్రభుత్వ న్యాయశాఖ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ కు వచ్చింది. ఇటీవలి కాలంలో, ముఖ్యంగా 2జి స్పెక్ట్రం అమ్మకాల కుంభకోణాల తర్వాత కొంతమంది అవినీతి పరులైన పారిశ్రామిక, వ్యాపారవేత్తల మీద కేసులు పెట్టి వారిని అరెస్టు చేయడం ఆయనకు చాల బాధ కలిగించింది. "ఇట్లా వ్యాపారవేత్తలను అరెస్టు చేయమని ఉత్తర్వులిస్తూ పోతే దేశంలోకి పెట్టుబడులు ఎట్లా వస్తాయి" అని ఆయన న్యాయ వ్యవస్థనూ, ఇతర ప్రభుత్వ సంస్థలనూ కోప్పడ్డారు. ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో "ఇవాళ మనం ఏ రాజకీయార్థిక స్థితిలో ఉన్నామో గుర్తించకుండా కొన్ని ప్రభుత్వ సంస్థలే ఇటువంటి పనిచేస్తే ప్రభుత్వ పనితీరు మీద దాని ఫలితం ఎలా ఉంటుంది? ఇవాళ కావలసింది పెట్టుబడులనూ వృద్ధినీ ప్రోత్సహించడం. వ్యాపారస్తులను కటకటాల్లో పెడితే పెట్టుబడులు వస్తాయా?" అని ఆయన ఆక్రోశించారు. "మాకేదో వాళ్ళను అరెస్టు చేయించాలనే ఆసక్తి ఉన్నట్టు మాట్లాడితే ఎలా" అని సుప్రీంకోర్టు నాయమూర్తులు ఎదురు కోప్పడి, తమకు ఆ ఆసక్తి లేదని, కాని తప్పని పరిస్థితుల్లోనే అటువంటి ఆదేశాలు ఇవ్వవలసి వస్తున్నదని చెప్పకనే చెప్పారు. అంటే అటు న్యాయశాఖ మంత్రి అయినా, ఇటు అత్యున్నత న్యాయస్థానమైనా అక్రమ వ్యాపారులను శిక్షించడం తప్పని అంటున్నారు. దేశంలోకి పెట్టుబడుల ప్రవేశం అవసరం, ముఖ్యం అనే పేరుతో వ్యాపార, పారిశ్రామిక వేత్తల అక్రమాలను చూసీ చూడనట్టు

వదిలేయాలని, వారి మీద చట్టప్రకారం కూడ కేసులు పెట్టగూడదని, నిర్బంధంలోకి తీసుకోగూడదని అంటున్నారు.

* * * * *

సంపన్నులను, వ్యాపారస్తులను, నిజంగా అక్రమాలకు, దోపిడీకి పాల్పడిన వారిని కటకటాల వెనక్కి పంపించడానికి న్యాయశాఖ మంత్రి అంత ఇబ్బంది పడుతుండగానే, ఈ సంపన్నులు దేశం మొత్తం జనాభాలో ఎంత తక్కువ శాతమో, దేశంలోని అసంఖ్యాక ప్రజానీకం ఎటువంటి దుర్భర జీవనం గడుపుతున్నారో రోజుకొక కొత్త ఆధారం బయట పడుతున్నది. తాజాగా టి ఎన్ ఎస్ గ్లోబల్ అనే బహుళ జాతి సంస్థ ప్రపంచ సంపద సర్వే నిర్వహించి ఈ విషయాన్ని మరొకసారి ప్రకటించింది. ఇరవై నాలుగు దేశాలలో పన్నెండు వేల మంది సంపన్నులను సర్వే చేసి ప్రకటించిన ఈ నివేదిక ప్రకారం దేశంలో యాభై లక్షల రూపాయల కన్న ఎక్కువ పెట్టుబడి పెట్టగల కుటుంబాలు ముప్పై లక్షలు ఉన్నాయని తేలింది. ఇది దేశ జనాభాలో కేవలం 1.25 శాతం. జనాభాలో రెండు శాతం కూడ లేని ఆ కుటుంబాల దగ్గర దేశ సంపదలో మూడో వంతు పోగుపడి ఉన్నది. మరొకపక్క దేశ జనాభాలో మూడింట రెండు వంతుల మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. సంపన్నుల సంఖ్య జాబితాలో భారత దేశం జర్మనీని, ఫ్రాన్స్ ను కూడ దాటేసిందని, భారత్ వంటి దేశాలలో "వ్యాపారస్ఫూర్తి నానాటికీ పెరిగిపోతూ వ్యక్తిగత సంపదగా పరిణమిస్తున్నద"ని టి ఎన్ ఎస్ అధిపతులు అన్నారు. అయితే ఈ సంపన్న గృహాలలో నిర్ణయాధికారం 80 శాతం పురుషుల చేతుల్లోనే ఉన్నదని, ఈ సంపన్నులలో 33 శాతం బంగారం వంటి విలువైన లోహాలలో దాచిపెట్టుకోవాలని అనుకుంటు న్నారని కూడ సర్వేలో తేలింది. భారత సంపదకు పురుషాధిపత్యం, బంగారం పోగేయడం వంటి అనుత్పాదక లక్షణాలు ఎలా ఉన్నాయో ఆ సర్వే చెపితే, మరొక వార్తావిశ్లేషణ దేశంలోని బడా కార్పొరేట్ సంస్థలు ఎంత ఎక్కువగా ద్రవ్య నిలువలను అనుత్పాదకంగా పోగేస్తున్నాయో వివరించింది. బొంబాయి స్టాక్ ఎక్స్ చేంజిలోని అగ్రశ్రేణి 500 కార్పొరేట్ సంస్థలనుంచి బ్యాంకింగ్, ద్రవ్యరంగ సంస్థలను తీసేసి (వాటి దగ్గర ఎట్లాగూ డబ్బు ఉండక తప్పదు గనుక), మిగిలిన సంస్థలను లెక్కిస్తే 408 సంస్థలు తేలాయి. ఇవి పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు గనుక, నిజంగా పెట్టుబడిదారీ స్వభావం కలిగి ఉంటే డబ్బును ఊరికే మురగ బెట్టకుండా పునరుత్పత్తి కోసం ఖర్చుపెట్టి, ఇంకా ఇంకా ఎక్కువ అదనపు విలువను సంపాదించాలి. కాని ఈ 408 సంస్థలు తమదగ్గర నాలుగు లక్షల డెబ్బై వేల కోట్ల రూపాయల ద్రవ్యనిలువలు పెట్టుకున్నాయి. ఈ సంస్థలలో కోల్ ఇండియా, ఒ ఎన్ జి సి, ఎన్ టి పి సి, ఎన్ ఎం డి సి, సెయిల్, ఆయిల్ ఇండియా వంటి ప్రభుత్వరంగ సంస్థలూ, రిలయన్స్, టాటా స్టీల్, టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, టి సి ఎస్, రాన్ బాక్సీ వంటి ప్రైవేటు సంస్థలూ ఉన్నాయి. ఈ డబ్బును పునరుత్పత్తిలో పెడితే, ఆ సంస్థలకు కొత్త ఆవిష్కరణలు, అదనపు ఉత్పత్తులు, అదనపు మార్కెట్లు, అదనపు విలువ రావడం మాత్రమే కాదు, లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుంది. దేశీయ మార్కెట్ విస్తరిస్తుంది. ఆర్థికవ్యవస్థ పైస్థాయికి వెళుతుంది. కాని ఈ భారత పెట్టుబడికి అటువంటి విస్తరణ స్వభావం కాక, దాచి ఉంచడం, వడ్డీ సంపాదించడం, అనుత్పాదక రంగాలలో ఖర్చుపెట్టడం, దళారీలుగా ఉండడం వంటి అర్ధభూస్వామ్య, అర్ధవలస లక్షణాలే ఉన్నాయి గనుక ఈ డబ్బు అలా మూలుగుతోంది. ఈ నివేదిక రాసిన పత్రిక పెట్టుబడిదారీ విస్తరణ కోరుకునేది గనుక ఈ డబ్బు నిలువలను విమర్శిస్తూ దాన్ని అనారోగ్యం అంటూ, భారత పెట్టుబడిదారులు ఇలా ఎందుకు చేయవలసి వస్తున్నదో సంజాయిషీ ఇవ్వడానికి కూడ ప్రయత్నించింది. ఈ డబ్బుతో 18,000 కిమీ ఆరు లేన్ల రహదారులు వేయవచ్చుననీ, 27 భారీ విద్యుదుత్పత్తి కేంద్రాలను స్థాపించవచ్చుననీ రాసింది. వ్యాపార వాతావరణం అనుకూలంగా లేనందువల్ల వ్యాపార సంస్థలు ఈ డబ్బును విస్తరణ మీద మదుపు పెట్టడానికి సందేహిస్తున్నాయని రాసింది. రహదారులు, విద్యుదుత్పత్తి కేంద్రాలూ కాక, నిజంగా సామ్రాజ్యవాద, బహుళజాతి సంస్థల దోపిడీని అడ్డుకోగలిగే, స్థానిక, దేశీయ పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధి కోసం ఈ నిలువలను వెచ్చించగలిగితే నిరుద్యోగమూ సమసిపోతుంది, స్వావలంబనా పెరుగుతుంది.

* * * * *

ఇవాళ ప్రపంచాన్ని శాసిస్తున్నదెవరు? అత్యధిక దేశాలలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్నదనీ, ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధుల ప్రభుత్వాలే అధికారం నడుపుతున్నాయనీ నమ్మే అమాయకులు ఇంకా ఉంటే ఉండవచ్చుగాని, 99 శాతం ప్రజలను ఒక్కశాతం పాలకవర్గాలు శాసిస్తున్నాయనీ, ఆ ఒక్క శాతానికి ఆర్థికబలం వల్లనే ఆ అధికారం సంక్రమించిందనీ ఇవాళ ప్రపంచ ప్రజాభిప్రాయం ఘోషిస్తున్నది. ఈ రాజకీయ, సామాజిక ఘోషకు ప్రతిస్పందనగా విశ్లేషణ సాగించిన సాంకేతిక, విజ్ఞానశాస్త్ర నిపుణులు ఆ ప్రజాభిప్రాయాన్ని నిరూపించారు, నిర్ధారించారు. జూరిచ్ లోని స్విస్ ఫెడరల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ముగ్గురు శాస్త్రవేత్తలు ఒక అసాధారణ నమూనా విశ్లేషణ ద్వారా ఈ నిర్ధారణ చేశారు. ఆ ముగ్గురూ భౌతిక, గణిత, సామాజిక శాస్త్రాలను మేళవించిన "కాంప్లెక్స్ సిస్టమ్స్ థియరీ" అనే అత్యాధునిక విజ్ఞానశాస్త్ర శాఖలో నిపుణులు. వారు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మూడు కోట్ల డెబ్బై లక్షల కంపెనీలను, మదుపుదార్లను పరిగణనలోకి తీసుకుని వాటిలోంచి ప్రభావశీలమైన 43,060 బహుళజాతి సంస్థలను వేరు చేశారు. వాటిలో ఒక్కో కంపెనీకి ఇతర కంపెనీలలో ఉన్న వాటాలను బట్టి, వాటి ఆదాయాలను బట్టి అవి ప్రభావం వేయగల ఆర్థిక శక్తి నమూనాను తయారు చేశారు. గోళాకారంగా తయారయిన ఈ నమూనాకు కేంద్రక స్థానంలో 1318 బహుళజాతి సంస్థలు ఉన్నాయని తేలింది. వీటిలో ప్రతిఒక్క కంపెనీకి కనీసం రెండు మూడు కంపెనీలలో వాటాలున్నాయని, ఒక్కొక్క కంపెనీకి సగటున మరొక 20 కంపెనీలతో సంబంధం ఉంది. అంతర్జాతీయ ఆదాయాలలో 20 శాతం ఈ కంపెనీలకే అందుతుండగా, మొత్తం మీద 60 శాతం ఆదాయం పొందే పారిశ్రామిక, వ్యాపారసంస్థలు వీటి అదుపాజ్ఞలలోనే ఉన్నాయి. ఈ సంబంధాల, సమ్మేళనాల సంక్లిష్టతను మరింత లోతుగా అధ్యయనం చేస్తే, యాజమాన్య నిర్వహణలో ఈ 1318 కంపెనీలు కూడ వాస్తవానికి 147 సూపర్ కంపెనీలమీద ఆధారపడి ఉన్నాయని తేలింది. ఇవాళ ప్రపంచ ఆర్థిక రాజకీయ వ్యవస్థలను ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ శాసిస్తున్నది ఈ 147 సూపర్ కంపెనీలే. "మొత్తంగా చెప్పాలంటే, ప్రపంచం మొత్తం మీద ఒక్క శాతం కంపెనీలు వ్యాపార, పారిశ్రామిక వ్యవస్థలో 40 శాతాన్ని శాసిస్తున్నాయి" అని ఆ నిపుణులు చెపుతున్నారు. ఆ సూపర్ కంపెనీలలో మొదటి యాభై కంపెనీలలో ఒకేఒక్కటి నిజమైన పారిశ్రామిక ఉత్పత్తి సంస్థ కాగా మిగిలినవన్నీ బ్యాంకింగ్, బీమా, తనఖా, యాజమాన్య రంగాల సంస్థలే. వీ

ఒడిశాలో మైనింగ్ కుంభకోణం

ఒడిశాలోని మూడు మైనింగ్ (సిరాజుద్దీన్ మైన్స్, రుంగ్తా మైన్స్, ఇంద్రాణి పట్నాయక్ మైన్స్) కంపెనీలపై అక్కడి విజిలెన్స్ విభాగం చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ మూడు కంపెనీలు అక్రమ గనుల తవ్వకాల ద్వారా సుమారు 3 లక్షల కోట్ల రూపాయలు ఆర్జించినట్లు వెల్లడైంది. అక్రమ తవ్వకాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు రు. 2352 కోట్ల నష్టం వాటిల్లిందని విజిలెన్స్ విభాగం పేర్కొంది. ఒక్కో టన్ను ద్వారా మైనింగ్ కంపెనీకి రు. 8000 ఆదాయం రాగా ప్రభుత్వానికి రు. 26 మాత్రమే రాయల్టీగా చెల్లిస్తున్నారు. రాష్ట్ర గనుల శాఖ మాత్రం రాయల్టీ చెల్లిస్తున్నారు కాబట్టి అవి అక్రమ తవ్వకాలు కాదని చెపుతోంది.

వాచాతి ఘటనపై తీర్పు

తమిళనాడు ధర్మపురి జిల్లాలోని వాచాతి గ్రామ ఆదివాసి మహిళల పై జరిగిన అత్యాచారం కేసులో సెప్టెంబర్ 29న తీర్పువెలువడింది. 1992లో వీరప్పన్‌ను బందించడానికి వెళ్లిన పోలీసులు, అటవి శాఖ సిబ్బంది 18 మంది ఆదివాసీ మహిళలపై దాడిచేసి అత్యాచారం చేశారని, 269 మందిని నిందితులుగా గుర్తిస్తూ ధర్మపురి జిల్లా న్యాయమూర్తి ఎస్. కుమార్ తీర్పు వెల్లడించారు. తుది తీర్పు నాటికి సజీవంగా ఉన్న 215 మంది కోర్టుకు హాజరయ్యారు. శిక్షలు పడిన వారిలో 126 మంది అటవి శాఖ అధికారులు, 84 మంది పోలీసులు, ఐదుగురు రెవెన్యూ ఉద్యోగులున్నారు. వీరిలో 17 మందికి 5-10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. మిగిలిన వారికి ఏడాది నుండి ఏడు సంవత్సరాల జైలు శిక్షలు విధించారు.

సుప్రీం కోర్టు జడ్జీలుగా చలమేశ్వర్, దీపక్ మిశ్రా

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ దీపక్ మిశ్రాలు అక్టోబర్ 10న ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.హెచ్. కపాడియా వారిద్దరితో ప్రమాణ స్వీకారం చేయించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా ఎంపిక కాకముందు చలమేశ్వర్ కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, దీపక్ మిశ్రా ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు.

యడ్యూరప్పకు జైలు

భూ కుంభకోణాల కేసులో కర్ణాటక మాజీ సిఎం యడ్యూరప్ప కోర్టులో లొంగిపోయారు. అవినీతి, భూ కుంభకోణాల కేసులో ఉన్న యడ్యూరప్పకు లోకాయుక్త ప్రత్యేక కోర్టు బెయిల్ నిరాకరించింది. ఈ కేసులో అరెస్ట్ వారంట్ జారీ కావడంతో ఆయనను జైలుకు పంపారు. అక్టోబర్ 22 వరకు ఆయన్ను జ్యుడీషియల్ కస్టడీకి అప్పగిస్తూ న్యాయమూర్తి సుదీంద్రరావు ఆదేశాలు జారీచేశారు.

గుజరాత్ అల్లర్ల కేసు

2002లో జరిగిన అల్లర్ల కేసుల పర్యవేక్షణ నుంచి సుప్రీం కోర్టు తప్పుకోవాలన్న గుజరాత్ సర్కార్ అభ్యర్థనను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. 2002 అల్లర్ల కేసులకు సంబంధించి చార్జిషీటు సమర్పించారని, విచారణ ఆరంభమైనందున ఇక సుప్రీంకోర్టు పర్యవేక్షణ అవసరం లేదంటూ గుజరాత్ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. సుప్రీంకోర్టు ఈ కేసును అక్టోబర్ 11న విచారిస్తూ అల్లర్ల కేసులను తాము ఎంతో కాలంగా పర్యవేక్షిస్తున్నందున భవిష్యత్‌లో అవసరమైన పక్షంలో తగిన సూచనలు జారీచేస్తామని పేర్కొంది.

సాయుధ బలగాల చట్టం రద్దుచేయాలి

సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం (ఎ.ఎఫ్.ఎస్.ఎ)ను రద్దు చేయాలని మేధాపాట్కర్ డిమాండ్ చేశారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బలగాలు తమ అధికారాలను అడ్డం పెట్టుకొని అనాగరిక చర్యలకు పాల్పడుతున్నాయని ఆమె ఆరోపించారు. బద్రతా బలగాల అధికారాలను రద్దు చేయాలని, మానవ హక్కుల కార్యకర్తలు శ్రీనగర్ నుంచి మణిపూర్ వరకు పది రోజుల పాదయాత్రను అక్టోబర్ 16న ప్రారంభించారు. అక్టోబర్ 27 వరకు పది రాష్ట్రాల్లో సాగుతున్న యాత్రలో ఎఎఫ్ఎస్‌పిఎ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ప్రచారం చేస్తామన్నారు.

అసోంలో రైతులపై కాల్పులు

అసోంలోని డాల్గాన్ ప్రాంతంలో జూట్ రైతులు తమ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకోసం డిమాండ్ చేస్తూ ఉద్యమం చేపట్టారు. ఇందులో భాగంగా దాదాపు 500 మంది రైతులు అక్టోబర్ 10న జాతీయ రహదారి 52ను దిగ్బంధించారు. నిరసనకారులపై పోలీసులు కాల్పులు జరపడంతో నలుగురు రైతులు అక్కడికక్కడే మరణించారు.

భగత్‌సింగ్ క్రాంతిసేన దాడులు

ఢిల్లీలో ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌పై అక్టోబర్ 10న భగత్‌సింగ్ క్రాంతిసేన సభ్యులు దాడి చేశారు. ప్రశాంత్ భూషణ్ ఒక టివి చానల్‌లో కాశ్మీర్ అంశంపై మాట్లాడుతూ కాశ్మీరీలు భారత్‌లో ఉండడం ఇష్టంలేకపోతే...కాశ్మీరీలకు స్వాతంత్రం ఇవ్వాలని, దీనిపై ప్లెబిసైట్ నిర్వహించాలని అన్నందుకే తాము దాడి చేశామని భగత్‌సింగ్ క్రాంతిసేన పేర్కొంది. సుప్రీం కోర్టు ఆవరణలో ఈ దాడి జరిగింది. దాడి తరువాత కాశ్మీర్‌పై తన అభిప్రాయాలను మార్చుకునేది లేదని ప్రశాంత్ భూషణ్ అన్నారు. తన అభిప్రాయాలను వ్యతిరేకించొచ్చు గానీ..తనను కొట్టే హక్కు వారికి లేదని చెప్పారు. పోలీసు అత్యాచార బాధితులను కాపాడటమే రాజద్రోహం అయితే తనను రాజద్రోహిగా పిలిచినా సంతోషమేనన్నారు.

మృగ్యమవుతున్న హక్కులు

గత పద్దెనిమిది సంవత్సరాల్లో హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ఉత్తరప్రదేశ్, ఢిల్లీ రాష్ట్రాల నుంచి అందాయని జాతీయ మానవ హక్కుల సంఘం వెల్లడించింది. 19వ వ్యవస్థాపక దినం సందర్భంగా ఈ వివరాలు తెలిపింది. మొత్తం 10,94,113 కేసులను నమోదు చేయగా అందులో 10,77,622 కేసులు పరిష్కారమయ్యాయని ఎన్.ఎచ్.ఆర్.సి. తెలిపింది. మొత్తం ఫిర్యాదుల్లో ఉత్తర ప్రదేశ్ నుంచి 6,22,635, ఢిల్లీ నుంచి 69,409 నుంచి వచ్చాయి. వీ

నోబెల్ పురస్కారాలు

2011 సంవత్సరానికి గాను నోబెల్ పురస్కారాలు ప్రకటించారు. వైద్య రంగంలో ముగ్గురికి ఈ పురస్కారం వరించింది. రోగ నిరోధక వ్యవస్థపై పరిశోధనకు గాను బ్రూస్ బ్యూట్లర్ (అమెరికా), జూల్స్ హాఫ్‌మాన్ (లక్సెంబర్గ్), రాల్ఫ్ స్టైన్‌మాన్ (కెనడా)లకు నోబెల్ వచ్చింది. అయితే కేన్సర్‌తో బాధపడుతున్న రాల్ఫ్ స్టైన్‌మాన్ 23 అక్టోబర్ 2011న చనిపోయారు. వీరి పరిశోదన ఫలితాల వల్ల కేన్సర్, అస్తమా, రుమటాయిడ్ ఆర్థ్రైటిస్, క్రోన్స్ తదితర వ్యాధులకు కొత్త చికిత్సలు మందులు కనుగొనే అవకాశం ఉంది. భౌతిక శాస్త్రంలో కూడా ముగ్గురికి నోబెల్ దక్కింది. విశ్వం అంతకంతకూ విస్తరిస్తోందని, కాలంతో పాటు ఈ విస్తరణ వేగం కూడా పెరుగుతోందని గుర్తించిన ముగ్గురు శాస్త్రవేత్తలు సాల్ పెర్లమట్టర్ (అమెరికా), బ్రెయిన్ స్కిమిట్ (ఆస్ట్రేలియా), ఆడమ్ రీస్ (అమెరికా)లకు ఈ సంవత్సరం నోబెల్ దక్కింది. ఈసారి నోబెల్ శాంతి బహుమతికి ముగ్గురు మహిళలు ఎంపికయ్యారు. లైబీరియా అధ్యక్షురాలు ఎలెన్ జాన్సన్, ఉద్యమకర్త లేమా బ్యూవీ, యెమెన్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న తవక్కుల్ కర్మాన్‌లకు నోబెల్ పురస్కారం లభించింది. మానవ మేధ రహస్యాలపై కవిత్వం అల్లిన స్వీడన్ కవి టోమాస్ ట్రాన్స్‌ట్రోమ్‌కు సాహిత్య నోబెల్ వచ్చింది. ట్రోమర్‌కు 1990లో పక్షవాతం రావడంతో శరీరంలో సగభాగం చచ్చుబడిపోయింది. మాట కూడా పడిపోయింది. ఈ ఏడాది ఆర్థిక రంగంలో నోబెల్ పురస్కారం అమెరికా ఆర్థిక వేత్తలు థామస్ సార్జెంట్, క్రిస్టోఫర్ సిమ్స్‌కు లభించింది. ఆర్థిక విధానాలకు, స్థూల జాతీయోత్పత్తి, ద్రవ్యోల్బణం, ఉపాధి, పెట్టుబడులు వంటి స్థూల ఆర్థిక అంశాలకు నడుమ గల సంబంధాలపై తలెత్తే పలు ప్రశ్నలకు సమాధానాలు కనుగొనేందుకు ఈ ముగ్గురు కనుగొన్న పద్ధతులు దోహదపడేవిగా ఉన్నాయని న్యాయ నిర్ణేతల బృందం వెల్లడించింది.

ఆపిల్ సృష్టికర్త స్టీవ్ జాబ్స్ మృతి

ప్రపంచంలో సమాచార, సాంకేతిక విజ్ఞానంలో సంచలనం సృష్టించిన ఆపిల్ మెకింతోష్, ఐపాడ్, ఐఫోన్, ఐప్యాడ్‌లను కనిపెట్టిన స్టీవ్ జాబ్స్ అక్టోబర్ 6న కాలిఫోర్నియాలో పాలో ఆల్టోలో కోమా కేన్సర్‌తో మరణించారు. స్టీవ్ ఆపిల్ కంప్యూటర్స్ సహ వ్యవస్థాపకుడు కూడా. పర్సనల్ కంప్యూటింగ్ మ్యూజిక్, మొబైల్ ఫోన్స్‌కి స్టీవ్ కొత్త భాష్యాన్ని చెప్పాడు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది స్టీవ్ అభిమానులకు ఆయన మరణవార్త తీవ్ర మనస్థాపానికి గురిచేసింది.

'ఆక్యుపై వాల్‌స్ట్రీట్' ఉద్యమం

కార్పొరేట్ దురాశ, ఆర్థిక - సామాజిక అంతరాలకు వ్యతిరేకంగా అమెరికాలోని న్యూయార్క్‌లో దాదాపు నెల రోజుల నుంచి 'ఆక్యుపై వాల్‌స్ట్రీట్' ఉద్యమం ప్రారంభమైంది. ఇది క్రమంగా అమెరికా లోనే కాకుండా ప్రపంచమంతా వ్యాపించింది. వాషింగ్టన్, షికాగో, లాగ్ ఏంజెలిస్, లండన్, రోమ్, సిడ్నీ, టోక్యో, బెర్లిన్, మాడ్రిడ్, హాంకాంగ్, టొరాంటో తదితర నగరాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. ప్రపంచ ఆర్థిక రంగంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభానికి కార్పొరేట్ సంస్థల దురాశనే ప్రధాన కారణం అంటూ దాదాపు 80 దేశాలలోని 950 నగరాల్లో లక్షలాది మంది వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు చేపట్టారు.

పెద్దదవుతున్న ఓజోన్ రంధ్రం

భూమికి రక్షణ కవచంలా నిలుస్తున్న ఓజోన్ పొరకు ఏర్పడిన రంధ్రం పెద్దదవుతోంది. దక్షిణ ధృవం వద్ద అంటార్కిటిక్‌పై గతంలో గుర్తించిన ఈ రంధ్రం రికార్డు స్థాయిలో పెరిగిందనీ, దాదాపు ఉత్తర అమెరికా అంత వైశాల్యానికి విస్తరించిందనీ శాస్త్రవేత్తలు వెల్లడించారు. మొత్తం రంధ్రం సైజు 2.5 కోట్ల చదరపు కిలోమీటర్లకు వ్యాపించిందని తెలిపారు. నాసాకు చెందిన ఆరా ఉపగ్రహం పంపిన సమాచారం ఆధారంగా శాస్త్రవేత్తలు ఈ అంచనా వేసినట్లు తెలుస్తోంది.

'ది సెన్స్ ఆఫ్ ఆన్ ఎండింగ్'కు బుకర్

ఈ సంవత్సరానికిగాను ప్రతిష్ఠాత్మకమైన మాన్ బుకర్ బహుమతి బ్రిటిష్ రచయిత జూలి యన్ బార్నెస్ నవల 'ది సెన్స్ ఆఫ్ ఆన్ ఎండింగ్'కు లభించింది. గతంలో బార్నెస్ నవలలు మూడుసార్లు బుకర్ బహుమానం కోసం పరిశీలనకు వచ్చినా, చివరి దశలో అవి బహుమతి దక్కించుకోలేక పోయాయి. ఎట్టకేలకు నాలుగోసారి బార్నెస్ నవల బుకర్‌ను సాధించింది.

గడ్డాఫీ హత్య

నలభై రెండు ఏళ్లపాటు లిబియాను పాలించిన మొహమ్మద్ గడ్డాఫీ అక్టోబర్ 20న తిరుగుబాటుదారుల చేతిలో హతమయ్యారు. సర్త్ నగరంలోని ఒక కల్వర్టులో దాగి ఉన్న గడ్డాఫీని తిరుగుబాటు దారులు బయటికి ఈడ్చుకు వచ్చి కాల్చి చంపారు. ఆయన కుమారుడు మొటాసిమ్ గడ్డాఫీ కూడా ఈ దాడులలో మృతి చెందాడు. దీంతో గడ్డాఫీ నాలుగు దశాబ్దాల పాలన అంతమయ్యింది. వారి మృత దేహాలను లిబియా ఏడారిలోని రహస్య ప్రదేశంలో ఖననం చేశారు.

గిలాద్ షలిత్ విడుదల

హమాస్ చెరలో ఐదేళ్లకు పైగా చిక్కుకున్న ఇజ్రాయెలీ సిపాయి గిలాద్ షలిత్ అక్టోబర్ 18న విడుదల అయ్యారు. హమాస్ కిడ్నాపర్లు అతనిని 1,941 రోజులు నిర్బంధంలో ఉంచారు. చరిత్రలోనే మొదటిసారిగా హమాస్‌కు, ఇజ్రాయెల్‌కు నడుమ రఫా క్రాసింగ్ వద్ద ఖైదీల మార్పిడి జరిగింది. ఉభయ వర్గాల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు చరిత్రాత్మకమైన ఈ ఖైదీల మార్పిడి ఘటన చోటుచేసుకుంది. ఒప్పందంలో భాగంగా ఇజ్రాయెలీ సైనికుడు షలిత్‌ను హమాస్ విడుదల చేస్తే, అందుకు ప్రతిగా చిరకాలంగా నిర్బంధంలో ఉన్న 1027 మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేయాలని ఇజ్రాయెల్‌తో ఒప్పందం జరిగింది. తొలి విడతగా 477 మంది ఖైదీలు చెర నుంచి విముక్తి అయ్యారు. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం : రాంకి, వై. రామచంద్రం

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగానూ, జాగ్రత్తగానూ వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(21 సెప్టెంబర్ 2011 నుండి 20 అక్టోబర్ 2011 వరకు 16 జిల్లాలలో అసహజ మరణాల పాలైన వారి సంఖ్య – 1744)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	–	2	–	22	20	18	20	17	2	2	2	2	2	2	20	32	–	–	–	1	2
హైదరాబాద్	–	–	–	10	17	–	1	–	5	4	9	11	–	–	26	21	–	–	–	5	–
కరీంనగర్	–	10	–	22	31	24	41	4	3	8	3	5	1	8	25	24	–	–	–	2	–
ఖమ్మం	–	3	–	20	9	14	9	4	1	4	4	11	4	2	16	30	2	–	–	–	1
మహబూబ్‌నగర్	–	15	–	16	10	6	17	8	2	20	8	14	42	15	30	15	–	–	–	–	–
మెదక్	–	4	–	15	14	4	3	–	6	3	1	1	–	5	27	19	–	–	–	–	2
నల్గొండ	–	2	1	19	19	3	5	2	1	5	3	2	1	9	50	30	–	–	0	2	–
నిజామాబాద్	–	–	–	6	16	3	5	5	1	2	4	6	2	5	17	31	–	–	–	–	–
రంగారెడ్డి	1	5	–	16	27	12	24	3	7	13	5	6	5	10	38	9	–	–	–	–	5
వరంగల్	వివరాలు అందలేదు																				
అనంతపూర్	–	21	3	10	8	3	5	2	2	1	3	7	5	–	27	8	–	–	–	–	2
చిత్తూరు	–	–	–	3	5	–	–	–	–	–	2	4	–	–	27	–	–	–	–	–	–
గుంటూరు	–	1	–	5	10	–	2	2	3	3	10	3	2	2	24	18	–	–	–	–	10
నెల్లూరు	–	–	–	3	4	–	–	–	–	3	–	1	–	3	28	12	–	–	–	–	–
కర్నూలు	వివరాలు అందలేదు																				
విజయనగరం	–	–	–	6	8	4	3	3	6	5	2	1	2	–	28	15	–	–	–	–	6
మొత్తం	**1**	**63**	**4**	**173**	**198**	**91**	**108**	**50**	**39**	**73**	**56**	**74**	**66**	**61**	**383**	**264**	**2**	**–**	**0**	**10**	**28**

అందిస్తున్నవారు : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ఎల్. సంతోష్; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి;
మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఎక్బాల్; నల్గొండ – గొడిశాల వెంకటేశ్వర్లు; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – ఎస్. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్;
అనంతపూర్ – కె. నాగేశ్వరచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – దస్తగిరి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; గుంటూరు – బి. అంజమ్మ ;
నెల్లూరు – బాలగురువయ్య; శ్రీకాకుళం – జి. సుధీర్; ప్రకాశం – ఎల్. సాంబశివరావు, విజయనగరం – డి. సుధాకర్

మీ గ్రంథాలయానికి వీక్షణం వస్తోందా!

వీక్షణం మిత్రులకు, శ్రేయోభిలాషులకు విజ్ఞప్తి!

మీ గ్రామంలో, మండలంలో, జిల్లా కేంద్రంలో,
మీకు తెలిసిన విద్యా సంస్థలలో ఉన్న
గ్రంథాలయాలలో వీక్షణం పత్రిక వస్తోందా?
రాకపోతే అక్కడి పాఠకులకు వీక్షణం అందేలా చూడండి.

మీ వంతుగా ఇటు వీక్షణం మనుగడకు,
అటు సామాన్య పాఠకులకు అందుబాటులోకి
తీసుకువెళ్లడానికి సహకారం అందించండి.

ఇప్పటికే ఇలా గ్రంథాలయాలకు వీక్షణం చందా కానుకగా ఇస్తూ
సహకారం అందిస్తున్న మిత్రులలో మీరూ ఉంటారని ఆశిస్తున్నాం!

చందా వివరాలు

	సంస్థలకు/లైబ్రరీలకు	వ్యక్తులకు	విద్యార్థులకు
విడి ప్రతి	రు. 15	రు. 15	రు. 15
సంవత్సరం	రు. 180	రు. 150	రు. 120
మూడు సంవత్సరాలు	రు. 500	రు. 400	రు. 350
ఐదు సంవత్సరాలు	రు. 800	రు. 650	-
పది సంవత్సరాలు	రు. 1500	రు. 1300	-

వీక్షణం అకౌంట్ నెంబర్ - 013911011002175, ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్
'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3 హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495
ఇమెయిల్ : veekshanam2003@gmail.com

వీక్షణంను ఈ సైట్‌లో చూడొచ్చు, చదవవచ్చు **www.veekshanam.wordpress.com**

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 124 -November 2011 • ISSN 2231-6892
• RNI Regn.No.APTEL/2003/11482• Published on 29/10/2011 • Postal Regn. No. L II/RNP/HD/1100/2011-13

వీక్షణంకు చేయూతనివ్వండి...

మీ ఆదరాభిమానాలతో త్వరలో పదో సంవత్సరంలో అడుగుపెడుతున్న వీక్షణం మీరు మరింత సహాయం అందించకపోతే ఎక్కువకాలం నడవడం కష్టం...

ఔను, వీక్షణం నష్టాలతో నడుస్తున్నదని, ఉత్పత్తి వ్యయం కూడ తిరిగి రావడం లేదని, ఆర్థిక పరిస్థితి నానాటికీ క్షీణిస్తున్నదని గత కొంతకాలంగా చెపుతూనే ఉన్నాం. అది ఇంకా విషమించింది. వీక్షణం నాలుగు కాలాల పాటు సజావుగా నడవడానికి ఇప్పటికే వందలాది మంది అభిమానులు తమ శాయశక్తులా ప్రయత్నిస్తున్నప్పటికీ, ఆ సహాయం చాలడం లేదు. సహాయం ఇతోధికంగా పెరగకపోతే వీక్షణం ఎక్కువకాలం మనగలగడం కష్టం.

వీక్షణం మీ పత్రిక. ప్రజల పత్రిక. ప్రజలకు అవసరమైన పత్రిక. ఇది ఆగిపోకుండా కాపాడండి.

- ❖ ప్రతి పాఠకుడూ/పాఠకురాలూ కనీసం మరొకరికి వీక్షణాన్ని పరిచయం చేయండి.
- ❖ ప్రతి చందాదారూ కనీసం మరొకరిని చందాదారుగా చేర్పించండి.
- ❖ మీకు తెలిసిన కళాశాలలు, కార్యాలయాలు, గ్రంథాలయాలు, ప్రజా సంస్థలు వీక్షణంను తెప్పించేలా చూడండి.
- ❖ మీ గ్రామంలో, పట్టణంలో న్యూస్ ఏజెంట్ దగ్గర వీక్షణం అమ్మేలా చూడండి

ఇవన్నీ వీక్షణం ప్రచురిస్తున్న భావాలు ప్రచారం చేయడానికి. కాని వీక్షణం ఆర్థిక పరిపుష్టికి అవి మాత్రమే సరిపోవు. వ్యాపార, ప్రచార ప్రకటనలు లేకుండా పత్రికలేవీ మనుగడ సాగించలేవు. వీక్షణంకు మీకు తెలిసిన వ్యక్తులనుంచీ, సంస్థల నుంచీ ప్రకటనలు సంపాదించండి. కళాశాలలు, వైద్యశాలలు, ఆస్పత్రులు, దుకాణాలు, వ్యాపార, పారిశ్రామిక సంస్థలు, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా పాలక సంస్థలు, దాతలు... సంస్థల బాధ్యులు, వ్యక్తులు ఎవరి నుంచి ఐనా సరే...

- ❖ జీవిత చందాలు, కానుకగా చందాలు, విరాళాలు సేకరించండి.
- ❖ ప్రకటనలు సేకరించండి.

ప్రతినెలా కనీసం మూడు పేజీల ప్రకటనలు ఉంటేనే వీక్షణం ఆర్థిక స్థితి ఏనెలకానెల అన్నట్టు సాగుతుంది. తెలుగు సమాజం తనతో తాను జరుపుకుంటున్న సంభాషణ ఆగిపోకుండా మీ వంతు సాయం చేయండి.

మీ సహకారం అందించాల్సిన చిరునామా :

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3 హిమాయత్‌నగర్
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495
ఇమెయిల్ : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao